# క్రాంతి

లోపలి పేజీల్లో...


| | |
|---|---|
| అసోం ఘర్షణలు ....... | 7 |
| పండాపై ప్రకటన ....... | 10 |
| లక్షింపేట దాడులు ....... | 14 |
| బాక్సైట్ పోరాటం ....... | 16 |
| 'సంక్షేమ' పథకాలు ...... | 20 |
| ఫీజు రీయింబర్స్‌మెంట్ ....... | 25 |
| బాలికపై అత్యాచారం ...... | 26 |
| స్టోలోపిన్ నిర్బంధం ...... | మధ్యపేజీ |
| చైనాలో స్త్రీ విముక్తి ...... | 33 |
| కా రోజెర్‌కు జోహార్ ...... | 40 |
| పోలీసుల నిరసన ....... | 44 |
| పోరాట వార్తలు ...... | 46 |



సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., ఎన్.టి., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 36  సంచిక: 2  సెప్టెంబర్ - అక్టోబర్ 2012  వెల: పది రూపాయలు


# సిరియాలో సామ్రాజ్యవాదుల జోక్యందారి విధానాలను ఖండించండి!

# బషర్ అల్ అస్సాద్ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలి!!

సిరియాలో గత సంవత్సరం మార్చి నెలలో ప్రారంభమైన అంతర్యుద్ధం, ఇప్పటికీ కొనసాగుతూ దినదినం తీవ్రతరం అవుతూనే వుంది. ఈ అంతర్యుద్ధంలో వేలాది మంది అమాయక ప్రజలు మృత్యువాత పడుతున్నారు. ఇప్పటివరకు 17 వేలకు పైగా ప్రజలు మరణించినట్లుగా 'సిరియన్ అబ్జర్వేటర్ ఫర్ హ్యూమన్ రైట్స్' సంస్థ ప్రకటించింది. దేశంలో హెూమ్స్, అలెప్పో, హమా, ఇద్లీబి పట్టణాలు మొదలు రాజధాని అయిన డమాస్కస్ వరకు హింస ప్రజ్వరిల్లుతున్నది. హెూమ్స్ పట్టణం పక్కనే వున్న బాబా అమర్‌లో ప్రభుత్వ బలగాలకు, తిరుగుబాటుదారు సంస్థ 'సిరియన్ నేషనల్ కౌన్సిల్' నాయకత్వంలోని 'ఫ్రీ సిరియన్ ఆర్మీ'కి మధ్య జరిగిన యుద్ధంలో వందలాది మంది పౌరులు చనిపోయారు. తిరుగుబాటుదారులకు, ప్రభుత్వ బలగాలకు ఇరువైపులా తీవ్ర నష్టం జరిగింది. దాదాపు రెండు వేల మంది సిరియా సైనికులు మరణించారని ప్రభుత్వం ధృవీకరించగా, ఆ సంఖ్య ఏడు వేలకు పైగా వుందని అనధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వ జాతీయ భద్రతా కార్యాలయంపై జరిగిన ఓ ఆత్మాహుతి దాడిలో సిరియా రక్షణ మంత్రి దావూద్ రజాతో పాటు అధ్యక్షుడు బషర్ అల్ అస్సాద్ బావ అసఫ్ షాకత్, మరో సీనియర్ అధికారి మరణించారు. సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అస్సాద్ అధికారం నుండి వైదొలగాలని, సిరియన్ నేషనల్ కౌన్సిల్ డిమాండ్ చేస్తున్నది. అయితే ఈ సంస్థకు సిరియా దేశ ప్రజల నుండి పూర్తి మద్దతు లేదు. కాబట్టి ఈ సంస్థ పశ్చిమ సామ్రాజ్యవాదులపై ఆధారపడుతూ సాయుధ తిరుగుబాటు నడిపిస్తున్నది. సిరియా పక్కన గల టర్కీ, సౌదీ అరేబియా, ఖతార్ దేశాలు ఈ సంస్థకు అన్ని విధాల సహాయాన్ని అందిస్తున్నాయి. సిరియాలో అధికారంలో వున్న అధ్యక్షుడు బషర్ అల్ అస్సాద్‌కు సిరియా ప్రజల్లో 60 శాతం మద్దతు వుందని అందరూ అంగీకరిస్తున్న విషయమే. అధ్యక్షుడు బషర్ అల్ అస్సాద్ ముస్లిం మతంలో మైనారిటీ అల్వైట్ శాఖకు చెందినవాడు.



అస్సాద్ గద్దె దిగాలని నినదిస్తున్న సిరియన్లు

సిరియాలో 70 శాతం సున్నీ మతస్థులు కాగా, 30 శాతం అల్వైట్లు, క్రిస్టియన్‌లు, డ్రూజెలు, అస్సీరియన్లు, కుర్దులు మైనారిటీలుగా వున్నారు. మైనారిటీల్లో 90 శాతం, సున్నీల్లో 30 శాతం ప్రజల్లో ప్రస్తుత అధ్యక్షుడు  బషర్ అల్ అస్సాద్ మద్దతు కల్గి వున్నాడు.

గత సంవత్సరం టునీషియా, ఈజిప్టు, లిబియా, బెహ్రయిన్, యెమెన్‌లలో ప్రారంభమైన ప్రజాస్వామిక వుద్యమాలు సిరియాపై కూడ బలమైన ప్రభావం వేశాయి. సిరియాలో వివిధ పట్టణాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. మార్చి 18న ధార పట్టణంలో జరిగిన నిరసన ప్రదర్శనపై సిరియా బలగాలు దాడి చేసి ఆరుగురిని చంపివేశాయి. అంతకు ముందు మూడు రోజుల క్రితం ప్రభుత్వ బలగాలు అరెస్టు చేసిన 36 మంది ప్రజలను విడుదల చేయాలనే డిమాండ్‌తో ఈ ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శన తర్వాత సిరియా ప్రభుత్వం అరెస్టులను కొనసాగిస్తూ మరో 300 మంది ప్రజలను నిర్బంధించింది. దీనితో సిరియాలోని ముఖ్య వాణిజ్య పట్టణమైన అలెప్పో, రాజధాని డెమాస్కస్, హామా, హొమ్స్ పట్టణాలకు నిరసన ప్రదర్శనలు విస్తరించాయి. సముద్రతీరంలోని లాటికియా పట్టణంలో పోలీసులు నిరసనకారులపై పెద్ద ఎత్తున దాడులు చేసి 12 మందిని చంపివేశారు. ఈ అణచివేతతో ప్రజల ఆందోళన దేశమంతటా ప్రజ్వరిల్లింది. సిరియాను ఎప్పటి నుండో లక్ష్యం చేసుకున్న అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ సామ్రాజ్యవాద దేశాలు ఈ అవకాశాన్ని వుపయోగించుకొని ఆందోళన చేపడుతున్న ప్రతిపక్షాలకు మద్దతునిచ్చి, అక్కడి అంతర్యుద్ధానికి ఊతం యిచ్చాయి. ఈ పరిణామాలు సిరియా సార్వభౌమాధికారానికి, స్వాతంత్ర్యానికి, దేశ సమగ్రతకు ముప్పుగా పరిణమించాయి.

సిరియా మధ్యధరా సముద్రానికి ఆనుకొని వున్న ఉత్తర ఆఫ్రికా దేశం. పశ్చిమ ఆసియా లేదా ఆరబ్ ప్రపంచంలో భాగంగా కూడ ఈ దేశాన్ని పేర్కొంటారు. ఈ దేశానికి చుట్టు పక్కల లెబనాన్, జోర్డాన్, లిబియా, ఈజిప్టు, పాలస్తీనా, ఇజ్రాయిల్ దేశాలుంటాయి. సిరియా దేశపు జనాభా 2 కోట్ల 50 లక్షలు వుంది. ఈ దేశంలో చమురు నిల్వలు పుష్కలంగా వున్నాయి. ఈ దేశ ప్రజలకు సామ్రాజ్యవాదానికి, వలసవాదానికి వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర వుంది. 50, 60 దశకాల్లో ఆఫ్రికా దేశాల్లో సామ్రాజ్యవాదానికి, వలసవాదానికి వ్యతిరేకంగా బ్రహ్మాండమైన వెల్లువ పెల్లుబికి అనేక దేశాలు వలస పీడనను వదిలించుకొని స్వాతంత్ర్యం పొందాయి. నాజర్ నాయకత్వంలో ఈజిప్టు ప్రజలు బ్రిటన్‌కు వ్యతిరేకంగా పోరాడి 1953లో స్వాతంత్ర్యం ప్రకటించుకొన్నారు. 1948లో సిరియా, లెబనాన్‌లు ఫ్రెంచి ఆధిపత్యం నుండి స్వాతంత్ర్యం పొందాయి. 1948లోనే జోర్డాన్ బ్రిటన్ నుండి స్వాతంత్ర్యం సాధించింది. 1962లో అల్జీరియా ఫ్రెంచి వారికి వ్యతిరేకంగా గొప్ప పోరాటం చేసి స్వాతంత్ర్యం పొందింది. 1959లో లిబియాలో గడాఫీ అధికారానికి వచ్చాడు. అదే సంవత్సరం ఇరాక్‌లో బాత్ పార్టీ అధికారానికి వచ్చింది. దక్షిణ సూడాన్‌లో బ్రిటన్‌కు వ్యతిరేకంగా మార్క్సిస్టు గెరిల్లా గ్రూప్ నాయకత్వంలో ప్రజా తిరుగుబాటు జరిగి కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడింది. అరబ్ ప్రపంచంలో ఇది మొదటి కమ్యూనిస్టు ప్రభుత్వం. సిరియాతో సహా అరబ్ దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు కూడా అభివృద్ధి చెందుతూ వచ్చాయి. ఈ కాలం అంతటా అరబ్ జాతీయవాదం పెంపొందింది. నాజర్ అలీన దేశాల స్థాపకుల్లో ఒకరుగా గణతికెక్కడం గాక అరబ్ జాతీయ భావాలకు ప్రేరణగా కూడా నిలిచాడు. ఈజిప్టు యూనియన్, సిరియా బాతిస్టు పార్టీ, ఇరాక్ రిపబ్లిక్‌ను ఐక్యం చేసి శక్తివంతమైన అరబ్ ప్రపంచంను రూపొందించవచ్చని కలలు కన్నాడు. సామ్రాజ్యవాదుల దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా వివిధ దేశాల్లో పోరాటాలు ముందుకు రాగా, ఈ ప్రాంతాల్లో గల చమురు నిల్వలపై అదుపును కోల్పోకూడదనే వుద్దేశంతో బ్రిటన్, అమెరికా దేశాలు కుట్రపూరితంగా పాలస్తీనా దేశాన్ని విభజించి ఇజ్రాయిల్‌ను ఏర్పరిచాయి. ఐక్య రాజ్య సమితి నిర్ణయం మేరకు 1947లో ఇజ్రాయిల్ అనే కొత్త దేశం ఆవిర్భవించింది. అప్పటినుండి అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ అరబ్ దేశాలపై దురాక్రమణ యుద్ధాలు కొనసాగించడమే గాక పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించింది. దీని ఫలితంగా 1967లో ఇజ్రాయిల్‌కు అరబ్ దేశాలకు (ఈజిప్టు, ఇరాక్, సిరియా, లెబనాన్, సౌది అరేబియా, జోర్డాన్‌లు) మధ్య యుద్ధం బద్ధలైంది. అమెరికా, బ్రిటన్‌ల అండతో ఇజ్రాయిల్ ఈ యుద్ధంలో విజయం సాధించి, గాజా స్ట్రిప్పు, వెస్టుబ్యాంకులతో పాటు, సిరియాకు చెందిన గోల్డెన్ హైట్స్ ప్రాంతాన్ని ఆక్రమించింది. 1971లో మరోసారి ఈ దేశాల నడుమ యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో అరబ్ దేశాలు ఇజ్రాయిల్‌పై విజయం సాధిస్తున్న క్రమంలో అగ్రరాజ్యాల కుట్రల వల్ల ఈ యుద్ధ ఫలితం అరబ్ దేశాలకు వ్యతిరేకంగా తేలింది. అగ్రరాజ్యాల ఆధిపత్య పోటీలో అరబ్ ప్రపంచం సంఘటితం కాలేకపోయింది. క్రమంగా ఈ దేశాల్లో నాజర్ జాతీయతా భావాలు సన్నగిల్లుతూ జాతీయతా భావాల నీడలోనే నియంతృత్వ పరిపాలనకు దారితీసింది. ఈజిప్టులో 1970లో నాజర్ మరణించిన వెంటనే అన్వర్ సాదాత్ అధికారానికి వచ్చి ఇజ్రాయిల్‌తో క్యాంపు డేవిడ్‌లో శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకొని అమెరికాకు అమ్ముడుపోయాడు. తర్వాత అధికారానికి వచ్చిన హొస్నీ ముబారక్ నియంత అమెరికాకు మంచి మిత్రుడు కాగా, వరుసగా సౌది అరేబియా, జోర్డాన్ లాంటి దేశాలు అమెరికా మిత్రులుగా మారిపోయాయి. లెబనాన్, సిరియా, లిబియా, ఇరాక్, ఇరాన్‌లు అమెరికాకు వ్యతిరేకంగా వుంటున్నాయి. యిందులో ఇరాక్, లిబియాలు ఆయా కాలాల్లో తమ పాత్రను మార్చుకున్నాయి.

మొత్తం అరబ్ దేశాల ప్రజలకు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప సాంప్రదాయం వుంది. ఇటలీకి వ్యతిరేకంగా ఒమర్ ముక్తార్ నాయకత్వంలో లిబియా ప్రజలు, ఫ్రెంచికి వ్యతిరేకంగా అల్జీరియా ప్రజలు చేసిన చారిత్రక పోరాట వారసత్వం ఇప్పటికీ ప్రజల్లో వుంది. ఇజ్రాయిల్ దురాక్రమణకు వ్యతిరేకంగా పాలస్తీనా, లెబనాన్, సిరియా ప్రజానీకం ప్రభుత్వాలు ఇప్పటికీ పోరాడుతూనే వున్నాయి. అందుకే సామ్రాజ్యవాదులు సిరియాను, లెబనాన్‌లో హిజిబుల్లాను టార్గెట్ చేశారు.

ప్రస్తుతం అధికారంలో వున్న అధ్యక్షుడు  బషర్ అల్ అస్సాద్

బాత్ పార్టీకి చెందినవాడు. సిరియాలో 1966లో బాత్ పార్టీ అధికారానికి వచ్చింది. బషర్ అల్ అస్సాద్ తండ్రి అయిన హాఫేజ్ అల్-బహర్ సిరియాను శక్తివంతమైన దేశంగా రూపుదిద్దాడు. తండ్రి అనంతరం బషర్ అల్ అస్సాద్ 2000 సంవత్సరంలో సిరియా అధ్యక్ష పదవిని చేపట్టాడు. ప్రస్తుత సంక్షోభంలో సిరియా ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటుదారులకు టర్కీ, సౌదీ అరేబియా, ఖతార్‌లు పూర్తిగా మద్దతునిస్తున్నాయి. సిరియా, టర్కీ సరిహద్దులో గల ఇస్కాందారు అనే టర్కీ దేశపు పట్టణంలో తిరుగుబాటు దళాలకు నాటో బలగాలు తర్ఫీదునిస్తున్నాయి. సౌదీ అరేబియా, ఖతార్‌లు డబ్బు (పెట్రో డాలర్లు) సహాయము చేస్తున్నాయి. అమెరికా, బ్రిటన్ ఇంటెలిజెన్స్ వర్గాలు సిరియా భూభాగంలో చురుకుగా పనిచేస్తున్నాయి. బ్రిటన్, అమెరికా సైనికాధికారులు, తిరుగుబాటు దళాలకు యుద్ధ రంగంలో మార్గనిర్దేశం చేస్తున్నాయి. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు టాంకులు, మిస్సైల్స్ లాంటి అత్యాధునిక ఆయుధాలు సరఫరా చేస్తున్నాయి. అయినప్పటికీ తిరుగుబాటుదారులు సిరియాలో అంతర్గత భూభాగంలో బేస్‌లు ఏర్పాటు చేసుకోలేకపోతున్నారు. సిరియా భూభాగంలోకి చొచ్చుకొచ్చిన టర్కీ జెట్ విమానాన్ని సిరియా బలగాలు కూల్చివేశాయి. ఐక్య రాజ్య సమితి నియమించిన ప్రత్యేక దూత కోఫీ అన్నన్ మాట్లాడుతూ, లిబియాలో లాగా కాకుండా సిరియాలో అంతర్గత తిరుగుబాటుకు బదులు సిరియా బార్డర్‌లో యుద్ధం తీవ్రతరం అవుతోందని పేర్కొన్నాడు. సిరియాతో టర్కీ సంబంధాలు 1990 దశకంలో సౌహార్ద్ర పూరితంగా వుండేవి. టర్కీ అధ్యక్షుడిగా ఎర్దోగాన్ అధికారానికి వచ్చిన తర్వాత పెట్టుబడిదారీ దేశాల పోటీలో భాగంగా టర్కీ గట్టి పోటీనివ్వాలంటే సిరియాతో మంచి సంబంధాలు అవసరమని భావించాడు. ముఖ్యంగా ఇరాక్‌తో అమెరికా యుద్ధంలో కూరుకొని పోయిన కాలంలో సిరియాను పశ్చిమదేశాలకు అనుకూలంగా ఉండేలా ప్రోత్సహించాడు. కానీ సిరియాలో ప్రస్తుతం అంతర్యుద్ధం వలన పరిస్థితి పూర్తిగా మారింది. టర్కీయే సిరియా తిరుగుబాటుదారులకు తర్ఫీదునిస్తున్నది. సిరియాలో అంతర్యుద్ధాన్ని నిలుపుదల చేయడానికి వుద్దేశించి ఐక్య రాజ్య సమితి మాజీ అధ్యక్షుడు కోఫీ అన్నన్‌ను ప్రత్యేక దూతగా పంపింది. ఈ సంఘర్షణ అంతానికి కోఫీ అన్నన్ ఆరు సూత్రాల పథకాన్ని సంఘర్షణ పడుతున్న ఇరుపక్షాల ముందుంచాడు. ఈ ఆరు సూత్రాలను సిరియా ప్రభుత్వం అంగీకరించింది. ఇరుపక్షాల మధ్య రాజకీయ సంప్రదింపులతో పాటు హెూమా, హమా, ఇడ్లీబీ పట్టణాల నుండి ప్రభుత్వ బలగాలను వుపసంహరించి, తిరిగి సైన్యాన్ని బ్యారక్‌లకు పంపించి వేయడానికి, దేశంలో ఐరాస శాంతి పరిరక్షక దళాల్ని నియమించడానికి సిరియా ప్రభుత్వం సిద్ధపడింది. తిరుగుబాటు దారులు ఈ సూత్రాలను అంగీకరించలేదు. కోఫీ అన్నన్ దౌత్యం నెరుపుతున్న సమయంలోనే అల్లర్లు, హింస మరింత తీవ్రం అయినాయి.

ఇటు సిరియాలో అల్లర్లు పెరిగిపోవడం, తాను ప్రతిపాదించిన ఈ ఆరు సూత్రాలను భద్రతాసమితి అంగీకరించకపోవడంతో తాను



ఒక సామూహిక వధలో వంద మందికి పైగా మరణించిన వారికి సామూహిక అంత్యక్రియలు జరుపుతున్న దృశ్యం

విఫలమైనట్లు పేర్కొంటూ కోఫి అన్నన్ నిస్సహాయత వ్యక్తం చేస్తూ ఐక్య రాజ్య సమితి ప్రత్యేక దూతగా రాజీనామా చేశాడు.

ఈ సంవత్సరం ఫిబ్రవరిలోనే సిరియా ప్రభుత్వం, బహుళ పార్టీలు పాల్గొనే ఎన్నికలకు నాందిగా కొత్త రాజ్యాంగంపై ప్రజాభిప్రాయ సేకరణ జరిపింది. ఈ కొత్త రాజ్యాంగానికి ఆమోదం తెలుపుతూ 89.4 శాతం ప్రజలు ఓటు వేశారు. ఈ రెఫరెండాన్ని తిరుగుబాటుదారులు వ్యతిరేకించి ఎన్నికల్లో పాల్గొనలేదు. పశ్చిమ దేశాలు ఈ రెఫరెండంకు ఎలాంటి సాధికారతను యివ్వలేదు.

సిరియాలో అల్లర్లు ప్రారంభమైన వెంటనే సామ్రాజ్యవాదుల జోక్యం పెరిగిపోయింది. పశ్చిమ సామ్రాజ్యవాదులైన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లకు సిరియాపై గుర్రు చాలా కాలంగా వుంది. పశ్చిమాసియాలో ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా సిరియా పోరాడుతున్నదని, ఇరాన్‌తో మంచి సంబంధాలు కల్గివుందని, రష్యాకు మిత్ర దేశంగా ఉందనే వుద్దేశంతో, సామ్రాజ్యవాద దేశాలు ఇరాన్‌తో పాటు సిరియాను టార్గెట్ చేసి వీలు దొరికితే దురాక్రమణ చేయడానికి సిద్ధంగా వున్నాయి. బషర్ అల్ అస్సాద్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విపక్షాలు ఒక్కటై 'సిరియన్ నేషనల్ కౌన్సిల్'ను ఏర్పరిచి అంతర్యుద్ధాన్ని ప్రారంభించిన నేపథ్యంలో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లకు సిరియాలో బషర్ అల్ అస్సాద్ ప్రభుత్వాన్ని గద్దె దింపి, ఇరాన్‌కు సిరియా నుండి ఎలాంటి సహాయం అందకుండా చేసి, ఇరాన్‌ను ఒంటరి చేసి దెబ్బతీయాలనే పథకం కూడ వుంది.

సిరియాలో అంతర్యుద్ధం ప్రారంభమైన తరువాత అరబ్ లీగ్ ఒక ప్రణాళిక రూపొందించింది. సిరియాలో శాంతియుత వాతావరణం ఏర్పాటుకు అధ్యక్షుడు అస్సాద్ వైదొలగాలని, వుపాధ్యక్షుడికి అధికారం అప్పగించాలనీ, ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రారంభించాలనే ముఖ్యమైన అంశాలు ఈ తీర్మానంలో వున్నాయి.

ఈ తీర్మానం అమలు కోసం అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌ల ఒత్తిడితో ఐక్య రాజ్య సమితి భద్రతా మండలిలో దీనిపై చర్చించారు. ఈ తీర్మానాన్ని రష్యా, చైనాలు వీటో చేశాయి. భద్రతా మండలిలో ప్రవేశపెట్టిన తీర్మానం గనుక ఆమోదం పొందినట్లయితే, లిబియాలో

లాగానే సిరియాలో కూడ అమెరికా, బ్రిటన్‌లు జోక్యం చేసుకొంటాయని రష్యా విదేశాంగ మంత్రి సర్గోవ్ లావారోవ్ పేర్కొన్నాడు. సిరియాలో పరిపాలక వర్గాన్ని అధికారం నుండి తొలగించడం అంటే, యిది అంతర్జాతీయ సంబంధాల్లో ఐక్య రాజ్య సమితి స్వభావానికి, ఆచరణకు మార్గదర్శకంగా వుండే ప్రాథమికమైన పద్ధతులకు విరుద్ధమైందని చైనా విదేశాంగ మంత్రి లీ-బోండాంగ్ పేర్కొన్నాడు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు లిబియాలోలాగా నేరుగా ఆంతరంగిక జోక్యం చేసుకోవడానికి ఐక్య రాజ్య సమితి ఏడవ చాప్టర్ తీర్మానాన్ని సిరియా విషయంలో కూడ ఆమోదింపచేయడానికి అరబ్ లీగ్ ప్రణాళికను ముందుకు తెస్తున్నారనేది గమనార్హం.

ఐక్య రాజ్య సమితి భద్రతా మండలిలో రష్యా, చైనాలు వీటో వుపయోగించడంతో సామ్రాజ్యవాదులు సిరియా విషయంలో రెండుగా చీలిపోయాయి. వీరి మధ్య వైరుధ్యం తీవ్రతరం అవుతున్నది. లెబనాన్ లాగా సిరియాలో అమెరికా దాని మిత్రదేశాలు పాగా వేస్తే, రష్యా ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతుంది. సిరియా చాలా కాలంగా రష్యాకు మిత్రదేశంగా వుండి, ఈ ప్రాంతంలో రష్యా ప్రయోజనాలు నెరవేరుస్తున్నది. సిరియా రక్షణ రంగానికి అవసరమైన ఆయుధాలను రష్యా సరఫరా చేస్తున్నది. 36 యాక్ ఫైటర్ విమానాలు సిరియాకు సప్లయ్ చేసింది. రష్యా యుద్ధ నౌకలు సిరియా సముద్ర తీరంలోని టార్గెల్ అనే పోర్టులో నిలిచి వున్నాయి. చైనా కూడ సిరియాకు ఆయుధాలు అమ్ముతున్నది. మధ్యధరా సముద్రంలో చైనా ప్రయోజనాలు దెబ్బతినే అవకాశం కూడ వుంది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు సిరియాపై యుద్ధాన్ని రుద్దడానికి ప్రయత్నిస్తుంటే మరోవైపు రష్యా - చైనా, ఇరాన్ - సిరియా ట్రూప్స్ కలిసి (90 వేల వరకు) భూమిపై, సముద్రంపై జాయింట్ మిలిటరీ ఎక్సర్‌సైజ్‌లు చేయాలని నిర్ణయం తీసుకున్నాయి. సిరియాకు వెనిజులాతో పాటు కరేబియన్ దేశాలు బలమైన మద్దతును తెలియజేస్తున్నాయి. ఇరాన్, వెనిజులాలు సిరియాకు ఆయిల్ సహాయం చేస్తున్నాయి.

మరోవైపు అమెరికా "సిరియా మిత్రులు" అనే పేరిట అరబ్ దేశాల్లో ఒక సంస్థను తయారు చేసింది. ఈ దేశాలతో అమెరికా విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్ టూనిస్‌లో సమావేశం జరిపింది. ఈ సమావేశంలో సిరియాలో ప్రస్తుతం వున్న హింసాత్మక పరిస్థితులరీత్యా నాటో సైనిక జోక్యం అవసరమని, అందుకు "సిరియా మిత్రదేశాలు" సహకరించాలని కోరింది. కాని యిందులో చాలా దేశాలు సిరియాలో నాటో జోక్యాన్ని వ్యతిరేకించాయి. టునీషియా అధ్యక్షుడు మోన్సెఫ్ మెర్జాకీ ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించి, టునీషియా విప్లవం శాంతిని కోరుకొంటుందని పేర్కొన్నాడు.

భద్రతా మండలిలో తన ప్రణాళిక వీటో అయిన తర్వాత అరబ్ లీగ్ 'సిరియా మానిటరింగ్ మిషన్'ను సిరియాకు పంపించింది. దీనికి ఆల్‌దాబి అనే అతన్ని నాయకుడిగా నియమించింది. ఈ సంస్థ సిరియాలో పర్యటించి, ఒక రిపోర్టు తయారు చేసింది. ప్రచారం జరుగుతున్నంతగా సిరియాలో హింస లేదని, ప్రభుత్వ బలగాలు సహనం పాటిస్తున్నాయని, హింసకు ప్రధానంగా ప్రైవేట్ సాయుధ గ్యాంగులు కారణమని మానిటరింగ్ మిషన్ తన రిపోర్టులో పేర్కొంది. ఈ రిపోర్టును అరబ్‌లీగ్‌లోని ఖతార్ దేశం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ రిపోర్టును అరబ్‌లీగ్ ఆమోదించడమైతే చేసింది గానీ, అల్‌దాబీని ఆ సంస్థ నాయకత్వం నుండి తొలగించింది.

బ్రిక్స్ దేశాలు (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) ఢిల్లీలో జరిగిన నాలుగవ సమావేశంలో, సిరియాపై ఒక డిక్లరేషన్‌ను ఆమోదించారు. "సిరియా సమాజంలోని అన్ని సెక్షన్ల న్యాయబద్ధమైన ఆకాంక్షలు ప్రతిబింబించేలా, సిరియా స్వాతంత్ర్యం, భౌగోళిక సమగ్రత, సార్వభౌమాధికారం కాపాడబడేలా శాంతియుత మార్గాల ద్వారా జాతీయ చర్చను ప్రోత్సహించేలా వుండాలని" ఆ డిక్లరేషన్‌లో పేర్కొన్నాయి. కాని ఆ తర్వాత అందులో సభ్య దేశమైన భారతదేశం ఈ డిక్లరేషన్‌కు కట్టుబడకుండా భద్రతా సమితిలో అరబ్‌లీగ్ ప్రణాళికకు ఓటు వేసింది. సిరియాకు వ్యతిరేకంగా తన వైఖరి తెలిపింది. అరబ్‌లీగ్ ప్రణాళికను అడ్డం పెట్టుకొని, అమెరికా సిరియాలో జోక్యానికి సన్నాహాలు చేస్తుందనే విషయం బహిరంగ రహస్యమైనప్పటికీ, అరబ్‌లీగ్ ప్రణాళిక కాబట్టి దానికి ఓటు వేశామని భారతదేశం బుకాయిస్తున్నది. ఇలాగే భద్రతా మండలిలో ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా తీర్మానం పెడితే భారతదేశం తటస్థంగా వుంది. లిబియా విషయంలో కూడా తటస్థంగానే వుంది. భారతదేశం ఇలాంటి విధానాల ద్వారా అమెరికా దురాక్రమణ యుద్ధాలకు పూర్తిగా తన మద్దతు తెలుపుతున్నది.

అమెరికా నేతృత్వంలో సామ్రాజ్యవాదులు తమ ఆర్థిక, భౌగోళిక రాజకీయ లబ్ధిలో భాగంగా దురాక్రమణ యుద్ధాలకు దిగుతూ నయా వలస విధానాన్ని ప్రపంచంపై రుద్దుతున్నారు. పెట్టుబడిదారీ విధానంలో తలెత్తుతున్న అర్థిక సంక్షోభంలో నుండి బయటపడడానికి ప్రపంచ వనరుల మీద గుత్తాధిపత్యం కోసం సామ్రాజ్యవాదులు దురాక్రమణ యుద్ధాలు చేస్తున్నారు. 2008లో సంభవించిన ద్రవ్య ఆర్థిక సంక్షోభం తర్వాత ఈ ధోరణి మరింతగా పెరుగుతూనే వుంది. అమెరికా నేతృత్వంలో నాటో బలగాలు ఇరాక్‌పై రెండు యుద్ధాలు చేసి, 2003లో ఆ దేశాన్ని దురాక్రమించి, సద్దాం హుస్సేన్‌ను గద్దె దింపి చివరకు పరమ నిరంకుశంగా ఉరితీశాయి. అలాగే అఫ్ఘానిస్తాన్‌పై దాడి చేసి ఆ దేశాన్ని దురాక్రమించాయి. ఈ రెండు దేశాల్లో తమ తొత్తు ప్రభుత్వాలను గద్దెపై కూర్చోబెట్టి ఆ దేశాల్లో అధికారం చెలాయించ ప్రయత్నిస్తున్నాయి. అయినప్పటికీ అఫ్ఘానిస్తాన్‌లో నాటో సైన్యాలకు తీవ్ర ప్రతిఘటన ఎదురై ఆ దేశం నుంచి అవి తోకముడిచే పరిస్థితి రాగా, ఇరాక్‌లో పరిస్థితులు అమెరికా అదుపులో లేకుండా అస్తవ్యస్తంగా తయారైనాయి.

మధ్య ఆసియా, దక్షిణ కాకసస్ ప్రాంతంలోని ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలను పొందే విధంగా అమెరికా 'సిల్క్ రోడ్ స్ట్రాటజీ యాక్ట్'ను 1999లో రూపొందించింది. 2006లో చట్టాన్ని సవరించి దక్షిణాసియా, మధ్య ఆసియా, యూరేసియా,

పశ్చిమాసియా తదితర ప్రాంతాలకు దీన్ని విస్తరింపజేసింది. ఈ ప్రాంతాల్లోని సహజ వనరుల రీత్యా సంబంధిత దేశాలలో ఉదారవాద అడ్డంకులను, అధికారస్వామ్య పద్ధతులను తొలగించి, రవాణా, ఇంధన మౌలిక సదుపాయాలను తన అదుపులోకి తెచ్చుకో ప్రయత్నిస్తున్నది. విశాలమైన ఆర్థిక, వాణిజ్య సామ్రాజ్యాన్ని రూపొందించేందుకు, అందుకు సహకరించే ప్రభుత్వాల ఏర్పాటు కోసం అమెరికా నిర్విరామంగా కృషి చేస్తున్నది. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం నుండి బయటపడడం కోసం 'న్యూ సిల్క్ రోడ్ స్ట్రాటజీని' అమలులోకి తెచ్చేందుకు పూనుకొంటున్నది. అందులో భాగంగానే 'అరబ్ వసంతం' తిరుగుబాట్ల తర్వాత ఆయా దేశాల పరిస్థితులను బట్టి ఆ దేశాలను నయాన లేదా భయాన తన అదుపులో పెట్టుకోవడానికి కృషి చేస్తున్నది. టునీషియా, ఈజిప్టు తదితర దేశాల్లో, ఒక రకమైన విధానాలను అమలు చేస్తూ, లిబియాలో అక్కడి తిరుగుబాటుదారులకు సైనిక, రాజకీయ, దౌత్య మద్దతునిచ్చి గడాఫీని అధికారం నుండి తొలగించి, హత్య చేసింది.

1979లో ఇరాన్‌లో రాచరికానికి వ్యతిరేకంగా జరిగిన మత విప్లవం తర్వాత నుండి పశ్చిమ దేశాలకు ఇరాన్ శత్రు దేశంగా మారింది. ఇరాన్‌ను లొంగదీసుకోవడానికి మూడు దశాబ్దాలుగా పశ్చిమ దేశాలు తీవ్ర ప్రయత్నాలు చేస్తూనే వున్నాయి. ప్రస్తుతం ప్రపంచంలో ఇరాన్‌ను ఒంటరి చేసి దానిపై దురాక్రమణ చేయాలని అమెరికా ఉవ్విళ్ళూరుతున్నది. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తోందన్న సాకుతో అమెరికా ఆ దేశంపై 2006 – 10 మధ్య కాలంలో నాలుగుసార్లు ఆంక్షలు విధించింది. ఇరాన్ శాస్త్రవేత్తల హత్యలు, కిడ్నాపులు, కంప్యూటర్లపై వైరస్ దాడులు, అంతు చిక్కని పేలుళ్ళు మొదలైనవి జరిపించింది. వీటిని లెక్క చేయకుండా ఇరాన్ అణు ఇంధన విషయంలో ముందుకు సాగగా, ఇరాన్ నుండి చమురు దిగుమతులను నిలిపివేయించడానికి అమెరికా నిర్ణయాలు తీసుకొంది. ఇరాన్ నుండి ఇంధన దిగుమతులను జూలై నుంచి నిలిపివేసినట్లుగా యూరోపియన్ యూనియన్ ప్రకటించింది. ఇతర దేశాలు కూడా ఇలా చేయాలని అమెరికా ఒత్తిడి తెస్తున్నది. సిరియాకు, లెబనాన్‌లో హిజిబుల్లాకు సహకరిస్తున్నదని ఇరాన్‌ను ధూర్త దేశంగా అమెరికా ప్రకటించింది. ప్రస్తుతం సిరియాలో బాత్ పార్టీ అధికారాన్ని తొలగించి ఇరాన్‌పై దురాక్రమణ చేయాలనే వుద్దేశంతోనే సిరియాలో సైనిక జోక్యానికి అమెరికా సిద్ధపడుతున్నది. మరోవైపు ఇజ్రాయిల్ ఇరాన్, సిరియాలపై యుద్ధానికి తీవ్రమైన సన్నాహాలు చేస్తూ అమెరికాపై ఒత్తిడి చేస్తున్నది. ఇదే సమయంలో గాజా స్ట్రిప్పులో, వెస్టు బ్యాంకులో వైమానిక దాడులు చేసి, బాంబుల వర్షం కురిపించి అనేక మంది పౌరులను పొట్టనపెట్టుకుంది. సిరియా, లెబనాన్‌లో హిజిబుల్లాలు, పాలస్తీనాలో హమాస్‌లు కలిసికట్టుగా ఈ శతాబ్దంలో రెండు ఇజ్రాయిల్ దాడులను సాహసోపేతంగా ఎదుర్కొన్నారు. అందుకే ఇజ్రాయిల్‌తో పాటు పశ్చిమ దేశాలు సిరియాపై తమ దృష్టినంతా కేంద్రీకరించాయి.

అరబ్ దేశాలతో పాటు, ఆఫ్రికాలో 50, 60 దశకాల్లో వలసవాదానికి వ్యతిరేకంగా జరిగిన గొప్ప వుద్యమాలతో సామ్రాజ్యవాదంకు తల బొప్పికట్టింది. ఈ వుద్యమాలకు అప్పటి సోషలిస్టు క్యాంపు గట్టి మద్దతునిచ్చింది. ఈ దేశాలు వలసల నుండి విముక్తి పొంది అర్ధ వలస– అర్ధ భూస్వామ్య దేశాలుగా మారిపోయాయి. ప్రపంచంలో చమురు, సహజ వాయువు డిమాండ్ పెరిగి పోవడంతో ఈ దేశాలపై పెత్తనాన్ని వదులుకోవడానికి సామ్రాజ్యవాదులు సిద్ధంగా లేరు. వారు ఏదో పద్ధతిలో ఈ దేశాలను లొంగదీసుకోవడానికి ప్రయత్నాలు చేస్తూనే వున్నారు. 1967 ఇజ్రాయిల్ – అరబ్ యుద్ధంలో అరబ్ దేశాల ఓటమి తర్వాత క్రమంగా అరబ్ జాతీయవాదం వెనకపట్టు పట్టింది. అరబ్ దేశాల్లో జాతీయవాదం మాటున అధికారానికి వచ్చిన రాజరిక – నిరంకుశ దళారీ బూర్జువా – బడా భూస్వామ్య వర్గాలు ఈ దేశాల్లో తీవ్రహింసకు, అణచివేతకు పాల్పడి జాతులను, ప్రజా వుద్యమాలను అణచిపెట్టడంతో పాటు కమ్యూనిస్టులను, ఊచకోత కోశారు. సూడాన్, యెమెన్, సిరియా, ఇరాక్ నుండి ఈజిప్టు వరకు ఇదే విధానాన్ని అధికారానికి వచ్చిన పాలకవర్గాలు అమలు చేశాయి. క్రమంగా ఈ దేశాల్లో సామ్రాజ్యవాదులతో మిలాఖతైన రాజరిక ప్రభువులు, నియంతలు చమురు, సహజ వాయువు అమ్ముకోవడం ద్వారా లభించిన బిలియన్ల పెట్రో డాలర్లతో కోటీశ్వరులుగా అవతారమెత్తారు. వీరే దేశాల్లో కుటుంబపాలన, నిరంకుశ పరిపాలనను కొనసాగించారు. ఈజిప్టులో హెూస్ని ముబారక్, లిబియాలో గడాఫీ, ఇరాక్‌లో సద్దాం హుస్సేన్, టునీషియాలో సాలే, సిరియాలో అస్సాద్‌లు తమకు ఎదురులేకుండా దశాబ్దాలుగా నిరంకుశ పరిపాలన సాగించారు. సిరియాలో ఇప్పటికీ బాత్ పార్టీయే అధికారంలో కొనసాగుతున్నది. ఇక్కడ బహుళ పార్టీ వ్యవస్థకు రాజ్యాంగంలో తావులేదు. నిరంకుశ పాలన ప్రజలను నానా యాతనలు పెట్టింది. టునీషియా, ఈజిప్టుల నుండి ప్రారంభమైన 'అరబ్ వసంతం' అరబ్ దేశాలను చుట్టుముడుతూ సిరియాలో కూడా వెల్లివిరిసింది. ఈ ధోరణిని సకాలంలో బాత్ పార్టీ అర్థం చేసుకోక, నిరసనలు చేస్తున్న ప్రజలపై కాల్పులు, అరెస్టులు కొనసాగించింది. ప్రజాందోళనలు పెరిగి విషమిస్తున్నదని అర్థం కాగానే, అస్సాద్ ప్రభుత్వం కొన్ని రాజకీయ సంస్కరణలకు సిద్ధపడింది. కాని అప్పటికే విపక్షాలు ఆందోళనను చేతిలోకి తీసికొని డమాస్కస్‌పై అధికారం కోసం అంతర్యుద్ధం ప్రారంభించాయి. గుంటకాడి నక్కలా కాచుకొని వున్న సామ్రాజ్యవాద దేశాలు సిరియాలో ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవడాన్ని తీవ్రతరం చేశాయి.

ప్రస్తుతం అరబ్ దేశాల్లో ప్రజలు వాంఛిస్తున్నట్లుగానే సిరియాలో కూడ ప్రజలు నియంతృత్వ ప్రభుత్వం నశించాలని, రాజకీయ మార్పులు రావాలని, నిరుద్యోగం పోవాలని, రాజకీయ స్వేచ్ఛ, బాధ్యతాయుత ప్రభుత్వం, మంచి జీవనం, నిర్భయమైన జీవితం కోసం దృఢ నిశ్చయంతో పోరాడుతున్నారు.

టునీషియా, ఈజిప్టు, తదితర అరబ్ దేశాల్లో తిరుగుబాట్లు ప్రజ్వరిల్లి ప్రజల ఆక్రోశానికి సైనిక నియంతలు మట్టికరిచారు. కాని వ్యవస్థలో ప్రజలు ఆశించిన విధంగా రాజకీయ, ఆర్థిక

మార్పులు జరగలేదు. ఈజిప్టులో హొస్ని ముబారక్ పతనం తర్వాత కూడ మొన్నటి వరకు తంత్యాని సైనిక ముఠా అధికారంలో నిరంకుశ పాలన కొనసాగింది. ఒక ఏడాది కాలంలో 12 వేల మందికి పైగా ఆందోళనలో పాల్గొన్నవారిని కక్షసాధింపు చర్యలతో సైనిక కోర్టుల్లో విచారించి వివిధ రకాలైన శిక్షలు విధించారు. ఈ ముఠా తాత్కాలిక పార్లమెంటు చేసిన తీర్మానాలను తోసిపుచ్చింది. ఎన్నికలను వాయిదా వేసి దేశంలో నిరంకుశ పరిపాలనను రుద్దడానికి తీవ్ర ప్రయత్నాలు చేసింది. కాని మళ్లీ రాజధాని కైరోలోని తెహ్రీర్ స్క్వేర్‌లో లక్షలాది మంది ప్రజలు మిలిటెంట్ ఆందోళన చేపట్టారు. దానితో తంత్యాని మిలిటరీ కూటమి తప్పని పరిస్థితుల్లో ఎన్నికలు జరిపించింది. ఈ ఎన్నికల్లో కూడ ఫలితాలను తారుమారు చేయ ప్రయత్నించింది. ప్రజల నిరసనలతో సాధ్యంకాకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో ముర్సీ ఎన్నికల్లో గెలిచినట్లుగా సైనిక ప్రభుత్వం ప్రకటించింది. అయినప్పటికీ అధ్యక్షుడు ముర్సీ ప్రభుత్వానికి, పార్లమెంటుకు ఇప్పటి వరకు పూర్తి అధికారాలను సైనిక ముఠా అప్పజెప్పలేదు. ఈ సంవత్సరన్నర కాలంగా సాగిన గొప్ప ప్రజా ఉద్యమాల తర్వాత కూడా అరబ్ ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదనే విషయం ఈజిప్టు పరిణామాలను చూస్తే కళ్లకు కట్టినట్టుగా కనపడుతున్నది.

సిరియాలో అధ్యక్ష పదవి నుండి అస్సాద్ దిగిపోవాలి; బాత్ పార్టీ నిరంకుశ అధికారం స్థానంలో బహుళ పార్టీల రాజకీయ వ్యవస్థ ఏర్పడాలి; ప్రజలకు స్వాతంత్ర్యం, ప్రజాస్వామిక హక్కులు కావాలి అనే డిమాండ్స్ కోసం సిరియా ప్రజలు జరుపుతున్న పోరాటం న్యాయబద్ధమైంది. ఆ పోరాటాలకు ప్రపంచ ప్రజలందరూ మద్దతునివ్వాలి. అయితే సిరియాలో ప్రజా వుద్యమకారులు దృష్టిలో పెట్టుకోవాల్సిన కొన్ని ముఖ్యమైన అంశాలు వున్నాయి. ప్రజా వుద్యమం స్వతంత్ర వుద్యమంగా ఎదగాలి. సిరియాలోని అన్ని సెక్షన్ల, అన్ని మతాల ప్రజలను, ముఖ్యంగా మైనారిటీలను కలుపుకొని బలమైన ప్రజా వుద్యమాన్ని పెంపొందించాలి. మరోవైపు విపక్షాలైన దళారీ నిరంకుశ బూర్జువా వర్గంలోని నాయకత్వం నుండి ఒక సెక్షన్ ప్రజలను స్వతంత్ర వుద్యమాల వైపు తీసుకొని రావాలి. అస్సాద్ ప్రభుత్వాన్ని అధికారం నుండి తొలగించడంతో పాటు సిరియా ఆంతరంగిక విషయాల్లో సామ్రాజ్యవాదుల, ముఖ్యంగా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌ల జోక్యాన్ని నిర్ద్వంద్వంగా నిరాకరించాలి, తిప్పికొట్టాలి.

గత ఏడాదిన్నరగా అరబ్ ప్రజలు గొప్ప ఉద్యమాలు చేపట్టినప్పటికీ, వారి ఆకాంక్షలు ఇంకా నెరవేరలేదు. పోరాడుతున్న ప్రజలకు పురోగామిగా సంఘటితమైన కార్మికవర్గ పార్టీ నాయకత్వం వహించినప్పుడే, ప్రజలు దేశంలో నిరంకుశ పరిపాలనను కూలదోయడంతో పాటు సామ్రాజ్యవాదులను దేశం నుండి పారదోలి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయగలుగుతారు. ప్రస్తుతం అన్ని అరబ్ దేశాల్లో కార్మికవర్గ పార్టీ అయిన విప్లవకర కమ్యూనిస్టు పార్టీలు లేకపోవడం పెద్దలోటు. గతంలో సిరియాతోపాటు ఈ దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు బలంగానే వుండేవి. ఆ ప్రేరణతో సిరియాలో ప్రజలు నూతనంగా విప్లవ పార్టీని నిర్మించుకొని, దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి, రాచరికానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేయడం ద్వారానే నిజమైన విముక్తిని సాధించగలుగుతారు.

సిరియాలో అస్సాద్ పరిపాలన అంతం కావాలని, సిరియా అంతర్గత విషయాజల్లో సామ్రాజ్యవాదుల జోక్యందారి విధానాలను మానుకోవాలని, సిరియా భవితవ్యాన్ని సిరియా ప్రజలే నిర్ణయించుకోవాలని, ప్రపంచ ప్రజలంతా ఎలుగెత్తి చాటాలి. సిరియా ప్రజలు స్వేచ్ఛాయుతమైన రాజకీయ వ్యవస్థను స్థాపించుకొని, సామ్రాజ్యవాదాన్ని తమ గడ్డపై లేకుండా తరిమివేయగలరని ఆశిద్దాం.

★

---

*( 13వ పేజీ తరువాయి...)*

పండా మా పార్టీ, ఉద్యమం, నాయకత్వం పట్ల తీసుకున్న శత్రుపూరిత అవకాశవాద వైఖరిని, పాలకవర్గ అనుకూల, ప్రజావ్యతిరేక వైఖరులను ఖండించాలనీ, అతన్నీ, కుళ్లికంపు కొట్టే అతని ఆధునిక రివిజనిస్టు రాజకీయాలనూ, అతను చేసిన ఆరోపణలనూ తిరస్కరించాలని ఒడిషా కామ్రేడ్స్‌కూ, ప్రజాసంఘాలకూ, విప్లవ-ప్రజాస్వామిక ప్రజానీకానికీ మేం విజ్ఞప్తి చేస్తున్నాం. సాటిలేని విప్లవ మొనగాళ్లుగా తమను తామే చాటుకునే, పాలకవర్గాలచే అలా ఫోకస్ చేయబడే ఇటువంటి రెనెగేడ్లు చరిత్ర పెంటకుప్పల మీదకు విసిరివేయబడతారనీ, నిజమైన విప్లవ పార్టీ, దాని నాయకులూ, దాని నాయకత్వంలోని విప్లవ ప్రజానీకమూ అసమాన ధైర్యసాహసాలతో పెను తుఫానుల మధ్యనుండే అంతిమ విజయంకేసి అప్రతిహతంగా పురోగమిస్తారనీ చరిత్ర అనేకసార్లు రుజువు చేసింది. పండాలాంటి కుహనా విప్లవకారులు కాదు, ప్రజలే చరిత్ర నిర్మాతలు. ఒడిషా పేరు చెప్పుకుని పబ్బం గడుపుకుంటూ పాలకవర్గాల పాదసేవలో తనివితీరా మునిగిపోయే పండాలాంటి ద్రోహుల్ని ఒడిషా విప్లవ ప్రజానీకం తప్పకుండా తిరస్కరిస్తారనీ, సిపిఐ (మావోయిస్టు) నాయకత్వంలో ఒడిషా కామ్రేడ్స్, అశేష పీడిత ప్రజానీకం విప్లవ మార్గంలో పయనిస్తారనీ మా పార్టీ సంపూర్ణ విశ్వాసంతో ఉన్నది.

**ఆనంద్**

**పొలిట్‌బ్యూరో సభ్యుడు, మధ్య రీజనల్ బ్యూరో కార్యదర్శి**

**కేంద్ర కమిటీ తరఫున,**

**సీపీఐ (మావోయిస్టు)**

# అసోం ఘర్షణలకు కారకులు పాలకులే!

అసోంలో ఇటీవల చెలరేగిన ఘర్షణలు దేశవాసులను తీవ్రంగా ఆందోళన పర్చాయి. అసోంలోని బోడోల్యాండ్ ప్రాదేశిక స్వయంప్రతిపత్తి జిల్లాల (బీటీఏడీ) ప్రాంతంలోని కోక్రాఝార్, చిరాంగ్, ధుబ్రి జిల్లాలు ఈ ఘర్షణలకు కేంద్రంగా వున్నాయి.

బోడోలకు, ముస్లింలకు మధ్య జరుగుతున్నవిగా ప్రచారంలోకి వచ్చిన ఈ ఘర్షణలు జూలై 6న ఒక ముస్లిం విద్యార్థి సంఘానికి చెందిన ఇద్దరు కార్యకర్తలను గుర్తు తెలియని వ్యక్తులు చంపడంతో ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత జూలై 18న మైనారిటీ విద్యార్థుల సంఘం మాజీ అధ్యక్షుడు మొహిబుల్ ఇస్లాంను, ఆయన సహచరుడిని కోక్రాఝార్ పట్టణ సమీపంలో చంపడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. జూలై 19న వెయ్యి మందికి పైగా ముస్లింలు కలిసి నలుగురు బోడో యువకులను చంపేశారు. ఆ తర్వాత ఘర్షణలు కొనసాగుతూనే పోయాయి. ఫలితంగా ఆగస్ట్ 9 నాటికి అధికారిక లెక్కల ప్రకారం 77 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే ఇంతకు ఐదు రెట్ల మరణాలు సంభవించాయని సైనిక వర్గాలు పేర్కొన్నాయి. కాగా వందలాది గ్రామాలు, వేలాది ఇండ్లు బూడిద కుప్పలుగా మారాయి. దాదాపు నాలుగు లక్షల మంది ప్రజలు నిరాశ్రయులై కిక్కిరిసిన శరణార్థి శిబిరాలలో బిక్కు బిక్కుమంటూ రోజులు వెళ్లదీస్తున్నారు. ఇక ఈ ప్రాంతమంతా కర్ఫ్యూలతో, కనిపిస్తే కాల్చివేతలతో కొంత కాలం పాటు అట్టుడికిపోయింది. సామాన్య జనజీవనం స్తంభించిపోయింది.

బంగ్లాదేశ్ నుండి అక్రమంగా చొరబడుతున్న ముస్లింల వల్లే ఇటువంటి ఘర్షణలు ఉత్పన్నమవుతున్నాయని, ఇలా చొరబడుతున్న వారిని కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా వుపయోగించుకుంటూ ఈ ఘర్షణలు పెరగడానికి కారణమవుతున్నదని బీజేపీ ఆరోపిస్తున్నది.

మొత్తంగా దీనిని బోడోలు, ముస్లింలకు మధ్య సమస్యగానో, బంగ్లాదేశ్ మూలంగా ఉత్పన్నమయిన సమస్యగానో చిత్రీకరించే ప్రయత్నం జరుగుతున్నది. ఇది మత సామరస్యం దెబ్బతినడం మూలంగా వచ్చిన సమస్యనో, విదేశీ హస్తంతో తలెత్తిన సమస్యనో కాదు. ఇది బోడో ప్రజలు చేస్తున్న జాతి పోరాటం. అయితే ఈ జాతి పోరాటం సాగవలిసిన తీరు మాత్రం ఇది కాదు.

తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాలనే బోడో ప్రజల ఆకాంక్షలను తప్పుదోవ పట్టించే కుట్రలను పాలక వర్గాలు పన్నుతున్నాయి. అందులో అవి చాలా వరకూ సఫలమవుతున్నాయి.

బోడో ప్రజల జాతి పోరాటమే కాదు, మొత్తంగా అసోం ప్రజల జాతి పోరాటం ఈనాటిది కాదు. అయితే ఈ పోరాటాన్ని అసోం ప్రజలకూ అసోమేతర ప్రజలకు మధ్య పోరాటంగా మలచడానికి ఇందిరా గాంధీ పాలన నుండే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందుకు కావలిసిన భౌతిక ప్రాతిపదిక కూడా అసోం రాష్ట్రానికి వుంది.

అసోం ప్రజలు వీరోచిత సంప్రదాయం కలవారు. తమ స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకోవడానికి మొఘలుల దాడులను చాలా కాలం వీరోచితంగా ప్రతిఘటించారు. వీరోచిత ప్రతిఘటన తర్వాతనే ఆ ప్రాంతం 1826లో బ్రిటీష్ వారి స్వాధీనమయింది. తేయాకు పంటకు అది చాలా అనువయిన ప్రాంతం. అమూల్యమైన, అపారమైన చమురు సంపద, అటవీ సంపద వుంది. ఆ సంపదను దోచుకోవడానికై తమకు అవసరమైన వుద్యోగులను బ్రిటీష్ వారు ఇరుగు పొరుగు రాష్ట్రాల నుండి అక్కడికి దిగుమతి చేశారు. క్రమంగా వారితో పాటు అనేక మంది, వర్తకులు తదితరులు అక్కడ చేరి స్థిరపడ్డారు. అలా చేరిన వారిలో అత్యధికులు బెంగాలీలు. బెంగాలీలలో ముస్లింలు అధికంగా వున్నారు. "భూ దాహం అధికంగా గల బెంగాలీ ముస్లింలు ఒక దండుగా ఇక్కడికు వచ్చి స్థిరపడుతున్నారు" అని 1931 నాటి జనాభా గణాంకాలకు సంబంధించిన సూపరింటెండెంట్ సి.ఎస్. ములియాన్ చేసిన వ్యాఖ్యానాన్ని యథాతథంగా తీసుకోనవసరం లేకపోయినా వలసల తీవ్రతను మాత్రం ఈ వ్యాఖ్యల ద్వారా అర్థం చేసుకోవచ్చు.



ఘర్షణల భయానికి వలస పోతున్న ప్రజలు

ఆ తర్వాత ఈ పరిస్థితి మరింత పెరిగింది. 1951 తర్వాత, అలాగే 1971 భారత్ పాక్ యుద్ధం తర్వాత అసోం జనాభా పెద్ద ఎత్తున పెరిగింది. వలసలే కాకుండా యుద్ధ సమయంలో బంగ్లాదేశ్ నుండి నాటి కేంద్ర సర్కార్ పెద్ద సంఖ్యలో ప్రజలను తీసుకువచ్చి ఇక్కడ స్థిరపరచడం కూడా ఈ పెరుగుదలకు ప్రధాన కారణం. ఈ వలసల్లో బెంగాలీలే అధికులు. రోజు రోజుకూ అసోం జాతి

జనాభా శాతం తగ్గడం అసోమీయేతర జనాభా శాతం పెరగడం అనేది అసోం ప్రజల్లో ఆందోళన కల్గించింది.

దీనికి తోడు 1947 తర్వాత అసోం రాష్ట్ర వనరులను దోచుకోవడమే తప్ప, దాని అభివృద్ధిని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిన కారణంగా రాష్ట్రంలో నిరుద్యోగం, పేదరికం ఆ కారణంగా అసంతృప్తి పెరిగిపోసాగాయి. ఈ అసంతృప్తి తన వైపుకు కేంద్రీకృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం అసోములకు, బెంగాలీలకు గొడవలు సృష్టించింది.

బెంగాల్ జాతీయ దురహంకారులు, వారికి సేవ చేసిన సీపీఐ, సీపీఐఎం నాయకులు కూడా తమ బృహత్ బెంగాల్ పథకంలో భాగంగా బతుకుదెరువు కోసం ఈశాన్య ప్రాంతంలో స్థిరపడిన బెంగాలీలను పాచికలుగా వుపయోగించుకోవాలని చూశారు.

అఖిల అసోం మైనారిటీ యువ పరిషత్తును, అఖిల అసోం స్టూడెంట్స్ యూనియన్‌కు, అసోం ప్రజల వుద్యమానికి పోటీగా ప్రోత్సహించి న్యాయమైన అసోం పోరాటాన్ని అసోం, అసోమేతర ప్రజలకు; ముఖ్యంగా అసోం ప్రజలకూ అసోంలో నివసిస్తున్న బెంగాలీ ప్రజలకు మధ్య అంతర్యుద్ధంగా మార్చడానికి ఇందిరా గాంధీ ప్రభుత్వం, మార్క్సిస్ట్ పార్టీ నాయకులు పథకం పన్నారు.

ఇందిరా గాంధీ హయాంలో మొదలైన ఇటువంటి కుట్రలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అసోం ప్రజల స్వాతంత్ర్య ఆకాంక్షలను అడ్డుకోవడానికి తీవ్రమైన అణచివేతను ప్రయోగించడంతో పాటు పోరాటాన్ని పక్కదారి పట్టించడం, పోరాడే సంస్థల్లో చీలికలు తేవడం, కొన్ని సంస్థలను లొంగదీసుకోవడం, పోటీ సంస్థలను ఏర్పాటు చేసి వాటి ద్వారా సమస్యను పక్కదార్లు పట్టించడం వంటి అన్ని రకాల కుయుక్తులకు పాలకవర్గాలు పాల్పడుతున్నాయి.

అసోం జాతి పోరాటంలో భాగంగానే అసోంలోని బోడో ప్రజల జాతి పోరాటం కూడా నడుస్తున్నది. కోక్రాఝార్, చిరాంగ్, బక్సా, ఉదాల్‌గురి జిల్లాల పరిధిలోని ప్రాంతం బోడోల సొంత గడ్డ. 2003లో వీటిని ధుబ్రి, కోక్రాఝార్, బొంగైగావ్, బార్పేట, నల్‌బరీ, కామరూప్, దర్రాంగ్, సోనిత్‌పూర్ అనే ఎనిమిది జిల్లాలుగా విభజించారు. అన్ని రంగాల్లోనూ ఈ ప్రాంతం ఘోరంగా నిర్లక్ష్యం చేయబడింది. ఫలితంగా బోడోల్లో నిరుద్యోగం, పేదరికం పెరిగిపోయింది. రాజకీయ అధికారంలో వాళ్లకు తగిన ప్రాతినిధ్యం కొరవడింది. సాంస్కృతికంగా కూడా వివక్షకు గురయ్యారు. ఫలితంగా బోడోల్లో జాతి చైతన్యం రగుల్కోసాగింది. 1987 నుండి స్వతంత్ర రాష్ట్రం కోసం పోరాటం మొదలైంది. ఈ పోరాటం ఫలితంగా 1993 ఫిబ్రవరిలో కేంద్రం–రాష్ట్రం–బోడోల నడుమ కుదిరిన ఒక త్రైపాక్షిక ఒప్పందం మేరకు బోడోల్యాండ్ స్వయం ప్రతిపత్తి మండలి ఏర్పడింది. కాని అది ప్రారంభం నుండి నామమాత్రంగానే వుండిపోయింది. బోడోలకు ఎటువంటి రాజకీయ, ఆర్థిక అధికారాలు లభించలేదు. పైగా అసోం ప్రభుత్వం తీసుకువచ్చిన భూ విధానం ప్రకారం పెద్ద ఎత్తున బోడోలను తమ సొంతగడ్డ నుండి తరిమివేశారు. దానితో బోడోలు పెద్ద ఎత్తున హింసాత్మక చర్యలకు పాల్పడ్డారు. ప్రభుత్వ ఇన్ఫార్మర్లుగా ఆరోపిస్తూ తమ పక్కన వున్న సంథాలీలపైనా, తమ భూములను ఆక్రమించుకున్నారని భావిస్తూ ఇక్కడ స్థిరపడిన బెంగాలీ ముస్లింల పైనా దాడులు చేశారు. అయితే ఈ దాడులు కేవలం ఏకపక్షంగానే జరగడం లేదు. ముస్లింల నుండి కూడా ప్రతిఘటన బలంగానే వుంటున్నది. బెంగాలీ ముస్లింల మీద దాడులు చేస్తున్నది కేవలం బోడోలే కాదు. అసోములు కూడా బెంగాలీ ముస్లింలపై దాడులకు పాల్పడ్డ సంఘటనలు వున్నాయి. 2003లో నెల్లి, దాని చుట్టు పక్కల గ్రామాలపై అఖిల అసోం విద్యార్థి సంఘం దాడి చేసి బంగ్లాదేశీ వలసలనే పేరిట మూడు వేల మందిని ఊచకోత కోసిన ఘటన అత్యంత తీవ్రమైనది.

2003లో జరిగిన రెండవ త్రైపాక్షిక ఒప్పందం బోడోల్యాండ్ స్వయం ప్రతిపత్తి మండలికి మరిన్ని అధికారాలు కల్పిస్తూ బోడోల సొంతగడ్డ అయిన నాలుగు జిల్లాలను బోడోల్యాండ్ ప్రాదేశిక స్వయం ప్రతిపత్తి జిల్లాలు (బోడో టెరిటోరియల్ ఏరియా డిస్ట్రిక్ట్స్–బీటీఏడీ)గా ఏర్పాటు చేసింది. కాని పాలనాధికారం అసోం ప్రభుత్వానిదే. స్వతంత్ర రాష్ట్రం అనే బోడోల ఆకాంక్ష నెరవేరకపోవడం, అన్ని రకాల వివక్షలు ఇంకా కొనసాగుతూనే వుండడం బోడోలను ఆందోళనకు గురిచేస్తూనే వుంది.

ఇదే సమయంలో బీటీఏడీ ప్రాంతంలో బోడో జనాభా శాతం కూడా తగ్గిపోతున్నది. బీటీఏడీలో మొత్తం 31 లక్షల జనాభా వుంటే బోడోల జనాభా పది లక్షలు మాత్రమే వుంది. కాగా ముస్లిం జనాభా పెరుగుతున్నది. ధుబ్రి వంటి జిల్లాలలో బోడోల కంటే ముస్లింల జనాభానే అధికం. పెరుగుతున్న ముస్లిం జనాభా తమ అవకాశాలను దెబ్బతీస్తున్నదనే భావన కూడా బోడోల్లో పెరుగుతున్నది. తమ సొంత గడ్డ మీదనే అల్ప సంఖ్యాకులుగా వున్నందువల్ల వాళ్లకు స్వతంత్ర రాష్ట్రం ఇవ్వబోమనే ప్రకటనలు పాలకుల నుండి వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో ముస్లింలను బోడోలు శత్రువులుగా భావించడంలో ఆశ్చర్యం లేదు. స్థానిక ముస్లింలతో తమకు ఏ సమస్యలూ లేవనీ, వలసలే తమకు సమస్య అని బోడోలు భావిస్తున్నారు.

బెంగాలీ ముస్లింలలో కూడా తాము ఎప్పుడో వచ్చి ఇక్కడ స్థిరపడినప్పటికీ, ఇక్కడే పుట్టి పెరుగుతున్నప్పటికీ తమకు బీటీఏడీలో తగిన ప్రాతినిధ్యం లభించడం లేదనే అసంతృప్తి రగులుతున్నది. మొత్తంగా రాష్ట్రంలో అసోములు, బోడోలు, మైనారిటీలు ఎవరికి వారు అభద్రతకు గురవుతున్న పరిస్థితి వుంది.

బోడోల ఆకాంక్షను నెరవేర్చాలనే ఉద్దేశం సహజంగానే కేంద్రంలోని, రాష్ట్రంలోని పాలకవర్గాలకు లేదు. అందుకే ఆ వుద్యమాన్ని బలహీనపర్చడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నాయి. ఒకవైపు బోడోల్లోని ఒక వర్గాన్ని లొంగదీసుకుంది. మరొకవైపు బోడోయేతర జనాభాను బీటీఏడీలో పెంచి బోడోల్యాండ్ డిమాండ్‌ను బలహీనపర్చడం కోసం వలసలను కూడా ప్రోత్సహిస్తున్నదనే వాదనలు వున్నాయి. ఒకప్పుడు వలసలు బాగా వుండేవి కాని ఇప్పుడు వలసలు తగ్గిపోయాయని అసోం ముఖ్యమంత్రి తరణ్

గొగోయ్ చెప్పే మాటలను గాని, సరిహద్దులో కట్టుదిట్టం చేసి వలసలను నిరోధించామని బీఎస్ఎఫ్ అధికారులు చెప్పే మాటలను కాని పూర్తిగా విశ్వసించనవసరం లేదు.

అయితే ఈ వలసల సమస్యను ఎలా అర్థం చేసుకోవాలి? ఇది చాలా సున్నితమైన సమస్య. మొత్తంగానే ఈశాన్య రాష్ట్రంలో బెంగాలీల సమస్య వుంది. సి.ఎస్. ములియాన్ వ్యాఖ్యానించినట్టు వీళ్లంతా భూదాహంతోనే వచ్చారని అనుకోలేం. పొట్ట చేత పట్టుకొని బతుకుదెరువు కోసం రాష్ట్ర సరిహద్దులు దాటుతున్న వాళ్లే ఎక్కువగా వుండే అవకాశం వుంది. ఇలా పొట్ట చేతపట్టుకొని ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు వెళుతున్న పరిస్థితి మన దేశమంతటా వుంది. తమ ప్రాంతాల నుండి ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళు తున్నారంటే అది స్థానిక పాలకుల వైఫల్యం. అయితే ఒకచోటి నుండి మరొక చోటికి వలసలు వెళుతున్నప్పటికీ స్థానిక ప్రజల ప్రయోజనాలు దెబ్బతినకుండా పాలకులు జాగ్రత్తలు తీసుకుంటే వలసల పట్ల స్థానికుల్లో ఈ స్థాయిలో వ్యతిరేకత పెరిగే అవకాశం వుండదు. అదే సమయంలో స్థానికుల ప్రయోజనాలు దెబ్బతినే స్థాయిలో వుండే వలసలను నిరోధించాల్సిన అవసరం కూడా వుంది. అసోంలో అసోముల, బోడోల అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్న పాలకవర్గాలు వాళ్ల అసంతృప్తిని పథకం ప్రకారం వలసల మీదికి మరలిస్తున్నాయి. అలా జాతి పోరాటాల తాకిడి నుండి పాలకులు తమను తాము కాపాడుకుంటున్నారు.

అసోముల, బోడోల సమస్యలను పరిష్కరించడంలో ఎటువంటి చిత్తశుద్ధి లేని నాయకులు ఘర్షణలు జరిగిన వెంటనే మాత్రం ఒకరి తర్వాత ఒకరు పర్యటనలు జరుపుతున్నారు. ఘర్షణలకు కారణాలు ఒకవైపు స్పష్టంగా అర్థం అవుతుంటే మరోవైపు సీబీఐ విచారణకు ఆదేశించి చేతులు దులుపుకున్నారు.

పాలకవర్గాల ఈ కుట్రలను జాతి విముక్తి వుద్యమకారులు అర్థం చేసుకోవాలి. తమ శత్రువులు తమను తొక్కిపడుతున్న పాలకవర్గాలే తప్ప, బతుకుదెరువు కోసం వలస వచ్చిన ప్రజలు కాదని గ్రహించాలి. బతుకుదెరువు కోసం వచ్చిన పేదలను, తమ ఆస్తులను వనరులను దోచుకోవడానికి వచ్చిన దోపిడీ వర్గాలను ఒకే గాటన కట్టకుండా విడదీసి చూడాలి. తమ పోరాటాన్ని పేద ప్రజల మీదికి కాకుండా దోపిడీ పాలక వర్గాలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టాలి.

ఇక్కడ శరణార్థి శిబిరాల గురించి కూడా కొంత చెప్పుకోవాలి. తాజా ఘర్షణల ఫలితంగా కూడా దాదాపు నాలుగు లక్షల మంది ప్రజలు శరణార్థి శిబిరాల్లోకి చేరారని చెప్పుకున్నాం. ఈ శరణార్థుల్లో ముస్లింలూ, బోడోలు ఇరువర్గాల వారూ వున్నారు. ఒక శరణార్థి శిబిరాన్ని సందర్శించిన పత్రికల వారితో కొందరు అమ్మాయిలు తాము స్నానం చేయక వారం దాటిపోయిందనీ, తాగడానికే నీళ్లు లేవని, మార్చుకోవడానికి బట్టలు కూడా లేవని చెప్తుంటే, ఒక మహిళ మార్చుకోవడానికి బట్టలు లేకపోవడమే మంచిదయింది ఒక వేళ వుంటే మగవాళ్ల ముందే వాటిని మార్చుకోవల్సి వచ్చేది అని చెప్పడాన్ని బట్టి, శరణార్థి శిబిరాల్లో మనుషుల, ముఖ్యంగా మహిళల పరిస్థితి ఎంత దయనీయంగా వుందో అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితి ఎంత కాలం కొనసాగుతుందో చెప్పడం కూడా కష్టమే. ఎందుకంటే తరచూ ఘర్షణలు చెలరేగడం వల్ల, ఇక్కడ సంవత్సరాల తరబడి శరణార్థి శిబిరాలు కొనసాగుతున్నాయి. 1993లో జరిగిన ఘర్షణల్లో శరణార్థి శిబిరాలకు చేరిన వాళ్లు ఇప్పటికీ తమ ఇండ్లకు చేరుకోలేదంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

ఇక ఈ ఘర్షణల ప్రతిఫలనం దేశంలోని పలు ప్రాంతాల్లో కనిపించింది. ఈ ఘర్షణల నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లో వలసలుగా వున్న కొంతమంది అసోములపై దాడులు జరిగాయి. మరికొన్ని చోట్ల దాడులు చేస్తామనే బెదిరింపులు వచ్చాయి. పుకార్లు కూడా వ్యాపించాయి. హైదరాబాద్, పుణె, ముంబై, మైసూర్, బెంగుళూరు వంటి నగరాలకు బతుకుదెరువు వెతుక్కుంటూ వచ్చిన అసోములు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. చాలా మంది తమ వుద్యోగాలు, బతుకుదెరువులను వదిలేసుకొని తమ రాష్ట్రానికి వెళ్లిపోయారు. అలా తమ రాష్ట్రంలో జరుగుతున్న ఘర్షణలకు, ఆ ఘర్షణలతో ఎటువంటి సంబంధం లేని ఎక్కడో దూరంగా వున్న అసోములు కూడా మూల్యాన్ని చెల్లించారు. ఇలా అసోములు వున్నఫళంగా తమ రాష్ట్రానికి వెళ్లిపోవడం అనేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిపై చాలా ప్రభావాన్ని చూపింది. హైదరాబాద్‌లో వున్న దాదాపు 650 ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలలో పని చేస్తున్న లక్ష మంది సెక్యూరిటీ గార్డుల్లో సగానికి పైగా అసోం ప్రజలే. (అసోం దుస్థితినీ, నిరుద్యోగాన్నీ సూచిస్తుందిది) ఈ ఘర్షణల నేపథ్యంలో అధిక సంఖ్యలో అసోం ప్రజలు తమ రాష్ట్రానికి తిరిగివెళ్లడం ప్రవేట్ సెక్యూరిటీ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది.

అసోం ఘర్షణలకు వ్యతిరేకంగా ముంబైలో ఒక ముస్లిం సంస్థ తలపెట్టిన నిరసన ప్రదర్శనలో హింస చెలరేగి ఇద్దరు మరణించారు. 55 మంది గాయపడ్డారు.

ఈ ఘర్షణలకు మూల కారకులైన పాలకులు క్షేమంగా వుంటున్నారు. కాని పాలకుల కుటిలనీతి వల్ల అమాయకులు బలవుతున్నారు. ఈ నిజాన్ని గ్రహించి దేశవాసులందరూ జాతుల పోరాటానికి మద్దతునివ్వాలి. అదే సమయంలో వలసల సమస్యను సానుభూతితో, సామరస్యంగా పరిష్కరించాలని డిమాండ్ చేయాలి.

★

**పత్రికపై మీ విమర్శలూ, అభిప్రాయాలూ, సలహాలూ, సూచనలను ఎప్పటికప్పుడు తెలియజేయండి. అది పత్రిక అభివృద్ధికి దోహదపడుతుందని గుర్తించండి!**

పత్రికా ప్రకటన

జులై 16, 2012

# సవ్యసాచి పండా పాలకవర్గాలతో గొంతు కలిపి మా పార్టీపై చేసిన విషపూరిత, నిరాధార, బూటకపు ఆరోపణలన్నింటినీ

# సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నది!

# విప్లవ విద్రోహానికై అతన్ని పార్టీ నుండి బహిష్కరిస్తున్నది!

మా ఒడిషా రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ (ఎస్ఓసి) కార్యదర్శి సవ్యసాచి పండా మా పార్టీ ప్రధాన కార్యదర్శి పేరిట రాసిన 16 పేజీల వుత్తరాన్ని 14-7-2012న మీడియాకు విడుదల చేశాడు. అందులో అతను పాలకవర్గాలతో గొంతు కలిపి సిపిఐ (మావోయిస్టు)పై, దాని నాయకత్వంలో నడిచే విప్లవోద్యమంపై విషం కక్కుతూ, అభూత కల్పనలతో అనేక నిరాధారమైన, తప్పుడు ఆరోపణలను చేశాడు. పార్టీనీ, విప్లవోద్యమాన్నీ విచ్ఛిన్నం చేసే దుష్ట తలంపుతో అతను ఈ ఉత్తరాన్ని విడుదల చేసి, మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతాన్నీ, కార్మికవర్గ వాన్‌గార్డ్ పార్టీనీ విడిచిపెట్టాడు. పార్టీని విడిచిపెట్టాననీ, సంపూర్ణంగా ప్రజాయుద్ధ పంథాను-విప్లవాచరణను వదులుకున్నాననీ బహిరంగంగా ప్రకటించుకుని తన ఆధునిక రివిజనిస్టు రూపాన్ని బహిర్గతపరుచుకున్నాడు. అత్యంత గర్హనీయమైన, నీచమైన పద్ధతుల్లో కుట్రపూరితంగా అతను పార్టీకీ, విప్లవానికీ, పీడిత ప్రజల, ప్రత్యేకించి ఒడిషా పీడిత ప్రజల విముక్తితో ముడిపడిన మహత్తర ఆశయాలకూ ద్రోహం చేసి, తనను తాను రెనెగేడ్‌గా రుజువు చేసుకున్నాడు.

సవ్యసాచి పండా మొదట కొంతకాలం సిపిఎంలోనూ, తదుపరి సిపిఐ (ఎం.ఎల్.) (లిబరేషన్)లోనూ పని చేశాడు. అతను విప్లవోద్యమంచే ప్రభావితుడై మితవాద అవకాశవాద లిబరేషన్ పార్టీని వదిలి 1998లో సిపిఐ (ఎం.ఎల్.) (పార్టీ యూనిటీ)లో చేరాడు. పార్టీల ఐక్యత ద్వారా అతను మునుపటి సిపిఐ (ఎం.ఎల్.) (పీపుల్స్‌వార్)లోనూ, తదుపరి సిపిఐ (మావోయిస్టు)లోనూ కొనసాగాడు. అతను 2003-05 మధ్యలో ఏవోబి ఎస్‌జెడ్‌సి సభ్యుడిగా, 2005 నుండి ఒడిషా రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడిగా, 2008 నుండి దాని కార్యదర్శిగా పని చేశాడు. 15 ఏండ్ల కాలం అతను విప్లవ పార్టీలో పని చేసినప్పటికీ ఒక సిసలైన కార్మికవర్గ విప్లవకారుడిగా తనను తాను మలచుకోవడంలో విఫలమయ్యాడు. అతని విప్లవ వ్యతిరేక అవకాశవాద రాజకీయ అభిప్రాయాలనూ వైఖరులనూ, కార్యాచరణనూ అతని తోటి కామ్రేడ్స్, క్యాడర్, సిసి కామ్రేడ్స్ అనేకసార్లు విమర్శించారు. గత సంవత్సరం డిసెంబర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రత్యేక ప్లీనంలో తనపై విమర్శలు వచ్చినప్పుడు కూడా అతను వాటిలో కొన్నింటిని మాత్రం నామమాత్రంగా ఆమోదించి, మరి కొన్నిటిని దాటవేశాడు. ఒక నిజమైన కార్మికవర్గ విప్లవకారుడిగా తన తప్పుల్ని నిజాయితీగా గుర్తించి వాటిని సరి చేసుకోవడానికి బదులుగా అతను విప్లవోద్యమాన్ని వదిలి పిరికిపందలా పారిపోయాడు.

తన 16 పేజీల ఉత్తరం నిండా అతను రాసినవన్నీ పచ్చి అబద్ధాలు, వక్రీకరణలు, వాస్తవాల్ని తిమ్మిని బమ్మిని చేసే కుయుక్తులే తప్ప వాటిలో ఇసుమంత కూడా వాస్తవం లేదు. ఇవన్నీ ఒడిషాలోని పార్టీనీ, విప్లవోద్యమాన్ని నీరుగార్చి, విచ్ఛిన్నం చేసి నాశనం చేయాలనే, మహత్తర విప్లవాశయానికి అంకితమైన, త్యాగనిరతిగల, నిస్వార్థపూరిత అనన్య త్యాగాలకు వెరవని పార్టీగా, దేశవిముక్తికి అంకితమైన పార్టీగా, పీడిత ప్రజలకు ఆశాజ్యోతిగా మా పార్టీకున్న ప్రతిష్టను దెబ్బ తీసి పాలకవర్గాలకు సేవ చేసే తన స్వార్థపూరిత రాజకీయాలను నేరవేర్చుకోవాలనే ఘోరమైన దురుద్దేశంతో రాసినవేననేది బహిరంగ రహస్యమే. విప్లవోద్యమంపై తాము చేసే దుష్ప్రచారానికి సాధికారత సాధించవచ్చుననే భ్రమతో పండాలాంటి వారిని పాలకవర్గాలు ముందుకు తేవడం అనేది చరిత్రలో తరచుగా జరుగుతున్నదే. పండాలాంటి అవకాశవాదులను ముందుపెట్టి ఇలాంటి అభూతకల్పనలను విప్లవోద్యమం ఆరంభం నుండి ఎడతెరిపి లేకుండా కామ్రేడ్స్ చారు మజుందార్, కన్హయ్ చటర్జీ తదితర మా నాయకులు చాలామందిపై, పార్టీపై, విప్లవోద్యమంపై శత్రువు గుప్పిస్తూనే ఉన్నాడు.

పండా చేసిన ఆరోపణలలోకీ, వాటికి గల కారణాలలోకీ వెళ్లే ముందు మేం స్పష్టంగా చెప్పదల్చుకున్నదేమంటే మా పార్టీ ఎప్పటికప్పుడు తన కార్యాచరణను సరిదిద్దుకుని, మెరుగుపర్చుకుని మరింత ఉన్నత కర్తవ్యాలతో పురోగమించడానికి సమావేశాలు, ప్లీనాలు, కాన్ఫరెన్సులు నిర్వహిస్తుంది. తన తప్పులను గుర్తించి వాటిని విమర్శ-ఆత్మవిమర్శలు, సమీక్షలు, ప్రత్యేకంగా చేపట్టే దిద్దుబాటు క్యాంపెయిన్‌ల ద్వారా సరిదిద్దుకుంటుంది. ఇది నిరంతరంగా కొనసాగే ప్రక్రియ. ఈ విషయాలన్నీ తెలిసి కూడా పండా తన పదహారు పేజీల బూటకపు ఆరోపణలతో ప్రజల ముందుకు వచ్చాడంటే అతని దురుద్దేశాలు అర్థం చేసుకోవచ్చు. అసలు విషయం ఏంటంటే యిలాంటి ప్రక్రియలో తనను తాను సరిదిద్దుకోడానికి సిద్ధపడకనే అతను పార్టీని వదిలిపెట్టడానికి నిశ్చయించుకున్నాడు.

పండాగారు చేసిన కుళ్లికంపు కొట్టే చెత్త ఆరోపణల జాబితా పెద్దదే గానీ వాటిలో ప్రముఖంగా ముందుకు తెచ్చిన కొన్ని ఆరోపణలు ఇలా ఉన్నాయి:

1. మావోయిస్టులకు మతిలేని హింస, అమాయక ప్రజలను చంపడం మామూలైపోయాయి, అమాయక, నిరాయుధ పోలీసులను విచక్షణారహితంగా చంపాలని క్యాడర్‌కు ఆదేశాలిస్తున్నారు. 2. పార్టీలో తెలుగు, కోయ కామ్రేడ్స్ ఆధిపత్యం నడుస్తోంది 3. ఆదివాసులను మావోయిస్టులే అందరికంటే ఎక్కువ దోపిడీ చేస్తున్నారు, వారితో వంట చేయిస్తారు, బరువులు మోయిస్తారు, కార్యకర్తలను పండుగల సందర్భంగా కూడా కుటుంబాలను కలవనివ్వరు, ఆదివాసీ మహిళల్ని మావోయిస్టులు లైంగికంగా వేధిస్తున్నారు. 4. గణపతి బీభత్సంపై, భయంపై ఆధారపడిన ఒక నియంతృత్వాన్ని స్థాపించాలని చూస్తున్నాడు.

రాజ్యం తనకున్న సకల అస్త్రాలతోనూ తమ హక్కుల కొరకు పోరాడే ప్రజలపై అణచివేతకు పూనుకుంటుంది. ఇక ఆ పోరాటం ప్రజల విముక్తి కోసం, అంటే పీడిత ప్రజల రాజ్యాధికారం కోసం అయినప్పుడు రాజ్యం తీవ్రమైన అణచివేతకే పాల్పడుతుంది. దాని పోలీసు, పారామిలటరీ, మిలటరీలు ముందుండి ఆ దాడిని కొనసాగించగా, దాని ఇతర సకల అంగాలూ ఆ దాడిలో ఒక పథకం ప్రకారం సమన్వయంతో, అత్యంత క్రూరంగా, కుట్రపూరితంగా పాల్గొంటాయి. అందుకని ప్రజలకు ఈ హింసను ఎదిరించడానికి సాయుధ పోరాటం అత్యవసరమౌతుంది. మార్క్సిజం గురించి ఏ, బి, సి, డిలు తెల్సినవారెవరికైనా విప్లవ హింస గురించిన ఈ మౌలిక, ప్రాథమిక విషయం తెలిసే వుంటుంది. మితవాద అవకాశవాద సిపిఐ (ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీని విడనాడి విప్లవ పార్టీ పంథాను ఆమోదించి పార్టీలో చేరి, ఐక్యతా కాంగ్రెస్ పంథాను ఆమోదించినప్పుడు పండాకు ఈ పార్టీ పంథా తెలవదనుకోలేం. అయితే పండా పార్టీ నుండి తనను తాను వేరుపరుచుకోవాలనుకున్నాడు కాబట్టి అవకాశవాదంతో మావోయిస్టులది మతిలేని హింస అనీ, అమాయక ప్రజలను చంపుతున్నారనీ విషం కక్కుతూ తను వీటన్నిటినీ వ్యతిరేకిస్తున్నట్టుగా చూపించుకోవడానికి తాపత్రయపడ్తూ, తద్వారా భారత రాజ్యం తన విషయంలో దయాపూరితమైన వైఖరిని తీసుకోవాలని ఆశిస్తున్నాడు. ప్రజలను నానారకాలుగా హింసిస్తూ, వారి జీవితాలను సకల పార్శ్వాల్లో నాశనం చేస్తూ, హత్యలు చేస్తూ రాజ్య బీభత్స నిర్బంధకాండని కొనసాగిస్తున్న, దానిలో పాలుపంచుకుంటున్న ప్రభుత్వ సాయుధ బలగాలు, అధికారులు, లక్ష్మణానంద, జగబంధులాంటి వర్గశత్రువులు అతనికి యిప్పుడు హఠాత్తుగా అమాయకులుగా కనిపిస్తున్నారు. పాలకవర్గాల పాదాల వద్ద మోకరిల్లడానికి అతను స్వామికి మించిన స్వామిభక్తిని ప్రదర్శిస్తూ అబద్ధపు కూతల్లో శత్రు దుష్ప్రచారాన్ని తలదన్నుతున్నాడు.

ఒడిషాలో తెలుగు, కోయ కామ్రేడ్స్ ఆధిపత్యం నడుస్తోంది అనే ఆరోపణ చేయడం ద్వారా పండా 'విభజించు, పాలించు' అనే బ్రిటిష్ వలసవాదుల, వారి అడుగుజాడల్లో నడుస్తున్న భారత పాలకవర్గాల అరిగిపోయిన, నీచమైన ఎత్తుగడనే తిరిగి అవలంబిస్తున్నాడు. దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాననుసరించి సిపిఐ (మావోయిస్టు) వ్యూహాత్మక దృష్టితో ఒంటరి స్థలాల నుండి దేశవ్యాప్తంగా, చిన్నప్రాంతాల నుండి విశాల ప్రాంతాలకు విస్తరించడానికి చిన్న శక్తి నుండి బలమైన శక్తిగా ఎదుగుతూ అంతిమంగా దేశవ్యాపితంగా రాజ్యాధికారం స్వాధీనం చేసుకోవడానికి విప్లవోద్యమాన్ని నిర్మిస్తుంది. ఇందుకనుగుణంగా వ్యూహాత్మక దృష్టితో మొదటి నుండీ తన శక్తులను వివిధ ప్రాంతాలలో మోహరించి పని చేస్తుంది. స్థానికంగా ప్రజాపునాదిని పెంపొందించుకుంటూ పార్టీనీ, సైన్యాన్నీ అభివృద్ధి చేస్తూ ప్రాంతాలవారీగా అధికారాన్ని స్థాపిస్తుంది. ఈ పంథాలో సాగుతూ వ్యూహాత్మకంగా బలాబలాల్లో మార్పు తీసుకువస్తూ, అంతిమంగా పట్టణాలను చుట్టుముట్టి దేశవ్యాపితంగా రాజ్యాధికారం స్వాధీనం చేసుకుంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని మా పార్టీలోని ప్రతి మెంబర్ దేశంలో ఎక్కడికైనా వెళ్లి పని చేయడానికి సిద్ధం కావల్సి ఉంటుంది. అంతేగాక అంతర్జాతీయవాదులైన కమ్యూనిస్టులు ప్రపంచంలోని ఏ దేశానికైనా–ప్రాంతానికైనా వెళ్లి అక్కడి ప్రజలతో భుజం భుజం కలిపి, వారి విముక్తికై పని చేయడానికి సిద్ధంగా వుండాలి. భారతదేశంలో విప్లవ చరిత్రను మొత్తంగా చూసినప్పుడు, తమ ప్రాంతాలనూ, రాష్ట్రాలనూ వదిలి ఇతర ప్రాంతాలకూ, రాష్ట్రాలకూ వెళ్లిన కామ్రేడ్స్ చేసిన దృఢమైన విప్లవ కృషి ఫలితంగానే విప్లవోద్యమం దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు విస్తరించిందని తెలుస్తుంది. ఆ కామ్రేడ్స్ భాషల్ని నేర్చుకున్నారు, అక్కడి ప్రజల సంస్కృతిని గౌరవించారు, వారితో మమేకమయ్యారు. నూతన ప్రాంతాల్లో నిర్మితమైన ఉద్యమాలు ఇలాంటి కామ్రేడ్స్ సమిష్టిగా చేసిన కృషికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. పండా ఈనాడే కాదు, తన సంకుచిత ప్రాంతీయవాద దృష్టివల్ల వేరే రాష్ట్రాల నుండి కామ్రేడ్స్ వచ్చి ఒడిషాలో పని చేయడాన్ని ఎన్నడూ జీర్ణించుకోలేకపోయాడు. ఆ కామ్రేడ్స్ నిస్వార్థాన్ని మెచ్చుకోవడానికి బదులుగా, అతను వారికీ, ఒడియా కామ్రేడ్స్‌కీ మధ్య విభేదాలు సృష్టించడానికి కుట్రపూరితంగా ముఠాకోరు పద్ధతుల్లో నిరంతరం ప్రయత్నించాడు. ఉద్యమావసరాల రీత్యా ఇతర రాష్ట్రాల నుండి ఒడిషాలో పని చేయడానికి వచ్చిన కామ్రేడ్స్ విషయంలో అతను ప్రాంతీయ దురహంకారాన్ని ప్రదర్శిస్తూ పెత్తందారీతనంగా, అప్రజాస్వామికంగా, సెక్టేరియన్‌గా వ్యవహరించాడు. వాస్తవానికి ఒడియా ప్రజలూ, ఒడియా కామ్రేడ్స్ ఆంధ్రప్రదేశ్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుండి కామ్రేడ్స్ తమ కోసం, తమతో కలిసి పని చేయడానికి వస్తున్నారనే విషయాన్ని సంతోషంగా ఆహ్వానించారు, ఆ వాస్తవాన్ని ఆమోదించారు. పండాతో వున్న కొద్దిమంది కామ్రేడ్స్ ప్రజాయుద్ధ పంథా గురించి పునరాలోచించి ఆయన చెప్తున్న అబద్ధాల్ని గ్రహిస్తారనీ, త్వరలోనే అతని కుట్రలను అర్థం చేసుకుని, అతన్ని ఎండగడ్తారనీ ఆశిస్తున్నాం.

విప్లవోద్యమంలో భాగంగా ఆదివాసీల విముక్తి లక్ష్యాన్నే వదిలిపెట్టేసిన పండా మావోయిస్టులచే 'ఆదివాసీల దోపిడీ' గురించి పాలకవర్గ నరహంతకుల్లా మా పార్టీపై ఆరోపణలు చేస్తూ మొసలి కన్నీరు కార్చడం అనేదాన్ని మించిన మోసం మరొకటుండదు. తాను పార్టీలో వున్నకాలంలో ఏనాడూ సమిష్టి శ్రమలో పాల్గొనని పండాగారి కళ్లకు పాలకవర్గాల కళ్లద్దాలు అమిరాక ఆదివాసీ కామ్రేడ్స్ స్వచ్ఛందంగా, అత్యున్నత విప్లవ చైతన్యంతో విప్లవం కోసం తమ శారీరక శక్తినంతటినీ వెలికితీస్తూ పాటుపడ్డం 'మావోయిస్టులు చేసే దోపిడీ'గా

కనిపిస్తున్నది. ఇంతకీ మావోయిస్టులు ఎవరు? ఆదివాసులు ఎవరు? పార్టీలోని ఆదివాసీ కామ్రేడ్స్ మావోయిస్టులు కారా? విప్లవాన్ని వీడి పాలకవర్గాల వకాల్తా పుచ్చుకున్న అభినవ అవకాశవాది పండాకు విప్లవోద్యమ రోజువారీ జీవితంలో అవసరం అయ్యే వ్యక్తిగత శ్రమ, సమిష్టి జీవనంలో అవసరమయ్యే సైనిక, టెక్నికల్, ఉత్పత్తి-అభివృద్ధి, సంక్షేమ తదితర రంగాలలో అవసరమయ్యే శ్రమ, ప్రజా వుద్యమంలో ప్రజలు చేసే వివిధ రకాల శ్రమ ఆదివాసీ ప్రజలను మావోయిస్టులు చేసే దోపిడీగా కనిపించడం మాకు ఆశ్చర్యం ఏమీ కలిగించలేదు. కార్మికవర్గ పార్టీలో ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో భాగంగా తమ, తమ పనులు చేసుకుంటారు. సమిష్టి శ్రమలో పాల్గొంటారు. బరువులూ మోస్తారు. అనారోగ్యంగా ఉన్నవాళ్లకూ, శారీరకంగా బలహీనంగా ఉన్నవారికీ, ప్రత్యేక పనులు ఉన్నవారికీ ఇతరులు సహాయం చేస్తారు. అసలు ప్రజాసైన్యం అంటేనే ప్రధానంగా అది యుద్ధం చేస్తూనే తనకవసరమైన వంట, బరువులు మోయడం లాంటి అనివార్యమైన పనులను తనకు తాను చేసుకుంటుంది. జాతి, లింగం, ప్రాంతం వగైరా ఎటువంటి భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ ప్రజాయుద్ధంలో పై పనులను చేయాల్సిందే, దేశంలోని వివిధ గెరిల్లాజోన్లలో అలాగే చేస్తూ వచ్చారు, చేస్తున్నారు కూడా. నిజానికి, మావోయిస్టు పార్టీది స్త్రీ పురుషుల మధ్యా, చదువుకున్నవారికీ చదువుకోనివారికీ మధ్య, నాయకులకూ కార్యకర్తలకూ మధ్య తేడాల్ని చూపని ప్రజాస్వామిక, సోషలిస్టు సంస్కృతి. ఆదివాసులు మా పార్టీపట్ల పెద్దెత్తున ఆకర్షితులు కావడానికి ఇది ఒక ప్రధాన కారణం. మా పార్టీ ఇటువంటి సంస్కృతినే పెద్దెత్తున లక్షలాది ప్రజల్లోకి తీసుకెళుతున్నది.

పార్టీలోగల మహిళలపై/ఆదివాసీ మహిళలపై మావోయిస్టులు అత్యాచారాలను చేస్తున్నారనే, లైంగికంగా వేధిస్తున్నారనే ఆరోపణల్ని రాజ్యం పదే పదే చేస్తూనే ఉంది. విప్లవద్రోహిగా మారిన పండా పాలకవర్గాల్లాగానే అత్యంత నీచంగా కాకుండా మావోయిస్టులపై మరెలా దాడి చేస్తాడు? గతంలో మా పార్టీ అన్నిసార్లూ దానికి సమాధానంగా చెప్తూ వచ్చిన జవాబే నేడూ ఈ ఆరోపణకు జవాబు. అయితే ఆ ఆరోపణకు అత్యుత్తమంగా జవాబు యిచ్చింది, ఇస్తున్నది మాత్రం వందల సంఖ్యలో పార్టీలో చేరుతున్న మహిళా కామ్రేడ్స్లూ, వేలాది-లక్షలాది విప్లవ మహిళా సంఘాల సభ్యులతోపాటు ఉద్యమ ప్రాంతాల మహిళలూ, నక్సల్బరీ నాటి నుండి 45 ఏండ్లుగా పీడిత ప్రజల ముక్తి కోసం తమ ప్రాణాల్ని అర్పించిన వందలాది మహిళా అమరులే.

1925లో భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు చూసుకుంటే, 90 ఏండ్లకు పైబడిన భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ప్రజలతో, వారి సంస్కృతితో, ప్రజాజీవనానికి సంబంధించిన అన్ని పార్శ్వాలతో కమ్యూనిస్టు పార్టీ యింతగా మమేకం అయినది గత పాతికేళ్లుగానే అంటే అతిశయోక్తి కాదు. మా పార్టీ మమేకం అవ్వడమే కాదు ప్రజా జీవనంలోని రాజకీయ, సాంస్కృతిక పార్శ్వాలలోని ప్రగతిశీల అంశాలన్నిటినీ ఎత్తిపట్టి, వాటిని తనలో లీనం చేసుకుని, వాటిని మరింత అభివృద్ధి చేసి విప్లవకరంగా మారుస్తున్నది. కార్యకర్తలు పండుగలకు ఇండ్లకు పోతామంటే పార్టీ వెళ్లనివ్వడం లేదని రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన పండాగారు ఆరోపణ చేయడాన్ని విప్లవ ప్రజానీకం ఎలాగూ నమ్మరు గానీ విప్లవోద్యమ వాస్తవాలతో అంతగా పరిచయం లేనివారికి విప్లవ పార్టీ ఇంత ఘోరంగా వుంటుందా అనే భావం కలిగించడానికి అవకాశవాదంతో చేసిన దాడికి ఇది మరొక నిదర్శనం మాత్రమే.

గణపతి బీభత్సంపై, భయంపై ఆధారపడిన నియంతృత్వాన్ని స్థాపించాలనుకుంటున్నారు అనే ఆరోపణ ఎంత హాస్యాస్పదమైనదంటే నిజానికి దానికి వివరణ కూడా అవసరం లేదు. సిపిఐ (మావోయిస్టు) ఒక బూర్జువా పార్టీలాంటిది కానే కాదు. అది దేశంలోని నేటి అర్ధ వలస, అర్ధ భూస్వామ్య రాజ్యాన్ని విప్లవ హింస ద్వారా ధ్వంసం చేసి, నూతన ప్రజాస్వామిక విప్లవ అధికారాన్ని, అంటే కార్మికవర్గ నాయకత్వాన, కార్మిక-కర్షక సమైక్యత పునాదిపై ఆధారపడిన నాలుగు వర్గాల - కార్మిక, కర్షక, పెటీబూర్జువా, జాతీయ బూర్జువా వర్గాల - ప్రజాస్వామిక నియంతృత్వాన్ని స్థాపించడాన్ని తక్షణ లక్ష్యంగా, తర్వాత సోషలిజం, కమ్యూనిజం స్థాపనను అంతిమ లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఈ విషయం పండాగారికి తెలియందేమీ కాదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ముసుగులో దేశంలో కనీవినీ ఎరుగని నిరంకుశ పాలనను చెలాయిస్తున్న, సామ్రాజ్యవాదులతో మిలాఖతు అయిన దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల నియంతృత్వ వ్యవస్థతో రాజీపడి అందులో స్థానం సంపాదించుకునే స్వార్థపూరిత ఉద్దేశంతోనే పండా కామ్రేడ్ గణపతిపై, మా పార్టీపై తప్పుడు ఆరోపణను చేస్తున్నాడు.

వాస్తవానికి, పండానే ఒడిషాలో తన నియంతృత్వాన్ని స్థాపించాలని ప్రయత్నిస్తున్నాడు. రాష్ట్ర ప్రత్యేక ప్లీనంలో చేసిన సమీక్షలను, నిర్ణయాలను చూసిన అతను పార్టీ క్యాడర్ ఇకనెంతమాత్రం తన పెత్తనాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేరనే విషయాన్ని గ్రహించాడు. వారు అతని పెత్తందారీ వ్యవహారాన్నీ, ఇతర రాష్ట్రాల కామ్రేడ్స్ పట్ల అతని అప్రజాస్వామిక, సెక్టేరియన్ వైఖరినీ విమర్శించారు. తన పెత్తందారీ పద్ధతుల్ని ఇకనెంతమాత్రం కొనసాగించడం వీలుకాదని గుర్తించిన ఈ అవకాశవాది పార్టీని విడిచిపెట్టాలని నిర్ణయించుకుని అప్పటి నుండి అందుకవసరమైన సన్నాహాల్ని రెట్టించాడు.

నిజానికి, రాష్ట్ర స్థాయి ప్రత్యేక ప్లీనం ముగిశాక అతను ఒడిషా రాష్ట్ర ఇన్ఛార్జి సిసి కామ్రేడ్ను కాంటాక్టు చేయడమే మానివేశాడు. అప్పటి నుండి, దాదాపు అర్ధ సంవత్సరంపాటు అతను తన ప్రకటనల్లో, ఇంటర్వ్యూల్లో పార్టీపై విషాన్ని కక్కుతూ వచ్చాడు. అది పార్టీలో రాజకీయ, నిర్మాణపరమైన సమస్యల్ని సృష్టించి, ఒడిషా ఉద్యమానికి తీవ్ర నష్టాన్ని కలిగించింది. ఎందుకంటే అతను వాటిలో స్పెషల్ ప్లీనం నిర్ణయాలకు, పార్టీ పంథాకూ, విధానాలకూ వ్యతిరేకమైన వైఖరులను తీసుకుంటుండినాడు. తన నాయకత్వంలో ఇటలీ పర్యాటకులను బందీగా పట్టుకున్న సందర్భంలో అతను పచ్చి అవకాశవాద పద్ధతులకు పాల్పడ్డాడు. అతను మొత్తం ఒడిషా రాష్ట్రానికంతా ఏకపక్షంగా

కాల్పుల విరమణ ప్రకటించాడు. కానీ నిజానికి ఒడిషా–దాని సరిహద్దులలోని గణనీయమైన ప్రాంతాల్లో రెండు రాష్ట్ర సరిహద్దు పార్టీ కమిటీలు పని చేస్తున్నప్పుడు అతను అలా ప్రకటించడం సరైందీ కాదు, అలా మిగతా రెండు కమిటీలకూ ఆదేశాలిచ్చే అధికారమూ అతనికి లేదు. తాను ఏకపక్ష కాల్పుల విరమణ ప్రకటించాక ఏఓబి కామ్రేడ్స్ ఒక ఎంఎల్ఏని బందీగా పట్టుకున్న, ఒక ఎస్ఐని చంపిన సందర్భంగా అతను ఏఓబి కామ్రేడ్స్‌ను బహిరంగంగా విమర్శించడమే కాక వారికి చంపడం ఫ్యాషన్ అయిపోయింది అనేంతదాకా వెళ్లాడు.

ఒడిషా ఎస్ఓసి పరిధిలోని మొత్తం పార్టీ చేసిన సమీక్షల్ని పక్కకు బెట్టి, వర్గశత్రువులైన లక్ష్మణానంద, జగబంధుల్ని ఖతం చేయడం తప్పు అని ప్రకటించేశాడు. శత్రువుతో చేయి కలిపి కామ్రేడ్ నిఖిల్ పేరిట ప్రకటనలు ఇస్తూ వేర్వేరు సముదాయాల నుండీ, వేర్వేరు రాష్ట్రాల నుండీ వచ్చి పని చేస్తున్న కామ్రేడ్స్ మధ్య విభేదాల్ని సృష్టించే ప్రయత్నం చేస్తూ ఒక విషపూరిత క్యాంపెయిన్‌ను మొదలుపెట్టాడు. పండా పార్టీని వీడి వెళ్లిపోతాడనీ, కొత్త గ్రూపును ఏర్పరుస్తాడనీ మీడియాలో వరుసగా కథనాలు వెలువడుతుంటే నిరంతరం మీడియా సంబంధంలో వుండే పండా ఎటువంటి వివరణ ఇవ్వకపోవడం అనేది యాదృచ్ఛికంగా జరిగినది కాదు. అతను ప్రత్యేక ప్లీనం తర్వాత నుండే పార్టీని వదిలిపోవడానికి పథకరచన చేస్తూ, అవకాశవాద పద్ధతులకూ, విచ్ఛిన్నకర కార్యకలాపాలకూ బాహాటంగా పాల్పడ్డాడనేది స్పష్టాతిస్పష్టం. తన దిగజారుడుతనానికి పరాకాష్టగా అతను చివరికి పార్టీని వదిలిపోయాడు.

ఒడిషా ఉద్యమ క్రమంలో ముందుకు వచ్చిన కొన్ని రాజకీయ సమస్యలపై పండా మితవాద అవకాశవాద వైఖరిని తీసుకుని చివరికి దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాని తిరస్కరించే రివిజనిస్టు స్థాయికి దిగజారాడు. అతని సెక్టేరియన్, బ్యూరాక్రటిక్, అతిప్రజాస్వామ్య, క్రమశిక్షణారాహిత్య, ముఠాతత్వ, నిర్మాణరాహిత్య, కెరీరిస్టు, కీర్తికండూతి ధోరణులు ఒడిషా పార్టీకీ, ఉద్యమానికీ చాలా తీవ్రంగా నష్టం కలిగించాయి. అతను సుఖమైన జీవితాన్ని కోరుకునేవాడు, అతనిలో కష్టపడేతత్వం కూడా ఉండేది కాదు. సంఘటితక్రమంలో వున్న ఒడిషా రాష్ట్ర పార్టీకీ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీకీ తీవ్ర నష్టాలు కలిగిన పరిస్థితినీ, సిసిపై శత్రుదాడి కేంద్రీకృతమై తీవ్ర నష్టాలు కలిగిన పరిస్థితినీ ఈ అవకాశవాది రాష్ట్రంలో విచ్ఛిన్నకర కార్యకలాపాలు కొనసాగించడానికి వినియోగించుకున్నాడు. వీటన్నింటికి మూలం వ్యక్తిని కేంద్రంగా నిలిపే అతని శృతి మించిన వ్యక్తివాదంలో ఉంది. వీటితో పాటు విప్లవోద్యమంపై సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల పూర్తి మద్దతుతో భారత పాలకవర్గాలు కొనసాగిస్తూ వచ్చిన విప్లవ ప్రతీఘాతుక యుద్ధంలో 2009 మధ్య నుండి ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరిట గణనీయమైన మార్పు వచ్చింది. అప్పటి నుండి మా ఉద్యమంపై దేశవ్యాప్త, బహుముఖ, భారీ సైనికదాడి కొనసాగుతున్న నేపథ్యంలోనే పండా దిగజారుడుతనాన్నీ, విద్రోహాన్నీ చూడాల్సి ఉంటుంది. ఈ దాడిలో పార్టీకి దేశవ్యాప్తంగా తీవ్రమైన నష్టాలు జరిగాయి. ఒడిషాలో వర్గపోరాటం ఇప్పటికీ బలహీనంగానే వున్నప్పటికీ అది కూడా ఈ దాడికి తీవ్రంగానే గురయ్యింది. 2010 చివరి నుండి అది తీవ్రమైన నష్టాల్ని చవిచూసింది. ఈ దాడి యింకా తీవ్రతరం కానుంది. మన దేశంలాంటి వెనుకబడిన దేశాల సహజ సంపదలనూ–ముడి వనరుల్నీ దోచుకోవడానికి తమకు అడ్డం వచ్చే ప్రతి సంస్థనూ, ప్రజలనూ అణచివేయడానికి ప్రధాన కారణం బహుళజాతి, దేశ దళారీ కార్పొరేట్ ప్రయోజనాలే. ప్రపంచ ఆర్థిక వ్యవస్థని చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం ఎంత తీవ్రతరమైతే దాని నుండి బయటపడ్డానికి విప్లవ పార్టీపై, దాని నాయకత్వంపై, పీడిత తాడిత ప్రజలపై కొనసాగించే దాడిని వారు అంతగా తీవ్రతరం చేస్తారు. విప్లవ పార్టీ నాయకులెవరికైనా గానీ ఇటువంటి నేపథ్యంలో విప్లవోద్యమాన్ని నడపడం అంటే కత్తి మీద సామే. నిజమైన పార్టీ నాయకులెవరైనా దేశంలోనూ, ప్రపంచంలోనూ నెలకొన్న అద్భుతమైన విప్లవ పరిస్థితులను ఉపయోగించుకుని ప్రజలను రాజకీయంగా సంసిద్ధం చేస్తూ, ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేయడానికి, విప్లవానికి అనుకూలంగా మలచడానికి కృషి చేస్తారు. అందుకు విప్లవ సిద్ధాంతం పట్ల నిబద్ధత, గట్టి పట్టుదల, సాహసోపేతంగా నిర్ణయాలు తీసుకోవడం, పార్టీనీ, ప్రజాసైన్యాన్నీ, ప్రజలనూ ఏకతాటిపై కదిలించడం, త్యాగనిరతి అవసరమౌతాయి. విప్లవ అవసరాలకూ, కర్తవ్యాలకూ అనుగుణంగా తనను తాను మలుచుకోవడానికీ, పార్టీని మలచడానికీ ఉక్కులాంటి సంకల్పం అవసరమౌతుంది. ఇటువంటి లక్షణాలు ప్రదర్శించలేనివారు విప్లవానికి నాయకత్వాన్ని అందించడంలో విఫలమౌతారు లేదా అశక్తులవుతారు. అలాంటివారిలో కొందరు యుద్ధరంగం నుండి పిరికిపందల్లాగ పారిపోతారు లేదా శత్రుపంచన చేరిపోతారు. దీన్ని కప్పిపుచ్చుకోవడానికి ఈ అవకాశవాదులు, విప్లవ ద్రోహులు పాలకవర్గాల కొమ్ము కాస్తూ పార్టీపై, నాయకత్వంపై అన్ని రకాల ఆరోపణలను చేస్తారు. మా పార్టీ చరిత్రలోనే కాకుండా వివిధ దేశాల విప్లవాల్లో గతంలోనూ ఇటువంటి రెనెగేడ్లు వుండినారు, పండా అలాంటివారిలో చివరివాడూ కాదు.

పై విషయాలన్నిటినీ దృష్టిలో వుంచుకుని, అతనిపై వచ్చిన ఆరోపణలన్నిటినీ రాజకీయపరంగా అతని ముందు ఉంచి, అతనికి తన తప్పుల నుండి బయటపడ్డానికి అవకాశం ఇస్తూ అతన్ని సరిజేసేందుకు మా కేంద్రకమిటీ ప్రత్యేక కృషినారంభించింది. కానీ రాష్ట్ర ప్రత్యేక ప్లీనం తర్వాత నుండి అతను సంబంధిత సిసి కామ్రేడ్‌తో సంబంధాలు తెంచుకొని వరుసగా పార్టీపై, ఉద్యమంపై, నాయకత్వంపై బాహాటంగా దాడి చేస్తూ వచ్చాడు. వీటన్నిటి పరాకాష్టగా అతను ఈ విషపూరితమైన లేఖను మీడియాకు విడుదల చేయడం ద్వారా తనను తాను రెనెగేడ్‌గా రుజువు చేసుకున్నాడు. అందువల్ల మా కేంద్రకమిటీ సవ్యసాచి పండాను పార్టీ నుండి బహిష్కరిస్తూ, ఆ విషయాన్ని ఒడిషాలోని మా పార్టీ కామ్రేడ్స్ అందరికీ, విప్లవ ప్రజానీకానికంతటికీ, దేశంలోని మొత్తం విప్లవ క్యాంపుకూ తెలియజేస్తోంది.

*(మిగతాది 6వ పేజీలో...)*

# లక్షింపేట దళితులపై మారణకాండ

పదిరికుప్పం, కారంచేడు, నీరుకొండ... ఇవన్నీ ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని గ్రామాల పేర్లు. అయితే మనలో చాలా మందికి ఇవి గ్రామాలుగా కాక మారణకాండలుగా పరిచయమయ్యాయి. ఈ గ్రామాల పేర్లు వింటే కులాహంకారం జడలు విప్పుకొని గెంతులేస్తున్న దృశ్యం మన మనోఫలకం మీద మెదులుతుంది. దళితుల హాహాకారాలు మన చెవులను బద్దలు కొడతాయి. తెగిపడుతున్న తలలు, కాలువలై పారుతున్న నెత్తురు... ఒక బీభత్స, భయానక దృశ్యం మన కళ్ల ముందు తిష్టవేసుకుంటుంది.

ఇప్పుడీ గ్రామాల జాబితాలో లక్షింపేట కూడా చేరిపోయింది. లక్షింపేట కూడా ఇప్పుడు ఒక గ్రామం పేరుగా కాక ఒక మారణకాండగా మనలో చాలా మందికి పరిచయమైంది. ఇక్కడ కూడా కులాహంకారం జడలు విప్పుకొని గెంతులేసింది. దళితుల హాహాకారాలు మన చెవులను బద్దలుకొట్టాయి. ఇక్కడ దళితులు శవాలుగా మారారు. నెత్తుటి మడుగులై పారారు.

ఈ గ్రామాలు ఎందుకిలా నెత్తుటి గుర్తులుగా మిగిలిపోతున్నాయి?

గ్రామాలేవైనా కావొచ్చు, జిల్లాలేవైనా కావొచ్చు, ఆ మాటకొస్తే రాష్ట్రాలేవైనా కావొచ్చు. దళితుల తలలు తెగుతున్నది, నెత్తురు పారుతున్నది మాత్రం వాళ్లు ఆత్మగౌరవాన్ని చాటుకుంటున్నందుకే. భూమి, భుక్తి, విముక్తిని కోరుకుంటున్నందుకే.

లక్షింపేట శ్రీకాకుళం జిల్లా వంగర మండలంలోని ఒక గ్రామం. పన్నెండేళ్ల క్రితం ఏర్పడిన నిర్వాసిత గ్రామమిది. జిల్లాలోని సువర్ణముఖి, వేగావతి నదీ సంగమ ప్రాంతంలో ప్రభుత్వం మడ్డువలస రిజర్వాయర్‌ను నిర్మించింది. ఇది 2002లో పూర్తయింది. ఈ ప్రాజెక్టు కారణంగా ఆరు గ్రామాలు – లక్షింపేట, కొట్టిస, మగ్గూరు, దేవకవాడ, నరేంద్రపురం, గుడివాడ – పూర్తిగా మునిగిపోయాయి. ఇంకొక ఆరు గ్రామాలు పాక్షికంగా ముంపుకు గురయ్యాయి. పూర్తిగా ముంపుకు గురయిన ఆరు గ్రామాల్లో నాలుగు గ్రామాలు చెల్లాచెదురై చెట్టుకొకరు, పుట్టకొకరు అయిపోగా కొట్టిస, లక్షింపేట గ్రామస్థులు మాత్రం ప్రభుత్వం పునరావాసంగా కేటాయించిన స్థలంలో 2000 సంవత్సరంలో స్థిరపడ్డారు. అయితే ఈ గ్రామాల నుంచి కూడా చాలా మంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. కాగా నిర్వాసితులైన ఇతర గ్రామాల ప్రజలు కొంతమంది ఈ గ్రామాల్లో స్థిరపడ్డారు. మునిగిపోయిన ఈ గ్రామాలన్నింటికి ప్రభుత్వం ఎంతో కొంత నష్ట పరిహారం చెల్లించింది. మునిగిపోయిన లక్షింపేటలో దాదాపు 220 ఇండ్లు వుండేవి. సంఖ్యాపరంగా తూర్పుకాపులది పెద్ద కులం. 75 ఇండ్లు వాళ్లవే. ఆ తర్వాత పెద్ద కులం మాలలదే. 55 ఇండ్లు వారివే. వీళ్ల గ్రామం ముంపుకు గురయినప్పుడు తూర్పు కాపులతో సహా ఇతర కులాల వాళ్లు తమ ఇండ్లకు 50 నుండి 60 వేల రూపాయల వరకు నష్టపరిహారంగా పొందారు. కానీ మాలలు ఎనిమిది నుండి పదివేల రూపాయలు మాత్రమే పొందగలిగారు. ఈ గ్రామానికి 350 ఎకరాల భూమి వుండేది. భూమిని కల్గి వున్న వారందరూ ఎకరానికి రెండున్నర లక్షల చొప్పున నష్టపరిహారం పొందారు. 41 మంది తూర్పుకాపులకు పునరావాసం కింద ప్రభుత్వ వుద్యోగాలు కూడా వచ్చాయి. కాని భూమి లేని మాలలకు లక్షలూ లేవు, వుద్యోగాలూ లేవు.

పునరావాసంలో భాగంగా కేటాయించిన స్థలంలో పన్నెండేళ్ల క్రితం ఏర్పడిన గ్రామాన్ని కొత్త లక్షింపేట అంటున్నారు. ఇక్కడ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఇండ్లు కట్టుకోవడానికి మూడు సెంట్ల స్థలాన్ని కేటాయించింది. ఇతర కులాల వాళ్లు తమ గ్రామం నుండి వెళ్లిపోయిన వాళ్ల పేర్లు కూడా రాయించి ఎక్కువ స్థలాన్ని పొందారు. సాపేక్షికంగా మెరుగైన నష్టపరిహారాన్ని పొందారు కనుక ఇండ్లు కూడా ఎంతో కొంత మంచిగానే కట్టుకోగలిగారు. మాలలు మాత్రం ప్రభుత్వం ఇచ్చిన మూడు సెంట్ల స్థలంతోనే సరిపెట్టుకున్నారు. ప్రభుత్వం చేసిన ఆర్థిక సాయం చాలక కొందరు రేకుల కప్పులతోనే సరిపెట్టుకున్నారు. మరి కొందరు స్లాబ్ వేసుకున్నప్పటికీ ఇంకా గోడలకు సిమెంట్ పూత వేయలేదు. ఇక వీళ్లకు మరుగుదొడ్లు, స్నానాల గదుల వంటివి అసలే లేవు. ఇక మొత్తంగానే వూళ్లో సి.సి. రోడ్లు, మురుగునీటి కాలువలు, వీధి లైట్లు లేవు. కనీసం స్మశానం కూడా లేదు. దేశంలో ఎక్కడైనా నిర్వాసితులకు పునరావాస కల్పన ఎంత చక్కగా జరుగుతున్నదో లక్షింపేటను చూసి అర్థం చేసుకోవచ్చు.

కొత్త లక్షింపేటకు ఆనుకొని 250 ఎకరాల భూమి వుంది. దీన్ని కూడా ముంపు భూమిగా గుర్తించి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించింది. కాని ఇది మునిగిపోలేదు. సంవత్సరానికి మూడు కార్లు పండే సారవంతమైన, కాలువల ద్వారా నీటి వసతి కల్గి వున్న భూమి ఇది. ఇందులో 190 ఎకరాల భూమి లక్షింపేటకు చెందిన తూర్పుకాపులది. కాబట్టి నష్ట పరిహారం పొంది ప్రభుత్వానికి తమ భూములను ఇచ్చేసినప్పటికీ ఆ భూములను తూర్పుకాపులు అనధికారికంగా అనుభవిస్తూనే వున్నారు. ఇకపోతే మిగతా 60 ఎకరాలు దేవకవాడకు చెందిన తూర్పుకాపులవి. వారు మొత్తంగా ఈ భూములను వదిలేసుకొని వెళ్లిపోయారు. అందుకని మాలలు ఈ భూములను చేసుకొంటూ తూర్పు కాపులకు కౌలు చెల్లిస్తున్నారు. అయితే ఇది ప్రభుత్వ భూమి కనుక దాని కౌలు చెల్లించకూడదని మాలలు నిర్ణయించుకున్నారు. ఇది తూర్పుకాపులకు మింగుడు పడలేదు. ఆ భూమి నుంచి మాలలను తరిమేసి దాన్ని తమ సొంతం చేసుకోవాలనుకున్నారు. అందుకోసం గాను గత కొంతకాలంగా మాలలను వేధిస్తూ చివరికి ఇంతటి మారణకాండకు తెగించారు.

జూన్ 12న వుదయం ఏడున్నర గంటల ప్రాంతంలో లక్షింపేటకు చెందిన తూర్పుకాపులంతా తమ గ్రామానికి ఇరుగు పొరుగున వున్న విక్రంపురం, పదమవలస, శేఖరపల్లి, బలిసపేట,

మద్దివలస గ్రామాలకు చెందిన తూర్పుకాపులను కూడా కలుపుకొని, ఆడ, మగ, పిల్లా, పిసరు అందరూ కలిసి లక్ష్మింపేట దళితులపై విచక్షణారహితంగా దాడి చేశారు. కత్తులు, గొడ్డళ్లు, కొడవళ్లు, బరిసెలు, బాంబులు, రాళ్లతో గుంపులు గుంపులుగా ప్రతి యింటిపై పడ్డారు. ఈ దాడిలో చిత్తిరి అప్పడు (25), నిపర్తి సంగమేశ్ (35), నిపర్తి వెంకటి (51), బూరడ సుందర రావు (35) అక్కడికక్కడే మరణించగా, బొడ్డారి పాపయ్య (60) తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో మరణించాడు. దాదాపు 25 మంది తీవ్రంగా గాయాలపాలయ్యారు.

ఇప్పటి వరకూ దళితులపైన అగ్రకులాలు దాడులు చేయడం చూశాం. కాని తూర్పుకాపులు బీసీలు. బీసీలు ఇంత కులాహంకారాన్ని ఎలా ప్రదర్శించారని ఎవరికైనా సందేహం వస్తుంది. బీసీనే అయినప్పటికీ ఈ ప్రాంతంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రాబల్యం వున్న కులమిది. మంత్రి, పీసీసీ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ ఈ కులానికి చెందినవాడే. ఇతడి అండదండలు కూడా ఈ దాడి వెనుక పని చేశాయి. ఆస్తికి తోడు అధికారపు అండ కూడా వుంటే ఏ కులం నుండైనా పీడకులు తయారవుతారనేది మనకు తెలియని విషయం కాదు. అంతేకాదు ఆర్థికంగా, సామాజికంగా బలపడిన సందర్భాల్లో కింది కులాలు కూడా పైకి ఎగబాకడం చరిత్రలో చూశాం.

ఇదే సందర్భంలో లక్ష్మింపేట కొండ్రు మురళి అనే దళిత మంత్రి నియోజకవర్గంలోది అనే విషయాన్ని కూడా మనం గుర్తుంచుకోవాలి. జూన్ 12న జరిగిన ఈ దాడి హఠాత్తుగా జరిగినదేమీ కాదు. గత మూడేళ్లుగా ఈ భూమి విషయంలో ఘర్షణలు జరుగుతూనే వున్నాయి. సంవత్సరం క్రితం జరిగిన ఘర్షణలో ఇరువర్గాలకు చెందినవారు గాయపడ్డారు. ఈ కారణంగానే ఇక్కడ పోలీస్ పికెట్‌ను కూడా ఏర్పాటు చేశారు. (ఉప ఎన్నికల బందోబస్తు కోసమంటూ ఈ పోలీసులు గ్రామాన్ని ఖాళీ చేసిన సమయంలో ఈ దాడి జరిగింది.) భూమి సమస్య కేంద్రంగా ఘర్షణలు జరుగుతున్నప్పుడు ఏ దళిత మంత్రీ ఈ సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయలేదు. ఇక్కడ దళితులు ఎవరికో చెందిన వ్యక్తిగత భూమిని ఎకరాల కొద్దీ ఆక్రమించుకున్నదేమీ లేదు. పాత లక్ష్మింపేటలో 55 వున్న దళిత కుటుంబాలు కొత్త లక్ష్మింపేటలో (ఇతర గ్రామాల వాళ్లు కూడా చేరడం మూలంగా) 85 అయ్యాయి. 85 కుటుంబాల వాళ్లు 60 ఎకరాలను అది కూడా ప్రభుత్వ అసైన్డ్ భూమిని సాగుచేసుకుంటున్నారు. వాళ్ల బతుకుదెరువుకు అది కొంత ఆసరా అవుతుందనే తప్ప ఆస్తులు పెంచుకునే ఉద్దేశం వాళ్లకు లేదు. 'మాలలకు భూమి కావాల్నా', 'మా కులం వాళ్ల భూములు మాకే చెందాలి', 'మా భూముల పక్కన మాతో సమానంగా మాలలు భూములు దున్నుకుంటారా?' అనే కుల, వర్గ అహంకారం తప్ప ఇక్కడ ఘర్షణ పడ్డానికి తూర్పు కాపులకు ఆ భూమిపై ఎటువంటి అధికారం లేదు. మరిట్లా ఘర్షణలు మొదలైనప్పుడు దళిత 'ప్రతినిధి'గా, రాజ్యాంగం దళితుల ప్రయోజనాల కోసం అంటూ కేటాయించిన రిజర్వేషన్ ద్వారా అధికార పీఠాన్నెక్కిన దళిత మంత్రిగారు ప్రభుత్వానికి చెందిన ఆ భూమిని దళితులకు కేటాయించడం కోసం ఎందుకు ప్రయత్నించలేదు? ప్రయోజనాలను పొందడం కోసం వాళ్లు దళిత ముసుగును వాడుకుంటారు గాని అగ్ర వర్గాలకే వాళ్లు సేవ చేస్తారనేది స్పష్టం. అలా సేవ చేయలేకపోతే వాళ్లా చట్రంలో ఇమడలేరు. అందుకే కొండ్రు మురళి దళితుడైనప్పటికీ తన నియోజక వర్గంలోని పేద దళితులకు ఒనగూర్చిందేమీ లేకపోగా తూర్పు కాపుల పక్షమే వహించాడు.

భూ వివాద పరిష్కారం కోసం ఇరు పక్షాల వారు కోర్టుకు కూడా పోయారు. కాగితాల సాక్ష్యాలను తప్ప మనుషులను, బతుకులను పట్టించుకోని కోర్టు ఆ భూమిని ఎవరూ దున్నకూడదని తీర్పునిచ్చింది. ఆ భూమిపై దళితుల బతుకుదెరువు ఎంతగా ఆధారపడి వుందో కళ్లూ, మనసూ వుండని కోర్టుకు సహజంగానే అర్థం కాలేదు.

దళితులకు, ఆదివాసులకు అవమానాలు, అత్యాచారాల నుండి రక్షణ కల్పించడం కోసం అంటూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ యాక్ట్‌ను ప్రభుత్వాలు తయారు చేశాయి. కాని పీడితుల కోసం తయారు చేసిన అన్ని చట్టాల వలెనే ఇది కూడా కాగితాలకే పరిమితమైంది. ఈ గ్రామంలో కూడా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ యాక్ట్ ప్రకారం ఎన్నో కేసులు నమోదయ్యాయి. కాని ఎవ్వరికీ శిక్షలు పడింది మాత్రం లేదు. ఏ సమస్యకైనా మూలంగా వున్న భౌతిక ప్రాతిపదికను మార్చకుండా, కేవలం చట్టాలు చేయడం అనేది వ్యర్థమైన చర్య అని వర్తమాన చరిత్రలో ఇప్పటికే ఎన్నోసార్లు రుజువయ్యే వుంది.

భూ సంస్కరణలను అమలు చేస్తున్నాం, పేదలకు భూమిని పంపిణీ చేస్తున్నాం, అని ప్రభుత్వాలు చేసుకుంటున్న ప్రచారం ఎంత బూటకమైనదో, కొన్ని సెంట్ల భూమి కోసం ప్రాణాలకు తెగించి చేస్తున్న లక్ష్మింపేట దళితుల పోరాటం ద్వారా మరోసారి మనకు అర్థం అవుతుంది. ఆరుగురు దళితుల ప్రాణాలు గాల్లో కలిసిపోయినప్పటికీ దళితులు సాగు చేసుకుంటున్న ఆ భూమిపై వాళ్లకు హక్కు కల్పించడానికి ప్రభుత్వం ముందుకు రాలేదు. మృతదేహాలను ముందుపెట్టుకొని మూడు రోజులు కొట్లాడితే ఆ భూమిలో దళితులకు కుటుంబానికి ఒక ఎకరా చొప్పున ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ పోరాటం తర్వాతే మృతుల కుటుంబాలకు 5 లక్షల నష్ట పరిహారం ఇస్తామని కూడా హామీనిచ్చింది. తాను ఇచ్చిన హామీని ప్రభుత్వం పొరపాటున నెరవేర్చినప్పటికీ ఇది కేవలం కంటి తుడుపు చర్యనే.

మన దేశంలో మౌలిక సమస్య భూమి సమస్యే. 'దున్నేవారికే భూమి కావాలి' అనే నినాదం వాస్తవ రూపం దాల్చినపుడు లక్ష్మింపేటలు నెత్తుటిగుర్తులుగా కాక, పచ్చటి గ్రామాలుగానే ఎవరికైనా పరిచయం అవుతాయి.

అయితే 'దున్నేవారికే భూమి' నినాదాన్ని పార్లమెంటరీ వ్యవస్థకు లోబడిన ఏ ప్రభుత్వాలూ, ఏ పార్టీలు సాకారం చేయవు. పేద ప్రజల కనీస అవసరాలను కూడా అవి తీర్చలేవని 65 ఏండ్లుగా మనం అర్థం చేసుకుంటూనే వున్నాం. ఈ నినాదాన్ని సాకారం

# బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా అలుపెరగని ప్రజా పోరాటం

మన్యం ప్రజలు బాక్సైట్ వెలికితీతకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేస్తూనే వున్నారు. పోరాటంలో అలసిపోయినా, ఆగిపోయినా వాళ్ల ఉనికికే ముప్పు వస్తుందని వాళ్లు అర్థం చేసుకున్నారు. అందుకే వాళ్ల పోరాటం ఏడేళ్లుగా కొనసాగుతూనే వుంది.

దేశవ్యాప్తంగా ఎక్కడయినా ఆదివాసులు అత్యంత సంపన్నులు. వెల కట్టలేని అటవీ, ఖనిజ, జల సంపదలకు పుట్టుకతోనే వారసులు. తామెంత సంపన్నులో వాళ్లెప్పుడూ లెక్కలు వేసుకోరు. మార్కెట్ లెక్కలు వాళ్లకు తెలియవు కూడా. అడవి చల్లగా వుంటే చాలు వాళ్లకు. తల్లి గర్భంలో వున్నంత నిశ్చింత. కాని ఆదివాసుల కాళ్ల కింద ఎంత సంపద వుందో మార్కెట్‌కు తెల్సు. అందుకే కబళించడానికి ఎల్లవేళలా ప్రయత్నిస్తుంది.

ఆదివాసులు అమాయకులే కాని అజ్ఞానులు కారు. అర్భకులు అంతకన్నా కారు. ఆశ్రయమడిగితే ఆదరిస్తారు. కాని వాళ్ల కాళ్ల కింది నేలనే ఎగరేసుకు పోవాలని చూస్తే ఎదురుతిరుగుతారు. తమ గడ్డ మీద కోట్ల సంపద వుందని వాళ్లకు తెలియకపోవచ్చు. కాబట్టే దాన్ని రక్షించుకోవాలనే ఆదుర్దా వాళ్లకు లేకపోవచ్చు. కాని ఆ గడ్డన లోలోతుల్లోకి విస్తరించిన తమ వేర్లున్నాయనేది వాళ్లకు తెలియని విషయం కాదు. వాటిని పెకిలిస్తే తమ వునికికే ప్రమాదమన్నది వాళ్లకు అర్థం కాని విషయం కాదు. అందుకే నిరంతరాయంగా పోరాడుతున్నారు.

ప్రపంచంలోని బాక్సైట్ నిల్వలు వున్న దేశాల్లో భారతదేశం ఆరవ స్థానంలో వుంది. దేశంలోని బాక్సైట్ ఖనిజంలో 72 శాతం తూర్పు కనుమల్లోనే నిక్షిప్తమై వుంది. ఇందులో 51 శాతం ఒడిశాలో వుంటే 21 శాతం ఆంధ్రప్రదేశ్‌లో వుంది. విశాఖ జిల్లా అరకు నుండి, తూర్పు గోదావరి జిల్లా గుర్తేడు వరకు 384 కిలోమీటర్ల పొడవునా 24 కొండల్లో 3,562 హెక్టార్ల విస్తీర్ణంలో దాదాపు 55 కోట్ల టన్నుల బాక్సైట్ నిల్వలు వున్నాయి.

బాక్సైట్ నుండి అల్యూమినియం తయారు చేస్తారు. ఇంట్లో వుపయోగించే వంట పాత్రల నుండి విమానాలు, రాకెట్లు, యుద్ధ సామాగ్రి వంటి ఎన్నింటి తయారీలోనో అల్యూమినియం వుపయోగిస్తారు. అందుకే పెట్టుబడిదారుల దృష్టి ప్రస్తుతం రాష్ట్రంలోని బాక్సైట్ మీద పడింది.

మన దేశంలో 1985 నుండి అల్యూమినియం తయారీ వేగవంతమైంది. ప్రస్తుతం మన దేశంలో డిమాండ్ కంటే అల్యూమినియం వుత్పత్తి ఎక్కువగా వుంది. అంటే మన దేశపు అవసరాల కోసమే అయితే బాక్సైట్‌ను తవ్వాల్సిన పనేలేదు. కాని ప్రపంచం 'గ్లోబల్ కుగ్రామం'గా మారిన నేపథ్యంలో, ఏ సరుకు వుత్పత్తికైనా, ఏ ఖనిజ వెలికితీతకైనా, ఏ పంట పండించడానికైనా దేశీయ అవసరాలు ప్రాతిపదికగా వుండవు కదా. అసలు పెట్టుబడిదారీ విధానంలో సరుకుల వుత్పత్తికి మానవుల అవసరాలు ప్రాతిపదికగా వుండవు కదా. సరుకులనే కాదు అది అవసరాలను కూడా సృష్టించగలదు. కాబట్టి బాక్సైట్‌ను పెట్టుబడిదారులు తవ్వుకు పోవాలనుకుంటున్నారు.

బాక్సైట్‌ను పెట్టుబడిదారులకు తవ్విపెట్టాలనే ఆలోచన మొదట చేసినవాడు చంద్రబాబే. దుబాయ్‌కి చెందిన కంపెనీకి అయిదు వేల కోట్ల రూపాయలకు బాక్సైట్ నిక్షేపాలను కట్టబెట్టాలని 2000 సంవత్సరంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అప్పటి గిరిజన సంక్షేమ శాఖా మంత్రి మణికుమారి అధ్యక్షతన గిరిజన సలహా మండలి సమావేశమై బాక్సైట్ తవ్వకాలకు అంగీకారం తెలుపుతూ తీర్మానాన్ని ఆమోదించింది. అయితే ప్రైవేటు కంపెనీలు ఆదివాసీ ప్రాంతాల్లో గనుల తవ్వకాలు చేపట్టాలంటే 1/70 చట్టాన్ని

---

చెయ్యవల్సింది ఆదివాసులు, దళితులు సహా 90 శాతంగా వున్న పీడిత ప్రజలే. ఈ దేశంలోని భూమి, నీరు, అడవులు, ఖనిజాలు సమస్త సంపదలు ఆదివాసులు, దళితులు సహా 90 శాతం పీడిత ప్రజలవి. కాని అవి నేడు పిడికెడు మంది దోపిడీ వర్గాల చేతుల్లో వున్నాయి. ఆ సంపద పీడిత ప్రజలకే దక్కడం కోసం మన దేశంలో సుదీర్ఘ కాలంగా పోరాటం జరుగుతున్నది. ఆ పోరాటంలో సమస్త పీడితులు భాగస్వాములు అవడమే లక్షింపేట తదితర మారణకాండలకు పరిష్కారం.

లక్షింపేట సమస్య కేవలం వర్గ సమస్య మాత్రమే కాదు. ఇక్కడ కుల సమస్య కూడా వుంది. ఇలా భూమి కోసం పోరాడిన వాళ్లు దళితులు కాకుంటే, లేదా మరో అణగారిన కులం కాకుంటే, ఇంత రక్తపాతం జరిగి వుండకపోవును. భూమి కేంద్రంగా ఇక్కడ ఘర్షణ ప్రారంభం కాక ముందు కూడా, ఇక్కడ దళితులపై అణచివేత వుంది. రెండు గ్లాసుల పద్ధతి వుంది. హేయమైన అంటరానితనం వుంది. 2006లో జరిగిన గ్రామ పంచాయితీ ఎన్నికల్లో రిజర్వేషన్ మూలంగా సింహాలమ్మ అనే దళిత మహిళ సర్పంచ్ అయింది. సర్పంచ్ అయినప్పటికీ తూర్పుకాపులు ఆమెను తమతో సమానంగా కూర్చోనిచ్చేవారు కూడా కాదు. ఇలా ఎన్నో గ్రామాల వలెనే ఇక్కడ దళితులు అవమానాలను, ఛీత్కారాలను ఎదుర్కొంటునే వస్తున్నారు. అంతేకాదు తూర్పు కాపులు తమకున్న రాజకీయ ప్రాబల్యంతో వృద్ధాప్య ఫించన్లు, వుపాధి హామీ పథకం వంటివి దళితులకు బంద్ చేయించారు. ఇటువంటి కుల అణచివేతకు అవమానాలకు వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటాలు చేపట్టాలి. ఆ పోరాటాలను మౌలిక పోరాటమైన వర్గపోరాటంతో మిళితం చేయాలి. అప్పుడే మన దేశంలోని దళిత సమస్యకు నిజమైన పరిష్కారం లభిస్తుంది.

★

సవరించాలని కూడా ఈ సమావేశం తీర్మానించింది. ఇలా తీర్మానం చేసేలా గిరిజన సలహా మండలిపై ప్రభుత్వం ఒత్తిడి తెచ్చింది. ఈ నేపథ్యంలో తీవ్రస్థాయిలో నిరసనలు వెల్లువెత్తడంతో, నాటి గవర్నర్ రంగరాజన్ సలహా మేరకు, 1/70 చట్ట సవరణ ప్రతిపాదనతో, పాటు బాక్సైట్ తవ్వకాల ప్రతిపాదనను కూడా విరమించుకుంటున్నట్టు 2000 సెప్టెంబర్లో చంద్రబాబు ప్రకటించాడు.

చంద్రబాబును ఓడించి 2004లో అధికారంలోకి వచ్చిన రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు ప్రజా వ్యతిరేక పాలనను మరింత దూకుడుగా ముందుకు తీసుకుపోవడంతో పాటు, ప్రజా వ్యతిరేకతకు భయపడి చంద్రబాబు వెనుకాడిన పనులను కూడా 'సమర్థవంతంగా' చేసి చూపెట్టాడు. అందులో భాగంగా 2005 జూలై 1న జిందాల్‌తోనూ, 2007 ఫిబ్రవరి 14న రస్ అల్ ఖైమా దేశానికి చెందిన ఆన్‌రాక్ కంపెనీతోనూ బాక్సైట్ తవ్వకాల గురించి ఒప్పందాలు చేసుకొన్నాడు. ఈ ఒప్పందాల ద్వారా అరకు గ్రూపులో 2,446 హెక్టార్లలోని 24 కోట్ల టన్నుల బాక్సైట్ నిల్వలను జిందాల్‌కు, చింతపల్లి గ్రూపులో 1,162 హెక్టార్లలోని 22 కోట్ల టన్నుల నిల్వలను ఆన్‌రాక్‌కు కేటాయించడానికి వీలవుతుంది.

ఈ ఖనిజాలను శుద్ధి చేయడం కోసం విజయనగరంలోని ఎస్.కోటలో జిందాల్ కంపెనీకి, విశాఖ జిల్లాలోని మాకవర పాలెంలో ఆన్‌రాక్ కంపెనీకి రిఫైనరీలు ఏర్పాటు చేయడానికి కూడా అనుమతులిచ్చాడు.

ఈ ఒప్పందాలపై ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమయింది. బాక్సైట్ నిల్వలున్న ఈ ప్రాంతమంతా సీపీఐ (మావోయిస్ట్) కార్యకలాపాలు చురుగ్గా సాగుతున్న ప్రాంతం. కాబట్టి సీపీఐ (మావోయిస్ట్) నేతృత్వంలో ప్రజలు మిలిటెంట్ పోరాటం ప్రారంభించారు. పలు ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, హక్కుల సంఘాలు కూడా పోరాడుతున్న ప్రజలకు బలమైన మద్దతు ఇస్తున్నాయి.

ఇంతకూ బాక్సైట్ తవ్వకాల పట్ల ప్రజలు, ప్రజా సంఘాలు, పలు పార్టీల్లో ఎందుకింత వ్యతిరేకత?

రాష్ట్రంలో విస్తరించిన తూర్పు కనుమల్లో బాక్సైట్, మాంగనీస్, గ్రాఫైట్, క్రోమైట్, ఇనుము, రాగి, జింక్, మైకా, సిలికా, క్వార్జ్, లేటరైట్‌లతో పాటు కనుమల తీర ప్రాంతంలోని ఇసుకలో అణు ధార్మికత కలిగిన మోనజైట్, ఇల్మనైట్, మాగ్నటైట్, గార్నెట్, సిలిమినైట్ వంటి ఖనిజ సంపద వుంది.

తూర్పు కనుమలు హిమాలయాల కంటే పురాతనమైనవని శాస్త్రజ్ఞుల అంచనా. వీటి వయసు దాదాపు 260 కోట్ల సంవత్సరాలని చెబుతున్నారు. ఇవి పశ్చిమ బెంగాల్లో ప్రారంభమయి ఒడిశా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడుల్లో విస్తరించి వున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించిన తూర్పుకనుమల్లో 42 రకాల అడవులున్నాయి. దేశంలోని అడవుల విస్తీర్ణంలో తూర్పుకనుమల అడవులు 24.2 శాతమని నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ నిర్ధారించింది.

ఇక్కడ అనేక ఆదివాసీ తెగలున్నాయి. బాక్సైట్ తవ్వకాలు రెండు లక్షల ప్రజలను తీవ్ర ప్రభావానికి గురి చేస్తాయి. 8 వేల హెక్టార్ల ప్రాంతంలో వున్న ఆదివాసీ గ్రామాలన్నీ ఖాళీ చేయవల్సి వుంటుంది. సుమారు 180 గ్రామాలకు చెందిన 47 వేల మందిని ఇక్కడి నుండి తరిమేస్తారు. మాకవరం, ఎస్.కోటలలో ఏర్పాటు చేసే శుద్ధి కర్మాగారాల కారణంగా కూడా ఎంతో మంది నిర్వాసితులవుతారు. ఇది ఆదివాసీ సంస్కృతిని కూడా విధ్వంసం చేస్తుంది.

శ్రీకాకుళం జిల్లా వంశధార నుంచి తూర్పు గోదావరి జిల్లా ఏలేరు వరకు 19 చిన్నా, పెద్దా నదులు వున్నాయి. ఇవన్నీ తూర్పు కనుమల్లోని కొండకోనల్లో పుట్టినవే. ఈ 19 చిన్నా పెద్దా నదులపై 27 నీటి పారుదల ప్రాజెక్టులు వున్నాయి. వీటి ద్వారా ఉత్తర కోస్తా జిల్లాల్లో పది లక్షల ఎకరాలకు సాగునీరు, వేల గ్రామాల ప్రజలకు తాగునీరు అందుతున్నది. బాక్సైట్‌కు నీటిని నిల్వ చేసుకునే గుణం వుంటుంది. అలా నిల్వ వున్న నీరే... ఊటలుగా, సెలయేళ్లుగా, నదులుగా మారుతుంది. బాక్సైట్‌ను తవ్వితీస్తే సహజమైన ఈ జల వనరులు దెబ్బతింటాయి.

980 కి.మీ. పొడవునా విస్తరించిన ఈ అటవీ ప్రాంతం జీవ వైవిధ్యానికి నిదర్శనం. 3200 రకాల పూల మొక్కల జాతులు, దాదాపు 200 రకాల పక్షులు, 55 రకాల చేపలు, 89 రకాల సీతాకోకచిలుకలున్నాయి. ఇంకా ఎంతో విలువైన ఔషధ, వృక్ష సంపద వుంది. ఈ జీవ వైవిధ్యమంతా దెబ్బ తింటుంది. బిల్వెట్ అనే అరుదైన గుడ్లగూబ జాతి ఇక్కడ వుంది. ఇది అంతరించిపోతుంది.

అల్యూమినా కర్మాగారాల వలన తాగే నీరు, పీల్చే గాలి, పచ్చని పంటలు విషతుల్యమవుతాయని క్యాన్సర్, ఉదరకోశ సంబంధిత వ్యాధులు విజృంభిస్తాయని అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

బాక్సైట్ తవ్వకాలు, శుద్ధి, కరిగించడం తదితర పనులకు ఏడాదికి 1,927 కోట్ల లీటర్ల నీరు అవసరమవుతుందని అంచనా వేశారు. ఈ నీరు దాదాపు 10 లక్షల మందికి ఏడాదిపాటు సరిపోతుంది. అసలే బాక్సైట్ తవ్వకం మూలంగా సహజ జల వనరులు ఒకవైపు దెబ్బ తింటుంటే మరోవైపు ఈ విధంగా శుద్ధి తదితరాలకు వాడుకోవడం వల్ల సమీప భవిష్యత్తులో విశాఖ నగర ప్రజలు కూడా గుక్కెడు నీళ్లకు ఇబ్బంది పడే ప్రమాదం ముంచుకొస్తుంది.

ప్రజలకు, పర్యావరణానికి, సంస్కృతికి తీవ్ర హాని కలుగుతుందని పలు అధ్యయనాలు స్పష్టంగా తెలుపుతున్నప్పటికీ వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి... అందరూ బాక్సైట్‌ను ఆన్‌రాక్, జిందాల్‌లకు కట్టబెట్టడానికి ఎంత మాత్రం వెనకాడ లేదంటే ఈ ప్రభుత్వాలు ఎవరి ప్రయోజనాల కోసం పని చేస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు.

పైగా ఇంత విధ్వంసాన్ని, అభివృద్ధి పేరుతో ప్రజల నెత్తిన రుద్దుతున్నారు. ఈ 'అభివృద్ధి' మూలంగా ప్రతి ఏటా ఆన్‌రాక్,

జిందాల్‌లకు 3,500 కోట్ల లాభాలొస్తాయి. ప్రతిగా ప్రభుత్వానికి 64 కోట్ల రాయితీలు మాత్రమే వస్తాయి.

ఇలా పెట్టుబడిదారులకు సేవ చేయడం కోసం ప్రభుత్వాలు ఎన్నో అక్రమాలకు పాల్పడ్డాయి. చట్టాలను అతిక్రమించాయి, లేదా హేళన చేశాయి.

ఆదివాసీ ప్రాంతాల్లో ప్రైవేటు కంపెనీలకు గనుల తవ్వకాల కోసం అనుమతి ఇవ్వకూడదనే నిబంధన వుంది. ఈ నిబంధనను రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం తు.చ. తప్పకుండా ఎట్లా పాటించిందంటే, మొదట ఈ గనులను ఏపీఎండీసీ (ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ)కి ఇస్తున్నట్టుగా చూపించింది. ఏపీఎండీసీ ద్వారా ఆన్‌రాక్, జిందాల్‌లకు గనులు అందే ఏర్పాటు చేసింది. ప్రభుత్వ సంస్థకే గనులు అనుమతినిచ్చినట్టు చూపించడం కోసం ఏపీఎండీసీని 1.5 శాతం వాటాతో భాగస్వామిగా వుంచింది. తమ ప్రయోజనాలను నెరవేర్చుకోవడం కోసం దోపిడీ వర్గాలు చట్టాలను ఎంతగా అవహేళన చేస్తాయో, వాటితో ఎంతగా ఆడుకుంటాయో, లొసుగులను ఎట్లా వాడుకుంటాయో అనడానికి ఇదొక వుదాహరణ మాత్రమే.

బాక్సైట్ ఖనిజ నిల్వలున్న ఆదివాసీ ప్రాంతాలు రాజ్యాంగంలోని అయిదో షెడ్యూల్ పరిధిలోకి వస్తాయి. ఆదివాసీ ఎమ్మెల్యేలతో ఏర్పాటైన గిరిజన సలహా మండలితో సంప్రదించాలని అయిదో షెడ్యూల్ నిబంధనలు పేర్కొంటున్నాయి. గనుల తవ్వకాల కారణంగా ప్రభావానికి గురయ్యే ప్రాంతాల్లోని గిరిజన గ్రామ సభల నుంచి తవ్వకాలకు అనుమతి పొందాలని పీసా (షెడ్యూల్డు ప్రాంతాల పంచాయితీల విస్తరీకరణ) చట్టం చెబుతుంది. 1997లో సమతా స్వచ్ఛంద సంస్థ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం 1/70 చట్టం ప్రకారం గిరిజనేతర వ్యక్తులకు గాని, సంస్థలకు గాని ఆదివాసీ ప్రాంతాల్లోని గనులు, భూములను లీజుకు ఇవ్వడానికి వీలు లేదు. ఈ చట్టాలు, నిబంధనలు అన్నీ ఇక్కడ ఘోరంగా వుల్లంఘించబడ్డాయి.

కేంద్ర ప్రభుత్వం 2006 డిసెంబర్‌లో తెచ్చిన అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆదివాసులకు లభించాల్సిన హక్కులు కూడా ఇక్కడ ఉల్లంఘించబడ్డాయి.

ఖనిజాలు వెలికితీయడానికి పర్యావరణ మంత్రిత్వశాఖ నుండి అటవీ పర్యావరణ సంబంధ అనుమతులు తీసుకోవాల్సి వుంటుంది. లీజు కోసం గనుల మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి పొందాలి. కాని అన్ని శాఖలు పెట్టుబడిదారులకు దాసోహం అన్నాయి. ఆన్‌రాక్‌కు పర్యావరణ అనుమతి ఇవ్వడంలో భాగంగా 2008 అక్టోబర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు. బాక్సైట్ వెలికితీత ప్రభావం ఎక్కువగా వుండే జెర్రెలకొండ పరిసర గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరపాల్సి వుండగా, మావోయిస్టుల బెడద అనే సాకును చూసి ప్రభావిత ప్రాంతానికి దూరంగా చింతపల్లిలో జరిపారు. నిర్వాసిత గ్రామాల ప్రజలను అక్కడకు రానీయకుండా పోలీసులు అడుగడుగునా ఆటంకాలు కల్పించారు. అయినా ప్రజలు పాల్గొని బాక్సైట్ తవ్వకాలు చేపట్టవద్దని ముక్త కంఠంతో చెప్పారు. ఆ తర్వాత బహిష్కరించారు. అయినప్పటికీ ఆన్‌రాక్‌కు అనుకూలంగా కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ అనుమతులు మంజూరు చేసింది.

ప్రజలు వ్యతిరేకిస్తున్నప్పటికీ, బహిష్కరించినప్పటికీ అనుమతులు మంజూరు చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ పలు ప్రజా సంఘాలు జాతీయ పర్యావరణ ట్రిబ్యునల్‌కు వెళ్లాయి. ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియ సజావుగానే సాగిందని, పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలు సక్రమంగానే వున్నాయంటూ ట్రిబ్యునల్ ప్రజా సంఘాల అభ్యంతరాలను కొట్టిపడేసింది.

ఈ విధంగా ఆదివాసుల ప్రయోజనాలను కాపాడ్డంలో అన్ని చట్టాలు, కోర్టులు ఘోరంగా విఫలమవుతున్నాయి. ఆదివాసుల పోరాట ఫలితంగా వచ్చిన 1/70ని కేవలం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం మార్చాలని గిరిజనశాఖా మంత్రి ప్రతిపాదించిందంటే ప్రభుత్వాలు ఆదివాసుల సంక్షేమం పట్ల ఎంత బాధ్యతా రహితంగా వుంటున్నాయో అర్థం చేసుకోవచ్చు.

ప్రజలు ఇంతగా వ్యతిరేకిస్తున్నప్పటికీ ఏ మాత్రం లెక్కచేయకుండా ప్రభుత్వం బాక్సైట్ తవ్వకాలకు అనుకూలంగా 13 అనుమతులనిచ్చింది.

బాక్సైట్ నిల్వలున్న ఈ ప్రాంతం జీవ వైవిధ్యం వున్న ప్రాంతం కనుక దీన్ని రక్షిత జీవావరణ కేంద్రంగా గుర్తించాలనే ప్రతిపాదన చాలా కాలంగా వుంది. 2007లో భారత పర్యావరణ మంత్రిత్వశాఖ దేశంలో రక్షిత జీవావరణ కేంద్రంగా గుర్తించడానికి అర్హత వున్న 14 ప్రాంతాల జాబితాను తయారు చేసింది. ఇందులో రాష్ట్రంలోని చింతపల్లి, శేషాచలంలను కూడా చేర్చింది. ఈ ప్రాంతాల్లో జీవ వైవిధ్య పరిరక్షణ కోసం ప్రణాళికలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. చింతపల్లి ప్రాంతం రక్షిత జీవావరణ కేంద్రమైతే బాక్సైట్ తవ్వకాలకు వీలుకాదు కనుక, రాష్ట్ర ప్రభుత్వం కేవలం శేషాచలం గురించి మాత్రమే ప్రణాళికలు పంపింది. అంటే బాక్సైట్‌ను పెట్టుబడిదారులకు దోచిపెట్టడానికి ప్రభుత్వం ఎంత తీవ్రంగా ప్రయత్నిస్తుందో అర్థమవుతుంది.

వైఎస్సార్ పాల్పడిన అవినీతి డొంక ఇటీవలి కాలంలో కదులుతున్నది. అందులో ఇచ్చి పుచ్చుకొనే ధోరణిలో ఎన్నో కంపెనీలకు అక్రమంగా ఎన్నో ప్రయోజనాలను కట్టబెట్టిన తీరు తెలుస్తూనే వుంది. ఆన్‌రాక్‌కు అల్యూమినియంను కట్టబెట్టిన తీరు కూడా అటువంటిదే. పేరు ఆన్‌రాక్‌దైనా అందులో ఎక్కువ శాతం వాటా వైఎస్సార్‌కు సన్నిహితుడైన ప్రతాపరెడ్డికి చెందిన పెన్నా గ్రూపుదే. 2011 సెప్టెంబర్ నాటికి కంపెనీ ఈక్విటీ 927.47 కోట్ల రూపాయలు వుంటే అందులో ఆన్‌రాక్ వాటా 192.35 కోట్లు, పెన్నా వాటా 585 కోట్లు వుంది. అంటే పెన్నా వాటా సుమారు 63 శాతం వుంది. అల్యూమినియం తయారీలో ఎటువంటి అనుభవం లేని పెన్నా గ్రూపుకు బాక్సైట్ కేటాయించడానికి, అందులో అనుభవం వున్న ఆన్‌రాక్‌ను ముందుకు తెచ్చాడనే వాదన ఒకటి వుంది.

ఇలా తాను దోచుకోవడం కోసం, పెట్టుబడిదారులకు దోచిపెట్టడం కోసం ఇటువంటి ఎన్నో అడ్డదారులు తొక్కడంతో పాటు రాజశేఖర్ రెడ్డి నిర్బంధాన్ని కూడా ఒక ఆయుధంగా ప్రయోగించాడు. బాక్సైట్ ఉద్యమానికి మావోయిస్టు వుద్యమం ప్రేరణగా వుండడం మూలంగా సీపీఐ (మావోయిస్ట్)పైన తీవ్ర అణచివేతకు పాల్పడ్డాడు. ఈ అణచివేతలో భాగంగా గునికిరాయి, అమిడేలు తదితర ఎన్‌కౌంటర్లు జరిపి విప్లవకారులను పొట్టన పెట్టుకున్నాడు. ఎందరో వుద్యమ సానుభూతిపరులను మావోయిస్టుల ముద్రవేసి బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్య చేయించాడు. వాకపల్లి, భల్లుగూడ వంటి సామూహిక అత్యాచారాల ఘటనలకు పోలీసులను ఉసిగొల్పాడు. ఇక గ్రామాలపై దాడులు, అరెస్టులు, చిత్రహింసలు నిత్యకృత్యంగా మారాయి.

ప్రభుత్వం, పెట్టుబడిదారులు ఎన్ని కుట్రలు పన్నినా, ఎంత నిర్బంధాన్ని ప్రయోగించినా మన్యం ప్రజలు మాత్రం బాక్సైట్ తవ్వకాలకు ఒప్పుకోవడం లేదు. మరింత మిలిటెంట్‌గా ముందుకు సాగుతున్నారు. 2011 డిసెంబర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ కోసం వచ్చిన కేంద్ర సాధికారిక కమిటీని ప్రజలు తీవ్రంగా అడ్డుకున్నారు. మూడు రోజులు విశాఖ నగరంలో తిష్టవేసిన ఈ కమిటీ ఏమీ చేయలేక వెనుదిరిగిపోయింది. మొక్కవోని దీక్షతో పోరాడుతున్న ఈ ప్రజలకు ఎన్నో ప్రగతిశీల ప్రజా సంఘాలు, హక్కుల సంఘాలు మద్దతునిస్తున్నాయి. ప్రజల పోరాటంలో భాగమవుతున్నాయి. ఈ ప్రజల పోరాటం ఎంత బలంగా వుందంటే తన హయాంలో బాక్సైట్‌ను దుబాయ్ కంపెనీలకు కట్టబెట్టాలని చూసిన చంద్రబాబుకూ, తెలుగు దేశం పార్టీకీ బాక్సైట్‌ను వ్యతిరేకిస్తూ మాట్లాడక తప్పడం లేదు. అంతేకాదు బాక్సైట్ తవ్వాలని తమ ప్రభుత్వమే చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా కొందరు కాంగ్రెస్ నాయకులకు, మంత్రులకు మాట్లాడక తప్పని స్థితి ఏర్పడింది. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో కిషోర్ చంద్రదేవ్ గవర్నర్‌కు లేఖ రాశాడు. ఆ లేఖలో బాక్సైట్ తవ్వకాల వలన జరిగే నష్టాలతో పాటు, ప్రభుత్వం ఎన్ని అడ్డదారులు తొక్కుతున్నదో కూడా వివరించాడు. రాజ్యాంగపరంగా గవర్నర్‌కు వున్న విచక్షణాధికారాలను వుపయోగించి బాక్సైట్ తవ్వకాలను అడ్డుకోవాలని ఆ లేఖలో ఆయన కోరాడు. తాము అధికారంలో వున్నంత వరకూ మన్యంలో బాక్సైట్ తవ్వకాలు జరగనివ్వమని కేంద్ర మంత్రులు జయరాం రమేష్, కిషోర్ చంద్రదేవ్, రాష్ట్ర మంత్రి పి. బాలరాజులు చింతపల్లిలో జరిగిన బహిరంగ సభలో ప్రకటించారు. చివరికి ముఖ్యమంత్రి, స్పీకర్‌లు కూడా గిరిజనులకు ఇష్టం లేకుండా బాక్సైట్‌ను తవ్వమని మాట్లాడాల్సి వచ్చింది.

అయితే ఒకవైపు బాక్సైట్ తవ్వమని చెబుతూనే మరోవైపు బాక్సైట్ తవ్వకంలో ఆదివాసులకు శిక్షణ ఇస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో కొందరు యువకులకు నెలకు 10 నుండి 18 వేల రూపాయల వరకూ ఇస్తూ బాక్సైట్ అనుకూల ప్రచారం చేయిస్తున్నారు.

ఈ నేపథ్యంలో బాక్సైట్ తవ్వకాలను నిలిపివేస్తున్నామంటూ తాజాగా కేంద్ర, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రుల ప్రకటనలు మరోసారి వెలువడ్డాయి. అయితే ప్రభుత్వం ఆన్‌రాక్, జిందాల్‌లతో చేసుకొన్న ఒప్పందాలు రద్దు చేసుకోలేదని మనం మరవొద్దు. పోరాటాలకు, ప్రజా వ్యతిరేకతకు భయపడి ప్రస్తుతం ప్రభుత్వం తవ్వకాలు ఆపుతున్నట్టుగా ప్రకటించినప్పటికీ, ఈ నిలుపుదల తాత్కాలికమే కావొచ్చు. ఒప్పందాలు రద్దు చేసుకోనంత కాలం మళ్లీ ఏదో రకంగా బాక్సైట్ తవ్వకాలను ముందుకు తెచ్చే అవకాశాలు వుంటాయి. కాబట్టి వెంటనే ఈ ఒప్పందాలను రద్దు చేసుకోవాలనే డిమాండ్‌తో పోరాటం కొనసాగించవల్సే వుంటుంది.

ఈ పోరాట క్రమంలో సంఘటితమైన ప్రజలు, తమ పోరాట చైతన్యాన్ని మరింత ముందుకు తీసుకుపోతూ, తమ మౌలిక సమస్యల పరిష్కారానికి పూనుకోవాలి.

★

***మన దేశంలో ఒక వైపు పేదరికం పెరిగిపోతుంటే మరొక వైపు కొంత మంది చేతిలో సంపద విపరీతంగా పోగుపడుతున్నది. ప్రపంచ కుబేరుల్లో నాలుగు శాతం మంది భారతీయులేనని ఫోర్బ్స్-2012 ప్రపంచ బిలియనీర్ల జాబితా పేర్కొంది. వీరిలో అంబానీ సోదరులు, లక్ష్మీ మిట్టల్, అజీమ్ ప్రేమ్‌జీ లాంటి ప్రముఖులు వున్నారు. 58 దేశాలకు చెందిన 1,226 మంది అపర కుబేరుల ఫోర్బ్స్ జాబితా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా అపర కుబేరుడుగా వరుసగా మూడవ సంవత్సరం కార్లోస్ స్లిమ్ నిలిచాడు. ఆయన సంపద 69 బిలియన్ డాలర్లు. తర్వాత స్థానాల్లో మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ (61 బిలియన్ డాలర్లు), వారెన్ బఫెట్ (44 బిలియన్ డాలర్లు)లు వున్నారు.***

***ఇక మన దేశం సంగతి చూస్తే... ఈ జాబితాలో 48 మంది భారతీయులు వున్నారు. అయితే ఇండోనేసియా, ఐర్లాండ్, థాయ్‌లాండ్, బ్రిటన్, అమెరికా వంటి దేశాల్లో నివసిస్తున్న ప్రవాస భారతీయులను సైతం కలుపుకుంటే ఈ సంఖ్య 57కు చేరింది. భారత్‌లో అత్యంత సంపన్నుడి స్థానం ముకేశ్ అంబానీకి దక్కింది. 22.3 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచ ర్యాంకుల్లో 19వ స్థానాన్ని పొందాడు. 20.7 బిలియన్ డాలర్ల సంపదతో లక్ష్మీ మిట్టల్ దేశంలో 2వ స్థానంలోనూ ప్రపంచంలో 21వ స్థానంలోనూ వున్నాడు. విప్రో చీఫ్ అజీమ్ ప్రేమ్‌జీ 15.9 బిలియన్ డాలర్లతో దేశంలో 3వ స్థానంలోనూ ప్రపంచంలో 41వ స్థానంలోనూ వున్నాడు. భారత్‌కు చెందిన 48 మంది కుబేరుల సంపద 195 బిలియన్ డాలర్లు వుంది.***

# ‘సంక్షేమ’ పథకాలు అవినీతికి సోపానాలు

జూలై 13 నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ‘ఇందిరమ్మ బాట’ను ప్రారంభించాడు. గతంలోని రచ్చబండ, పల్లెబాట వంటిదే ఇది కూడా. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎలా అమలవుతున్నాయో తనిఖీ చేయడం, వివిధ దశల్లో వున్న పనులను పూర్తి చేసేందుకు ఆదేశాలు జారీ చేయడం, వివిధ వర్గాల ప్రజలతో సహపంక్తి భోజనాలు చేయడం... తదితర కార్యక్రమాలు ఇందిరమ్మ బాటలో వున్నాయి. మొన్నటి ఉప ఎన్నికల ఫలితాలను బట్టి, తమ పార్టీ దుస్థితిని మరింతగా అర్థం చేసుకున్న కిరణ్ కుమార్ రెడ్డి, కొంతైనా ఆ పరిస్థితి మెరుగుపరుచుకోవడానికి పడుతున్న ప్రయాసే ఇది తప్ప, దీని వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదు. ఇందిరమ్మ బాటలో కిరణ్ కుమార్ రెడ్డికీ, ఆయన సహచరులకు ఎదురైన అనుభవాలేంటీ, ప్రజలకు జరిగిన ప్రయోజనాలేంటీ అనేది పక్కన బెడుదాం. ఇందిరమ్మ బాట కార్యక్రమాల్లో సంక్షేమ పథకాల అమలు తనిఖీ ముఖ్యమైనది కనుక కొన్ని పథకాల అమలు తీరు ఎలా వుందో ఈ నేపథ్యంలో పరిశీలిద్దాం.

అభివృద్ధి పేరుతో, ప్రజా సంక్షేమం పేరుతో పాలకులు ప్రవేశ పెట్టే ఏ పథకాల లక్ష్యమైనా తమ రాజకీయ ప్రయోజనాలు, తద్వారా తమ వర్గ ప్రయోజనాలే తప్ప ప్రజా ప్రయోజనాలు కావన్నది ప్రజలందరికీ ఎప్పుడో అర్థమైన విషయమే. తమ ఓటు బ్యాంకును కాపాడుకోవడం కోసం ప్రజలను భ్రమల్లో వుంచడానికే కాకుండా, తమ పార్టీ శ్రేణులకు, తమ పార్టీని పోషించే పెట్టుబడిదారులకు ప్రయోజనాలు చేకూర్చే లక్ష్యం ఈ పథకాల వెనుక వుంటుంది.

ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నెన్నో పథకాలు అమలవుతున్నట్టుగా ప్రభుత్వాలు చెప్పుకుంటున్నాయి. వీటన్నింటికీ ఏవేవో రకరకాల ఆకర్షణీయమైన పేర్లు వున్నాయి. అందులో ఒకటి–

## రాజీవ్ యువకిరణాలు

ప్రస్తుతం అమలవుతున్నట్టు చెప్పుకుంటున్న పథకాలు చాలా మేరకు రాజశేఖర్ రెడ్డి హయాంలోనే ప్రారంభమైనాయి. మరి కొన్ని కేంద్ర ప్రభుత్వ పథకాలు. కానీ ‘రాజీవ్ యువకిరణాలు’ మాత్రం కిరణ్ కుమార్ రెడ్డి మానస పుత్రిక. ఇప్పటి వరకూ పథకాల మీదున్న వైఎస్సార్ ముద్రను తొలగించి, తన ముద్రను వేసుకోవాలనుకుంటున్న కిరణ్‌కుమార్ ఈ పథకం మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. యువత భవితకు ఆశాజ్యోతనీ, అవధులు లేని అవకాశాలనీ ప్రచారం చేస్తున్న ఈ పథకాన్ని, 2011 ఆగస్టు 21న విశాఖపట్నంలో లాంఛనంగా ప్రారంభించాడు. 2014 నాటికి రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల్లోని పదిహేను లక్షల మంది యువతీ యువకులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ పథకం లక్ష్యంగా కిరణ్ కుమార్ ప్రకటించాడు. 2011 డిసెంబర్ 31కల్లా లక్ష మందికి వుపాధి కల్పిస్తామని కూడా చెప్పాడు. ఈ పథకం అమలు కోసం ముఖ్యమంత్రి అధ్యక్షతన రాజీవ్ విద్యా, ఉపాధి అవకాశాల కల్పనల మండలి అనే ప్రత్యేక పర్యవేక్షక విభాగం పనిచేస్తుంది. ఇంకా దీని కింద ఎన్నో అనుబంధ విభాగాలు పనిచేస్తాయి.

ఈ పథకానికి ముఖ్యమంత్రి ఇస్తున్న ప్రాధాన్యతరీత్యా ఈ సంవత్సరం బడ్జెట్‌లో 777 కోట్ల రూపాయలను కేటాయించారు. అయితే ఈ పథకం అమలు సాధ్యాసాధ్యాల పట్ల అధికార పార్టీ నాయకుల్లోనే అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అంత పెద్ద ఎత్తున ఉద్యోగాలను ఎలా కల్పించగల్గుతామని ప్రశ్నిస్తున్నారు. ఈ పథకం గురించి ప్రభుత్వం పెద్ద ఎత్తున హోరెత్తిస్తున్న తీరును చూసి యువతకు ప్రభుత్వ వుద్యోగాలు కల్పించే పథకమిదని భావిస్తున్నారు. నిజానికి ఈ పథకం పట్ల స్పష్టత అధికార పార్టీలో కూడా లేదు. ఒక మంత్రివర్గ సమావేశంలో మంత్రి, పీసీసీ అధ్యక్షుడు బొత్సా సత్యనారాయణ ఈ పథకం గురించి తమకందరికీ అవగాహన కల్పించాలని అసహనంతో మాట్లాడాడు. ఆ వెంటనే తగిన అవగాహన కల్పించడం కోసం ఈ పథకాన్ని పర్యవేక్షించే అధికారులతో జరిగిన భేటీలో ఆయన ‘ఈ పథకం కింద కల్పించబడేవి ప్రభుత్వ వుద్యోగాలా? ప్రైవేటు వుద్యోగాలా?’ అని ప్రశ్నించాడు. ప్రైవేటు వుద్యోగాలేనని అధికారులు స్పష్టం చేసినపుడు, ‘ప్రజలు ప్రభుత్వ వుద్యోగాలే వస్తాయని భావిస్తున్నార’ని అన్నాడు. సోనియా, మన్మోహన్‌లకు ఎంపీ వివేక్ రాసిన వుత్తరంలో ఈ పథకం ద్వారా ప్రభుత్వం వుద్యోగాలు ఇస్తుందన్న భావన ప్రజల్లో ఏర్పడిందని, కానీ సర్కారు వుద్యోగాలు కోరుకుంటున్న వాళ్లకు శిక్షణ మాత్రమే ఇస్తుందని, అంటే ఇది శిక్షణ పథకమే తప్ప, వుద్యోగ కల్పన పథకం కాదని పేర్కొన్నాడు.

దీన్ని బట్టి సొంత పార్టీలోనే ఈ పథకం పట్ల వున్న అసంతృప్తి, అస్పష్టత అర్థమవుతుంది. ఈ అస్పష్టత ప్రజలను మోసం చేయడానికి, భ్రమల్లో వుంచడానికి కూడా వుపయోగపడుతుంది.

నిజానికి ఈ పథకం ప్రకారం, కనీసం పదో తరగతి చదివిన యువతకు ప్రభుత్వం పలు రంగాల్లో శిక్షణనిస్తుంది. ఆ తర్వాత వాళ్లను వాటి అవసరాన్ని బట్టి కొన్ని ప్రైవేట్ కంపెనీలు వుద్యోగాల్లోకి తీసుకుంటాయి. ఇలా వుద్యోగాలు ఇవ్వడం కోసం పలు బహుళ జాతి సంస్థలు, కార్పొరేట్ ప్రైవేటు సంస్థల యాజమాన్యాలు, అధికారులతో ప్రభుత్వం చర్చలు జరిపిందనీ, వుద్యోగాలు ఇవ్వడానికి పలువురు అంగీకరించారని ప్రభుత్వం చెబుతున్నది.

అయితే ఈ సంస్థలు ఎన్ని వుద్యోగాలను కల్పించగలవు? కిరణ్‌కుమార్ రెడ్డి యువతకు ఆశచూపుతున్నట్టుగా మూడేళ్లలో పదిహేను లక్షల వుద్యోగాలు కల్పించడం సాధ్యమా అని ఆనాడు మంత్రులే సందేహం వ్యక్తపరిచారు. హామీలతో నిరుద్యోగుల్లో లేనిపోని ఆశలను కల్పిస్తున్నట్టు వారు అభిప్రాయపడ్డారు. ఇప్పుడీ

పథకం అవసరమా అని కూడా ప్రశ్నించారు. రాష్ట్రంలో నూతనంగా పరిశ్రమలను స్థాపిస్తేనో, లేదా పరిశ్రమలను విస్తరిస్తేనో తప్ప వుపాధి అవకాశాలు మెరుగుపడవని సీఐఐ నివేదిక చెబుతున్నదని, ఇదేదీ లేకుండా లక్షలాది వుద్యోగాలు ఇచ్చేస్తామంటూ ప్రకటనలు చేస్తే చివరికి అప్రతిష్ఠ పాలయ్యేది ఎవరు అంటూ బొత్స సత్యనారాయణ ప్రశ్నించాడు.

పదిహేను లక్షల వుద్యోగాల మాట సరే ఇప్పటికే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పేరుతో ఏళ్ల తరబడి పని చేస్తున్న వేలాది మంది తాత్కాలిక వుద్యోగుల సంగతేంటి? వారిని తొలగించి కొత్త వుద్యోగాలను భర్తీ చేస్తారా? వారిని అలాగే కొనసాగిస్తూ కొత్త వుద్యోగాలు ఇస్తారా? ఉద్యోగాలు భర్తీ చేసే సమయంలో వీరికేమైనా ప్రాధాన్యత కల్పిస్తారా? అని పంచాయితీ రాజ్ శాఖా మంత్రి జానా రెడ్డి ప్రశ్నించాడు. ఇలా ఈ పథకం మీద ప్రశంసల కంటే విమర్శలే ఎక్కువగా వస్తున్నాయని కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఒప్పుకున్నాడు.

విమర్శలు, ప్రశంసల మాటెలా వున్నా నిరుద్యోగుల్లో ఎంతో కొంత ఈ పథకం పట్ల భ్రమలు కలగడం సహజం. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి ఉపాధికి ప్రయత్నిస్తున్న యువతను గుర్తించడానికి చేపట్టిన ఒక సర్వేలో 8,11,105 మంది నిరుద్యోగులున్నట్టు తేలింది. ఇక పట్టణ, నగర ప్రాంతాలను కలుపుకుంటే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. ఇంతగా నిరుద్యోగంతో సతమతమవుతున్న యువతను ఈ పథకం ఎంతో కొంత ఆకర్షించక మానదు. అందుకే డిసెంబర్ 14 నాటికి 4,68,638 మంది యువత రాజీవ్ యువ కిరణాలు వెబ్‌సైట్ ద్వారా వుద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రతిగా 1,01,082 వుద్యోగాలు కల్పించామని ఈ సంవత్సరం జనవరి మొదటివారంలో ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. అయితే డిసెంబర్ 14 నాడు నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఇచ్చిన నివేదిక ప్రకారం 64,082 వుద్యోగాలు కల్పించామని, 61 శాతం లక్ష్యం నెరవేరిందని గణాంకాలు చూపింది. ఈ సదస్సు ముగిసిన 15 రోజుల్లోనే మిగతా 37 వేల వుద్యోగాలు ఎలా కల్పించగలిగారన్నది అర్థం కాని విషయం. అంతేకాక రాష్ట్రవ్యాప్తంగా 716 కంపెనీలు తమకు మొత్తంగా 52,912 మంది వుద్యోగాలు కావాలని ప్రభుత్వానికి తెలియజేశాయి. మరి కంపెనీలో ఇన్నే ఖాళీలు వుండగా దాదాపు రెట్టింపు వుద్యోగాలు ఎక్కడి నుండి వూడిపడ్డట్టు?

దీన్నిబట్టి ప్రభుత్వం కాకిలెక్కలు చెబుతున్నదని అర్థం అవుతుంది. ఇప్పటికే వుద్యోగాలు చేస్తున్న వారికి కొత్తగా వుద్యోగం ఇచ్చినట్టుగా కొన్ని చోట్ల, అసలు వుద్యోగాలు ఇవ్వకుండానే ఇచ్చినట్టుగా కొన్ని చోట్ల లెక్కలు చెబుతున్నారు. దాదాపు అన్ని జిల్లాల్లో దరఖాస్తులు కూడా చేసుకోనివారికి వుద్యోగాలు ఇచ్చినట్టుగా కాగితాల్లో చూపిస్తున్నారని తనిఖీల్లో బయట పడుతున్నది. మచ్చుకు ఒక వుదాహరణ చెప్పుకోవాలంటే పశ్చిమగోదావరి జిల్లా పోలవరం మండల పరిధిలో ఈ పథకం కింద 173 మందికి శిక్షణ ఇచ్చి వుద్యోగాలు ఇచ్చినట్లు రికార్డుల్లో రాశారు. అయితే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన దర్యాప్తులో ఒక్కరంటే ఒక్కరు కూడా వుద్యోగం చేయడం లేదని తేలింది. ఇలా వుద్యోగాలు పొందినట్టుగా చెబుతున్న వారందరికీ సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన జరిపి వివరాలివ్వాలని ఆంధ్రప్రదేశ్ రాజీవ్ విద్యా వుపాధి మిషన్ జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇచ్చిన గడువు ముగిసినప్పటికీ క్షేత్రస్థాయి పరిశీలన పూర్తికాలేదు. పరిశీలనకు ఇచ్చిన ఉద్యోగుల జాబితాలో 25-30 శాతం మంది వివరాలు తెలియలేదని జిల్లాల అధికారులు తమ పై అధికారులకు తెలియజేశారు.

ఇక ఇస్తున్న వుద్యోగాలు కూడా చిన్నా చితకవే. ఈ వుద్యోగాలకు చట్టబద్ధత కూడా లేదు. నెలకు 5 వేలు, 6 వేలు జీతం వచ్చే వుద్యోగాలు వస్తున్నట్టు ఈ పథకాన్ని పర్యవేక్షించే అధికారులు చెబుతున్నారు. అయితే ఈ రోజుల్లో ఐదు, ఆరు వేలు వచ్చే వుద్యోగాలకు ఏపాటి విలువుంటుంది? ఈపాటి వుద్యోగాల కోసం దూర ప్రాంతానికి వెళ్లడానికి ఎవరు సిద్ధపడతారు? "ఈ పథకం పేరుతో నెలకు మూడు వేల రూపాయల జీతమిచ్చి ఏజెన్సీలో వున్న ఆదివాసీలను హైదరాబాద్, చెన్నై లాంటి ప్రాంతాలకు పంపిస్తున్నారు. వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని దోచుకుంటున్నారు. ఇటువంటి వుద్యోగాల కంటే వున్న ఊళ్లో కూలి చేసుకొని బతకడం మేలు" అంటూ గిరిజన సలహా మండలి సభ్యులు ఒక సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని చూస్తే ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చింది నిరుద్యోగ యువతకు వుద్యోగాలు కల్పించడం కోసమా? లేదా కార్పొరేట్ సంస్థలకు తక్కువ ఖర్చుతో వుద్యోగులను సమకూర్చడానికా? అని అనుమానం రాక మానదు. ముందుగా ఏదో ఒక వుద్యోగం అనుకొని చేరినప్పటికీ, చేరిన తర్వాత సాధక బాధకాలు అర్థమై చాలా మంది ఇటువంటి వుద్యోగాలు వదిలేసుకుంటున్నారు. ఇలా వదిలేసుకొన్న వుద్యోగాలను కూడా ఉద్యోగాలు ఇచ్చిన లెక్కల్లోనే ప్రభుత్వం చూపిస్తున్నది.

నిజానికి లేని వుద్యోగాలను ప్రభుత్వాలు ఎక్కడి నుండి సృష్టిస్తాయి? కొన్ని సంస్థలు వాగ్దానాలు చేసినప్పటికీ వుద్యోగాలు ఇవ్వడం లేదు. ఉదాహరణకు విశాఖలో ఏర్పాటైన బ్రాండెక్స్ అనే సంస్థ తొలుత లక్ష వుద్యోగాలను కల్పిస్తానని చెప్పింది. కాని దాని కార్యకలాపాలు ప్రారంభించి రెండేళ్లు కావొస్తున్నా 6 వేల మందికే వుద్యోగాలిచ్చింది.

రాష్ట్రవ్యాప్తంగా కల్పించిన వుద్యోగాలు కూడా ఎక్కువగా పదవీ విరమణ, పదోన్నతుల కారణాల వల్ల ఖాళీ అయినవే కాని కొత్త పోస్టులు కల్పించింది తక్కువే.

ఇది ప్రభుత్వాలు కల్పిస్తున్న ఉద్యోగాల తీరు! మరి శిక్షణ తీరు ఎలా వుంది?

నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్, స్కైలార్క్ ఇన్‌ఫోవేవ్స్ ప్రైవేట్ లిమిటెడ్, డా. రెడ్డీస్ ఫౌండేషన్, స్కిల్లింగ్ రూరల్ ఇండియా తదితర సంస్థలతో వివిధ జిల్లాలలో వున్న సంస్థలతో సేల్స్ అండ్ మార్కెటింగ్, హోటల్ మేనేజ్‌మెంట్ బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్,

మల్టీమీడియా, కంప్యూటర్ జాబ్‌వర్క్, ట్యాలీ అండ్ అకౌంటింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇలా శిక్షణ పొందుతున్న ఒక్కో అభ్యర్థికి గాను భోజన, నివాస వసతి, శిక్షణ ఖర్చుల కింద ప్రభుత్వం శిక్షణ సంస్థలకు 8 వేల నుండి 13 వేల వరకు చెల్లిస్తున్నది. ఈ లెక్కన ప్రభుత్వం అభ్యర్థుల సంఖ్యను అనుసరించి ఒక్కో జిల్లాకు ఒకటిన్నర నుండి మూడు కోట్లు చెల్లించింది. అంటే ఈ డబ్బంతా శిక్షణ ఇచ్చే పై సంస్థలకే పోతుంది. పైగా వుద్యోగ అవకాశాలతో సంబంధం లేకుండా శిక్షణ ఇప్పిస్తున్నది. ప్రైవేటు సంస్థల్లో వుద్యోగాల డిమాండ్ వంద వుంటే, సర్కారు వెయ్యి మందికి శిక్షణ ఇస్తున్నదని మంత్రులే విమర్శిస్తున్నారు. ప్రభుత్వం ఎంత మందికి శిక్షణ ఇప్పిస్తే అంతమేరకు శిక్షణనిచ్చే ప్రైవేటు సంస్థలకు లాభాల పంట పండుతుంది.

ఈ డబ్బు చాలనట్టు ఈ సంస్థలు బోగస్ అభ్యర్థుల పేర్లతో అక్రమ సంపాదనకు పాల్పడుతున్నాయి. ఇంతకు ముందే 'రాజీవ్ వుద్యోగశ్రీ పథకం' కింద శిక్షణ పొందిన వారికి, ఇప్పుడు మళ్లీ 'రాజీవ్ యువకిరణాలు' పథకం కింద శిక్షణ ఇస్తున్నట్టు చూపుతున్నారు. ఒక్క కర్నూలు జిల్లాలోనే ఇలా ఏకంగా 3,915 మంది అభ్యర్థులను చూపారు. చివరకు ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కాలేజీల్లో కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న వారిని కూడా శిక్షణ పొందుతున్న వారి జాబితాలో చూపారు. కొన్ని సంస్థలు ఒకే వ్యక్తితో పదివేళ్లతో వేలిముద్రలు వేయించుకొని పది మంది పేరుతో సొమ్మును కాజేస్తూ బయోమెట్రిక్ యంత్రాలను కూడా మోసం చేస్తున్నాయి. ఇదే అవకాశంగా కొన్ని బోగస్ సంస్థలు కూడా పుట్టుకొస్తున్నాయి. నిజామాబాద్ జిల్లాలో ఈ పథకం కింద శిక్షణ ఇస్తున్నామంటూ ఓ బోగస్ సంస్థ 80 మంది కాలేజీ విద్యార్థులను అభ్యర్థులుగా చూపి, వాళ్ల పేరుతో సొమ్ము కాజేసింది. ఇలా చెప్పుకుంటే పోతే ఈ శిక్షణా పథకం యువతకు ఏం ఒరగబెడుతుందో గాని శిక్షణనిచ్చే కార్పొరేట్ సంస్థలకు మాత్రం కాసుల వర్షం కురిపిస్తున్నది.

నేడు నిరుద్యోగ సమస్య చాలా తీవ్రంగా వేధిస్తున్నది. ముఖ్యంగా యువతలో అసంతృప్తి రగులుకుంటున్నది. యువతలో పేరుకొనే అసంతృప్తి దేనికైనా దారితీస్తుందని పాలకులకు బాగానే తెలుసు. అందుకే ఆ అసంతృప్తి బద్దలు కాకుండా వుండడం కోసం, యువతను భ్రమల్లో పెట్టి ఆ అసంతృప్తిని చల్లార్చి తమ ఓటుబ్యాంకుగా మలచుకోవడం కోసం కిరణ్ కుమార్ రెడ్డి ఈ పథకం పన్నాడు. యువతకు ఆశా జ్యోతిగా చెబుతున్న ఈ పథకాన్ని కిరణ్ కుమార్ రెడ్డి తనకే ఆశాజ్యోతిగా భావిస్తున్నాడు. కాని యువతను ఎంతో కాలం ఇలా భ్రమల్లో వుంచలేడు. ఇటువంటి పథకాలు తమ భవితకు ఎటువంటి గ్యారంటీని ఇవ్వవని, తమను భ్రమల్లో ముంచెత్తాలని చూస్తున్న పాలకవర్గాలతో పోరాడ్డం ద్వారానే తమ భవితను తాము నిర్మించుకోగలమని యువత తప్పక గ్రహిస్తారు. యువతలో ఇటువంటి పథకాల పట్ల భ్రమలు తొలిగిన నాడు కిరణ్ కుమార్ రెడ్డికైనా, మరొకరికైనా తీవ్రమైన నిరాశే మిగులుతుంది.

## మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం

ఇది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం. ఈ పథకానికి అవసరమైన నిధులను 90 శాతం మేరకు కేంద్రం భరిస్తే, 10 శాతం రాష్ట్రాలు భరించాలి. గ్రామీణ పేదరికాన్ని రూపుమాపుతుందంటూ ప్రభుత్వాలు ఊదరగొట్టిన ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా బండ్లమోటు గ్రామంలో నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో మన్మోహన్, సోనియాల సమక్షంలో ఆర్భాటంగా ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతంలో దారిద్ర్యరేఖ దిగువన వున్న ప్రతి కుటుంబంలోని ఒకరికి వంద రోజుల పాటు కూలీ పని కల్పించడం ఈ పథకం ఉద్దేశం. దేశంలోని 150 జిల్లాల్లో మొదట ఈ పథకం ప్రారంభమైంది. ప్రారంభంలో ఈ పథకం ద్వారా వేతనంగా రోజుకు 60 రూపాయలు లేదా ఆ ప్రాంతంలో వున్న కనీస వేతనం ఈ రెండిట్లో ఏది ఎక్కువ వుంటే దాన్ని చెల్లించాలనే నిబంధన వుండేది. ప్రస్తుతం దినసరి వేతనంగా 125 రూపాయలకు తగ్గకుండా ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది.

దారిద్ర్యరేఖ దిగువన వున్న కుటుంబాలను రేషన్ కార్డు ద్వారానే గుర్తిస్తారు. అయితే దేశంలో అర్హులైన ఎంతో మందికి రేషన్ కార్డులు లేనేలేవు. మన దేశంలో దారిద్ర్యరేఖకు నిర్ణయించిన ఆదాయం చాలా తక్కువ. ప్రణాళిక సంఘం లెక్కల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో రోజుకు 28 రూపాయలు, గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు 22 రూపాయల ఆదాయం వున్న వాళ్లు దారిద్రరేఖకు పైన వున్నట్టే. కనుక గణాంకాలు చెబుతున్న దానికంటే పేదరికం శాతం మరెంతో ఎక్కువ వుండే అవకాశం వుంది. ఈ లెక్కన చూసుకుంటే ఎంతో మంది నిజమైన అర్హులకు ఈ పథకం ద్వారా ఎటువంటి ప్రయోజనం చేకూరదు. ఒకవేళ అర్హులందరికీ ఈ పథకం వర్తించినా, ఇంత తక్కువ వేతనంతో కేవలం ఒక కుటుంబంలోని ఒకరికి, అది కూడా గరిష్టంగా వంద రోజులు మాత్రమే పని కల్పించడం వలన పేదరికం నిర్మూలించబడదనేది నిర్వివాదాంశం.

మౌలికంగానే లోపాలు వున్న ఈ పథకం గురించి పాలకులు చాలా గొప్పలు పోతున్నారు. దీని అమలులో ఆంధ్రప్రదేశ్ అగ్ర స్థానంలో వుందని కూడా కితాబులిస్తున్నారు. అంతగా కితాబు పొందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో దీని అమలు ఎలా వుందో కాస్త పరిశీలిద్దాం.

ఈ పథకం ద్వారా నీటి సంరక్షణ, పంటకోత, కరువు నివారణ, నీటి పారుదల, సాంప్రదాయ నీటి వనరులను మెరుగు పరచడం, బంజరు భూముల అభివృద్ధి, వరద నియంత్రణ, గ్రామీణ ప్రాంతంలో రహదారుల అభివృద్ధి వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యతను ఇవ్వాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రభుత్వం ఈ పనులను చేపట్టడం ద్వారా పేదలకు ఉపాధిని అంటే కూలీ పనిని కల్పిస్తుంది.

ఈ పనుల ఎంపిక, పర్యవేక్షణ, అమలు బాధ్యత పంచాయితీలదే. అయితే శ్రమశక్తి సంఘాల్లోని సభ్యులతో పాటు ఎస్సీ, ఎస్టీలకు చెందిన మాజీ వార్డు మెంబర్లు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, మాజీ జడ్‌పీటీసీల్లో ఎవరో ఒకరి ద్వారా పని చేయించే వెసులుబాటును కూడా ప్రభుత్వం కల్పించింది. దీనితో ఏ పనులు చేయించాలి, ఎవరికి పనులు కల్పించాలి అనేది అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకుల పెత్తనంగా మారింది. కొంత కాలం తర్వాత వైఎస్ ఈ పథకం అమలు బాధ్యతను గ్రామీణాభివృద్ధి శాఖకు బదలాయించడంతో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంగా మారింది. మొత్తంగా ఈ పథకం అధికార పార్టీ స్థానిక నాయకులకు కాంట్రాక్టులను, కార్యకర్తలకు పనులను పంచిపెట్టే కార్యక్రమంగా తయారైంది. వాళ్లకు ప్రయోజనాలను చేకూర్చడం కోసమే ఈ పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా లింకురోడ్లు, సిమెంట్ రోడ్లు మంజూరు అవుతున్నాయి. ఈ పనులను కేటాయించడానికి గ్రామసభలు జరపాల్సి వుండగా ఎక్కడా గ్రామసభలు జరపడం లేదు.

ఇక వంద రోజుల పని కల్పించాలనే లక్ష్యం దాదాపుగా ఎక్కడా నెరవేరడం లేదు. గతేడాది ఒక కోటి రెండు లక్షల మంది కూలీల్లో 13 లక్షల మందికి మాత్రమే వంద రోజుల పని కల్పించారు. మిగిలిన వారికి 60 రోజుల పని కూడా కల్పించలేకపోయారు. పైగా కొన్ని గ్రామాల్లో ఈ పథకం అమలే కావడం లేదు. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన అనంతపురం జిల్లా బండ్లమోటు గ్రామంలో ప్రారంభోత్సవం తర్వాత ఈ పథకం అడ్రస్ లేకుండా పోయింది. అధికారిక లెక్కల ప్రకారమే 514 పంచాయితీల్లో ఏడాది పొడవునా ఒక్కరికైనా పని కల్పించలేదు. అంటే అధికార పార్టీకి లబ్ధి చేకూరే అవకాశాలు లేని గ్రామాల్లో పనులు కల్పించడంలో ప్రభుత్వం ఎటువంటి శ్రద్ధ చూపడం లేదని అర్థం అవుతుంది.

మొత్తంగా గణాంకాలను పరిశీలిస్తే ఈ పథకంలో భాగంగా కల్పిస్తున్న పని దినాలు సంవత్సర సంవత్సరానికీ తగ్గిపోతున్నాయి. 2009-10లో 283.354 కోట్ల పనిదినాలు నమోదు కాగా, 2010-11లో 257.15 కోట్లకు పడిపోయింది.

ఇలా కొన్ని గ్రామాల్లో పనులను కల్పించడంలో ఏ మాత్రం శ్రద్ధ చూపని ప్రభుత్వం పనులను కల్పించలేకపోతున్నారనే సాకుతో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగిస్తున్నారు. నిజానికి ఈ పథకం నిర్వహణ భారాన్ని తగ్గించుకోవడానికే ఈ తొలగింపులన్నది స్పష్టం. (ఒకవైపు 'రాజీవ్ యువకిరణాలు' పేరుతో యువతకు ఉపాధి కల్పిస్తామంటూ మరోవైపు వున్న ఉపాధిని దెబ్బతీస్తున్నారు.)

ఈ పథకం అమలులో అగ్రశ్రేణిలో వుందని కితాబులిస్తున్న రాష్ట్రంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కూలీలకు తక్కువ వేతనం అందుతున్నది. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద 125 రూపాయలను దినసరి వేతనంగా నిర్ణయిస్తే ఇక్కడ సగటున 80 రూపాయలు మాత్రమే కూలీలకు అందుతున్నది. కాగా వేలాది మంది కూలీలకు 30 రూపాయల కంటే తక్కువ వేతనమే అందుతున్నదని, గ్రామీణాభివృద్ధి శాఖలోని జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పర్యవేక్షిస్తున్న అధికారులే స్వయంగా చెబుతున్నారు.

పనులు కల్పించడంలో ఎస్సీ, ఎస్టీలకు చాలా అన్యాయం జరుగుతున్నది. ఈ వివక్షపై ఆయా జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి కమిషనర్ కార్యాలయం నుంచి లేఖలు వెళ్లడాన్ని బట్టి ఈ సమస్య తీవ్రత అర్థం అవుతుంది. 1,098 మండలాల్లో వుపాధి హామీ పథకం అమలవుతుంటే అందులో 951 మండలాల్లోని 4,400 గ్రామాల్లో ఎస్సీ/ఎస్టీ కూలీలకు ఇతర కూలీలతో పోలిస్తే సగానికంటే తక్కువ పని దినాలు కల్పించినట్లు తేలింది. ఈ గ్రామాల్లో ఎస్సీ/ఎస్టీలకు ఏడాదికి 20 రోజులు మాత్రమే కల్పించినట్టు అధికారిక లెక్కలు తెలియజేస్తున్నాయి. మొత్తంగా రాష్ట్రంలో ఎస్సీలకు 2006-07లో 29.8 శాతం పనిదినాలు కల్పిస్తే, తర్వాతి సంవత్సరాల్లో అది తిరోగమనం పట్టి 27.7, 26.1, 24.7, 24.3 శాతాలకు పడిపోయింది.

ఇప్పటికే సరిగా పనిదినాలను కల్పించడంలో విఫలమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం, ఇక నుండి ఏడాదికి 200 పనిదినాలను కల్పిస్తానని ఈ సంవత్సరం జూన్‌లో ప్రకటించింది. అదనంగా కల్పిస్తానని చెబుతున్న ఈ వంద రోజులకు రాష్ట్ర ప్రభుత్వమే నిధులు కేటాయించాల్సి వుంటుంది. అంటే రాష్ట్ర ప్రభుత్వంపై ఏడాదికి రెండు వేల కోట్లకు పైగానే భారం పడుతుంది. ఇప్పటికే తాను కేటాయించాల్సిన పది శాతం నిధులనే సరిగా కేటాయించడం లేదని రాష్ట్రంపై విమర్శలు వస్తున్నాయి. గత ఏడాది రాష్ట్రం తన వాటా కింద 820 కోట్ల రూపాయలను కేటాయించాల్సి వుండగా 500 కోట్ల రూపాయలను మాత్రమే కేటాయించింది. అటువంటిది ఇప్పుడు రెండు వేల కోట్లకు పైగా భారాన్ని భరించగలదా అనే సందేహాలు అందరిలోనూ తలెత్తుతున్నాయి.

పనులు జరిగే చోట కనీస సదుపాయాలు కల్పించాలనే నిబంధన వున్నా అమలు కావడం లేదు. ఇక పోతే తమకు పనులు కల్పించాలనే అభ్యర్థన కూలీల నుండి వచ్చిన 15 రోజుల లోపు, పనులను కల్పించడంలో అధికారులు విఫలమైతే అభ్యర్థులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలనే నిబంధన కూడా ఈ పథకంలో వుంది. రాష్ట్రంలో ఎక్కడా అటువంటి నిరుద్యోగ భృతి ఇస్తున్న దాఖలాలు లేవు. వేతనాలు కూడా సకాలంలో చెల్లించడం లేదనే ఆరోపణలు అంతటా వస్తున్నాయి.

ఈ అన్ని కారణాల వల్ల ఈ పనుల వల్ల ప్రజల్లో ఆసక్తి తగ్గిపోతున్నది. అందుకే 2010-11లో పనులకు వచ్చినంత మంది కూలీలు 2011-12 సంవత్సరంలో రాలేదు. ఇలా ఎందుకు జరుగుతున్నదని గ్రామీణాభివృద్ధి శాఖ చేయించిన సర్వేలో పలు కారణాలు బహిర్గతమయ్యాయి. ఈ పథకంతో వలసలకు అడ్డుకట్ట వేస్తామని ప్రభుత్వం ప్రగల్భాలు పలికినప్పటికీ వలసలు యథాతథంగా కొనసాగుతూనే వున్నాయి.

ఇలా సరిగా అమలు చేయకపోవడం వల్ల ఈ పథకానికి కేటాయించిన నిధులు మిగిలిపోతున్నాయి. 2010-11లో రాష్ట్ర

ఉపాధి హామీ పద్దులో 3,677 కోట్ల రూపాయల మిగులు తేలింది. 2011-12 ఆర్థిక సంవత్సరంలో ఉత్తర తెలంగాణాలోని ఐదు జిల్లాల అంచనా వ్యయం 2307.65 కోట్లు కాగా కేవలం 573.90 కోట్లు మాత్రమే ఖర్చయింది. ఖర్చు చేసిన మేరకైనా దుర్వినియోగం అవుతున్నందున అర్హులకు ప్రయోజనం చేకూరలేదు. ఈ పథకం కింద ఇప్పటికి 19 వేల కోట్ల వరకు ఖర్చు చేసినా, వాస్తవానికి వీటి వల్ల సమకూరిన ఆస్తుల విలువ 19 వందల కోట్లు కూడా కనిపించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం వివిధ స్వచ్ఛంద సంస్థలతో చేయించిన సర్వేలో వెల్లడయింది.

మొత్తంగా ఈ పథకంలో 109 కోట్ల అవినీతి జరిగినట్టు గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి డొక్కా వరప్రసాద్ ఒప్పుకున్నాడు. నిజానికి దీనికి ఎన్నో రెట్ల అవినీతి జరిగి వుంటుందనడంలో ఎటువంటి సందేహమూ వుండాల్సిన అవసరం లేదు. ఇందులో చోటు చేసుకుంటున్న అవకతవకలపై వందకు పైగా గ్రామాల్లో సుప్రీం కోర్టు సీబీఐ విచారణకు ఆదేశించింది. వీటిలో జరుగుతున్న అక్రమాల కేసులను పరిష్కరించేందుకు రాష్ట్రంలో మొట్టమొదటిసారి సంచార న్యాయస్థానాన్ని ఏర్పాటు చేశారు.

ఉపాధి హామీ పథకం తన లక్ష్యాన్ని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయిందని జాతీయ మానవ హక్కుల సంఘం కూడా విమర్శించింది. "మా బృందాలు 16 జిల్లాల్లో పర్యటించాయి. సంవత్సరంలో వంద రోజులు తప్పకుండా పని కల్పించి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్ని ఆదుకోవాల్సిన ఉపాధి హామీ పథకం తన లక్ష్యాన్ని చేరుకోలేదు" అని జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యుడు సత్యబ్రత పాల్ తెలిపాడు. ప్రభుత్వ గణాంకాలను పరిశీలిస్తే 50 పని దినాలకు మాత్రమే చెల్లింపులు జరిగినట్లు తేలిందని చెప్పాడు. 99 శాతం పనుల్లో నిర్మాణ వస్తువులు వినియోగించలేదని తేలిందనీ, అయితే వినియోగించినట్టుగా వాటి కోసం 37 శాతం నిధులు వెచ్చించారని, ఇంత పెద్ద ఎత్తున నిధులు ఎలా దుర్వినియోగమయ్యాయో విచారణ జరపాలని అన్నాడు. వీటన్నింటినీ బట్టి చూస్తే ఇక్కడ అవినీతి భారీగానే జరుగుతున్నదని అర్థం చేసుకోవచ్చు.

ఈ పథకంలోని మరో కోణంపై కూడా చర్చ జరుగుతున్నది. ఉపాధి హామీ పనులకు వెళుతున్నారు కనుక వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదని, దొరికినా అధిక కూలీ రేట్లు ఇవ్వాల్సి వస్తున్నదని, దీనివల్ల రైతులు నష్టపోతున్నారని చర్చ జరుగుతున్నది. కొన్ని జిల్లాల్లో అధ్యయనం చేసిన ఏయీూ వ్యవసాయ సంస్థ కూడా తన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. దీనికి విరుగుడుగా వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రవేశపెట్టాలని ఈ సంస్థ సూచించింది.

ఇటీవల 'ఇందిరమ్మ బాట'లో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ పథకం రైతులను దెబ్బతీసిందని అందుకని యంత్రాలను కొనుక్కోవాలని రైతులకు ఉద్బోధించాడు. యంత్రాలను కొనుక్కుంటే 50 శాతం రాయితీ కల్పిస్తామని కూడా చెప్పాడు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం కోసం అంటూ జరిగిన 'ఏపీ - టెక్ 2012' సదస్సులో కూడా ముఖ్యమంత్రి మాట్లాడుతూ వ్యవసాయ కూలీల కొరత తీర్చేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం వచ్చే మూడేళ్లలో 2,500 కోట్ల రూపాయలతో వ్యవసాయ యాంత్రీకరణ చేపట్టనుందని, ఇది పూర్తయితే ఉపాధి హామీ పథకం కింద కూలీలకు మూడు వందల రోజులు పని కల్పించాల్సిన పరిస్థితి వస్తుందని చెప్పాడు. అంటే వ్యవసాయంలో యాంత్రీకరణ పెంచి, కూలీలకు వున్న అవకాశాలను కూడా దెబ్బతీసి, తమ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే విధంగా వాళ్లను తయారు చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతుంది. వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహిస్తూ పెట్టుబడిదారుల ప్రయోజనాలను నెరవేర్చాలని చూస్తున్నది. ఉత్పాదక ఖర్చును మరింతగా పెంచి వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టాలని చూస్తున్నది.

నిజానికి పేద ప్రజలకు కావాల్సింది ప్రభుత్వం విదిల్చే ఏడాదికి వంద రోజుల కూలీ పనులు కావు. ఈ కూలీ పనులు వాళ్ల బతుకులో ఏ చిన్న మార్పును తీసుకురాలేవు. భూమిపై, వనరులపై అధికారం దక్కినప్పుడే పేద ప్రజల బతుకుల్లో అభివృద్ధి చోటు చేసుకుంటుంది. కాబట్టి పేదల పేరుతో దోపిడీ వర్గాల ప్రయోజనాల కోసమే ముందుకు తెచ్చే ఇటువంటి పథకాలను తిరస్కరించాలి. తమ బతుకులను మార్చుకోవడానికి పోరుబాట పట్టాలి.

**(రాబోయే సంచికలో మరి కొన్ని పథకాల గురించి)**

***మహిళా సాధికారత, మహిళల హక్కులు, మహిళలకు సమానావకాశాలు అంటూ పాలకులు వేదికలెక్కి మైకులు విరగ్గొడుతుంటారు. కానీ రోజు రోజుకూ మహిళల పరిస్థితి ఎంతగా దిగజారిపోతున్నదో, వాళ్ల మీద ఆంక్షలు ఎలా పెరిగిపోతున్నాయో ఉత్తర ప్రదేశ్‌లో జరిగిన తాజా సంఘటన మరోసారి తెలియజేస్తున్నది.***

***కుల పంచాయతీలు, పరువు హత్యలు ఉత్తర ప్రదేశ్ ప్రజలకు సుపరిచితమే. తాజాగా అక్కడో గ్రామం మరో రెండు అడుగులు ముందుకేసింది. బాఘ్‌పట్ జిల్లాలోని అసరా అనే గ్రామంలో ప్రేమ పెళ్లిళ్లను నిషేధిస్తూ ఆ గ్రామ పంచాయితీ ఆంక్షలు విధించింది. అంతే కాదు 40 సంవత్సరాలలోపు మహిళలు షాపింగ్ చేయడానికి వీల్లేదని, ఇంటి నుండి బయటకు అడుగు పెడితే ముఖాన్ని వస్త్రంతో కప్పుకోవాలని, ఇంటి నుండి బయటకు అడుగు పెట్టగానే సెల్‌ఫోన్ వాడకూడదని మహిళల స్వేచ్ఛపై కూడా వేటు వేస్తూ తీర్మానం చేసింది.***

# ఫీజు రీ యింబర్స్‌మెంట్ విధానాల అమలుకై పోరాడండి!

రాష్ట్రంలోని వృత్తివిద్యా కోర్సుల్లో కామన్ ఫీజు విధానాన్ని అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆగస్టు 9న తన తీర్పును వెలువరించడంతో రాష్ట్రంలోని బీసీ, ఈబీసీ, మైనారిటీ, వికలాంగ విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయింది.

ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాలు తాము తీసుకుంటున్న ఫీజులు తమ ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతనాలకు, వసతుల నిర్వహణకు సరిపోవడం లేదని, కన్వీనర్ కోటాలో ఫీజులు పెంచవలసిందిగా 2010లో హైకోర్టుకు వెళ్లారు. ఈ విషయంపై హైకోర్టు తీర్పునిస్తూ, కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటాలకు విడివిడిగా ఫీజులు కాకుండా విద్యార్థులందరికీ ఒకే విధమైన ఫీజు వుండాలనీ, కాలేజీల్లో కల్పించే వసతి సౌకర్యాలు, వుద్యోగులకు చెల్లించే వేతనాల ఆధారంగా కళాశాలవారీగా, కోర్సుల వారీగా ఫీజులుండాలని ఆదేశించింది.

దీనిని నిలుపుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ, సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును సమర్థించింది.

**కామన్ ఫీజు విధానం:** ఇంటర్ మీడియట్ చదువు పూర్తి అయిన తర్వాత వృత్తి విద్యా కోర్సులు చదవాలనుకునే విద్యార్థులు, ఎంసెట్ అనే కామన్ ఎంట్రన్స్ పోటీ పరీక్ష రాసి, ర్యాంకుల ఆధారంగా ఇంజనీరింగ్, మెడిసిన్, బీ ఫార్మసీ లాంటి వృత్తి విద్యా కోర్సులు చదవడానికి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో చేరుతారు. ప్రైవేటు కాలేజీలలో 70 శాతం సీట్లు కన్వీనర్ కోటా కింద వుంటాయి. 30 శాతం మేనేజ్‌మెంట్ కోటా కింద వుంటాయి. కన్వీనర్ కోటాలో వుండే 70 శాతం సీట్లను ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా కేటాయిస్తారు. మిగతా 30 శాతం సీట్లను ర్యాంకులతో సంబంధం లేకుండా మేనేజ్‌మెంట్ తమ ఇష్టానుసారం అమ్ముకుంటారు. ఇంజనీరింగ్ కాలేజీలలో కన్వీనర్ కోటా కింద ఇచ్చే ఒక్కొక్క సీటుకు ఇప్పటిదాకా సంవత్సరానికి 31 వేల రూపాయల చొప్పున ఫీజు చెల్లించవల్సి వచ్చేది. మేనేజ్‌మెంట్ కోటాలో ఒక్కొక్క సీటుకు దాదాపు 90 వేల రూపాయల వరకు చెల్లించవల్సి వచ్చేది.

నూతనంగా హైకోర్టు, సుప్రీంకోర్టులు ఇచ్చిన తీర్పు ప్రకారం కామన్ ఫీజు లేదా ఏకీకృత ఫీజు అమలు చేయడమంటే ఇక నుండి రెండు రకాల కోటాలు, రెండు రకాల ఫీజులు వుండవు. అన్ని సీట్లను కలిపి సరాసరి ఫీజును నిర్ణయిస్తారు. దీని ప్రకారం ఈ సంవత్సరం ఫీజు 50,200 నుండి 1 లక్ష రూపాయల వరకు వుంటుంది. ఈ విధానం ప్రకారం మంచి ర్యాంకులు పొందిన విద్యార్థులూ, మంచి ర్యాంకులు పొందకుండానే డబ్బులు కట్టి సీట్లు కొనుక్కోగలిగిన విద్యార్థులు ఒకే రకమైన ఫీజులు చెల్లించాల్సి వుంటుంది. దీని వలన పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇక నుండి వృత్తి విద్యా కోర్సులు మరింత భారమవుతాయి. ఇలా సర్కారు పేదల పొట్ట కొట్టి ధనికులకు పెడుతున్నది. అదే విధంగా అంతంత మాత్రపు ప్రమాణాలతో నడుస్తున్న దాదాపు 330 కాలేజీ యాజమాన్యాలకు ఈ విధానం మరింత లాభదాయకంగా వుంటుంది.

**ఫీజు రీ యింబర్స్‌మెంట్:** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వికలాంగ విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలలో చెల్లిస్తున్న ఫీజును ప్రభుత్వం తిరిగి విద్యార్థులకు చెల్లించే విధానాన్ని ఫీజు రీ యింబర్స్‌మెంట్ అంటారు. 2004కు ముందు దీనిని ప్రభుత్వం బోధనా ఫీజులు, స్కాలర్‌షిప్, మెస్‌ఛార్జీలు రూపంలో ఇచ్చేది.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని ప్రపంచంలోని అనేక దేశాలలో కూడా వివిధ పద్ధతులలో అమలు చేస్తున్నారు. కొన్ని దేశాలలో ప్రభుత్వాలే విద్యాలయాలను స్థాపించి ఉచిత విద్యనందిస్తున్నాయి. మరికొన్ని దేశాలు విద్యాలయాలు స్థాపించుకోవడానికి ప్రైవేట్ వారికి కూడా అవకాశాలు కల్పిస్తున్నది. మన దేశంలో మిశ్రమంగా ఈ రెండు పద్ధతులు అవలంబించబడుతున్నాయి.

భారతదేశం ఆర్థికంగా వెనుకబడిన దేశం. అసమాన అంతరాలతో కూడుకున్నది. నూటికి 85 శాతం దళితులు, ఆదివాసులు, బీసీలుగా వున్న పేదవారు. 15 శాతం భూస్వాములు, పెట్టుబడిదారులుగా వున్న ధనవంతులు. పేదవారిని ధనవంతులు అణచిపెడుతూ, వారికి విద్యను అందకుండా జేస్తున్నారు. కాబట్టి భారత రాజ్యంగం, సంఘ సంస్కర్తలు పోరాడి పేద విద్యార్థులందరికీ చదువు అందుబాటులో వుండాలని రాజ్యాంగంలో కొన్ని హక్కులు కల్పించారు. దీని మూలంగా విద్యారంగంలో పీడిత వర్గాలకు కొన్ని రిజర్వేషన్లు, స్కాలర్ షిప్పులు తదితర సౌకర్యాలు కల్పించబడ్డాయి.

కాని వాటి అమలు కోసం విద్యార్థులు నిరంతరం పోరాడవల్సే వస్తున్నది. పాలకవర్గాలు తమ ప్రయోజనాల కోసం విద్యార్థుల జీవితాలను బలిపెడుతున్నాయి. ఫీజు రీ యింబర్స్‌మెంట్ పథకాన్ని ఒక సంక్షేమ కోణం నుండి చూడకుండా వాటి లాభాల కోణం నుండే చూస్తున్నాయి. గతంలో కూడా ప్రభుత్వం ఫీజులను తిరిగి చెల్లించేది. అయితే దానికి కొంత పరిమితి వుండేది. ఎస్సీ, ఎస్టీలకు కేంద్రమే చెల్లించేది. బీసీలకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేది. అది కూడా పరిమిత సంఖ్యలోని విద్యార్థులకే చెల్లించేది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన ఓటు బ్యాంకును పెంచుకోవడం కోసం 2009 ఎన్నికల సమయంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతో పాటు, బీసీ, ఈబీసి, మైనారిటీ, వికలాంగ విద్యార్థులందరికీ మొత్తం ఫీజును తిరిగి చెల్లిస్తామని చెప్పి ఫీజు రీ యింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టాడు. తెల్లకార్డు వున్న ప్రతి విద్యార్థి అర్హుడే అని ప్రకటించాడు. మారిన రాజకీయ నేపథ్యంలో తిరిగి ప్రభుత్వమే ఈ పథకాన్ని వుపసంహరించడానికి సిద్ధపడింది. దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన నాటి నుండి విద్య సామాన్యులకు అందని ద్రాక్షగానే మిగిలింది. ఉచిత విద్యా హక్కు గాలిబుడగలా పేలిపోయింది.

# అసోంలో బాలికపై 'మృగాల' దాడి

మహిళలపై నిరంతరం జరిగే దారుణ కృత్యాల గురించి విని, చూసి, తెలుసుకొని మన మెదళ్లు ఎప్పుడో మొద్దుబారినయ్. అయినప్పటికీ అసోంలో ఒక బాలికపై జరిగిన దాడి ఘటన మొద్దుబారిన మన మెదళ్లను సైతం షాక్‌కు గురిచేసింది.

అసోం రాజధాని గౌహతిలోని క్రిష్టియన్ బస్తీ ఏరియాలో రద్దీగా వుండే కూడలి వద్ద జూలై 9వ తేదీ సాయంత్రం ఈ సంఘటన జరిగింది. స్నేహితురాలి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనడం కోసం పబ్‌కు వెళ్లి, తిరిగి వస్తున్న పదకొండో తరగతి చదువుతున్న పదహారు, పదిహేడేళ్ల బాలికపై, 20-25 ఏళ్ల వయసులోని దాదాపు ఇరవై మంది యువకులు అత్యంత హేయంగా దాడి చేశారు. పత్రికల కథనాల ప్రకారం ఒంటరిగా వస్తున్న ఆ బాలికపై పోకిరీలు అసభ్యకరమైన వ్యాఖ్యానాలు చేశారు. దానికి ఆమె తీవ్రంగా అభ్యంతరం చెప్పింది. తామేం వాగినా అమ్మాయిలు తలవంచుకొని పోవాలని ఆశించే ఆ పోకిరీలు ఆ అమ్మాయి అభ్యంతరం చెప్పడాన్ని జీర్ణించుకోలేక పోయారు. వాళ్లలోని పురుషాధిక్యతా భావజాలం బుసలు కొట్టింది. దాంతో ఆ అమ్మాయి మీద వికృతంగా పడిపోయారు. ఆమె బట్టలు చింపేశారు. ఆమె శరీరంతో చెప్పరాని రీతిలో వ్యవహరించారు. లైంగికంగా కూడా అత్యాచారయత్నం చేశారు. వదిలేయమంటూ ఆ అమ్మాయి వేడుకుంటున్న కొద్దీ ఆ మూక మరింత రెచ్చిపోయింది. 40 నిమిషాల పాటు సాగిన ఈ దారుణ కృత్యానికి చుట్టూ మూగిన వందలాది జనం వినోదాన్ని చూసే ప్రేక్షకులుగా మారారు. ఆ ప్రేక్షకుల్లో వున్న ఒక టీవీ ఛానెల్‌కు చెందిన ఇద్దరు ప్రతినిధులు ఆ వికృత దృశ్యాన్ని తమ కెమెరాతో చిత్రీకరించారు. సినిమాల్లో క్లైమాక్స్‌లో మాత్రమే సీన్‌లోకి ప్రవేశించినట్టుగా 40 నిమిషాల తర్వాత పోలీసులు రంగప్రవేశం చేయడంతో మూక పారిపోయింది. మీడియా చిత్రీకరించిన దాన్ని టీవీల్లో ప్రసారం చేయడమే కాక, యూట్యూబ్‌లోనూ పెట్టడం వల్ల ఈ దారుణం ప్రపంచం దృష్టికి వచ్చింది.

---

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలకు ప్రభుత్వం అనుమతులు ఇస్తూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నది. ఒకవైపు ప్రైవేట్ దోపిడీ కొనసాగుతుండగానే మరోవైపు కామన్ ఫీజు, రీ యింబర్స్‌మెంట్ ఎత్తివేత లాంటి నిర్ణయాలు చేస్తూ విద్యార్థులపై తలకు మించిన భారాన్ని వేస్తున్నది.

సుప్రీంకోర్టు ప్రకటన తర్వాత, ప్రభుత్వం తన దివాళాకోరు వైఖరిని బహిర్గతం చేస్తూ, గతంలో వున్న ఫీజులనే తిరిగి చెల్లిస్తామని, ప్రస్తుతం కామన్ ఫీజు విధానం వల్ల పెరుగుతున్న ఫీజులను విద్యార్థులే భరించాలని ప్రకటించింది. కనీసం వికలాంగ విద్యార్థులకు కూడా ఎటువంటి మినహాయింపు ఇవ్వడం లేదు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని దాదాపు 6 లక్షల మంది పేద విద్యార్థులపై ఏటా 350 కోట్ల భారం పడనుంది. లక్షల మంది విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోతాయి. ప్రస్తుతం కళాశాలల్లో అంతంత మాత్రంగానే వున్న పేద విద్యార్థుల శాతం మరింతగా తగ్గుతుంది.

మరోవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం దుర్వినియోగం అవుతుంది కాబట్టి కొనసాగించడం లేదని ప్రభుత్వం చెబుతున్నది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో అనేక అవకతవకలు వున్నప్పటికీ అది పేద విద్యార్థులకు కొంతమేరకైనా ఉపయోగపడుతుంది. తినడానికి సరిపడా తిండిలేని కుటుంబాలు కొన్నైనా తమ బిడ్డలకు విద్యను అందించగలుగుతున్నాయి. వీరి గురించి ఆలోచించకుండా, అవినీతిని అరికట్టకుండా పథకాన్ని పూర్తిగా ఎత్తివేయడమనేది ఎలుకల కోసం ఇళ్లు కాల్చుకున్న చందంగా వుంటుంది. దీనివలన పేద విద్యార్థులను విద్యకు మరింత దూరం చేసి వారిని సమాజం నుండి మరింత వెనక్కి నెట్టడమే అవుతుంది.

ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు, బడా కాంట్రాక్టర్లకు సెజ్‌ల పేర, వేలాది ఎకరాల భూమిని ఉచితంగా యిస్తూ, సంక్షోభాల పేరిట పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడిదారులకు లక్షలాది రూపాయల ప్యాకేజీలను ప్రకటిస్తూ పేద విద్యార్థులకు విద్యను అందించడానికి మాత్రం ససేమిరా అంటున్నది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మాత్రం కోతను విధించడం లేదన్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నది. కానీ ఎస్సీ ఎస్టీలకు కేంద్ర ప్రభుత్వమే ఫీజులు తిరిగి చెల్లిస్తున్నది. అలాగే బీసీ విద్యార్థులకు బ్యాంకు రుణాలు తీసుకోవచ్చని వుచిత సలహాలు ఇస్తున్నది. దేశంలో రైతులు, చేనేత కార్మికులు బ్యాంకు రుణాలు అందక ఆత్మహత్యలు చేసుకుంటున్న సంగతి తెలిసి కూడా ఇలా చెప్పడమంటే విద్యార్థులను మాయ చేయడమే.

పెరిగిన ఫీజులను తగ్గించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ కొనసాగించాలని వివిధ విద్యార్థి సంఘాలు, కుల సంఘాలు ఆందోళనలు చేస్తున్నాయి. ప్రభుత్వం అన్ని వుద్యమాలను అణచివేసినట్టుగానే ఈ వుద్యమాలను కూడా అణచివేస్తున్నది. విద్యార్థులను అక్రమ అరెస్టులు చేసి, జైళ్ల పాలు చేస్తున్నది.

విద్యార్థులారా! నూతన ఆర్థిక విధానాల్లో భాగంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి. శాస్త్రీయ విద్యా విధానానికై పోరాడాలి. సమాజంలో అసమానతలు వున్నంతవరకు ఈ విద్యా విధానంలో కూడా అసమానతలు వుంటాయి. కాబట్టి సమాజాన్ని మార్చడంలో మీ వంతు బాధ్యతను నెరవేరుస్తూ సమస్యల పరిష్కారానికి మరింత మిలిటెంట్‌గా పోరాడాలి. విద్యార్థులు చేసే పోరాటాలకు ప్రజలు, ప్రజా సంఘాలు తమ పూర్తి మద్దతునివ్వాలి.

★

మనం ఇప్పటికి ఎన్నో అత్యాచార గాథలను వినే వున్నాం. అయితే ఇలా బహిరంగంగా అందరూ గుమికూడి వుండగా అత్యాచారాలు చేయడం అరుదు. రాజ్య ప్రేరేపిత దాడుల్లో, మతోన్మాద దాడుల్లో తప్ప సాధారణ పోకిరీలు ఇంతగా బరితెగించడం వుండదు. మీడియా వాళ్లు చిత్రీకరిస్తున్నారని తెలిసి కూడా పోజులిస్తూ మరీ ఈ వికృత చర్యకు పాల్పడ్డారంటే వాళ్లలో పితృస్వామ్య భావజాలం ఏ స్థాయిలో కరడుకట్టుకొని పోయిందో అర్థం చేసుకోవచ్చు. మహిళలను ఎప్పుడైనా, ఎక్కడైనా, ఏమైనా చేసే అధికారం పురుషులకు వుందని వాళ్లు భావించడం వల్లనే ఇంతగా తెగించగలిగారు.

ఇకపోతే 40 నిమిషాల పాటు తమ కళ్ల ముందు ఒక దారుణ సంఘటన జరుగుతుంటే చుట్టూ చేరిన జనం తమకేమీ పట్టనట్టు వుండడం కూడా చాలా ఆందోళనాకరమైన విషయం. ఈ అత్యాచారం చేసిన వాళ్లు సాయుధ గూండాలు కారు. పోలీసులు అసలే కారు. 20, 25 ఏండ్ల ఓ ఇరవై మంది యువకులను వందల మంది జనం ఎదిరించి ఈ దారుణాన్ని ఆపడం కష్టమైన విషయమేమీ కాదు. కానీ ఎవరూ ఆ పని చేయలేదు. పైగా కొందరు ఆ మూకలో చేరి తామూ వికృతానందాన్ని పొందారనీ, మరి కొందరు తమ సెల్ ఫోన్లతో వీడియోలు తీశారనీ తెలుస్తున్నది. ఇక మీడియా వాళ్లు ఇలాంటి సంచలనాల కోసమే కాచుకుని వుంటారు కనుక వాళ్ల 'వృత్తి ధర్మం' నిర్వర్తించారు.

ఆ అమ్మాయి పబ్‌కు వెళ్లి తిరిగి వస్తున్నది కనుక, అమ్మాయిలు పబ్‌లకు వెళ్లడం పట్ల వుండే వ్యతిరేకత వల్ల అందరూ పట్టనట్టుగా వుండిపోయారనే ఒక అభిప్రాయం ప్రచారంలోకి వచ్చింది. ఆ పోకిరీలు కూడా పబ్‌కు వెళ్లే అమ్మాయిలకు బుద్ధి చెప్పడానికే అలా చేశారని కూడా పత్రికలు రాశాయి. పబ్‌లకు వెళ్లడం అనేది వికృత సంస్కృతే. పదహారేళ్ల పిల్లలు ఇటువంటి సంస్కృతికి అలవాటు పడడం తీవ్రంగా ఆందోళన పడాల్సిన విషయమే. కానీ ఇటువంటి సంస్కృతిని రుద్దుతున్నది ఎవరు? పాలకులు కాదా? రోజు రోజుకూ సామ్రాజ్యవాదానికి సాగిలాపడుతున్న మన దేశ దళారీ పాలకులు ఇటువంటి సామ్రాజ్యవాద సంస్కృతికి రెండు చేతులా స్వాగతం చెబుతున్నారు. పల్లె, పట్టణాలు అనే తేడా లేకుండా ఈ సంస్కృతి దేశవ్యాప్తంగా వ్యాపించడానికి అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నారు. ఈ సంస్కృతికి ప్రజలను, ముఖ్యంగా యువతను బలిచేస్తున్నారు. మహిళల మీద రోజు రోజుకూ పెరుగుతున్న అత్యాచారాలు, హింసలకు కూడా సామ్రాజ్యవాద సంస్కృతే ప్రధాన కారణం. మరి ఇటువంటి సంస్కృతిని పెంచి పోషిస్తున్న వాళ్లను వదిలేసి, దానికి బలవుతున్న వాళ్లపై దాడి చేయడం అర్థ రహితం. నిజానికి ఈ వ్యతిరేకత పబ్‌ల పట్ల కంటే కూడా, ఆ పబ్‌లకు మహిళలు వెళ్లడం పట్లనే. మహిళ పబ్‌లకు వెళ్లి తాగి చిందులెయ్యడం చట్ట ప్రకారం నేరం కాకపోయినా, సమాజం అనే బోనులో మాత్రం ఆమె దోషి. కానీ పురుషులు పబ్‌లలోనే కాదు నడిరోడ్డు మీద కూడా తాగి చిందులేయవచ్చు. వాళ్లకు ఏ నిషేధాలు లేవు. సాంప్రదాయాలనూ, సంస్కృతిని కాపాడాల్సిన భారాన్ని పితృసామ్య సమాజం మహిళల నెత్తి మీదనే పడేస్తుంది. వాళ్ల నడవడికను అనుక్షణం పితృస్వామ్యం నియంత్రించాలని చూస్తుంది. ఒక విచిత్రమైన విషయం ఏమిటంటే మన దేశంలో మద్యాన్ని వ్యతిరేకిస్తున్న వారిలో అత్యధికులు మహిళలే. వాళ్లు మద్య నిషేధం కోసం పోరాటాలు కూడా చేస్తున్నారు. అలా పోరాడుతున్నందుకు వాళ్ల వీపులపై లాఠీలు మోగుతున్నాయి. చిత్రహింసలు, అరెస్టులు, జైలు శిక్షలు అన్నింటినీ ఎదుర్కొంటున్నారు. అంటే మహిళలు మద్యం వద్దన్నా, మద్యం తాగినా సహించలేని విషయమే అవుతున్నది.

ఈ ఘోర కృత్యం జరిగింది రాష్ట్ర రాజధాని గౌహతిలో. అది కూడా సచివాలయానికి, పోలీసు స్టేషన్‌కు కిలోమీటర్ దూరంలోనే. జరుగుతున్న ఘోరాన్ని ఆపాలనుకునే వారు కొందరైనా వుంటారు కనుక ఎవరో ఈ విషయాన్ని ఫోన్ ద్వారా పోలీసులకు తెలియజేశారు. అయితే అయిదు నిమిషాల్లో రాగలిగి వుండి కూడా పోలీసులు అరగంట దాటాక వచ్చారు. ఈ ఆలస్యాన్ని ప్రశ్నించిన విలేకరులతో రాష్ట్ర డీజీపీ "పోలీసులు ఏటీఎం మిషన్లలాంటి వారు కారు, కార్డు పెట్టగానే డబ్బు వచ్చినట్లు నేరం జరగ్గానే అక్కడ వుండలేరు" అని నిస్సిగ్గుగా వ్యాఖ్యానించాడు. ఆలస్యంగానైనా సంఘటనా స్థలానికి వచ్చి కూడా పోకిరీలందరికీ పారిపోయే అవకాశం ఇచ్చారు గానీ పోలీసులు ఒక్కరిని కూడా పట్టుకోలేక పోయారు.

మన దేశంలో మహిళలపై అత్యాచారాలు రోజు రోజుకూ పెరిగిపోతూనే వున్నాయి. మహిళపై అఘాయిత్యాల విషయంలో అసోం దేశం మొత్తంలోనే రెండో స్థానంలో వుందని జాతీయ నేర రికార్డుల సంస్థ ఇటీవల పేర్కొంది. మహిళను లైంగిక వస్తువుగా చూసే దృక్పథం మారనంత వరకూ ఈ అత్యాచారాలకు అంతం వుండదు. ఒకవైపు పాలకులు మహిళా సాధికారత, మహిళా స్వాతంత్ర్యం అంటూ ఆకర్షణీయమైన మాటలు వల్లిస్తున్నారు. మరోవైపు మహిళల పట్ల సమాజ దృక్పథం కించిత్తు కూడా మారడం లేదు. కేవలం కల్లబొల్లి మాటలతో, ప్రచారార్భాటాలతో మహిళల సమస్యలు పరిష్కారం కావు. మహిళల సమస్యల పరిష్కారానికి సమాజంలో మౌలికమైన మార్పులు జరగాలి.

మహిళల మీద అమలవుతున్న సమస్త పీడనలకు మూలాలు దోపిడీ సమాజంలోనే వున్నాయి. కనుక తమ మీద జరుగుతున్న సమస్త పీడనలను తొలగించుకోవడానికి మహిళలు దోపిడీ సమాజానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సగభాగం కావాలి. అప్పుడే వాళ్లు నిజమైన సాధికారత, స్వతంత్రతలను పొందగలరు.

★

**మహిళపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా బలమైన మహిళా వుద్యమాన్ని నిర్మిద్దాం!**

*బోల్షివిక్ పార్టీ చరిత్ర నుండి...*

# స్టోలోపిన్ అభివృద్ధి నిరోధక కాలంలో బోల్షివిక్కులు స్వతంత్ర మార్క్సిస్టు

***స్టోలోపిన్ అభివృద్ధి నిరోధం - ప్రతికూల మేధావివర్గంలో శిథిలత-క్షీణత-పార్టీ మేధావులలో కొంత భాగం, మార్క్సిజానికి శత్రువులైన వారిలోకి జారిపోవడం - మార్క్సిస్టు సిద్ధాంతాన్ని కుసంస్కరించే ప్రయత్నం. "భౌతికవాదం-అనుభవవాద విమర్శ" (మెటీరియలిజం అండ్ ఎంప్రియో-క్రిటిసిజం) అనే గ్రంథంలో సిద్ధాంత కుసంస్కర్తలను (రివిజనిస్టులను) లెనిన్ ఖండించుట-మార్క్సిస్టు పార్టీ సిద్ధాంతపు పునాదులను లెనిన్ సమర్థించడం.***

1907 జూన్ మూడవ తేదీన జార్ ప్రభుత్వం తన రెండవ డ్యూమాను రద్దు చేసింది. ఇది చరిత్రలో "జూన్ మూడు తిరుగుబాటు" (కూప్)గా వర్ణించబడింది. ప్రభుత్వపు మూడవ డ్యూమా ఎన్నికల విషయమై ఒక కొత్త చట్టాన్ని జార్ ప్రభుత్వం ప్రకటించింది. డ్యూమా అనుమతితోనే కొత్త చట్టాలను ప్రకటించాలి అని చెప్పిన తన 1905 అక్టోబర్ 17 నాటి ప్రణాళికను తానే వుల్లంఘించింది. ప్రభుత్వపు రెండవ డ్యూమాలోని సోషల్-డెమోక్రటిక్ గ్రూప్‌ను కోర్టులో విచారణ చేసింది. కార్మికవర్గ ప్రతినిధులను కఠినశిక్షలకు, ప్రవాసశిక్షలకు గురిచేసింది. డ్యూమాలో భూస్వాముల, వ్యాపార, పారిశ్రామిక, బూర్జువా ప్రతినిధుల సంఖ్య తగినంత హెచ్చేటట్లు ఎలక్షన్ చట్టం తయారు చేయబడింది. అంతేగాక అసలే తక్కువగానున్న కార్మికుల, రైతుల ప్రాతినిధ్యం మునుపటి దానిలో కొద్దిభాగమే అయ్యేటట్లు తగ్గించబడింది. మూడవ డ్యూమాలో బ్లాక్ హండ్రెడ్స్, శాసనబద్ధ ప్రజాతంత్రవాదులు అధిక సంఖ్యాకులయ్యారు. మొత్తం 442 మంది ప్రతినిధులలోనూ 171 మంది కుడిపక్షం వారు (వీరినే బ్లాక్ హండ్రెడ్స్ అంటారు) 113 మంది అక్టోబరిస్టులు లేక వారి బంధువర్గ ముఠాలు, 101 మంది శాసనసభ ప్రజాతంత్ర వాదులు-వారి బంధువర్గ ముఠాలు, 13 మంది ట్రుడోవిక్ పక్షం వారు, 18 మంది సోషల్ డెమోక్రాట్లు వున్నారు.

కుడిపక్షం వారు (డ్యూమాలో కుడి పక్క బెంచీలపై కూర్చోవడం వల్ల వీరికాపేరు వచ్చింది) కార్మికులకు, రైతులకు ఘోర శత్రువులైన బ్లాక్ హండ్రెడ్స్ ఫ్యూడల్ భూస్వాముల ప్రతినిధులు. ఈ భూస్వాములు రైతు ఉద్యమాల్ని అణచివేసినప్పుడు రైతులను సామూహికంగా కొరడా దెబ్బలకు, తుపాకి కాల్పులకు గురిచేశారు. యూదులపై వేటను ప్రోత్సహించారు. విప్లవకాలంలో మీటింగులు జరిగిన ప్రదేశాలను అతి క్రూరంగా తగులబెట్టారు. ప్రదర్శనలుగావించే కార్మికులను చిత్రహింసలు పెట్టారు. కార్మిక ప్రజలను అతి నిర్దాక్షిణ్యంగా అణచివేయాలని, జార్‌కు అంతులేని అధికారాన్ని ఇవ్వాలని, వీరు కోరారు. 1905 అక్టోబర్ 17 నాటి జార్ ప్రణాళికకు వీరు వ్యతిరేకులు.

అక్టోబరిస్టు పార్టీ లేక అక్టోబర్ 17వ యూనియన్, డ్యూమాలో కుడిపక్షం వారికి చాలా సన్నిహితంగా వుండేది. పెద్దపెద్ద పారిశ్రామిక పెట్టుబడిదారుల ప్రయోజనాలకూ, పెట్టుబడిదారీ పద్ధతులపైన తమ ఎస్టేట్లను నడుపుతున్న పెద్ద భూస్వాముల ప్రయోజనాలకూ, అక్టోబరిస్టులు ప్రతినిధులు. (1905 విప్లవ ప్రారంభంలో శాసనబద్ధ ప్రజాతంత్ర పార్టీకి చెందిన పెద్ద భూస్వాములు చాలా మంది అక్టోబరిస్టులతో కలిసిపోయారు) కుడిపక్షం వారికి, అక్టోబరిస్టులకు వున్న విభేదాల వల్ల, అక్టోబరిస్టులు అక్టోబర్ 17 నాటి ప్రణాళికను మాటలలోనైనా అంగీకరించడం మాత్రమే. అక్టోబరిస్టులు జార్ ప్రభుత్వపు స్వదేశీ, విదేశీ రాజనీతిని పూర్తిగా సమర్థించారు.

మొదటి రెండు డ్యూమాలలో కంటే మూడవ డ్యూమాలో శాసనబద్ధ ప్రజాతంత్ర పార్టీకి చాలా తక్కువ స్థానాలు లభించాయి. దీనికి కారణం, భూస్వాముల ఓట్లలో కొంత భాగం శాసనబద్ధ ప్రజాతంత్రవాదులకు బదులుగా అక్టోబరిస్టులకు పోవడం.

మూడవ డ్యూమాలో ట్రుడోవిక్ అనే పెటీ-బూర్జువా ప్రజాతంత్రవాదుల చిన్న ముఠా ఒకటి వుంది. వారు శాసనబద్ధ ప్రజాతంత్రవాదులకు, కార్మిక ప్రజాతంత్రవాదులకు (బోల్షివిక్కులు) మధ్య వూగిసలాడారు. డ్యూమాలో ట్రుడోవిక్ చాలా బలహీన పక్షమైనప్పటికీ వారు జనసామాన్యానికి, అనగా రైతాంగ జనసామాన్యానికి ప్రాతినిధ్యం వహించారని లెనిన్ తెలియజేశాడు. శాసనబద్ధ ప్రజాతంత్రవాదులకూ కార్మిక ప్రజాతంత్రవాదులకూ మధ్య వూగిసలాడడం ట్రుడోవిక్‌కి సహజమే. ఎందువల్లనంటే చిన్నచిన్న ఆస్తిదారుల వర్గ పరిస్థితి మూలంగానే ఆ వూగిసలాట సంభవిస్తుంది. "పెటీ బూర్జువా ప్రజాతంత్రవాదులకు సహాయం చేయవలసిన కర్తవ్యాన్ని, లిబరల్స్ యొక్క పలుకుబడి నుండి వారిని బయటకు లాగవలసిన కర్తవ్యాన్ని కుడిపక్షం వారికి వ్యతిరేకంగానే కాకుండా విప్లవ ప్రతీఘాతకులకు, శాసనబద్ధ ప్రజాతంత్రవాదులకు వ్యతిరేకంగా కూడా ప్రజాతంత్ర శిబిరాన్ని సమీకరించవలసిన కర్తవ్యాన్ని బోల్షివిక్కు ప్రతినిధులకు, కార్మిక ప్రజాతంత్రవాదులకు

# మెన్షివిక్కులు - బోల్షివిక్కులు పార్టీగా తయారగుట - 1

**(1908-12)**

లెనిన్ నిర్దేశించాడు. (లెనిన్-సెలెక్టెడ్ వర్క్స్-ఇంగ్లీష్ ఎడిషన్-మాస్కో-1947, 1వ వాల్యూం 535వ పేజి)

1905 విప్లవకాలంలో ముఖ్యంగా అది అపజయం పొందిన తర్వాత శాసనబద్ధ ప్రజాతంత్రవాదులు, విప్లవ ప్రతీఘాతక శక్తిగా మరింత బట్టబయలయ్యారు. "ప్రజాతంత్ర" మనే ముసుగును తొలగించుకొని రాచరికవాదులుగా, జార్ ప్రభుత్వాన్ని సమర్థించేవారుగా మాటిమాటికీ వారు ప్రవర్తించారు. 1909లో ప్రముఖ శాసనబద్ధ ప్రజాతంత్రవాదుల రచయితల ముఠా ఒకటి విఖీ(మెలురాళ్లు) అనే వ్యాస సంపుటిని ప్రకటించింది. విప్లవాన్ని అణచినందుకు, జార్‌ను బూర్జువా తరపున వారు అభినందించారు. కొరడాలతో (నాట్), వురికంబాలతో పరిపాలించే జార్ ప్రభుత్వానికి యిచ్చకాలు పలుకుతూ, దాని దయాదాక్షిణ్యాలను దేబిరించుతూ, శాసనబద్ధ ప్రజాతంత్రవాదులు ఈ గ్రంథంలో సిగ్గు లేకుండా ఇలా అన్నారు: "ప్రజల ఆగ్రహాల నుండి మనలను (లిబరల్ బూర్జువాను) తన బాయొనెట్లతోను, జైళ్లతోను జార్ ప్రభుత్వం ఒక్కటే రక్షించుతూంది. అలాంటి ప్రభుత్వాన్ని మనం ఆశీర్వదించాలి".

ప్రభుత్వం రెండవ డ్యూమాను రద్దుపరచి, డ్యూమాలోని సోషల్ డెమొక్రటిక్ పక్షాన్ని వదిలించుకొని, జార్ ప్రభుత్వం శ్రామికవర్గానికి చెందిన ఆర్థిక, రాజకీయ సంఘాలను నాశనం చేయడం ప్రారంభించింది. కాన్విక్ట్ జైళ్లు, కోటలు, ప్రవాస ప్రదేశాలు విప్లవకారులతో పూర్తిగా నిండిపోయాయి. ప్రభుత్వం వారిని జైళ్లలో క్రూరంగా కొట్టి, బంధించి, నానా చిత్రహింసలు పెట్టింది. బ్లాక్-హండ్రెడ్స్ హింసాకాండ అడ్డూ, ఆపు లేకుండా విజృంభించింది. జార్ మంత్రి అయిన స్టోలోపిన్ దేశమంతటా వురికంబాలు నెలకొల్పాడు. వేలకొలది విప్లవకారులు వురితీయబడ్డారు. ఆ రోజుల్లో వురికంబాలను "స్టోలోపిన్ నెక్‌టై"లని పిలిచేవారు.

రైతుల, కార్మికుల విప్లవోద్యమాన్ని అణచే ప్రయత్నాలలో జార్ ప్రభుత్వం నిర్బంధ విధానం, ప్రతీకార శిక్షలు, కాల్పులు, జైళ్లు, కఠినశిక్షలు మొదలగు వాటితోనే సంతృప్తి పడలేదు. "చిన్నతండ్రి జార్" (రష్యాలో పెద్ద తండ్రి దేవుడు, చిన్నతండ్రి జార్ చక్రవర్తి అని పిలవడం కద్దు-అనువాదకుడు) అంటే రైతులకున్న నిర్వ్యాజమైన విశ్వాసం క్రమంగా అంతర్థానమై పోతున్నదని గ్రహించి ఆందోళన పడసాగింది. ఒక పెద్ద కుట్రచేయ పూనుకుంది. గ్రామసీమలో తనకు దృఢమైన అండను నిర్మించుకోవాలని భావించింది. గ్రామీణ బూర్జువా అనే పెద్దవర్గం అంటే కులక్‌వర్గమే. అలాంటి అండను ఇవ్వగల వర్గం.

1906 నవంబర్ 9వ తేదీన స్టోలోపిన్ ఒక కొత్త వ్యవసాయ చట్టాన్ని ప్రకటించాడు. దీనివలన రైతులు కమ్యూన్‌లను (సాముదాయక భూములు) వదిలి, ప్రత్యేకంగా వ్యవసాయ క్షేత్రాలను ఏర్పరచుకొనే అవకాశం కలిగింది. స్టోలోపిన్ వ్యవసాయ చట్టం సాముదాయకంగా భూమిని అనుభవించే పద్ధతిని భగ్నం చేసింది. సాముదాయక భూముల నుండి విడిపోయి, తమ భాగాలను స్వంత ఆస్తిగా స్వాధీనం చేసుకోవలసిందని రైతులను ప్రోత్సహించింది. తమ భాగాలను యిప్పుడు రైతులు అమ్ముకోవచ్చు. పూర్వం అలా అమ్ముకోనిచ్చేవారు కాదు. రైతు సంఘాన్ని (కమ్యూన్‌ను) వదిలి వెళ్లినప్పుడు అది అతనికి ఏకఖండ భూమిని (రష్యన్ భాషలో ఖుతార్, ఓట్రుల్ అని పిలిచేవారు) యిచ్చి తీరాలి.

ఇప్పుడు ధనిక రైతులు (కులక్‌లు), పేద రైతుల భూమిని తక్కువ ధరలకు కొనుక్కొనే అవకాశం లభించింది. ఈ చట్టం ప్రకటించిన కొన్ని సంవత్సరాలకే పది లక్షలకు పైగా రైతులు తమ భూమినంతా పోగొట్టుకుని, సర్వనాశనం అయ్యారు. పేద రైతులు తమ భూమిని పోగొట్టుకున్న కొలదీ కులక్‌ల భూఖండాల సంఖ్య పెరిగింది. జీతమిచ్చి కూలీలను-వ్యవసాయ కూలీలను పెద్ద పెట్టున నియమించే శాశ్వత ఎస్టేట్లుగా కొన్ని సందర్భాలలో ఇవి మారాయి. ప్రభుత్వం గ్రామ సంఘాల (కమ్యూన్)లోని మంచి భూమిని కులక్ రైతులకు ఇచ్చే విధంగా రైతులను ఒత్తిడి చేసింది.

రైతుల "విమోచన" కాలంలో భూస్వాములు వారి భూములను కొల్లగొట్టారు. ఇప్పుడు కమ్యూన్‌ల నుండి వారి భూమిని కులక్‌లు కొల్లగొట్టసాగారు. కమ్యూన్‌లలోని మంచి ప్లాట్‌లను కాజేయడమేగాక పేద రైతుల భూములను తక్కువ ధరలకు కొనివేశారు.

భూములు కొనేందుకు, వ్యవసాయ సరంజామాకు జార్ ప్రభుత్వం కులక్‌లకు పెద్దపెద్ద రుణాలను యిచ్చింది. కులక్‌లను చిన్న భూములుగా తయారు చేసి, జార్ నిరంకుశ ప్రభుత్వాన్ని విశ్వాసంతో సంరక్షించే వారిగా వారిని తయారు చేయాలని స్టోలోపిన్ వాంఛించాడు.

1906-15 సంవత్సరాల మధ్య అంటే 9 ఏండ్ల లోపుననే 20 లక్షల కుటుంబాలు గ్రామ సంఘాలను (కమ్యూన్‌లను) వదలివెళ్లాయి.

స్టోలోపిన్ విధాన ఫలితంగా చిన్న భూఖండాలు గల రైతుల స్థితి, పేద రైతుల స్థితి ఎన్నడూ లేనంత అధ్వాన్నస్థితికి మారింది. రైతాంగంలో వ్యత్యాసం మరింతగా స్పష్టంగాజొచ్చింది. కులక్ రైతులతో సాధారణ రైతులు ఘర్షణ పడసాగారు.

ఇంతేగాక జార్ ప్రభుత్వమున్నంతకాలం, భూస్వాముల శాసనబద్ధ ప్రజాతంత్రవాదుల ప్రభుత్వ ద్వ్యామా వున్నంత వరకు ఎస్టేట్ భూములను తాము స్వాధీనపరచుకోలేమని కూడా రైతులు గ్రహించసాగారు. కులక్ భూఖండాలు అధిక సంఖ్యలో ఏర్పడుతున్న రోజుల్లో (1907– 09) రైతు వుద్యమం తగ్గిపోజొచ్చింది. కాని త్వరలోనే 1910–1911 సంవత్సరాలలోను, ఆ తర్వాతను గ్రామ కమ్యూన్ సభ్యులకు, కులక్ రైతులకు మధ్య జరిగిన దెబ్బలాటల వల్ల కులక్ రైతులకు భూస్వాములకు వ్యతిరేకంగా రైతు వుద్యమం తీవ్రం కాజొచ్చింది.

విప్లవానంతరం పరిశ్రమలలో కూడా పెద్ద మార్పులు జరిగాయి. పరిశ్రమల కేంద్రీకరణ అనగా కొత్త పరిశ్రమల విస్తరణ, వృద్ధియగుచున్న శక్తివంతమైన పెట్టుబడిదారీ ముఠాల చేతులలోకి పరిశ్రమ కేంద్రీకరింపబడుట, చాలా త్వరితగతిని కొనసాగింది. 1905 విప్లవానికి పూర్వం కూడా పెట్టుబడిదారులు సంఘాలుగా ఏర్పడడం మొదలుపెట్టారు. తమ దేశంలో ధరలను పెంచి, ఆ విధంగా పొందిన లాభాలతో ఎగుమతి వర్తకాన్ని ప్రోత్సహించడమూ, తద్వారా విదేశాలలో తమ వస్తువులను తక్కువ ధరలకు డంప్‌చేసి (కొల్లలు కొల్లలుగా గుమ్మరించి) విదేశీ మార్కెట్లను స్వాధీనపరచుకోటమూ ఈ సంఘాల వుద్దేశ్యం. ఈ పెట్టుబడిదారీ సంఘాలు (గుత్త వ్యాపార సంఘాలు) ట్రస్టులని, సిండికేట్లని పిలువబడేవి. విప్లవానంతరం వాటి సంఖ్య మరింత పెరిగింది. పెద్ద బ్యాంకుల సంఖ్య కూడా హెచ్చింది. పరిశ్రమలలో వీటి పాత్ర కూడా హెచ్చింది. రష్యాలో విదేశీయుల పెట్టుబడి ప్రవాహం హెచ్చింది.

ఆ విధంగా రష్యాలోని పెట్టుబడిదారీ విధానం గుత్త వ్యాపార పెట్టుబడిదారీ విధానంగా పెద్ద పెట్టున మారజొచ్చింది. అనేక సంవత్సరాలుగా మందకొడిగా వున్న పరిశ్రమలు తిరిగి తలెత్తసాగాయి. బొగ్గు, లోహం, నూనె, పంచదార, టెక్స్‌టైల్స్ (బట్టలు) పరిశ్రమల వుత్పత్తి హెచ్చింది. ధాన్యం ఎగుమతి విస్తరించింది.

ఆ కాలంలో రష్యా పారిశ్రామికంగా కొంత అభివృద్ధి చెందినప్పటికీ, పశ్చిమ యూరప్‌తో పోల్చిచూస్తే అది యింకా వెనుకబడ్డ దేశమే. ఇంకా అది విదేశీ పెట్టుబడిదారుల పైననే ఆధారపడి వుంది. యంత్రాలను, యంత్ర సామాగ్రిని రష్యా వుత్పత్తి చేయడంలేదు. వాటిని విదేశాల నుండి దిగుమతి చేసుకొనేది. మోటారు పరిశ్రమగాని, రసాయనిక పరిశ్రమగాని, కృత్రిమ ఎరువులను తయారు చేసే పరిశ్రమలుగాని లేవు. ఆయుధోత్పత్తిలో గూడా యితర పెట్టుబడిదారీ దేశాలకంటే రష్యా వెనుకబడివుంది.

రష్యాలో లోహాల వినియోగం తక్కువ స్థాయిలో వుండడం దేశం వెనుకపడి వుండటాన్ని తెలియజేస్తుంది. ఈ విషయాన్ని పేర్కొంటూ లెనిన్ ఇలా అన్నాడు:

"రైతుల విమోచన" తర్వాత, రష్యాలో ఇనుము వినియోగం అయిదురెట్లు పెరిగింది. అయినప్పటికీ రష్యా కనీ విని ఎరుగని దరిద్రదేశం, వెనుకబడ్డ దేశం. దాదాపు ఆటవిక, అనాగరికదేశం. ఇంగ్లండ్‌లో నాల్గవవంతు, జర్మనీలో అయిదవవంతు, అమెరికాలో పదవవంతు మాత్రమే రష్యాకు ఆధునిక వుత్పత్తి సామాగ్రి వుంది". (లెనిన్, కలెక్టెడ్ వర్క్స్, రష్యన్ ఎడిషన్, 16వ వాల్యూమ్ 543వ పేజి)

ఆర్థికంగాను, రాజకీయంగాను రష్యా వెనుకబడి వుండటం వల్ల కల్గిన ప్రత్యక్ష ఫలితమేమంటే, రష్యన్ పెట్టుబడిదారీ వర్గమూ, జార్ ప్రభుత్వమూ రెండు కూడా పశ్చిమ యూరప్ పెట్టుబడిదారీ విధానంపై ఆధారపడవలసి వచ్చింది.

ఈ కింది విషయాల వల్ల ఆ విషయం స్పష్టం అవుతుంది. ముఖ్య పారిశ్రామిక విభాగాలయిన బొగ్గు, నూనె, విద్యుత్ పరికరాలు, లోహ పరిశ్రమ మొదలగునవి విదేశీ పెట్టుబడిదారుల చేతుల్లో వున్నాయి. తనకు కావలసిన యంత్ర సామాగ్రినంతా, పరికరాలన్నిటినీ విదేశాల నుండే రష్యా దిగుమతి చేసుకోవలసి వచ్చేది.

ఇంతేకాదు సంకెళ్లతో గూడిన విదేశీ రుణాలకు వడ్డీ చెల్లించే నిమిత్తం ఏటేటా ప్రజల నుండి కోట్లకొలది రూబుల్స్‌ను జార్ ప్రభుత్వం పిండుతుండేది.

"మిత్రమండలి"తో జార్ ప్రభుత్వం రహస్య ఒడంబడికలను చేసుకుంది. వీటి ప్రకారం, యుద్ధం వచ్చినప్పుడు బ్రిటిష్, ఫ్రెంచి పెట్టుబడిదారుల అత్యధికమైన లాభాలను రక్షించేందుకు సామ్రాజ్యవాద యుద్ధ రంగాలలో ''మిత్రమండలి''ని బలపరిచేందుకు, జార్ ప్రభుత్వం లక్షలాది తన సైన్యాలను పంపవలసి వుంది.

గ్రామ సైనికులు, పోలీసులు, జార్ ప్రభుత్వ గూఢచారులు, బ్లాక్‌హండ్రెడ్స్ గూండాలు, కార్మికవర్గంపై సాగించిన రాక్షస దౌర్జన్యకృత్యాలతో స్టోలోపిన్ అభివృద్ధి నిరోధక కాలం ముఖ్యంగా నిండి వుంది. కార్మికులను బాధించి, శిక్షించినది జార్ ప్రభుత్వ తాబేదారులొక్కరే కాదు. ఈ విషయంలో ఫ్యాక్టరీ యజమానులు, మిల్లు యజమానులు ప్రభుత్వానికి ఏమీ వెనుదీయలేదు. పరిశ్రమలు మందకొడిగా వుండి నిరుద్యోగం హెచ్చిన సంవత్సరాలలో కార్మికవర్గంపై వీరిదాడి ముఖ్యంగా మరింత తీవ్రమయింది. ఫ్యాక్టరీ యజమానులు ఒక్కుమ్మడిగా, లాకౌట్లు ప్రకటించారు. సమ్మెలలో ఉత్సాహంగా పాల్గొని పనిచేసిన వర్గ చైతన్యం గల కార్మికుల పేర్లతో "బ్లాక్‌లిస్టు"లను (దుష్ప్రవర్తన జాబితా) తయారు చేశారు. ఒకసారి ఆ జాబితాలో చేరిన వ్యక్తికి, ఆ ప్రత్యేక పారిశ్రామిక శాఖలో ఉత్పత్తిదార్ల సంఘానికి చెందిన ఏ కర్మాగారంలోనూ ఉద్యోగం దొరుకుతుందనే ఆశలేదు. 1908 నాటికే జీతాలు నూటికి 10 నుండి 15 వరకు కోసివేశారు. దినానికి

పనిచేసే గంటల పరిమితి 10 నుండి 12 వరకు పెంచబడింది. నెత్తురుపీల్చే జరిమానాల పద్ధతి తిరిగి తలయెత్తింది. 1905 విప్లవాపజయంతో, దానితోటి ప్రయాణీకులలో నైతిక పతనమూ క్షీణతా ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా మేధావులలో నైతిక పతన క్షీణతా ధోరణులు తలయెత్తాయి. విప్లవం వుచ్ఛస్థాయిలో వున్న కాలంలో బూర్జువా శిబిరం నుండి వచ్చిన తోటి ప్రయాణీకులు, స్టోలోపిన్ అభివృద్ధి నిరోధక కాలంలో పార్టీని విడిచిపోయారు. వారిలో కొందరు విప్లవశత్రు శిబిరంలో బహిరంగంగా చేరిపోయారు. మరికొందరు, అప్పటికి యింకా మిగిలియున్న, బహిరంగంగా పనిచేస్తున్న కార్మికవర్గ సంఘాలలో పాతుకుపోయారు. అలాచేరి శ్రామికవర్గాన్ని విప్లవమార్గం నుండి తప్పించడానికి ప్రయత్నం చేశారు. శ్రామికవర్గ విప్లవపార్టీని అపఖ్యాతిపాలు చేయసాగారు. విప్లవాన్ని వదిలి పారిపోయిన తోటి ప్రయాణీకులు, అభివృద్ధి నిరోధకుల దయాదాక్షిణ్యాలను సంపాదించడానికి, జార్ ప్రభుత్వంతో ఒడంబడిక చేసుకొని బతకడానికి ప్రయత్నించారు.

విప్లవం ఓడిపోవటాన్ని అదునుగా తీసుకొని ఎక్కువ స్వార్థపరులునూ, పిరికి పందలునూ అగు తోటి ప్రయాణీకులను గూఢచారులుగా జార్ ప్రభుత్వం తీసుకొంది. ఈ నమ్మక ద్రోహులయిన నీచులు జార్ గూఢచారి శాఖ తరపున (ఓఖ్రానా) కార్మికవర్గంలోకి, పార్టీ సంఘాలలోకి పోయి, లోపల నుండే గూఢచారి కార్యక్రమం చేస్తూ, విప్లవకారులకు ద్రోహం చేశారు. విప్లవ ప్రతీఘాతక దాడి సిద్ధాంత రంగంపైన కూడా సాగింది. ఫేషన్‌బుల్ రాతగాళ్ళ గుంపు ఒకటి బయలుదేరి మార్క్సిజాన్ని విమర్శించింది. దాన్ని "కూల్చివేశారు." వారు విప్లవాన్ని గేలిచేసి దూషించారు. ద్రోహాన్ని పొగిడారు. "వ్యక్తిత్వపూజ" అనే ముసుగు కింద వ్యభిచార అవినీతిని పొగిడారు.

తత్వశాస్త్రరంగంలో కూడా మార్క్సిజాన్ని "విమర్శించడానికి" కుసంస్కరించడానికి ప్రయత్నాలెక్కువయ్యాయి. సూడో-సైంటిఫిక్ థీరీలతో (కపట శాస్త్రీయ సిద్ధాంతం) కలిపివేయబడిన అనేకరకాల మత ధోరణులు కూడా తలెత్తాయి.

మార్క్సిజాన్ని విమర్శించడం ఫేషన్ అయిపోయింది.

ఈ పెద్ద మనుషులందరూ బహువేషధారులైనప్పటికీ, వారంతా ఒకే ఆశయానికి పాటుపడ్డారు. అది విప్లవం నుండి ప్రజలను మరలించటం.

పార్టీ మేధావి వర్గంలో ఒక భాగాన్ని సంశయవాదమూ (స్కెప్టిసిజమ్) పతనమూ ఆవరించాయి. వీరు తాము మార్క్సిస్టులమని అనుకొన్నా, ఎప్పుడూ మార్క్సిస్టు సిద్ధాంతానికి గట్టిగా అంటిపెట్టుకొని వుండలేదు. వారిలో బోగ్దనావ్, బాజరోవ్, లునాచర్స్కీ (1905 విప్లవంలో వీరంతా బోల్షివిక్కులతో చేతులు గల్పినవారు) యాష్కెవిచ్, వేలెంటినోవ్ (వీరు మెన్షివిక్కులు) మొదలగు రచయితలు వున్నారు. మార్క్సిస్టు సిద్ధాంతపు తత్వశాస్త్ర పునాదులపైన వారు ఒక్కసారిగా తమ విమర్శనాయుధాన్ని ప్రయోగించారు. అనగా గతితార్కిక భౌతికవాదానికి వ్యతిరేకంగాను, చారిత్రక విజ్ఞానపు ప్రధాన మార్క్సిస్టు సూత్రాలైన చారిత్రక భౌతికవాదానికి వ్యతిరేకంగాను, వారు తమ దాడిని సాగించారు. ఈ విమర్శ మామూలు విమర్శలాంటిదికాదు. ఈ విమర్శను బహిరంగంగాను, నియమబద్ధంగాను చేసేవారు కాదు. మార్క్సిజపు ప్రధాన సిద్ధాంతాలను "సమర్థించే" ముసుగుతో, మిషతో, కపటంగా యీ విమర్శను సాగించేవారు. వీరు అసలు విషయాల్లో మార్క్సిస్టులేనట. కాని మార్క్సిజాన్ని దాని కొన్ని ప్రధాన సూత్రాలను తోసివేసి, "అభివృద్ధి" చేయదలచుకున్నారట. వాస్తవంగా వీరు మార్క్సిజానికి ప్రతికూలురు. ఎందుచేతనంటే వీరు మార్క్సిస్టు సిద్ధాంతపు పునాదులనే కూలదోయ ప్రయత్నించారు. తాము మార్క్సిజానికి వ్యతిరేకులంకామని కపటంగా కల్లలాడినప్పటికీ, తాము మార్క్సిస్టులమంటూ రెండు నాల్కలతో ప్రవర్తించినప్పటికీ, వారు నిజానికి మార్క్సిజానికి వ్యతిరేకులే. పార్టీ అనుచరులను మోసగించి, వారిని తప్పుతోవ పట్టించడానికే యీ కపట విమర్శ చేయబడింది. ఇందులోనే దీని ప్రమాదం వుంది. మార్క్సిజం సిద్ధాంతపు పునాదులను భగ్నపరచదలచిన యీ విమర్శ కుటిలతరమైన కొలది పార్టీకి మరింత అపాయకరమైంది. ఎందువల్లనంటే విప్లవానికి వ్యతిరేకంగా, పార్టీకి వ్యతిరేకంగా అభివృద్ధి నిరోధకులు జరిపే సాధారణ దుష్ప్రచారంలో యిది కూడా మిళితమైంది. మార్క్సిజాన్ని వదిలిపారిపోయిన కొంత మంది మేధావులు ఒక కొత్త మతాన్ని స్థాపించాలని ప్రచారం చేసేదాకా పోయారు. వీరినే "భగవదన్వేషకులు" "భగవనిర్మాతలు" అని పిలిచేవారు. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని వదిలి పారిపోయిన స్వామి ద్రోహులకు తగు రీతిలో జవాబ్విడం, వారి ముఖాల నుండి ముసుగులను తొలగించి పూర్తిగా బట్టబయలు చేయడం, ఆ విధంగా మార్క్సిస్టు పార్టీ సిద్ధాంతపు పునాదులను సంరక్షించడం మార్క్సిస్టుల అత్యవసర కర్తవ్యమయింది.

"మార్క్సిస్టు సిద్ధాంత కర్తలలో ఘనులము" అని భావించే ప్లెఖనోవ్, అతని మెన్షివిక్ స్నేహితులూ ఈ కర్తవ్యాన్ని నెరవేర్చుతారని అనుకోవచ్చు. కాని ఏవో వార్తా పత్రికల విమర్శల లాంటివి ఒకటి రెండు అనామక ముక్కలు విసిరేసి, ఆ రంగాన్ని వీరు వదిలివేశారు.

1909లో ప్రచురించిన "భౌతికవాదము-అనుభవవాద దృష్యా విమర్శ" అనే తన సుప్రసిద్ధ గ్రంథంలో యీ కర్తవ్యాన్ని లెనిన్ నెరవేర్చాడు.

లెనిన్ యిలా రాశాడు:

"గతితార్కిక భౌతికవాదంపైనే ప్రధానంగా కేంద్రీకరించి దాడి సల్పిన నాలుగు పుస్తకాలు గత ఆరుమాసాలలో వెలువడ్డాయి. వాటిలో మొట్టమొదటివీ, ప్రధానమైనవీ ఇవి: 1908లో సెంట్ పీటర్స్‌బర్గ్‌లో ప్రచురించబడిన మార్క్సిస్టు తత్వశాస్త్ర అధ్యయనాలు (స్టడీస్ ఇన్ ద ఫిలాసఫీ ఆఫ్ మార్క్సిజం) నిజానికి 'మార్క్సిస్టు తత్వశాస్త్రానికి వ్యతిరేక అధ్యయనములు' అని అంటే బాగుండేది) బాజరోవ్, బోగ్దనోవ్, లూనాచెరెస్కీ, బెర్మన్, హెల్‌ఫాండ్, యుస్కెవిచ్, సువరోవ్‌ల వ్యాస సంపుటి: యుస్కెవిచ్ రాసిన

భౌతికవాదము–విమర్శనాత్మక (మెటీరియలిజం అండ్ క్రిటికల్ రియలిజం) బెర్మన్ రాసిన "ఆధునిక దర్శన శాస్త్ర వెలుగులో గతితర్కం" (డైలక్టిక్స్ ఇన్ ద లైట్ ఆఫ్ మోడ్రన్ థీరీ ఆఫ్ నాలెడ్జ్) వాలెంటినోవ్ రాసిన "మార్క్సిస్టు తత్వశాస్త్ర అన్వయాలు (ద ఫిలాసఫికల్ కన్‌స్ట్రక్షన్స్ ఆఫ్ మార్క్సిజం) వీరంతా రాజకీయంగా తీవ్రంగా విభిన్నాభిప్రాయాలు కలిగి వున్నప్పటికీ, గతితార్కిక భౌతికవాదానికి ప్రతికూలతలో ఒక్కటే. పైగా తత్వశాస్త్రంలో తాము మార్క్సిస్టులమని చెప్పుకునేవారు. ఎంగెల్స్ గతితార్కికవాదము, నిగూఢవాదమని (మిస్టిసిజం) బెర్మన్ వాదించాడు.

అదేదో ప్రత్యక్ష నిదర్శన విషయమైనట్లు ఎంగెల్స్ భావాలు "పాతబడ్డాయి" అని బాజరోవ్ చులకనగా అనేశాడు. 'ఆధునిక దర్శనశాస్త్రం', మొన్న మొన్నటి తత్వశాస్త్రం (లేక రూఢివాదం – రీసెంట్ ఫిలాసఫీ ఆర్ రీసెంట్ పాజిటివిజం), 'ఆధునిక ప్రకృతి శాస్త్ర తత్వశాస్త్రము', 20వ శతాబ్దపు ప్రకృతి శాస్త్ర తత్వశాస్త్రము మొదలగువాటిని గురించి సగర్వంగా ఉదహరించే యీ సాహసిక యోధులు భౌతికవాదాన్ని ఆ విధంగా తోసిపుచ్చారు' '(లెనిన్, భౌతికవాదము–అనుభవవాదదృష్ట్యా విమర్శ–ఇంగ్లీషు ఎడిషన్–మాస్కో 1947, 9వ పేజి).

తత్వశాస్త్ర కుసంస్కర్తలగు (రివిజనిస్టులు) తన స్నేహితులను సమర్థించుతూ లూనాచరెస్కీ యిలా అన్నాడు: "మేము దారితప్పితే తప్పవచ్చు. కాని దానికోసం అన్వేషించుతున్నాం". దీనికి జవాబుగా లెనిన్ ఇలా రాశాడు:

''నామట్టుకు నేను కూడా తత్వశాస్త్రంలో అన్వేషకుడినే. (భౌతికవాదము–అనుభవవాదదృష్ట్యా విమర్శ, అనే గ్రంథంలో –సంపాదకుడు) మార్క్సిజం అనే ముసుగు కింద అభివృద్ధి నిరోధకమైన, గందరగోళమైన, నమ్మరాని, అయోమయ విషయాలను తెలియజేసే వీరి పొరపాట్లు ఏమిటో కనుగొనుటయే యీ విమర్శల ((గ్రంథం) వుద్దేశ్యం." (పై గ్రంథమే – 10వ పేజీలో).

కాని వాస్తవానికి లెనిన్ గ్రంథం ఈ స్వల్ప కర్తవ్యంతోనే సరిపుచ్చుకోలేదు. బోగ్డనోవ్, యుష్కెవిచ్ బాజరోవ్, వాలెంటినోవ్–వారికి తత్వశాస్త్రంలో గురువులైన ఎవనోరియస్, మాష్ అనువారిని విమర్శించుటతోనే ఈ గ్రంథం సరిపుచ్చుకోలేదు. మార్క్సిస్టు భౌతికవాదాన్ని తమ రాతలలో తెలియజేశారు. వీరందరిని విమర్శించుటయేగాక లెనిన్ గ్రంథం మార్క్సిస్టు సిద్ధాంతపు పునాదులను అంటే గతితార్కిక చారిత్రక భౌతికవాద సిద్ధాంతపు పునాదులను సమర్థించింది. ఎంగెల్స్ చనిపోయిన నాటి నుండి లెనిన్ ప్రచురించిన "భౌతికవాదము–అనుభవవాదదృష్ట్యా విమర్శ" అనే గ్రంథం వెలువడే వరకు, అంటే ఈ చారిత్రక కాలమంతటిలోనూ ఈ అంశంపై రచనలేవి వెలువడలేదు. సైన్సు వల్ల ముఖ్యంగా ప్రకృతి విజ్ఞానశాస్త్రం (నేచరల్ సైన్స్) కనుగొన్న ప్రతి ముఖ్యమైన, కీలకమైన విషయానికి భౌతికవాదాన్ని అన్వయించి సూత్రీకరించింది. రష్యన్ అనుభవవాద–విమర్శలను, వారి విదేశీ గురువులను క్షుణ్ణంగా విమర్శించి, తత్వశాస్త్ర సిద్ధాంత కుసంస్కరణ విధానాన్ని (రివిజనిజం) గురించి ఈ కింది నిర్ణయాలకు లెనిన్ వచ్చాడు:

1. ''అర్థశాస్త్రంలోను, ఎత్తుగడలకూ తత్వశాస్త్రానికి సంబంధించిన సమస్యలలోను, ఆధునిక కుసంస్కరణవాదం (రివిజనిజం)లో విశిష్టమైన రూపం ఇది: మార్క్సిజం అనే ముసుగు కింద ఎప్పుడూ భౌతికవాద సిద్ధాంతాలను అతి నేర్పుతో ప్రకటించడం, మార్క్సిజాన్ని తప్పుడు తడకగా నేర్పుగా ప్రదర్శించడం".

(పై గ్రంథమే 342–43 పేజీలు)

2. ''మాష్, ఎవెనోరియస్ అనువారల ముఠా అంతా భావవాదంవైపు నడుస్తున్నది.

(పై గ్రంథమే 370వ పేజీ)

3. "మాష్‌ను అనుసరించే మనవారంతా భావవాదమనే వలలో తగుల్కొన్నారు.

(పై గ్రంథమే 359వ పేజీ)

4. "అనుభవవాద విమర్శయొక్క తర్కజ్ఞాన పాండిత్యాల వెనుక, తత్వశాస్త్రంలోని వివిధ పక్షాల పోరాటాన్ని చూడకుండా వుండలేము. ఈ పోరాటం ఆధునిక సమాజంలోని పరస్పర వ్యతిరేక వర్గాల సిద్ధాంతాన్ని ధోరణులను ప్రతిబింబించుతుంది."

(పై గ్రంథమే 371వ పేజీ)

5. "సాధారణంగా భౌతికవాదానికి, ముఖ్యంగా చారిత్రక భౌతికవాదానికి వ్యతిరేకంగా జరిపే పోరాటంలో, అంధ మత విశ్వాసకులకు (ఫీండిస్ట్సు) (శాస్త్ర విజ్ఞానం కంటే మత విశ్వాసానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే అభివృద్ధి నిరోధకులు) నమ్మకమైన సేవను చేయడమే అనుభవవాద విమర్శ యొక్క స్వతస్సిద్ధమైన వర్గ పాత్ర (ఆబ్జెక్టివ్ క్లాస్ రోల్)

(పై గ్రంథమే 371వ పేజీ)

6. "తాత్విక భావవాదం (ఫిలసాఫికల్ ఐడియలిజం) మత అంధకార అజ్ఞానవాదానికి మార్గం". (లెనిన్ కలెక్టెడ్ వర్క్సు, రష్యన్ ఎడిషన్–13వ పేజీ)

మన పార్టీ చరిత్రలో లెనిన్ గ్రంథం ప్రదర్శించిన అద్భుతమైన పాత్రను హర్షించాలంటే: స్టోలోపిన్ ప్రతీఘాత కాలంలో కుసంస్కరణవాదులు (రివిజనిస్టులు), నమ్మక ద్రోహులు (రెనేగేడ్సు) మొదలైన నానా గోత్రేభ్యుల గుంపు నుండి లెనిన్ సంరక్షించిన సిద్ధాంత సంపదను మనం గుర్తించాలి. మనం క్లుప్తంగానైనా సరే గతితార్కిక చారిత్రక భౌతికవాద ప్రధాన సూత్రాలను తెలుసుకోవాలి.

గతితార్కిక చారిత్రక భౌతికవాదాలు కమ్యూనిస్టు సిద్ధాంతానికి పునాది. మార్క్సిస్టు పార్టీకి సిద్ధాంత పునాది. అందుకే వీటిని తెలుసుకోవటం అవసరం. పార్టీ కార్యోత్సాహంగల (యాక్టివ్) ప్రతిసభ్యుడు యీ సూత్రాలను తెలుసుకొని అధ్యయనం చేయాలి. ★

# ‘చైనాలో స్త్రీ విముక్తి’ గురించి తెలుసుకుందాం -1

*1949లో నూతన ప్రజాస్వామిక విప్లవంలో విజయం సాధించి 1956లో చైనా సోషలిస్టు దశలోకి అడుగుపెట్టింది. సోషలిస్టు చైనాలో స్త్రీల స్థితిగతులెలా ఉన్నాయో, అంటే పాత సమాజపు అవశేషాలతో వాళ్లెలా పోరాడుతున్నారో, నూతన సమాజ నిర్మాణంలో వాళ్లెలా భాగమవుతున్నారోననే విషయాలను అధ్యయనం చేయడానికి 1971 నవంబర్‌లో ఫ్రాన్స్ నుంచి 12 మందితో కూడిన మహిళల బృందం చైనా వెళ్ళింది. వారంతా ఫ్రెంచి మహిళా విముక్తి కార్యకర్తలు. ఆ బృందంలో క్లాడీ బ్రాయెల్ ఒకరు. తమ అధ్యయనం ఆధారంగా క్లాడీ బ్రాయెల్ రాసిన పుస్తకాన్ని 1973లో ఫ్రెంచి భాషలో ప్రచురించారు. 1977లో దీని ఇంగ్లీషు అనువాదం ‘ది హార్వెస్టర్ ప్రెస్’ ప్రచురణగా వెలువడింది. తెలుగులోకి ‘పద్మ’ అనువదించిన ఈ పుస్తకం ‘చైనాలో స్త్రీ విముక్తి’ పేరిట మహిళా మార్గం ప్రచురణ స్టడీ సీరిస్-1గా వెలువడింది.*

*సమాజ విముక్తికీ, మహిళా విముక్తికీ వున్న గతితార్కిక, అవినాభవ సంబంధాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవడం కోసం ఈ పుస్తకాన్ని ప్రచురిస్తున్నట్లు మహిళామార్గం ప్రచురణకర్తలు ‘మామాట’లో పేర్కొన్నారు. ఇదే ఉద్దేశంతో మేం ఈ పుస్తకంలోని సారాంశాన్ని ‘క్రాంతి’ పాఠకులకు సంక్షిప్తంగా అందించదలుచుకున్నాం.*

*నేడు చైనా సోషలిస్టు దశలో లేదు. తిరోగమన ప్రయాణం చేసి పెట్టుబడిదారీ దేశంగా మారింది. అయినప్పటికీ సోషలిస్టు సమాజంలో మహిళల స్థితిగతులు ఎంతగా మార్పు చెందుతాయో తెల్సుకోవడం మహిళా విముక్తి కోసం పోరాడుతున్న వారికి అవసరం. అంతేకాక లీషావ్‌చీ వంటి అభివృద్ధి నిరోధకులు తిరోగమనంలోకి నడిపించడానికి చేసిన బలమైన ప్రయత్నం, అటువంటి అభివృద్ధి నిరోధకులతో సోషలిస్టు దశలోనూ ఎంతగా పోరాటం చేయాల్సి వుంటుందోననే విషయమూ ఈ పుస్తకం ద్వారా అర్థం అవుతాయి. అభివృద్ధి నిరోధకులకు వ్యతిరేకంగా జరిగిన సాంస్కృతిక పోరాట ఫలితాలు ఎంత గొప్పగా ఉన్నాయో కూడా చూడవచ్చు.*

*ఈ పుస్తకానికి ‘హాన్‌సుయిన్’ చక్కని ముందుమాట రాసారు. “నిజానికి సగం జనాభాను మాత్రమే తనలోకి తీసుకుని మిగిలిన సగాన్ని బానిసత్వంలోనూ, దోపిడీలోనూ మగ్గిపోనిచ్చి వుంటే చైనాలో సోషలిస్టు విప్లవం గురించి ఊహించడం కూడా సాధ్యమయ్యేది కాదు” అని ముందుమాటలో రాసిన ఆమె మాట చైనా విప్లవంలో స్త్రీల విడదీయరాని పాత్రను నొక్కి చెప్తాయి. “తల్లులుగా, భార్యలుగా, కార్మికులుగా తమ విధులను పునర్నిర్వచించుకుంటున్నారు” అని ఆమె రాసిన ఒక వాక్యం స్త్రీల మొత్తం సామాజిక కృషిని పట్టి చూపుతుంది. “చైనా స్త్రీలు కేవలం మగవాళ్ళతో సమానత్వం కోసం, ఆర్థిక లాభాలకోసమే కాక ‘విప్లవించడానికీ’ సామ్యవాదాన్ని పటిష్టపరచడానికి కూడా తమని తాము విముక్తి చేసుకుంటున్నారనే వాస్తవం, చైనా స్త్రీల ముందంజను చక్కగా సూచిస్తోంది. ఎందుకంటే సామ్యవాదాన్ని పటిష్టపరుచుకున్నప్పుడే వారు తమ విముక్తిని కూడా పటిష్టపరుచుకుని నిజంగా ‘ఆకాశంలో సగం’ కాగల్గుతారు” అన్న ఆమె మాటలు, ఉద్యమంలో భాగం కావల్సిన అవసరం స్త్రీలకు మరింతగా ఎందుకు ఉంటుందో అర్థం చేయిస్తాయి.*

*ఈ పుస్తకం ఇంగ్లీష్ ప్రతికి క్లాడీబ్రాయెల్ ఒక ముందుమాటను రాసారు. అందులో “ఈ పుస్తకం ఏ విధంగానూ ఒక అంతిమ నివేదిక కాదు. చైనాలో స్త్రీ విముక్తి సగటున ఏ మేరకు జరిగిందోనని చేసిన అంచనా అసలే కాదు. నేను అక్కడి ధోరణుల్ని, వారు ఎటువైపు మొగ్గు చూపుతున్నారనే దాన్ని రేఖా మాత్రంగా చెప్పడానికి ప్రయత్నించాను. స్త్రీల విముక్తి కొరకు ‘చైనా మార్గం’ గురించిన పుస్తకం ఇది” అంటూ ఈ పుస్తకాన్ని ఎలా అర్థం చేసుకోవాలోననే ఒక స్పష్టతను ఇచ్చారు.*

*ఐదు భాగాలుగా ఉన్న పుస్తకమిది. సామాజిక శ్రమ, ఇంటి పని , పిల్లలు, కుటుంబం, లైంగికత – ఇలా ఒక్కో భాగం ఒక్కో అంశాన్ని వివరిస్తుంది. స్త్రీలు ప్రధానంగా ప్రశ్నించే సామాజిక సంబంధాలివి. ఈ అధ్యాయాలు ఈ వరుస క్రమంలో వుండడం యాదృచ్ఛికం కాదు. స్త్రీలు సామాజిక శ్రమలో పూర్తి స్థాయిలో పాల్గొనడం అనేది స్త్రీ విముక్తికి మొదటి అడుగు. అందుకే సామాజిక శ్రమ అనే అధ్యాయం మొదటే వుంది. ఆ విధంగానే మిగతా నాలుగు అంశాలు కూడా ఒక అంశంతో మరో అంశానికున్న సంబంధం రీత్యా ఈ వరుస క్రమం ఏర్పడింది.*

# పని స్త్రీలను మారుస్తోంది స్త్రీలు పనిని మారుస్తున్నారు

విప్లవం విజయవంతం కాగానే ప్రజా ప్రభుత్వం అప్పటిదాకా ఇంటికి పరిమితమై వున్న లక్షలాది స్త్రీలను సామాజిక ఉత్పత్తిలో పాల్గొనేలా కృషి చేసింది. అప్పటిదాకా జరిగిన విముక్తి పోరాటం వల్లా, ఆ పోరులో పెరిగిన స్త్రీల చైతన్యం వల్లా, స్త్రీలు సామాజిక శ్రమలోకి రాగల్గిన భౌతిక పరిస్థితి పరిపక్వం చెంది వుంది. ఫలితంగా 1971 నాటికి ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో స్త్రీలు సామాజిక ఉత్పత్తిలో పాల్గొన్న దేశం చైనా అయింది. అయితే ఈ స్థితి అంత సాఫీగా రాలేదు. విప్లవ పోరాటం, ఆ తర్వాత ఏర్పడిన ప్రజా ప్రభుత్వం, స్త్రీలను సామాజిక ఉత్పత్తిలోకి రావడానికి ఎంతగానో ప్రోత్సహించాయి. కానీ సాంస్కృతిక విప్లవానికి ముందు చైనా ప్రజా రిపబ్లిక్ అధ్యక్షుడిగా వున్న లీషావ్‌చీ హయాంలో చాలా మంది స్త్రీలు సామాజిక ఉత్పత్తి నుంచి తిరిగి ఇండ్లకు వెళ్ళారు. అలా ఇండ్లకు తిరిగి వెళ్లడానికి అభివృద్ధి నిరోధకులు చేపట్టిన క్యాంపెయిన్ అనేక రకాలుగా సాగింది. ఒక్కోసారి వీరు, పిల్లల్ని పెంచడంలో స్త్రీలకున్న అసమాన సామర్థ్యాన్ని పొగిడేవారు. ఇది స్త్రీలను పిల్లల పెంపకానికి పరిమితం చేసే కుట్ర అని అర్థం చేస్కోలేక పోయిన చాలా మంది స్త్రీలు సామాజిక ఉత్పత్తిని వదిలి ఇంటికి పరిమితం అయ్యారు. స్త్రీలకు వృత్తులను నేర్చుకునే మేధాశక్తి లేదని బహిరంగంగా ప్రచారం చేసేవారు. ఆహార శాలలూ, శిశు సంరక్షణాలయాల కొరతను సాకుగా చూపి స్త్రీలు పని చేయడాన్ని నిరుత్సాహ పరిచేవారు. ఇవేకాక ఆనాడు పని (ఉత్పత్తి)ని నిర్వహించిన పద్ధతి కూడా స్త్రీలకు ప్రోత్సాహకరంగా లేదు. ఒకవైపు ఫ్యాక్టరీ కార్మికులది అని చెప్పేవాళ్ళు, కానీ మరోవైపు కార్మికులు ఫ్యాక్టరీలకు సంబంధించిన అధికారుల ఆజ్ఞలు పాటించవలసి వచ్చేది. వారికి, వారు పని చేస్తున్న యంత్రాలకు సంబంధించిన పరిజ్ఞానం ఉండేది కాదు. ఉత్పత్తి ఎంత జరుగుతుందో, ఎందుకు జరుగుతుందో, జరిగిన ఉత్పత్తి ఏమౌతున్నదో ఏమీ తెలిసేది కాదు. లాభార్జనే ధ్యేయంగా, బూర్జువా నిబంధనల మీద, గుడ్డి క్రమశిక్షణ మీద ఆధారపడే పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతిలోనే ఆనాటి ఉత్పత్తి కొనసాగింది. అందువలన కార్మికులకు ఫ్యాక్టరీ మాది అనే భావం కలిగేది కాదు, కేవలం జీతం కోసమే పని చేస్తున్న భావన కలిగేది. అందువల్ల ఫ్యాక్టరీ వదిలే వేళ కోసం, వారానికో సెలవు కోసం చచ్చేంత విసుగుతో ఎదురు చూసేవారు. ఇటువంటి పరిస్థితులు మహిళలను ఫ్యాక్టరీలలోకి రావడాన్ని నిరుత్సాహపర్చాయి. అంతేగాక ఇంటి పని నుంచి కూడా స్త్రీలు పూర్తిగా విముక్తి కానందున సామాజిక శ్రమలోకి రావడం అనేది వారికి అదనపు శ్రమగా వుండేది. కనుక చాలా మంది స్త్రీలు ఇంటికి పరిమితం అవ్వాలని ఆలోచించేవారు. అయితే వారిలో పెరిగిన చైతన్యం కేవలం ఇంటి పనితో సంతృప్తి పడనివ్వలేదు. ఒక టెలివిజన్ ఫ్యాక్టరీలో సోల్డరింగ్ చేసే కార్మికురాలి మాటల్లో చెప్పాలంటే "సోమవారం ఉదయం, ఒక పూర్తి వారం పాటు పని చేయవలసి ఉందని తలుచుకుంటే, ఇంటి దగ్గర వుండగలిగే వాళ్ళపై ఈర్ష్య కలుగుతుంది. ఒక రోజంతా ఇంట్లో అన్నీ చక్కబెట్టాక ఆదివారం సాయంత్రం వాళ్ళపై జాలివేస్తుంది".

ఇటువంటి నిరుత్సాహకర వాతావరణంలో సహితం అనేక మంది స్త్రీలు సామాజిక శ్రమలో పాల్గొనే తమ హక్కును పోరాడి సాధించుకున్నారు. పెకింగ్ లోని చావోయాన్ వైద్య పరికరాల ఫ్యాక్టరీ కార్మికుల పట్టుదలను చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమౌతుంది. 1958 వరకూ ఇళ్ళల్లో వుండి కుటుంబం కోసం పని చేస్తూ వుండిన 20 మంది మహిళలు 'సొంత కాళ్ళపై నిలబడమనీ, ఇంటి పనితో తెగతెంపులు చేసుకోమనీ, సామాజిక ఉత్పత్తిలో పాల్గొనమనీ' కామ్రేడ్ మావో ఇచ్చిన పిలుపుకు స్పందించారు. ఇక వారు ఎంత మాత్రమూ కుటుంబాలకు సేవ చేయదల్చుకోలేదు. ప్రజలకే సేవ చేయదల్చుకున్నారు. వాళ్ళు ఒక ఫ్యాక్టరీ పెట్టాలనుకున్నారు. 'వీధి కమిటీ' ఈ పని కోసం వారికి రెండు ఖాళీ గోదాములనిచ్చింది. అయితే వారు ఎక్కువ మంది లేరు. వారి దగ్గర ఏ పరికరాలూ లేవు. వారికి ఉత్పత్తిలో అనుభవమూ లేదు. అయితే స్త్రీల పరిస్థితినీ, మొత్తం సమాజాన్ని మార్చాలనే పట్టుదల వారి వద్ద మెండుగా వుంది. ఆ పట్టుదలే వారిని ముందుకు నడిపించింది. ఏం ఉత్పత్తి చేయాలి అనే ప్రశ్న వచ్చినప్పుడు జిల్లా అంతటా విచారించాక గిన్నెలు, స్టవ్ పైపులు, పెనాల వంటి నిత్యావసర వస్తువులు తయారు చేయాలని వారు నిర్ణయించుకున్నారు. ఇండ్ల నుంచి సుత్తెలు, కటింగ్ ప్లేయర్లు, స్క్రూ డ్రైవర్లు వంటి పరికరాలను సొంతంగా వాళ్లే తెచ్చుకున్నారు. ఫ్యాక్టరీల నుంచి వాడి పారేసిన తుక్కు లోహపు రేకులను, ఇనుప గొట్టాలను తెచ్చుకుని వాళ్ళు పనిని ప్రారంభించారు. ఇతర ఫ్యాక్టరీల నుండి కొందరు కార్మికులు వారి విరామ సమయాల్లో వచ్చి ఈ మహిళా కార్మికులకు శిక్షణ ఇచ్చే వారు. అలా పట్టుదలతో తమ పనిలో ముందుకు సాగుతున్న ఈ మహిళలు ఎదుర్కొన్న మరో తీవ్ర సమస్య పిల్లల్ని చూసుకోవడం. ఈ సమస్యను కూడా వారు పరస్పర సహకారంతో పరిష్కరించుకున్నారు. పెద్ద పిల్లలు, చిన్న పిల్లల్ని చూసుకునే వారు. కొంత మంది స్త్రీలు తమ పిల్లల్ని అత్తల వద్దనో, తల్లుల వద్దనో వదిలి వచ్చేవారు. వీరి పనిని చూసి ఆమోదించిన ఇరుగు పొరుగు స్త్రీలు కూడా ఈ మహిళల పిల్లల్ని చూసుకునే వారు. ఇలా తమకు వ్యతిరేకంగా వున్న పరిస్థితులను అనుకూలంగా మార్చుకుంటూ ఈ మహిళలు తమ లక్ష్యాన్ని కొనసాగించారు. మొత్తం ఆ కాలమంతా వారికెటువంటి వేతనాలూ దొరకలేదు. ఒక్కోసారి అనుకున్న పనిని పూర్తి చేయడం కోసం రాత్రి వరకూ వారు స్వచ్ఛందంగా ఫ్యాక్టరీలోనే ఉండిపోయారు. అలా పట్టుదలతో వారు చేత్తోనే గిన్నెలనూ, స్టవ్ పైపులనూ చేయడంలో విజయం సాధించారు. ఆ ఉత్పత్తులను ప్రభుత్వం

అంగీకరించింది. అది వారి తొలి విజయం. ఈ విజయోత్సాహంతో వారి ప్రయత్నాలను రెట్టింపు చేసారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా – సోషలిస్టు వ్యవస్థలో ఉత్పత్తికి గీటురాయి ప్రజల అవసరాలే – వివిధ రకాలయిన ఉత్పత్తులను చేయాలనుకున్నారు. అట్లా మళ్ళీ స్థానిక అవసరాలను కనుక్కొని ఆ మేరకు ఎక్స్‌రే యంత్రంలో ఉపయోగించే రక్షణ రేకుల వంటి పరికరాలను తీసుకుని వాటిని విప్పదీసి బాగు చేసేవారు.

అయితే ఈ పనికి మరింత పరిజ్ఞానం అవసరం. వీరిలో కొంత మంది కష్టాలనెదుర్కున్నప్పుడు నిరుత్సాహపడేవారు. "మనం చదువుకోలేదు. వైద్య పరికరాలు చేయడం కష్టం, గిన్నెలే చేద్దాం" అనేవారు. మరికొంత మంది మాత్రం "మనం ఇక్కడ ఉన్నది డబ్బులు సంపాదించడానికి కాదు. ప్రజలకు ఈ పరికరాలు అవసరం. మనం కార్మిక వర్గంలో ఒక భాగం. అందులో సగభాగాన్ని అజ్ఞానంలో ఉంచితే, సగభాగం నూతన సాంకేతిక విధానాలను నేర్చుకోలేకపోతే ఇక అది దేశాన్ని ఎట్లా నడిపించగల్గుతుంది. మనకు ఏమి తెలీదు సరే, అయితే నేర్చుకుందాం" అని వాదించే వారు. వారికి సలహాలివ్వడానికి ఇతర ఫ్యాక్టరీల నుండి నిపుణులు వచ్చేవారు. అలా వారు రక్షణ రేకులే కాక, పెద్ద స్టెరిలైజర్లు, ఇన్‌ఫ్రారెడ్ దీపాలు కూడా ఉత్పత్తి చేసారు. అప్పుడు ఆ ఫ్యాక్టరీకి వారు చావోయాన్ వైద్య పరికరాల ఫ్యాక్టరీ అని పేరు పెట్టుకున్నారు. ఆ సరికి వారి సంఖ్య పెరిగి 20 మంది మగవాళ్ళతో సహా మూడు వందలకు పైగా అయ్యారు. 1960లో ప్రభుత్వాన్ని ఒక్కపైసా కూడా అడక్కుండా పాత భవనాల నుంచి ఇటుకలను తీసుకుని ఆరుబైట ఇంకో నాలుగు కార్ఖానాలను కట్టుకున్నారు. అంతేకాక ఫ్యాక్టరీ ఆవరణలోనే ఒక భోజనశాలను, శిశు సంరక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

అయితే లీషావ్‌చీ అనుచరులైన అభివృద్ధి నిరోధకులు పెట్టుబడి తరహా ఉత్పత్తి పద్ధతులను తిరిగి ప్రతిష్టించడానికి పూనుకున్నారు. అందులో భాగంగా చావోయాన్ ఫ్యాక్టరీలో ఉత్పత్తిని 'క్రమబద్ధం' చేయ పూనుకున్నారు. అది వైద్య పరికరాల ఫ్యాక్టరీ కనుక గిన్నెల తయారీని ఆపాలని చట్టం చేసారు. అలా కొంత మంది కార్మికులను తగ్గించాలని వారి ఆలోచన. ఈ విషయంలో మహిళా కార్మికులు తీవ్రంగా ప్రతిఘటించారు. "మేం వంట పనికి తిరిగి వెళ్ళం, మేం మా ఉద్యోగాలు వదలం" అని ప్రకటించారు. మహిళల ఈ ప్రతిఘటనకు వారి భర్తలు, ఇతర పురుషులు వారికి మద్దతునిచ్చారు. మహిళల ఈ పోరాటం పెట్టుబడిదారీ విధాన పునఃప్రతిష్టకు వ్యతిరేకంగా అనే విషయం వాళ్ళు అర్థం చేసుకున్నారు. కనుక మద్దతునిచ్చారు. అభివృద్ధి నిరోధకులు ఎన్ని ఆటంకాలు కల్పించినా వారు ఫ్యాక్టరీని వదలలేదు. జీతాలు ఇవ్వకపోయినా ఒకరికొకరు సహాయం చేసుకుంటూ గడిపేవారు. 'క్రమబద్ధీకరణ' అనే పద్ధతిని ఖండిస్తూ వారు కాంపెయిన్లు చేసారు. అలా వారు తమ పని హక్కును కాపాడుకున్నారు. ఆ తర్వాత ఈ మహిళా కార్మికులు మరింత సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకుని సిలికాన్ తయారు చేసే పద్ధతిని లోపరహితం చేసారు. మొదట్లో ఈ కంపెనీలో 40,50 ఏళ్ళ మాజీ గృహిణులు ఉండేవారు. కానీ తర్వాత చదువుకున్న యువతులు వీరితో చేరి వారి విజ్ఞానాన్ని ఈ మహిళలకు పంచి, ఈ మహిళల పట్టుదలనూ, కార్మికవర్గ చైతన్యాన్ని వారు నేర్చుకున్నారు. క్రమంగా ఈ ఫ్యాక్టరీ చుట్టు పక్కల ప్రాంతంలో ముసలివాళ్ళు, అనారోగ్య పీడితులు తప్ప స్త్రీలు ఎవ్వరూ ఇంటి పట్టున ఉండని స్థితి ఏర్పడింది. ముసలివారు కూడా వుద్యోగం చేసేవారి భారం తగ్గించడం కోసం వారి ఇళ్లలో కొన్ని పనులు చేసి పెట్టేవారు. రిటైరయిన వాళ్ళు బడివేళ తర్వాత పిల్లల్ని చూసుకుని ఉద్యోగస్తులకు సహాయం చేసేవారు. అట్లా వారి శేష జీవితాలు కూడా సామాజిక ఉత్పత్తికి ఉపయోగపడే జీవితాలుగా పరివర్తన చెందాయి. వేలాది స్త్రీలు సామాజిక ఉత్పత్తిలోకి కదిలిన ఫలితమిది.

**ఆడ, మగ పనుల మధ్య చెరిగిపోతున్న విభజన రేఖ**

అయితే అన్ని ఆర్థికరంగ విభాగాల్లో స్త్రీలు ఉన్నప్పటికీ చాలా మంది స్త్రీలు సమాజం "ఆడవాళ్ళ పనులు"గా భావించే ఆరోగ్యం, విద్య, బట్టల పరిశ్రమ వంటి రంగాల్లోనే ఉన్నారు. అయితే అది ఒక తాత్కాలిక స్థితి. వర్గరహిత సమాజం దిశగా పురోగమిస్తున్న కొలదీ ఇటువంటి పరిస్థితి మారుతూ వస్తుంది. కానీ కొంతమంది మాత్రం ఈ విషయంలో, అంటే ఇటువంటి శ్రమ విభజనను కూలంకషంగా తొలగించాలనే విషయంలో తగినంత స్పృహను కలిగి వుండే వాళ్ళు కాదు. వాళ్ళు అప్పటి స్థితి పట్ల పూర్తి సంతృప్తిని కలిగి వుండేవాళ్ళు. ఉదాహరణకు ఒక ఫ్యాక్టరీలోని పురుష అధికారిని క్లాడీ బ్రాయెల్ తదితరుల బృందం కలిసినప్పుడు ఆ అధికారి ఎంతో గర్వంగా తమ ఫ్యాక్టరీలో స్త్రీలు అన్ని రకాల పనులూ చేస్తున్నారని చెప్పాడు. ఈ బృందంలోని ఒక కామ్రేడ్ "అంతా బాగానే వుంది. కానీ మేమిప్పుడే ఫ్యాక్టరీ శిశు సంరక్షణ కేంద్రం నుండి వస్తున్నాం. పిల్లల్ని చూసుకునే వాళ్ళలో ఒక్క మగవాడు కూడా మాకు కనిపించలేదు, ఎందుకు?" అని అడిగింది. దానికి ఆ అధికారి "పిల్లల్ని పెంచే విషయంలో మాత్రం స్త్రీలకు అద్భుతమైన సామర్థ్యం వుంది" అని జవాబిచ్చాడు. మహిళా బృందానికి చెందిన ఆ కామ్రేడ్ "అంటే మీరు మార్చడానికి వీలులేని సహజ సిద్ధమైన మానవ స్వభావం అనే భావాన్ని నమ్ముతారన్న మాట" అని వ్యంగ్యంగా అంది. అప్పుడా అధికారి తనలోని తప్పుడు భావజాలాన్ని అంగీకరిస్తూ "వర్గపోరాటం సోషలిజంతో ఆగదు, మీరు కొన్ని ఏళ్ళ తర్వాత చైనాకు వస్తే ఇక్కడ ఎన్నో మార్పుల్ని చూడగల్గుతారు. ముఖ్యంగా మీరు శిశు సంరక్షణ కేంద్రంలో మగవాళ్ళను చూస్తారప్పుడు" అన్నాడు.

సోషలిస్టు సమాజంలో సహితం భావజాల రంగంలో ఎంతగా పోరాడాలో పై ఉదాహరణ ద్వారా మనకు అర్థం అవుతుంది. పురుషులు చేసే ప్రతి పనిని మహిళలు చేయాలి అనేకాక, మహిళలు చేసే ప్రతి పనిని పురుషులు చేయాలి అనే విషయాన్ని మనం స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

సోషలిస్టు సమాజంలో కళ కూడా ఎలా విప్లవీకరించబడుతుందో

మనం ఎంబ్రాయిడరీ పనికి సంబంధించిన విషయంలో చూడవచ్చు. ఆ పనిలో స్త్రీ పురుషులిద్దరూ ఎలా భాగస్వాములయ్యారో కూడా చూడవచ్చు.

సుచే అనే పట్టణం ఎంబ్రాయిడరీ పనికి బాగా పేరు పొంది వుండేది. అక్కడి పేద స్త్రీలు ఎవరి ఇండ్లల్లో వారు ఆ పనిని చేసేవారు. ధనికుల, భూస్వాముల వస్త్రాలపై పూలూ, సీతకోక చిలుకలూ కుట్టీ కుట్టీ వాళ్ళ కళ్ళను నాశనం చేసుకుంటూ వుండేవారు. ఈ స్త్రీలను సామాజిక ఉత్పత్తిలోకి తీసుకురావాలంటే అక్కడ కొన్ని ఫ్యాక్టరీలను నిర్మించి వాటిలో వీరికి పని కల్పించవచ్చు. కానీ అక్కడి స్థానిక విప్లవ నాయకత్వం విభిన్న విధానాన్ని అవలంబించింది. ధనిక వర్గాలు స్వాధీనం చేసుకున్న ఈ ఎంబ్రాయిడరీ కళను విప్లవీకరించి ప్రజలకు స్వాధీనం చేసింది. ఇండ్లలో వంటరిగా జరుగుతున్న ఈ పనిని ఒక సామాజిక కార్యకలాపంగా మార్చింది. స్త్రీలు మాత్రమే చేస్తున్న ఈ పనిని స్త్రీ, పురుషులిద్దరూ కల్సి చేసేలా మార్చింది.

విప్లవం విజయవంతం కాగానే ప్రజల అవసరాలకు అనుగుణంగా వస్తూత్పత్తిని అధికం చేయాల్సిన కర్తవ్యం ఆనాటి ప్రజా ప్రభుత్వంపై ఉన్నది. అందుకోసం ఈ స్త్రీలను ఎంబ్రాయిడరీ నుంచి తప్పించి వస్తూత్పత్తి రంగంలోకి తీసుకెళ్ళవచ్చు....కానీ అక్కడి నాయకత్వమూ, ఈ స్త్రీలు కూడా మొక్కలకు నీరు అవసరమైనట్టే, ప్రజలకు కళ అవసరం అని భావించారు. కళ లేకుండా విప్లవం లేదు అనుకున్నారు. అయితే అంత వరకు రాజులను, చక్రవర్తులను చిత్రించిన తమ చేతులతో జైత్రయాత్ర చేస్తున్న కార్మికులను చిత్రించారు. ఉత్పత్తిలో పాల్గొనే మొరటు రైతుల చేతులను కుట్టారు. శత్రువు కోసం కాపలా కాస్తున్న సెంట్రీ బొమ్మను కుట్టారు. ఎవరి ఇండ్లల్లో వారు కుట్టే విధానానికి స్వస్తి చెప్పి వారంతా ఒకేచోట కూర్చొని సమిష్టిగా ఆ పనిని చేసారు. అయితే మొదట అలా సమిష్టిగా చేయడానికి చాలా మంది స్త్రీలు ఒప్పుకోలేదు. ఎందుకంటే పాత సమాజంలో ప్రతి స్త్రీ కొన్ని కిటుకులను దాచుకునేది. అందరూ కల్సి చేయడమంటే తమ కిటుకులను ఇతరులకు చెప్పాల్సి వస్తుందనీ, అలా చెప్పేస్తే తమ ప్రత్యేకత ఉండకుండా పోతుందని వారు భావించారు. అంతేకాక ఇంటి వద్దే పని చేయడం వల్ల పిల్లల్ని చూసుకోవడం అనే సౌలభ్యం ఉంటుందని వారు అనుకున్నారు. కానీ ఎనిమిది మంది స్త్రీలు ఇటువంటి ఆలోచనలను జయించి తమ సూదులను, దారాన్ని, బట్టల్నీ, కత్తెరలను, తమ పిల్లలనూ తీసుకొనిపోయి ఒకచోట కల్సి పని చేయడం మొదలుపెట్టారు.

వాళ్ళు కల్సి రేఖా చిత్రాలు గీసి, చర్చించి విమర్శించుకొని తమ నమూనాలను మెరుగుపరుచుకున్నారు. దానితో విసుగు కల్పించే పాత నమూనాలు పోయి అతి త్వరలోనే వాళ్ళ నమూనాల్లో నూతన వైవిధ్యం కనిపించసాగింది. వందమంది స్త్రీలు తమ తమ ఇండ్లల్లో కూర్చోని చేసిన దానికంటే ఎంతో వైవిధ్యంగా అందంగా వీరి కుట్లు ఉండేవి. ఫలితం ఒక్క సంవత్సరంలోనే వీరి సంఖ్య ఎనమిది మంది నుంచి వందదాక పెరిగింది.

అయితే అప్పటికి ఉనికిలో వున్న కొద్ది మంది పెట్టుబడిదారులు (చిన్న పెట్టుబడిదారీ సంస్థలు 1956 వరకూ ఉండేవి. అవి ఖచ్చితంగా ప్రభుత్వ అదుపులో ఉండేవి) ఈ మహిళల సమిష్టి వుద్యమాన్ని ఆదరించలేదు. ఈ ఉద్యమాన్ని దెబ్బతీయడానికి ఇండ్లలో వుండి చేసే కుట్టు పనికి ఎక్కువ డబ్బులు ఇచ్చేవారు. పెట్టుబడిదారులు, కార్మికులు అడగకుండానే జీతాలు పెంచడంలో గల ఆంతర్యాన్ని ఇంటి వద్ద వుండి పని చేస్తున్న మహిళలు గ్రహించారు. ఇక సమిష్టి సంస్థలో సభ్యులు మరింతగా పెరిగారు. ఒక శిశు సంరక్షణ కేంద్రాన్ని, ఒక శిశు పాఠశాలను కూడా నెలకొల్పుకున్నారు. క్రమంగా పదహారు వందల మంది స్త్రీలు పని చేసే ఫ్యాక్టరీ అయిందది. స్త్రీలే కాక కొంత మంది యువకులు కూడా ఈ పని చేయడం మొదలు పెట్టారు. అందులో ఒక యువకుడిని "ఆడవాళ్ళతో కల్సి పనిచేస్తే మీకేం అన్పించడం లేదా? అని ఈ మహిళా బృందం సభ్యురాలు అడిగింది. "ఏమాత్రం లేదు. నాకీపని ఇష్టం. అయినా ఇది ఆడవాళ్ళ పనేం కాదు. మగవాళ్ళ పని, ఆడవాళ్ళ పని అని చూడడం పాత సమాజపు పద్ధతి. కాలం మారింది" అని చెప్పాడతను. 'కానీ వేరే మగవాళ్లు మిమ్మల్ని ఎగతాళి చేయరా?" అని అడిగితే "లేదు, ఎంబ్రాయిడరీ పని విప్లవానికి ఉపయోగకరం. అయితే అది ఆడవాళ్ళ పనే అని అనుకుంటున్న వ్యక్తులు ఇంకా కూడా వున్నారు" అని ఆయన నవ్వుతూ ఇలా ముగించారు. "వర్గపోరాటం పూర్తి కాలేదు. మేం పోరాడుతూనే వుండాలి."

### మానసిక, శారీరక శ్రమలు ఏకమైన దృశ్యం

మానసిక శ్రమ, శారీరక శ్రమల మధ్య విభజనను తొలగించడం అనేది స్త్రీల విముక్తికి పెద్ద ఎత్తున దోహదం చేస్తుందన్న విషయాన్ని సోషలిస్టు చైనాలో మనం చూడవచ్చు.

మానసిక శ్రమనూ, శారీరక శ్రమనూ విభజించినప్పుడు మహిళల్లో అత్యధికులు మొదట నుండీ శారీరక శ్రామికులే. ఇంటికి పరిమితమవుతారు కనుక ప్రపంచం గురించి సమగ్ర జ్ఞానం వారికి అందే అవకాశం లేదు. అలా స్త్రీల మేధస్సు కుంచించుకుపోతుంది. ఇటువంటి స్త్రీలు పని చేయడానికి ఫ్యాక్టరీల్లోకి వస్తే, మొదట కేవలం చెప్పింది చేయడానికే (ఆజ్ఞలను పాటించడానికే) పరిమితమౌతారు. పనిలో వారి క్రియాత్మక పాత్ర పెరగకపోతే ఆ పని చేయాలనే ఆసక్తినీ, పట్టుదలనూ కోల్పోతారు. చైనాలో శారీరక శ్రమకూ, మానసిక శ్రమకూ మధ్య విభజన రేఖను చెరిపేయడానికి విశేషమైన కృషి జరిగింది. ఫ్యాక్టరీల్లో ఉత్పత్తికి సంబంధించిన పథకాలు వేసేవాళ్ళు కొందరు ఆ పథకాలను గుడ్డిగా అమలు చేసేవారు మరికొందరు అనే పాత విధానం పోయింది. ప్రతి కార్ఖానాలో మహిళా కార్మికులూ, సాంకేతిక నిపుణులు, విప్లవ కార్యకర్తలతో కూడిన బృందాలు ఉండేవి. వాళ్ళు కార్ఖానాలో పని చేస్తూనే మరోవైపు ఉత్పత్తికి సంబంధించిన పథకాలను కూడా రూపొందించే వారు. ఈ బృందం మిగతా కార్మికుల సూచనలూ, విమర్శలూ, సలహాలూ స్వీకరించేది. ఆ విధంగా జ్ఞానం, శారీరక శ్రమా, సిద్ధాంతమూ,

ఆచరణా, బుద్ధి జీవులూ – శ్రమ జీవులూ ఏకమవడం మనకు కనబడుతుంది.

కార్మికులు తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి ఎన్నో అవకాశాలు వుండేవి. చాలా మంది కార్మికులు సాయంకాలం చదువుకోవడానికి విద్యా కేంద్రాలకు వెళ్ళే అవకాశం వుండేది. వారు ఒకవైపు తమ జ్ఞానాన్ని పెంచుకునే విద్యార్థులుగా ఉంటూనే, తమ జ్ఞానాన్ని ఇతరులకు పంచే అధ్యాపకులుగానూ ఉండే వారు. తరచూ గ్రామీణ ప్రాంతాలకు వెళ్ళి విప్లవ అవసరాల కోసం రైతులను నైపుణ్యం గల కార్మికులుగా మలిచే శిక్షణ ఇచ్చేవారు. అనేక మంది కార్మికులు విశ్వవిద్యాలయాల్లో చదవకుండానే పట్టా పొందిన డాక్టర్ల వద్ద వైద్య పరిజ్ఞానాన్ని, చికిత్సా పద్ధతులను నేర్చుకుని స్వయంగా డాక్టర్లయ్యారు.

ఇలా మానసిక, శారీరక శ్రమలు కలగలసి పోవడం వల్ల సామాజిక ఉత్పత్తిలో స్త్రీల క్రియాశీలక భాగస్వామ్యం పెరిగి వారి విముక్తి దారులను మరింత విశాలం చేసింది.

## స్త్రీ, పురుషుల సమానత్వాన్ని అర్థం చేసుకున్న తీరు

స్త్రీ పురుషుల మధ్య సమాన పనికి సమాన వేతనం చైనా సోషలిస్టు సమాజంలో పూర్తిగా అమలైంది. అయితే ఈ అమలు అంత సాఫీగా జరగలేదు. ఇది దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. "వాళ్ళు మాతో సమానమైన పనులు చేయరు, మేం మోసినంత బరువులు వాళ్ళు మోయరు" అంటూ సమానమైన వేతనాలను ఇవ్వాలనే ఆలోచనలను కొంత మంది పురుషులు వ్యతిరేకించారు. అంటే సోషలిస్టు దశలోనూ స్త్రీలు తక్కువ వారనే అభిప్రాయం కొందరిలోనైనా ఉండింది. 1972లో చైనా అధికార పత్రిక అయిన 'రెడ్ ఫ్లాగ్'లో ఈ విషయానికి సంబంధించి ఒక వ్యాసం వచ్చింది. 'సర్వ సమానత్వవాదులను' ఖండిస్తూ అందులో "శారీరక శ్రమ చేయడానికి అందరికీ ఒకే విధమైన సామర్థ్యం వుండదు. స్త్రీ పురుషుల మధ్య పనుల కేటాయింపులో ప్రాకృతికపరమైన శారీరక తేడాలను పరిగణనలోకి తీసుకోవడం సహజం. స్త్రీ పురుషుల మధ్య తేడాలను సమర్థించడానికి శారీరక బలాన్ని ఏ స్థాయిలో ఉపయోగిస్తున్నారు అనే అంశాన్ని ఏ సందర్భంలోనూ ఉపయోగించకూడదు" అని రాశారు.

విశ్రాంతి దినాల, సెలవు దినాల ఏర్పాటులో కూడా స్త్రీల ప్రత్యేక శారీరక లక్షణాలు పరిగణించినట్లు స్పష్టమవుతుంది. ప్రతి ఒక్కరికి కనీసంగా వారంలో ఒకరోజు సెలవు ఉండగా స్త్రీలకు రుతుక్రమ సమయంలో నెలకు నాలుగు అదనపు సెలవులు ఇచ్చేవారు. ఈ సెలవు దినాలు పట్టణ, గ్రామీణ ప్రాంత మహిళలందరికీ వర్తించేవి.

సంపూర్ణ సమానత్వానికి, స్త్రీ పురుషుల మధ్య సమానత్వానికి మధ్య ఒక సన్నటి విభజన రేఖ ఉంటుంది. దాన్ని సరిగ్గా అర్థం చేసుకోకుంటే ఒకే విధమైన సామర్థ్యం ఉండదు అనే దానితో స్త్రీలను కొన్ని పనులకు దూరంగా వుంచడం అనే ప్రమాదం వాటిల్లే అవకాశం వుంది. దాని పట్ల సోషలిస్టు సమాజం తగిన జాగరూకతను వహించింది.

తర తరాలుగా పురుషులకు మాత్రమే పరిమితమై వున్న ఎన్నో పనులలో స్త్రీలకు ప్రవేశాన్ని కల్పించింది. సాంకేతిక నైపుణ్యం అవసరమైన గోధుమను, వరినీ విత్తడం, ఎరువులు వేయడం వంటి పనులు పాత సమాజంలో పురుషులు మాత్రమే చేసేవారు. ఇక ఆ పనులు స్త్రీలు కూడా చేయడం మొదలు పెట్టారు. పని చేయడం ద్వారానే నైపుణ్యం వస్తుందని వాళ్ళు నిరూపించారు.

స్త్రీ పురుషుల వేతనాలపై మరోరకమైన తప్పుడు భావన కూడా వుండేది. ఒక పనికి పురుషుడికి 10 పాయింట్లు వచ్చి స్త్రీలకు 8 పాయింట్లు వస్తాయనుకుందాం. ఒక వ్యక్తి దృక్కోణం నుండి కాక ఒక కుటుంబం కోణం నుంచి చూసినప్పుడు ప్రతి కుటుంబంలో స్త్రీలూ, పురుషులు వుంటారు కనుక అన్ని కుటుంబాలకు సమానమైన ఆదాయమే వస్తుంది. ఏ కుటుంబమూ నష్టపోదు అనే వాదన వచ్చింది. అయితే సమాన పనికి సమాన వేతనం ఒక కుటుంబానికి సంబంధించిన లాభ నష్టాల సమస్య కాదు. అంటే అది ఆర్థిక సమస్య మాత్రమే కాదు. అది చాలా ముఖ్యమైన రాజకీయ సమస్య. స్త్రీ పురుషుల ఆర్థిక సమానత్వం రాజకీయ సమానత్వంతో ముడిపడి వుంటుంది. వేతనాల్లోని అసమానత్వానికి వ్యతిరేకంగా స్త్రీలు చేసిన పోరాటం ఒక రాజకీయ పోరాటం. "మేం కొద్ది అదనపు వర్క్ పాయింట్ల కోసం పోరాడ్డం లేదు, మేం ఆత్మగౌరవం కోసం పోరాడుతున్నాం" అని ఆ స్త్రీలు అసలు విషయాన్ని చాలా సరిగ్గా చెప్పారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో మహిళల కృషి

పట్టణ మహిళలు సామాజిక ఉత్పత్తిలో పాల్గొన్న తీరులోనే చైనా గ్రామీణ ప్రాంతాల స్త్రీలు కూడా సామాజిక ఉత్పత్తిలో విశేషంగా పాల్గొన్నారు. షావాన్ ప్రాంతంలోని స్త్రీలు సామాజిక ఉత్పత్తిలో పాల్గొన్న తీరు చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

విముక్తి జరిగినప్పుడు ఈ ప్రాంతంలో పురుషులకు వలె స్త్రీలకు కూడా భూమిని పంచారు. కానీ ఉత్పత్తి యూనిట్‌గా ఇంకా కుటుంబమే వుండింది. కరువు వచ్చి నీళ్ళు మోసుకోవాల్సిన పరిస్థితుల వంటివి వచ్చినప్పుడు తక్కువ సభ్యులున్న కుటుంబాల వారు చాలా ఇబ్బంది పడేవారు. ఒక వంటరి స్త్రీకి 5 మౌల భూమి వచ్చింది. అయితే పని చేసే వాళ్ళు ఎవరు లేనందువల్ల ఆమెకు తక్కువ ఆదాయం వచ్చేది. తన కష్టాలకు మూలాల్ని గ్రహించిన ఆమె కుటుంబాల మధ్య పరస్పర సహకార బృందాలను ఏర్పర్చడంలో కృషి చేసింది. ఇంకొక కుటుంబంలో సభ్యులందరికి ఆ ఏడాది ఆరోగ్యం దెబ్బ తినడం వలన పని చేయలేక పోయారు. ఆదాయం లేక, అప్పుల పాలై వారు తమ భూమిని అమ్మేశారు. (1952 దాకా భూమిని అమ్మే హక్కు వుండేది) పేద రైతులందర్ని ఈ విషయం బాగా ఆలోచింప చేసింది. సమిష్టీకరణ గురించి కృషి చేయలేక పోతే మళ్లీ వర్గ విబేధాలు తలెత్తుతాయని వాళ్ళు గ్రహించారు. వెంటనే వాళ్ళు సహకార సంఘాలు ఏర్పర్చుకున్నారు. అయితే ఈ కృషిలో స్త్రీల పాత్ర ప్రధానమైనది.

స్త్రీలను సహకార సంఘాలు ఆకర్షించడానికి కారణం –

కుటుంబ యూనిట్ కేంద్రంగా ఉత్పత్తి జరిగినంత కాలం వాళ్ళు ఇంటినే అంటిపెట్టుకొని ఉండవల్సి వస్తుంది. ఎందుకంటే పిల్లల్ని చూస్కోవడం, ఇంటి పనులు, వంట పనులు ఎవరు చేస్తారు మరి. కానీ బృందాలుగా ఉన్నప్పుడు స్త్రీలూ, పురుషులూ ఒక్కలాగే పొలం పనులు చేస్తారు. పిల్లల సమస్యనీ, ఇంటి పని సమస్యనీ సమిష్టి ప్రాతిపదికనే తప్పకుండా తీర్చవలసి వస్తుంది. "మనం పొలంలో ఒకరికొకరం సాయం చేసుకుంటున్నామంటే ఇంటి వద్ద కూడా సాయం చేసుకోవాలన్న మాట" ఇదే ఆ స్త్రీల వాదన.

ఒక స్త్రీ తన భర్తతో సహకార సంస్థలో చేరుదామని అన్నది. కానీ ఆ భర్త "నువ్వో ఆడ గుర్రానివి (చైనా పాత సమాజంలో స్త్రీని అలా అనేవారు) నీకేం తెలియదు. నువ్వు పని చేయడానికి బయటకు వెళ్లొద్దు" అన్నాడు. ఆ స్త్రీకి భలే కోపం వచ్చింది. "స్త్రీలు తమను తాము విముక్తి చేసుకున్నారు. నాతో ఇలా ప్రవర్తించే హక్కు లేదు నీకు. మాకు ఉన్న ప్రతీదీ వర్గ పోరాటంలో గెల్చుకున్నాం. దాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేను" అన్నది. అతను లేకుండా ఆమె ఒక్కతే సహకార సంస్థలో చేరింది. దాని వల్ల ఆమె భర్త అతని పొలంలో అతనొక్కడే పని చేసుకోలేక ఇబ్బంది పడేవాడు. ఆ స్త్రీ సంస్థలో చేరడం వల్ల ఉన్న ప్రయోజనాలను అతనికి తరచూ వివరిస్తూ ఉండేది. ఆ తర్వాత అతను స్త్రీల పట్ల తనకున్న చులకన భావం భూస్వామ్య భావజాలం నుంచి పుడుతుందని గ్రహించి, తన తప్పును ఒప్పుకుని సహకార సంస్థలో చేరాడు. షావాన్ గ్రామంలో ఇటువంటి కుటుంబాలు ఎన్నో.

వీరంతా కమ్యూన్‌గా ఏర్పడి సమిష్టిగా సాధించిన విజయాలు ఎన్నెన్నో. ప్రకృతిని కూడా ఓడించిన సంఘటనలు కొన్నింటిని మనం తెలుసుకోవచ్చు.

ఆ ఊరు చుట్టూ వున్న నాలుగు గుట్టలు ఎండిపోయి వుండేవి. వీరు ఆ గుట్టల్ని పచ్చగా చెయ్యాలనుకున్నారు. ఇక అంతే ప్రకృతితో పోరాటం మొదలుపెట్టారు. ప్రతిరోజు వీపుల మీద బుట్టలకొద్దీ మట్టిని వారు గుట్టలపైకి మోసారు. అంచెల వారీగా మడులు తవ్వారు. తేయాకును వేశారు. అలా చుట్టు పక్కల గ్రామాలన్నింటికంటే వీరు అధికంగా తేయాకును పండించగల్గారు. వారికి విడిగా వచ్చిన చిన్న చిన్న విడి మళ్ళతో వాళ్లెన్నడూ ఇటువంటి ఫలితాలను సాధించగల్గేవారు కాదు. ఈ కృషి అంతటిలోను మహిళలే అగ్రగామిగా వున్నారు.

అంతేకాదు సమిష్టిగా వారు ఒక భయంకరమైన కరువును కూడా ఓడించారు. ఆ ప్రాంతంలో నీటి పారుదల ప్రాజెక్టులు కట్టక ముందు ఒక భయంకరమైన కరువు వచ్చింది. చుట్టు పక్కల నీటి వనరులన్నీ ఎండిపోయాయి. మొత్తం పంటకే ముప్పు వాటిల్లే పరిస్థితి వచ్చింది. ఆ కమ్యూన్‌లోని ముసలి వారు తమ చిన్నతనంలో గ్రామ సమీపంలోని పెద్ద పొలంలో ఒక ఊట ఉండినట్లు గుర్తుందని చెప్పారు. కానీ సరిగా ఎక్కడుందో చెప్పలేక పోయారు. ఒక బాలికల బృందం ఆ వూటను వెతకాలని నిర్ణయించుకుంది. చాలా మంది మాత్రం వీరి ప్రయత్నం వృధా అనుకొని ఆట పట్టించారు. కానీ ఆరవ రోజు ఉదయం ఆ అమ్మాయిలకు ఊట దొరికింది. ఇక గ్రామంలోని ప్రతి ఒక్కరు వెళ్ళి దాన్ని తవ్వడం మొదలు పెట్టారు. తర్వాత కొన్ని కాల్వలు తవ్వారు. ఒక వారం రోజుల్లో పొలాలన్నింటికి సరిపడా నీళ్ళు వచ్చాయి. ఇక సమిష్టీకరణ శక్తిని ఏ ఒక్కరూ కాదనలేక పోయారు.

పురుషులు ఈ పనిని ఎందుకు చేయలేదు? మహిళలే ఎందుకు చేశారు? అంటే స్త్రీలను అణచివేసే సాధనంగా వాళ్ళు కుటుంబాన్ని చూసి వున్నారు. కనుక ప్రయివేటు కుటుంబ యాజమాన్యం కంటే సమిష్టితత్వం మంచిదని నిరూపించాలని వాళ్ళు సంకల్పించుకున్నారు. అందరికంటే ఎక్కువగా ప్రకృతి చేత అణచివేతకు గురైన స్త్రీలే ప్రకృతిని అదుపులోకి తెచ్చే పోరాటంలో ముందు వరసలో ఉండడం యాధృచ్ఛికం కాదు.

**సామాజిక మార్పుకు మహిళా సంఘాల కృషి**

మహిళల చైతన్యాన్ని మహిళల పాత్రను చదువుతుంటే చైనాలో మహిళా సంఘాల గురించిన కుతూహలం రావడం సహజం. జపాన్ వ్యతిరేక యుద్ధ జ్వాలల్లో పుట్టిన మహిళా సంఘం లీషావ్‌చీ కాలంలో అభివృద్ధి నిరోధకమైన గృహిణిత్వ భావాజాలాన్ని ముందుకు తెచ్చింది. అయితే సాంస్కృతిక విప్లవ సమయంలో ఈ సంఘాన్ని సస్పెండ్ చేసారు. తర్వాత ఏర్పడిన నూతన మహిళా కమిటీలు ఐదు ప్రధాన కర్తవ్యాలను నిర్ణయించుకున్నాయి. అందులో

**మొదటి కర్తవ్యం** – మార్క్సిజం–లెనినిజం–మావో ఆలోచనా విధానాన్ని అధ్యయనం చేయడం. మొదట్లో ఈ అధ్యయన బృందాలు కలగా పులగంగా ఉండేవి. ఆలుమగలు పిల్లల్ని తీసుకుని అధ్యయనానికి వెళ్లే వారు. దాంతో అధ్యయనానికి ఆటంకం కల్గేది. ఆ తర్వాత ఆడవాళ్ళు చదువుకుంటుంటే మగవాళ్ళు ఇంటివద్దే వుండి పిల్లల్ని చూసుకోవాలని వారు నిర్ణయించుకున్నారు. ఆ పద్ధతి స్త్రీలకు ఎంతో తృప్తిని కల్గించింది. వారు నెలకు ఆరు పర్యాయాలు అధ్యయనం చేసేవారు. ఆ అధ్యయనం ఎంత పట్టుదలతో కొనసాగించారో ఒక ముసలవ్వ మాటల ద్వారా మనకు అర్థమవుతుంది. ఆమె క్లాడీ బ్రాయెల్ బృందంతో "ఒక రోజు సాయంత్రం నేను చదువు కోసం వెళ్ళవలసి వుండగా వర్షం మొదలైంది. బాగా చీకటిగా వుండింది. అటువంటి వాతావరణంలో చిమ్మ చీకటిలో బయటకు వెళ్ళవద్దని నా భర్త అన్నాడు. పాత రోజుల్లో పట్టపగలు కూడా నేను గుడ్డి దానితో సమానమే. ఎందుకంటే చాలా మంది స్త్రీల లాగానే నాకు చదవడం, రాయడం రాదు. ఇప్పుడు అరవైయేళ్ళు పైబడినా, ఇతర స్త్రీలతో విప్లవానుభవాలు పంచుకోవడానికి, నా రాజకీయ చైతన్యం పెంచుకోవడానికీ, నన్ను నేను తిరిగి చైతన్యవంతం చేసుకోవడానికి బడికి వెళ్తుంటే నన్ను ఇంటి దగ్గరే వుంచాలని ఆయన అనుకుంటున్నాడా? 'చదువుకోసం మా స్త్రీలం ఏమేం చేయడానికి సిద్ధంగా వున్నమో నీకు తెలియదు' అని అన్నాను" అని చెప్పింది. స్త్రీల విముక్తికి రాజకీయాల అధ్యయనం ఎంత ముఖ్యమో ఈ స్త్రీలు గ్రహించారన్నది స్పష్టంగా అర్థమవుతుంది.

**రెండవ కర్తవ్యం –** రివిజనిజం యొక్క ప్రతి వ్యక్తీకరణకు వ్యతిరేకంగా స్త్రీలు పూర్తి స్థాయి యుద్ధం తప్పకుండా ప్రకటించాలి. ముఖ్యంగా మహిళా సంఘం పాత లక్ష్యాలను పెద్ద ఎత్తున విమర్శించడాన్ని తుదకంటా కొనసాగించాలి.

**మూడవ కర్తవ్యం –** రాజకీయ కార్యకలాపాలన్నింటిలో పూర్తిగా పాల్గొనే వీలు కల్పించడానికి చేయగల్గిదంతా చేయడం. ఒక బాధ్యత గల పదవికి ఒక స్త్రీ, ఒక పురుషుడు ఇద్దరూ సమాన అర్హత కలిగి వున్నప్పుడు స్త్రీ కామ్రేడ్‌ను ఎంపిక చేయడం పార్టీ విధానంగా వుండింది.

**నాలుగవ కర్తవ్యం –** మహిళల్లో, పురుషుల్లో ఇద్దరిలోనూ వున్న అభివృద్ధి నిరోధక భావాలను అధిగమించడం, కొన్ని సాంకేతిక రంగాలలో పురుషులు అధికులనే భావాలను పోగొట్టి స్త్రీలు ఏ మినహాయింపు లేకుండా అన్ని సామాజిక కార్యకలాపాల్లో పాల్గొనేటట్లు చేయడం, ప్రత్యేకంగా స్త్రీలకు వ్యతిరేకంగా వున్న మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా నిర్దిష్టంగా పోరాడడం.

గుడులలో పూర్వాచారంగా వచ్చిన 'సుర'ను స్త్రీలు తాగడం పూర్వం నిషేధం. 'పవిత్ర సుర'ను తాగిన స్త్రీ వెంటనే చచ్చి పోతుందని ఒక మూఢ నమ్మకం. ఆ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న తిరుగుబాటు స్త్రీలు, గ్రామస్తులందరూ భయంతో చూస్తుండగా 'సుర' తాగి వెంటనే పడిపోక పోయే సరికి వాళ్ళ నమ్మకాలు పటాపంచలయ్యేవి.

స్త్రీలకు వ్యతిరేకంగా ఉన్న మూఢాచారాలపైనే కాక మొత్తంగా మూఢాచారాలపైన స్త్రీలు పోరాడారు. ఒకసారి కుండపోత వర్షం కురిసింది. వరద వేగానికి 500 కిలోల రాయి ఒక కిలోమీటర్ దూరం కదిలింది. హాక్ అనే వర్గ శత్రువు కొండవాలు మీద వెల్లువ కనిపించడమంటే మృత్యు దేవత భూమి మీదకు దిగుతున్నదన్న మాట, దాన్నట్లా వదిలేయాలి. లేకపోతే అంతా నాశనమై పోతుంది అని ప్రచారం చేశాడు. ఆ ప్రచారం వల్ల కొంత మంది ముసలి వాళ్ళు సామాజిక మార్పులు తీసుకు వచ్చినందుకు దేవుడు విధించిన శిక్ష అని నమ్మేశారు. ప్రజల్లో మూఢ నమ్మకాలను పెంచడం ద్వారా వర్గ శత్రవులు తమ ప్రయోజనాల్ని కాపాడుకోవాలని చూస్తారు. హాన్ అదే చేసాడు. కానీ షావాన్ స్త్రీలు హాన్ పప్పులను వుడకనివ్వలేదు. సిన్ అనే మహిళ గ్రామస్తులందర్ని ఒక చోట చేర్చి మాట్లాడింది. "వెల్లువ అంటే ఒట్టి నీళ్ళే...పెద్ద వర్షం వలన అది వస్తుంది. అది వేటిని నాశనం చేయగల్గుతుంది? బహుశా ఇళ్ళను, పొలాలను అంతే కదా! కానీ హాన్ మిమ్మల్ని నమ్మిస్తున్నట్లుగా సర్వనాశనం మాత్రం కాదు. విప్లవాన్ని పరిపూర్తి చేయాలన్న మన నిశ్చయాన్ని అది నాశనం చేయజాలదు. ప్రపంచంలో ఏ శక్తీ ఆ పని చేయలేదు. ఈ శిక్షా భయాన్ని అధిగమించడం మాత్రమే కాదు. మన శక్తి యుక్తులన్నింటితో ఈ ప్రకృతి వైపరీత్యాలను జయించేందుకు పోరాడాలి. మనం ప్రవాహ దిశను మళ్లిస్తే ఇండ్లు పొలాలు ఇంకా నాశనం కాకుండా ఆపగల్గుతాం. రండి మనం పని మొదలు పెడదాం" అని చెప్పి ఈ పనిలో పెద్ద భాగం తీసుకోవడానికి సిన్ మహిళలను కదిలించింది. అందరూ కష్టపడి పని చేసి 30,000 క్యూబిక్ మీటర్ల మట్టిని అడ్డువేసి ఆ ప్రవాహాన్ని పూర్తిగా ఆపగలిగాడు. ఆయేడు వర్షాల వల్ల వరదలొచ్చినప్పటికీ గత సంవత్సరం కంటే 25,000 కిలోల ధాన్యం ఎక్కువగా పండించగల్గారు. షావాన్ కమ్యూన్ పేద, మధ్య తరగతి రైతులు ఆకాశానికీ, భూమికీ, వర్గ శత్రువుకూ వ్యతిరేకంగా పోరాడి గెలిచారు. విప్లవ విజయానికి మహిళలు నిర్ణయాత్మక శక్తి అన్న మావో మాట నిజం చేస్తూ ప్రతి పోరాటంలో మహిళలు కీలకమైన పాత్ర నిర్వహించారు.

**అయిదవ కర్తవ్యం –** కుటుంబాన్ని గురించిన భావాలను మరింతగా విప్లవీకరించడం, ఇందులో కుటుంబపు సామాజిక బాధ్యతను పెంచడం, కుటుంబ స్వప్రయోజనాలను నాశనం చేయడం, స్త్రీ, పురుషుల మధ్య క్రమంగా నూతన సంబంధాలను సృష్టించడం, తల్లి దండ్రులకు పిల్లలకు మధ్య సంబంధాలను మౌలికంగా మార్చడం వంటివి ఉంటాయి.

సామాజిక ప్రయోజనానికి లోబడి కుటుంబ ప్రయోజనం వుండాలనే విషయంలో లీమాషీన్ ఎంత స్పష్టత కల్గి వుందో ఒక సంఘటన ద్వారా తెలుసుకోవచ్చు. ఒకసారి సమిష్టి సంస్థ కోసం బ్రిగేడ్‌కు ఒక బల్ల అవసరమైంది. వెంటనే లీమాషీన్ తమ ఇంట్లోని బల్లను ఇచ్చేసింది. అలా ఇవ్వడం ఆమె భర్తకు నచ్చలేదు. అతనికి కోపం వచ్చింది. ఆ తర్వాత లీమాషీన్, కుటుంబ సభ్యులందరూ కలిసి మావో ఆలోచనను చదవడానికి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. అందులో వ్యక్తిగత ప్రయోజనానికీ, సమిష్టి ప్రయోజనానికి మధ్య వుండే వైరుధ్యం గురించి మాట్లాడింది. మొదట సమిష్టి ప్రయోజనానికి ప్రాధాన్యతను ఇవ్వాల్సిన అవసరం గురించి మాట్లాడింది. ఆమె మాటలను సమర్థిస్తూ, ఆమె అత్త మూడింట రెండు వంతుల మానవాళి ఇంకా దోపిడీ పీడనల కాడి కింద బతుకు వెళ్లమారుస్తుండగా మనం మన సంక్షేమం గురించే ఆలోచించడం సరైంది కాదని మాట్లాడింది. ఇదంతా లీమాషీన్ భర్తను బాగా కదిలించింది. కొన్ని రోజుల తర్వాత తమ బల్లను వెనక్కు తీసుకొచ్చిన బ్రిగేడ్ కామ్రేడ్స్ వద్ద అతను ఆత్మ విమర్శను చేసుకుని బ్రిగేడ్‌కు ఎప్పుడు ఏది కావాల్సినా మాయింటి తలుపులు తెరిచే వుంటాయి అని చెప్పాడు.

సోషలిస్టు చైతన్యాన్ని పొందిన స్త్రీలు తమను తాము విముక్తి చేసుకోవడంలో భాగంగా రాజకీయ, ఆర్థిక, సామాజిక, భావజాల రంగాల్లో ఎంతగా పోరాడినారో 'పని స్త్రీలను మారుస్తోంది. పనిని స్త్రీలు మారుస్తున్నారు' అనే ఈ అధ్యాయంలో మనకు కళ్ళకు కడుతుంది. అంతేకాదు, పోరాడే మహిళలకు ఆ సమాజం ఎంతగా అండగా నిలిచిందో కూడా మనకు అర్థమవుతుంది.

**(తదుపరి సంచికలో 'ఇంటి పనిని సామాజికం చేయడం' గురించి)**

# ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ అధికార ప్రతినిధి కామ్రేడ్ కా రోజెర్‌కు రెడ్‌శెల్యూట్స్!

కామ్రేడ్ కా రోజెర్ 2011 జూన్ 22న లూజాన్‌లోని ఒక గెరిల్లా ఫ్రంట్‌లో గుండెపోటుతో మరణించారు. ఆయన వయస్సు 64 సంవత్సరాలు.

ఒక దశాబ్ద కాలం పైగా ఆయన పార్టీ అధికార ప్రతినిధిగా, దీనికి ముందు, దక్షిణ టగలోగ్ (మెలిటో గ్లోర్ కమాండ్)లో న్యూ పీపుల్స్ ఆర్మీ అధికార ప్రతినిధిగా, ఫిలిపినో ప్రజా విప్లవోద్యమ గొంతులా పనిచేశాడు. తమను దోపిడీ పీడనలకు గురిచేస్తున్న పాలక వ్యవస్థ నుంచి విముక్తి పొందాలనే మహత్తర ఆకాంక్ష కలిగిన రైతాంగం, కార్మికులు, పట్టణ పేదలు, ఉద్యోగులు, చిన్న వృత్తికారుల ఉద్యమాన్ని ఆయన ప్రతిబింబించాడు.



ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ అధికార ప్రతినిధిగా ఉద్యమానికి సంబంధించిన ముఖ్యమైన వార్తలన్నీ ఆయన దగ్గర జమయ్యేవి. ఎర్రపోరాట యోధుల, పోరాట ప్రజల ధైర్యసాహసాలతో ఆయన గొంతు జ్వలిస్తూ ఉండేది. న్యాయం కోసం అలమటించే పీడిత, తాడిత ప్రజలు ఆయనను ప్రాణప్రదాతగా చూస్తారు.

మెజారిటీ ఫిలిపినో ప్రజల మాదిరిగానే కా రోజెర్ కూడా గ్రామీణ ప్రాంతంలో పీడన, పేదరికం కింద పెరిగాడు. ఆయన బటన్‌గాస్ ప్రావిన్స్‌లోని ఇబాన్‌లో టలైబోన్ బరంగేలో 1947 ఏప్రిల్ 19న పుట్టాడు. తన ఆరుగురు సోదర, సోదరీమణులలో 'గోరింగ్' మూడవవారు. నైసెటాస్, బెర్నార్డో, ఫెలెసిడాడ్, ఎమిలియా, రెమెడియోస్ కన్నుమూశారు. వారి తండ్రి పబ్లో రోసల్, తల్లి క్రిస్పినా క్రసట్ – ఇరువురూ ఒక చిన్న భూస్వామి వద్ద భూమి కౌలుకు తీసుకొనేవారు. అందులో చెరకు పండించేవారు. తల్లి మంటపెడుతూ ఉంటే తండ్రి చెరుకు రసాన్ని మరిగించి బెల్లం తయారు చేసేవాడు. అతనిది మధ్యతరగతి రైతాంగ కుటుంబం. విప్లవోద్యమం పట్ల సానుభూతిని కలిగి ఉంటూ దానికి మద్దతు నిచ్చేది.

కా రోజెర్ చిన్ననాటి నుంచే దోపిడి, పీడనలు సాగే వ్యవస్థలో మగ్గుతూ పేదరికాన్ని చూశాడు. పసిప్రాయం నుంచే ఆయన కుటుంబానికి పనుల్లో సహాయం చేసేవాడు. 7వ తరగతి చదివేంత వరకూ, ఎనిదేళ్ల పాటు ఆయన తమ భూస్వామి ఇంట్లో సేవకుడిగా పనిచేశాడు. రేడియో వినడం, హాస్య పుస్తకాలు చదవడం అంటే ఆయనకు మహా ప్రీతి. పేదరికం వల్ల అనేక సంవత్సరాల పాటు చదువు ఆపుకోవాల్సి వచ్చింది. చదువు కొనసాగించడానికి ఆయన వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేసి దోమతెరలు, ఇతర సరుకులు కొని అమ్మేవాడు. ఆయన అనేక ప్రావిన్స్‌లు విస్తృతంగా తిరిగాడు. ఎక్కడికి వెళ్లినా అదే పేదరికాన్ని, పీడనను చూశాడు.

ఆయన 1971లో 24 సంవత్సరాల వయస్సులో మాత్రమే బటన్‌గాస్ నగరంలోని గోల్డెన్ గేట్ కాలేజెస్‌లో కాలేజీలోకి ప్రవేశించగలిగాడు. అది మనిలాలో, ఇతర నగరాల్లో విద్యార్థి–యువకుల పోరాట వెల్లువ సాగుతున్న సమయం.

కా రోజెర్ తన సరుకుల్ని అమ్మటానికి వెళ్లినప్పుడల్లా ఊరేగింపు, సభలు జరగడం కనపడేది. అక్కడ వక్తల ఉపన్యాసాలు వినేవాడు.

1972లో మార్షల్‌లా విధించినప్పుడు కా రోజెర్ పూర్తికాలం కార్యకర్తగా పనిచేయాలని నిర్ణయించుకున్నాడు. బటన్‌గాస్ ప్రావిన్స్‌లోని బలయాన్‌లో బటన్‌గాస్ షుగర్ సెంట్రల్‌లో కార్మికుల్ని సంఘటితం చేసే టీంలో ఆయన భాగమయ్యాడు. 1973 జూలైలో ఆయన శత్రువు చేత జిక్కి జైలు పాలయ్యాడు. విప్లవం కోసం అంకితం కావాలని దృఢంగా నిర్ణయించుకున్న ఆయన, మరో తొమ్మిది మంది పార్టీ నాయకత్వ కేడర్లతో కలిసి 1973 నవంబర్‌లో జైలును బద్దలు కొట్టుకొని తప్పించుకున్నారు. ఇది 'గ్రేట్ ఎస్కేప్'గా ప్రసిద్ధి చెందింది.

అప్పటి నుంచి గ్రామీణ ప్రాంతంలో సాయుధ విప్లవ మార్గంలో కా రోజెర్, తన తోటి కామ్రేడ్స్‌ను అనుసరించారు. లగునా–క్వెజోన్ సరిహద్దున ఉన్న సీర్రా మడ్రె పర్వతాలలో స్థాపించబడిన గెరిల్లా ఫ్రంట్‌లో ఆయన భాగమయ్యాడు. వీరోచిత పోరాటాలకు ఈ గెరిల్లా ఫ్రంట్ ప్రసిద్ధి చెందింది. కా లోరెనా బర్రో నాయకత్వంలో కా రోజెర్, ఇతర కామ్రేడ్స్‌ను సామాజిక పరిశోధన కోసం, విప్లవోద్యమాన్ని విస్తరింపజేయడం కోసం 1974లో మిన్‌డోరో దీవికి పంపబడ్డారు.

1975–76 నాటికి కా రోజెర్ క్వెజోన్–బైకోల్ జోన్‌లోని మొదటి

ఆర్గనైజింగ్ టీంలో భాగమయ్యాడు. అది కమరైన్స్ నార్టెలో వున్నతస్థాయి ప్రజాయుద్ధాన్ని సాగించింది. చివరకు ఆయన ఆ ప్రాంతంలో స్థాపించబడిన గెరిల్లా ఫ్రంట్ కమిటీకి నాయకత్వం వహించాడు.

ఆ తర్వాతి సంవత్సరాలలో దక్షిణ లూజాన్ వ్యాప్తంగా, ప్రత్యేకించి దక్షిణ టగలోగ్ రీజియన్‌లో విప్లవోద్యమ విస్తరణ, పురోగమన చరిత్రలో ఆయన భాగమైపోయాడు. 1980-81లో లాగునా, బటన్‌గాస్, కవిటె, రైజల్ ప్రావిన్స్‌లను కలుపుతూ దక్షిణ టగలోగ్ రీజినల్ కమిటీని ఏర్పాటు చేయాలని దక్షిణ లూజాన్ పార్టీ కమిషన్ నిర్ణయించింది. కా రోజెర్‌ను ఆ రీజినల్ కమిటీలో విద్యా రంగానికి ఉప కార్యదర్శిగా నియమించింది. దక్షిణ టగలోగ్ రీజినల్ కమిటీ కిందికి దక్షిణ క్వెజోన్ గెరిల్లా ఫ్రంట్‌ను తీసుకొచ్చినప్పుడు దక్షిణ క్వెజోన్‌లో, బోన్‌డోక్ ద్వీపకల్పంలో విస్తరణ కృషిలో కా రోజెర్ ప్రముఖ పాత్ర పోషించాడు. కొన్ని సంవత్సరాల తర్వాత, లాగునా-వుత్తర క్వెజోన్-తూర్పు రైజల్ గెరిల్లా ఫ్రంట్‌కు కార్యదర్శి అయ్యాడు.

ఆయన నాయకత్వంలో ఈ ప్రాంతాలలో సాయుధ పోరాటం, ప్రజా పోరాటాలు పురోగమించాయి. క్వెజోన్-బైకోల్ జోన్, దక్షిణ క్వెజోన్, బోన్‌డోక్ ద్వీపకల్పాలు బైకోల్ రీజియన్‌లో, దక్షిణ టగలోగ్‌లోని ఇతర ప్రాంతాల్లో విప్లవోద్యమం విస్తరించడంలో, సంఘటితపడడంలో కీలకమైన పాత్ర పోషించాయి. 1980ల ప్రారంభంలో దేశవ్యాప్తంగా నిరసన చర్యలు తీవ్రతరం కావడంలో ఈ ప్రాంతాలు ప్రముఖ పాత్ర పోషించాయి. 1985లో, కా రోజెర్ దక్షిణ టగలోగ్ పార్టీ కమిటీలో 4వ సభ్యుడిగా నియమించబడ్డాడు. ఆ తర్వాతి సంవత్సరంలో రీజినల్ కార్యవర్గ కమిటీలో సభ్యుడిగా, రీజినల్ కార్యదర్శివర్గ సభ్యుడిగా ఎన్నికయ్యాడు.

అదే సమయంలో కా రోజెర్‌కు కా సోలే (రోసెమారీ డుమనియాస్)తో పరిచయం ఏర్పడింది. అప్పటికి ఆమె యువ ఎర్ర పోరాటయోధ. తర్వాత ఆమె అతని జీవన సహచరి అయ్యింది. వారికి ఇద్దరు కూతుర్లు. వారి పట్ల వారికి అమిత ప్రేమ. వారి పెంపకం బాధ్యత తమ బంధువులకు, స్నేహితులకు వారు అప్పగించారు.

1989లో పెద్ద కూతురు ఆంద్రెయాను శత్రువు బంధించి కా రోజెర్‌ను సరెండర్ కావాలని ఒత్తిడి చేశాడు. ఆయన ఆ వత్తిడికి లొంగకుండా ఈ దిగజారుడు చర్యను మీడియాలో బహిర్గతపర్చాడు. దీనిపై ప్రజా ఉద్యమం పెల్లుబుకడంతో ఆంద్రెయాను శత్రువు వదిలిపెట్టాల్సి వచ్చింది.

కా రోజెర్ దక్షిణ టగలోగ్‌లో విప్లవోద్యమాన్ని పెద్ద అంగలతో పురోగమింపజేయడంలో ప్రముఖ పాత్ర పోషించాడు. అయితే, చరిత్రలో చీకటి అధ్యాయాన్ని కూడా ఆయన అక్కడ చూడాల్సి వచ్చింది. 1988లో విప్లవ శ్రేణుల్లోకి లోతుగా చొచ్చుకుకొని వస్తున్న శత్రు ఏజెంట్లకు వ్యతిరేకంగా 'ఆపరేషన్ మిస్సింగ్ లింక్'ను ఆ ప్రాంతంలో చేపట్టారు. ఇది ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘనకు దారితీసింది. నిర్బంధించడం, చిత్రహింసలు పెట్టడం, అనేక మందిని చంపటంలో కా రోజెర్ పాత్ర ప్రత్యక్షంగా లేకపోయినప్పటికీ, రీజియన్ లీడింగ్ కేడర్లలో ఒకడు కావడం వల్ల, ఆ హిస్టీరియాకు వ్యతిరేకంగా నిలబడడంలో అతని వైఫల్యం వల్ల అతనిపై కూడా విమర్శలు వచ్చాయి. అతనిపై కూడా క్రమశిక్షణా చర్య తీసుకున్నారు. ఆయన తలదించుకొని తనను తాను ఆత్మవిమర్శ చేసుకున్నాడు.

తర్వాత ఆయనను 'ఆపరేషన్ మిస్సింగ్ లింక్'ను ప్రధానంగా నిర్వహించిన లాగునా ప్రాంతానికి పంపినప్పుడు, బాధితుల బంధువుల ముందు తలవంచుకొని క్షమాపణ కోరాలని ఆయన నిరంతరం ఎర్ర పోరాటయోధులకు గుర్తుచేసేవాడు. చివరికి ఆ గాయాలన్నీ మానిపోయాయి. ఆ గెరిల్లా ఫ్రంట్‌లో విప్లవ ప్రజా వుద్యమాలు పురోగమించాయి.

తన వ్యక్తిగత జీవితంలో గానీ, రాజకీయ జీవితంలో గానీ ఎటువంటి అనుభవాలు ఎదురైనా ఆయన ఎన్నడూ నిరుత్సాహపడలేదు. తనకు చేతనైన మేరకు తన విధులను నిర్వహించాడు. అంతేకాక, ప్రచార రంగానికి ఎనలేని సేవ చేశాడు.

పార్టీ నాయకుడిగా, ప్రజా పోరాటాలను పురోగమింపజేయడంలో ప్రచార కృషి ప్రాధాన్యత గురించి ఆయనకు బాగా తెలుసు. రేడియోలోనూ, ఇతర మాస్ మీడియాలోనూ క్రియాశీల ప్రచార కృషికి ఆయన నేతృత్వం వహించాడు. 1986లో క్వెజోన్‌లో ఆయన "కా రోజెర్"గా యుద్ధ ఖైదీల విడుదలను పర్యవేక్షించినప్పుడు మొట్టమొదటగా ప్రాచుర్యంలోకి వచ్చాడు. 1987లో ఫిలిప్పైన్స్ ప్రభుత్వంతో శాంతి చర్చలలో దక్షిణ టగలోగ్‌లోని జాతీయ ప్రజాస్వామ్య ఫ్రంట్ (ఎన్‌డిఎఫ్) అధికార ప్రతినిధిగా వ్యవహరించాడు. తర్వాత అనేక సంవత్సరాల పాటు ఆయన మెలిటో గ్లోర్ కమాండ్ అధికార ప్రతినిధిగా అవిశ్రాంతంగా పనిచేశాడు. అనేక సమస్యలపై సిపిపి, ఎన్‌పిఏ వైఖరులను మాస్ మీడియాకు వివరించాడు. అదే విధంగా దక్షిణ టగలోగ్ విప్లవ ప్రజల వార్తా పత్రిక 'కలటన్' ప్రచురణ పనులు, రీజియన్‌కు చెందిన విప్లవ రేడియో కేంద్రం అయిన రాడ్యో పకికిబక ప్రసార పనులు కూడా చూశాడు.

1993 ఆఖరిలో కా రోజెర్‌ను పార్టీ అధికార ప్రతినిధిగా నియమించారు. రెండవ మహత్తర దిద్దుబాటు ఉద్యమాన్ని పురోగమింపజేయటానికి ప్రచార రంగ విధుల్ని ఆయన మొట్టమొదటగా నిర్వహించాడు. దిద్దుబాటు ఉద్యమానికి అడ్డుగా నిలిచి, పార్టీకి హాని చేసిన విప్లవ ప్రతీఘాతుక రెనగేడ్లతో పూర్తిస్థాయిలో రాజకీయ సమరాలు సాగించాడు.

2001లో కా రోజెర్‌కు జాతీయ ప్రచార కమిషన్ డిప్యూటీ సెక్రటరీ బాధ్యతలు అప్పగించారు. ఆయన సిపిపి అధికార ప్రతినిధిగానే కాక, అంగ్ బయాన్ రెగ్యులర్‌గా ప్రచురించే పనిని, ఫిలిప్పైన్ విప్లవ వెబ్ సెంట్రల్‌ను, సిపిపి వీడియో వేదిక 'సినీ ప్రొలెటార్యో' పనులను కూడా చూసేవాడు.

ఒక దశాబ్దం పైగా అధికార ప్రతినిధిగాను, సిపిపి ఇన్ఫర్మేషన్ బ్యూరో అధిపతిగానూ పనిచేశాడు. గెరిల్లా ఫ్రంటుల నుంచి దేశవ్యాప్తంగా వార్తలను ప్రసారం చేయడానికి మాస్ మీడియాతో సంబంధాలు నెలకొల్పుకోవడానికి విహెచ్ఎఫ్ రేడియోల నుంచి ఆధునిక సెల్ ఫోన్ల వరకూ అన్ని పద్ధతులను ఆయన వినియోగించాడు. సంక్లిష్టమైన సమస్యలపై సూటిగా వివరణలు ఇచ్చే కా రోజెర్ గొంతు కోసం దేశవ్యాప్తంగా ఎర్రపోరాట యోధులు, సాధారణ ప్రజలూ ప్రతిరోజూ ఆతురతగా ఎదురుచూసేవారు.

ఆయన పార్టీ వైఖరిని తెలియజేసే సరళమైన శైలి వల్ల ప్రజలు సమస్యల పట్ల అవగాహన, తమ రాజకీయ స్పృహను పెంచుకోవడానికి ఎంతో ప్రతిభావంతంగా ఉండేది. అభివృద్ధి నిరోధకులు, ప్రత్యేకించి ఫాసిస్టు ఫిలిప్పైన్స్ సైన్య అధికార ప్రతినిధులు ఒకటి తర్వాత మరొకటి గుప్పించే అబద్ధాల పుట్టను ఆయన ఎల్లప్పుడూ బహిర్గతం చేస్తూ ఉండేవాడు. అందువల్ల, ఆయనంటే వారికి చెప్పలేని ద్వేషం.

ఆయన మీడియా ప్రసారకులను, రచయితలను గెరిల్లాజోన్లకు ఆహ్వానించేవాడు. తద్వారా వారు విప్లవోద్యమ వాస్తవికతను, దానిని ఫిలిపినో ప్రజలు పురోగమింపజేస్తున్న తీరును స్వయంగా చూడగలిగేవారు. కా రోజెర్ చాలా నిరాడంబరమైన వ్యక్తి అని వారికి గెరిల్లాజోన్లలోనే అర్థమైంది. వారు ఆయన చెప్పేదాన్ని ఎంత ఆసక్తిగా వినేవారో, ఆయన కూడా అంతే ఆసక్తిగా వారు చెప్పేది వినేవాడు. వారు తమ సమస్యల్ని, బాధల్ని చెప్పుకునేవారు. కా రోజెర్ వారి పొగడ్తలను కాక, వారి గౌరవాన్ని పొందగలిగాడు. కా రోజెర్ ప్రదర్శించిన సామర్థ్యం, ఓపిక, సూటిదనం, తెలివితేటలు, దేశభక్తి, దేశం పట్ల ప్రేమ పార్టీ, విప్లవోద్యమ ప్రతిష్టను మరింతగా పెంచాయి. సిపిపి అధికార ప్రతినిధిగా ఫిలిప్పైన్ విప్లవ వార్తల్ని సేకరించడంలో కా రోజెర్ విసుగు లేకుండా పనిచేసేవాడు. అనేక రోజుల పాటు నడిచేవాడు, నదులు, సముద్రాలు దాటేవాడు, సుదూర ప్రదేశాలకు రోడ్డు మార్గాల ద్వారా పర్యటనలు చేసేవాడు. ఆయన ఏ రోజు, ఏ గంటలో అయినా ఇంటర్వ్యూలకు సిద్ధంగా ఉండేవాడు. అందువల్లనే మీడియాలో ఆయన అనేక మంది మిత్రుల్ని సంపాదించుకున్నాడు.

ఆయన పార్టీ అధికార ప్రతినిధిగా అనేక బహిరంగ కార్యకలాపాలకు నాయకత్వం వహించాడు. 1993లో లగునాలో పార్టీ స్థాపనా వార్షికోత్సవాన్ని నిర్వహించాడు. దానికి వేలాది మంది ప్రజలు హాజరయ్యారు. దక్షిణ టగలోగ్, బైకోల్‌లలో అనేక మంది యుద్ధ ఖైదీల విడుదలను పర్యవేక్షించాడు. ఫిలిప్పైన్స్ సైనిక బలగాల తీవ్రమైన కూంబింగ్ ఆపరేషన్ల మధ్య సైతం లగునా, అల్‌బే, క్వెజోన్, పర్వత ప్రావిన్స్‌లతో పాటు ఇతర ప్రాంతాలలోని గెరిల్లా ఫ్రంటులలో ఆయన ప్రెస్ కాన్ఫరెన్సులు నిర్వహించగలిగేవాడు.

కా రోజెర్ అంటే తీవ్రమైన ద్వేషంతో సైన్యం ఆయనపై అనేక తప్పుడు ఆరోపణలు చేసింది. ఆయన క్రూరుడని, నేరస్తుడని ప్రచారం చేసింది. ఆయనపై ఐదు మిలియన్ల పెసోల నగదును ప్రకటించింది. ఆయనను చంపడానికి లేదా ప్రాణాలతో పట్టుకోవడానికి మిలియన్ల పెసోల నగదును ఖర్చు చేసింది.

ఫిలిప్పైన్స్ సైన్యం ఆయనను పట్టుకోవడానికి లగునా (1998)లో, ఉత్తర క్వెజోన్ (2000–2001)లో, దక్షిణ క్వెజోన్ (2002)లో, అల్‌బే (2003)లో, మస్‌బతె (2004)లో, పర్వత ప్రావిన్స్ (2005)లో, తిరిగి దక్షిణ క్వెజోన్ (2005–2006)లో అనేక సైనిక క్యాంపెయిన్లను నిర్వహించింది. దాని ఇంటెలిజెన్స్ ఆపరేషన్లు నిర్విరామంగా పనిచేసేవి. ఫాసిస్టు ఏజెంట్లు నిరంతరం అతని కూతుళ్లను, తోబుట్టువులను, ఇతర బంధువులను, స్నేహితులను వెంటాడేవాళ్లు. సిపిపి ఇన్ఫర్మేషన్ బ్యూరో సెక్యూరిటీ యూనిట్ సైన్యంతో అనేక సమరాలు చేసింది. కాని, బలమైన ప్రజా పునాది వల్ల ఆయనకు వ్యతిరేకంగా శత్రువు నిర్వహించిన అన్ని రకాల ఆపరేషన్లనూ ఆయన అధిగమించగలిగాడు.

కా రోజెర్ తన విధుల్ని పరిపూర్తి చేసేందుకు అలసటను, ప్రమాదాలను లెక్కచేసేవాడు కాదు. రాత్రిళ్లు పొద్దుపోయే వరకూ రాయడం, చదవడం, మీటింగులు నిర్వహించడం చేసేవాడు. తిరిగి తెల్లవారే మేల్కొని వెంటనే తన పనిని కొనసాగించేవాడు. అవిశ్రాంతంగా పనిచేయడం వల్ల ఆయన ఆరోగ్యం మీద ప్రభావం పడింది. అనేక వ్యాధులకు దారితీసింది. 1995లో ఒక గెరిల్లా జోన్‌కు సుదీర్ఘ, కష్టభూయిష్టమైన ప్రయాణం తర్వాత అంటుకున్న టైఫాయిడ్ వల్ల ఆయన దాదాపు మృత్యువుకు చేరువగా వెళ్లాడు. ఒక నెల రోజులైనా విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్ సలహా ఇచ్చినప్పటికీ వెంటనే తన విధులను నిర్వర్తించడం తిరిగి కొనసాగించడంతో మళ్లీ అనారోగ్యానికి గురయ్యాడు.

1997లో ఆయనకు మొట్టమొదటిసారిగా గుండెపోటు వచ్చింది. కాని వెంటనే ఆయన దాని నుంచి తేరుకున్నాడు. పూర్తిస్థాయిలో తన విధుల్ని నిర్వహించగలిగాడు. 2000లో రెండవసారి స్ట్రోక్ వచ్చినప్పుడు కొన్ని నెలల పాటు ఆయన శెలవు పెట్టాడు. అయితే మొదటి స్ట్రోక్‌లో చేసినట్లుగానే, తన పనిని గ్రామీణ ప్రాంతంలో కొనసాగించేందుకు ప్రయత్నించాడు.

2006 మే 1న మరోసారి ఆయనకు స్ట్రోక్ వచ్చింది. మూడవసారి వచ్చిన ఈ స్ట్రోక్ తన శరీరానికి బాగా హాని చేసింది. శారీరకంగా ఆయన నిస్సత్తువగా ఉన్నప్పటికీ, విప్లవోద్యమానికి సేవ చేసేందుకై ఆయన దృఢంగా నిలబడ్డాడు. తన అనారోగ్యాన్ని అధిగమించేందుకు ఆయన తీవ్రంగా ప్రయత్నించాడు. కాని మూడవసారి స్ట్రోక్ తర్వాత ఆయన పరిస్థితి క్రమంగా దిగజారడం కొనసాగింది. గతంలోలా తన విధుల్ని నిర్వహించడం అసాధ్యమైంది.

2006 నుంచి 2011 వరకూ ఒక టీం ఆయన భద్రత, వైద్య అవసరాలు, జీవన అవసరాలు చూసింది. ఆయన తన విధుల్ని నిర్వహించే పరిస్థితి లేకపోయినప్పటికీ ఆయన ఇన్ఫర్మేషన్ బ్యూరోతో సన్నిహిత సంబంధంలో ఉండేవాడు. అది తన పనికి సంబంధించిన విషయాలపై ఆయనను తరచుగా సంప్రదిస్తూ ఉండేది. ఆయన

అనారోగ్యం పాలైనప్పటికీ, పార్టీ కృషిలో వస్తున్న అభివృద్ధి గురించి, ప్రత్యేకించి బ్యూరోలో వస్తున్న మార్పుల గురించి ఆయన ఎప్పటికప్పుడు తెలుసుకునేవాడు. సమిష్టి చర్చలలో, విద్యా బోధనలో, ప్లానింగ్‌లో, విమర్శ–స్వయం విమర్శలలో పాల్గొనేవాడు. ఆయన సంతోషంగా సహచర కామ్రేడ్స్‌తో చర్చిస్తూండేవాడు. ఆయన పనిచేసిన రోజుల గురించి, గ్రామీణ ప్రాంతంలో ఆయన అనుభవాల గురించి, అతని కూతుళ్లు, జీవన సహచరి, తల్లి గురించి ఆయన చెప్పే కథనాలను విసుగు–విరామం లేకుండా వినేవారు. అనుకూల వేళల్లో కామ్రేడ్స్ అభ్యర్థన మేరకు ఆయన హార్మోనియం వాయించేవాడు.

అనేక సందర్భాలలో ఆయన కూతుళ్లు ఆయనను కలిసేవారు. వారాల నుంచి నెలల వరకూ ఆయనతో పాటు ఉండి ఆయన బాగోగులు చూసుకునేవారు. తన కూతుళ్లు పెరిగి ప్రజలకు సేవ చేయడం ఆయనకు ఎంతో ఆనందాన్ని కలిగించేది. 2003లో తాను తన జీవన సహచరి నుండి విడాకులు తీసుకున్నప్పటికీ వారు స్నేహితులుగానే ఉండడం, వారి కూతుళ్లకు తల్లిదండ్రులుగా వ్యవహరించడం కూడా ఆయనకు ఎంతో సంతృప్తిగా ఉండేది. ఆయన తరచు వారి నుంచి దూరంగా ఉండాల్సి వచ్చినప్పటికీ ఆయన కూతుళ్లు ఆయనకు తరచుగా వుత్తరాలు రాసేవారు. తమ జీవిత విషయాలపై అనేక సలహాలు అడుగుతూ ఆయన సంబంధంలోనే వుండేవారు.

ఆయనకు అనారోగ్యం ఉన్నప్పటికీ ప్రతి రోజూ ఉదయమే లేచి వార్తలు వినేవాడు. పార్టీ విడుదల చేసిన స్టేట్‌మెంట్స్‌ను సమీక్షించగలిగేవాడు. 2009 నవంబర్‌లో మగుయిన్‌డనావో హత్యాకాండలో అనేక మంది మీడియా రిపోర్టర్లు మృతి చెందడం గురించి ఆయన తీవ్రంగా ఆందోళన చెందాడు. 2011 నూతన సంవత్సరాదిన బెనినో అక్వినో–3 ప్రభుత్వ హయాంలో వస్తున్న పరిణామాల్ని సమీక్షిస్తూ విప్లవ పోరాటాల్ని తీవ్రతరం చేయాల్సిందిగా ఆయన ఫిలిపినో ప్రజలకు ఒక సందేశం ఇచ్చాడు.

వైద్య సహాయం అందిస్తానన్న ఫిలిప్పైన్స్ సైన్యం అభ్యర్థనను ఆయన తిరస్కరించాడు. తన తలకు కట్టిన వెలను వుపసంహరించకుండా, తనను పట్టుకోవడానికి నిరంతరం కొనసాగిస్తున్న ఆపరేషన్లను ఆపకుండా, తనకు వైద్యం పేరుతో వుచ్చు వేయడం వెనక ఉన్న కుట్రను గుర్తించాడు.

2009 ఏప్రిల్ 19న కా రోజెర్ 62వ పుట్టిన రోజు సందర్భంగా కామ్రేడ్స్ జమ అయ్యారు. ఫిలిప్పైన్స్ విప్లవానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయనకు ధన్యవాదాలు తెలియజేయటానికి పార్టీ ఆ అవకాశాన్ని ఉపయోగించుకుంది. ఆ రోజు 1980లలో దక్షిణ టగలోగ్‌లో ప్రజలకు ధన్యవాదాలు చెబుతూ కా రోజెర్ రాసిన 'అవిట్ న కయిన్‌గినెరో' అనే పాటను పాడారు. ప్రజలకు, పార్టీకి, విప్లవానికి తన జీవితాన్ని అంకితం చేసినందుకు ఆయనకు వాళ్లంతా సెల్యూట్ చేశారు.

కా రోజెర్ తన చివరి ఊపిరి వరకూ ఆకలికి, దారిద్ర్యానికి గురైన వారికి, సామాజిక న్యాయం కోసం, జాతి విముక్తి కోసం వారు సాగించే విప్లవోద్యమానికి అంకితం చేశాడు.

ఆయన మృతికి సంతాపం తెలిపేందుకు ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీకి చెందిన సభ్యులంతా, న్యూ పీపుల్స్ ఆర్మీకి చెందిన పోరాట యోధులంతా, ఫిలిపినో ప్రజలంతా ఆయన కుటుంబంతో, ఆయన స్నేహితులతో పాటు నిలిచారు. అత్యంత ప్రతిభావంతుడైన కమ్యూనిస్టు, ధీరోదాత్తమైన ఎర్ర పోరాట యోధుడు, ప్రజలను సంరక్షించే సమరశీల యోధుడు, గౌరవనీయమైన కామ్రేడ్, స్నేహితుడు అయిన కా రోజెర్‌కు వారు బిగించిన పిడికిళ్లతో, సాయుధంగా వందనం చేశారు.

కా రోజెర్ విజయాలను, స్మృతులను ఫిలిపినో ప్రజలకు వారసత్వంగా వదిలి వెళ్లాడు. అవి ఫిలిపినో ప్రజల విప్లవ చరిత్ర పుటల్లో స్పష్టంగా కన్పిస్తాయి. ఆయన పేరు ఇప్పుడు ఫిలిపినో విప్లవం కోసం పోరాడిన ఇతర వీరుల పేర్ల సరసన చేరిపోయింది. జాతి విముక్తి కోసం, సమాజ విముక్తి కోసం ఫిలిపినో ప్రజలు సాగించే పోరాటంలో వారిని ఆయన ఎల్లప్పుడూ వుత్తేజపరుస్తూనే వుంటాడు.

★

***మహిళలపై భౌతిక దాడులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. అంతేకాదు గృహ హింస కేసుల నమోదును పరిశీలిస్తే రాష్ట్రం రెండో స్థానంలో నిలిచింది. 'లాయర్స్ కలెక్టివ్ విమెన్స్ రైట్స్ ఇనీషియేటివ్' అనే స్వచ్ఛంద సంస్థ 16 రాష్ట్రాల్లో 2010 ఏప్రిల్ నుంచి 2011 మార్చి వరకు చోటు చేసుకున్న గృహ హింస సంఘటనలపై నమోదైన కేసుల గణాంకాలను సేకరించింది.***

***ఈ సర్వే ప్రకారం దేశంలో అత్యధికంగా 2,433 కేసులు మహారాష్ట్రలో నమోదు కాగా, తర్వాతి స్థానాల్లో ఆంధ్రప్రదేశ్ (1,174), కర్నాటక (1,013), మధ్యప్రదేశ్ (882), కేరళ (631) వున్నాయి. ఇక స్త్రీలను పూజించాలని చెప్పే భారత్ ఆడ శిశువులకు ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన దేశమని ఐక్య రాజ్య సమితి నివేదిక పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ఆడ శిశువుల స్థితిగతులపై ఐరాస ఆర్థిక, సామాజిక వ్యవహారాల విభాగం ఈ నివేదికను విడుదల చేసింది. భారత్‌లో ఐదేళ్ల లోపు మగ పిల్లలతో పోలిస్తే నవజాత ఆడ శిశువులకు మరణించే అవకాశాలు 75 శాతం ఎక్కువని వివరించింది. ఆడ పిల్లలపై భారత్‌లో వివక్షే ఈ దుస్థితికి కారణమని వ్యాఖ్యానించింది.***

# పోలీసుల కుటుంబాల్లో భగ్గుమన్న అసంతృప్తి జ్వాల

పోలీసులంటే సాధారణ ప్రజల దృష్టిలో అచ్చోసిన ఆంబోతులు. ప్రజలు ఏ చిన్న నిరసనకు దిగినా ముందుగా వాళ్లు ఎదుర్కోవల్సి వచ్చేది పోలీసులనే. లాఠీలు, టియర్ గ్యాసులు, వాటర్ కెనాన్‌లు, ఆఖరికి తూటాలు ప్రయోగించి ప్రజల నిరసనను చెదరగొట్టడానికి, అణచివేయడానికి పోలీసులు ఎల్లవేళలా తయారుగా వుంటారు. ఇక వుద్యమ ప్రాంతాల్లోనైతే పోలీసులంటే 'యములే'. ప్రజలకు 'నరకం' చూపిస్తారు. ఏ గ్రామంలోకి పోలీసులు అడుగుపెట్టినా అక్కడొక అల్లకల్లోలం చెలరేగుతుంది. ఉద్యమకారులను, ఉద్యమకారుల కుటుంబాలనే కాకుండా సామాన్య ప్రజలను కూడా చెప్పరాని రీతిలో చిత్రహింసలు పెట్టడం, అరెస్టులు చేయడం, మహిళలపై సామూహిక లైంగిక అత్యాచారాలు చేయడం, ఎన్‌కౌంటర్ల పేరిట పాశవిక హత్యలకు పాల్పడడం, ఇండ్లను కాల్చడం, కూలగొట్టడం, ఆస్తులను, పంటలను విధ్వంసం చేయడం ఒకటేమిటి మనుషులను వేధించడానికి, బాధించడానికి, హింసించడానికి, ఏడిపించడానికి ఎన్నిరకాలుగా చేయవచ్చో అన్ని రకాలుగా చేస్తారు. ఇంకా కొత్త కొత్త మార్గాల కోసం అన్వేషిస్తారు. వుద్యమాలకో, నిరసన చర్యలకో పాల్పడితేనే, లేదంటే వుద్యమ ప్రాంతాల్లో నివసిస్తేనే పోలీసుల జులుంను ఎదుర్కోవల్సి వస్తుందని భావించడానికి వీలులేదు. పొట్టకూటి కోసం రోడ్ల మీద చిన్న చిన్న దుకాణాలు నడుపుకునే వారు, సారా వ్యాపారం చేసేవాళ్లు, ఆఖరికి ఒళ్లమ్ముకునే మహిళలు... ఇంకా ఎందరెందరో బడుగుజీవులు పోలీసు జులుంను నిరంతరం ఎదుర్కోవలసే వస్తుంది. ఇంకా తమ మానాన తాము వెళ్తుంటేనో, రాత్రిపూట సినిమాలకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుంటేనో కూడా అకారణంగా ఎంతో మంది పోలీసుల జులుంకు, అత్యాచారాలకు గురైన సంఘటనలు కోకొల్లలు. అంతగా ప్రజా జీవితంలో పోలీసుల జోక్యం పెరిగిపోతున్నది. ప్రజలను తిట్టడానికైనా, కొట్టడానికైనా, ఆఖరికి చంపడానికైనా తమకేవో ప్రత్యేకాధికారాలు వున్నట్టుగా పోలీసులు వ్యవహరిస్తారు. అందుకే పోలీసులంటే సామాన్య ప్రజలకు భయమో, అసహ్యమో, ఛీత్కారమో, చులకనో, ఆగ్రహమో, ఇవన్నీ కలిసో వుంటాయి తప్ప గౌరవభావం మాత్రం వుండదు. వాళ్లను రక్షక భటులుగా కాక భక్షక భటులుగానే చూస్తారు. అయితే ఇదంతా నాణానికి ఒకవైపు మాత్రమే.

మరి మరొక వైపు? సామాన్య ప్రజల మీద విరుచుకు పడే పోలీసులు, అధికారుల ముందు కుక్కినపేన్లలాగా వుంటారు. సామాన్య ప్రజలను, ఉద్యమకారులను దుర్భాషలాడే పోలీసులు అధికారుల దుర్భాషలను మౌనంగా భరిస్తారు. ప్రజల ఆత్మాభిమానాన్ని, వ్యక్తిత్వాన్ని ఎన్నడూ గౌరవించని పోలీసులు అధికారుల ముందు తమ ఆత్మగౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని చంపుకుంటారు. ఎందరో తల్లి దండ్రుల కడుపులు కాల్చే, భార్యలకు భర్తలను, భర్తలకు భార్యలను, పిల్లలకు తల్లిదండ్రులను లేకుండా చేసే పోలీసుల కుటుంబాలు సుఖశాంతులతో ఏమీ లేవు. తల్లిదండ్రులకు, భార్యలకు, పిల్లలకు, చివరకి తమకే రోగమొచ్చినా, చావు దగ్గరకు వచ్చినా పట్టించుకునే పరిస్థితి పోలీసులకు లేదు. ప్రజలతో చిత్తం వచ్చినట్టుగా వ్యవహరించే ప్రత్యేకాధికారాలు తమకు వున్నట్టుగా ప్రవర్తించే పోలీసులకు చాలా సందర్భాల్లో కనీస హక్కులు కూడా వుండవు. ప్రజల దృష్టిలో పోలీసులు మనుషులు కాదు, యములు. అధికారుల దృష్టిలో కూడా పోలీసులు మనుషులు కాదు, బానిసలు.


అధికారులను నిలదీస్తున్న పోలీసుల పిల్లలు

ఈ పరిస్థితి ఎప్పటి నుండో వున్నదే. అందుకే 'నాసా కింద మీసా కింద నిన్ను జైల్లో పెట్టినారు... నీకూ నాకూ తేడా లేదన్నో... పోరు తప్ప దారి లేదన్నో' అని గద్దర్ ఎప్పుడో అన్నాడు. తాజాగా ఏపీఎస్పీ (ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్)లో చెలరేగిన నిరసన జ్వాలలు సాధారణ పోలీసుల దుస్థితిని మరోసారి వెలుగులోకి తెచ్చాయి.

రాష్ట్రంలో మొత్తం 17 ఏపీఎస్పీ బెటాలియన్లు వున్నాయి. ఒక్కో బెటాలియన్‌లో 1200 మంది కానిస్టేబుళ్లు వుంటారు. ఈ కానిస్టేబుళ్లు గతంలో ఒక నెల రోజుల పాటు కుటుంబాలకు దూరంగా ఇతర ప్రాంతాల్లో విధుల్లో వుంటే, మరొక నెల పాటు బెటాలియన్‌లోనే అంటే కుటుంబాలకు దగ్గరగా విధుల్లో వుండేవారు. కుటుంబానికి దూరంగా నెలరోజులు విధుల్లో వున్న సమయంలో మధ్యలో మూడు రోజులు ఇంటికి వెళ్లడానికి సెలవులు ఇచ్చేవారు. అయితే ఇటీవల ఈ విధానంలో మార్పు వచ్చింది. బెటాలియన్‌లోని ప్రతి కంపెనీని ఏ, బీ, సీ, అనే మూడు గ్రూపులుగా విభజించారు. దీని ప్రకారం ప్రతి గ్రూపు 40 రోజులు ఇతర ప్రాంతాల్లో విధుల్లో వుండాలి. 20 రోజులు మాత్రమే కుటుంబానికి దగ్గరగా బెటాలియన్‌లో విధులు నిర్వహించాలి. ఇతర ప్రాంతాల్లో విధుల్లో వున్న సమయంలో గతంలో ఇచ్చిన నెలకు మూడు రోజుల సెలవును కూడా ఇప్పుడు రద్దు చేశారు. దీని వల్ల ఈ నలభై రోజుల పాటు ఎంత అత్యవసరమైనా సెలవు పొందే అవకాశం కానిస్టేబుళ్లకు

లేదు. వారాంతపు సెలవులు లేని ఏకైక ఉద్యోగం బహుశా ఇదే కావొచ్చు. అయితే సెలవులు పొందడానికి ఒక దొంగ దారి మాత్రం వుంది. ఇతర ప్రాంతాల్లో పని చేస్తున్న సమయంలో రోజుకు 200 రూపాయలు ప్రయాణ భత్యం, 60 రూపాయలు భోజన భత్యం ఇస్తారు. అత్యవసర పరిస్థితిలో కానిస్టేబుళ్లకు సెలవు కావాలంటే ఈ 260 రూపాయలను అధికారులకు ఇచ్చేస్తే అనధికారికంగా సెలవు మంజూరు చేస్తారు. ఒక్కోసారి 500 రూపాయలు కూడా లంచంగా ఇవ్వాల్సి వస్తుంది. అయితే కుటుంబానికి దూరంగా అంటే 200 కిలోమీటర్ల పరిధిలోనే విధులు నిర్వర్తించాలనే నిబంధన గతంలో వుండేది. ప్రస్తుతం 800 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడైనా పనిచేయాల్సి వస్తున్నది. దీని వల్ల ఎవరికైనా ప్రాణం మీదికి వచ్చి లంచం ఇచ్చి అనధికారికంగా సెలవు పొందినా ఒకరోజులో ఇంటికి చేరలేని పరిస్థితి. కొన్ని సందర్భాల్లో మూడు నెలలపాటు కూడా పోలీసులు ఇంటికి దూరంగా వుండాల్సి వస్తున్నది.

ఇతర ప్రాంతాల్లో పని చేయడంలో సమస్యలు ఇలా వుంటే బెటాలియన్‌లో విధులు నిర్వర్తించే సమయంలో ఇంకో రకమైన సమస్యలు. ఒకసారి పోలీసు స్టేషన్‌కు వెళ్లిన తర్వాత తిరిగి ఎప్పుడు ఇంటికి చేరుతారో ఎవరికీ తెలియని పరిస్థితి. అధికారుల ఆదేశాలను తప్ప పనివేళలను పాటించడం వుండదు. ఇక ప్రతి కానిస్టేబుల్ అధికారుల ఇండ్లల్లో ఆర్డర్లీగా పనిచేయాల్సి వస్తుంది. కింది నుండి పై వరకూ అధికారులందరూ ప్రతి ఒక్కరు ఇద్దరి నుండి నలుగురి వరకూ ఆర్డర్లీలను నియమించుకుంటారు. ఏపీఎస్పీలో ఈ ఆర్డర్లీ విధానం ఎక్కువగా వుంది. ఆర్డర్లీలు అధికారుల ఇండ్లల్లో వెట్టి చాకిరీ చేయాలి. వంట చేయడం, బట్టలు వుతకడం, బూట్లు తుడవడం, మరుగుదొడ్లు కడగడం వంటి ఏ పనినైనా చేయాలి. ఇంటి దగ్గర తమ పిల్లల ఆలనా పాలనా చూడకపోయినా అధికారుల పిల్లల ఆలనా పాలనా చూడడం, వాళ్ల పెంపుడు కుక్కలను షికారుకు తిప్పడం వంటివి కూడా చేయాలి. పని మనుషులకైనా నిర్ణీత వేళలు వుంటాయి కాని ఈ ఆర్డర్లీలకు అటువంటివేవీ వుండవు. ఇక అడుగడుగునా అధికారులు, అధికారుల భార్యలు చేసే అవమానాలను, ఛీత్కారాలను, దుర్భాషలను దిగమింగవల్సిందే. ఈ వేధింపులను భరించలేక మూడేళ్ల క్రితం అంబర్ పేట పోలీస్‌లైన్స్‌కు చెందిన మురళీనాథ్ అనే కానిస్టేబుల్ అనుమానస్పద స్థితిలో మరణించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఆర్డర్లీ వ్యవస్థను రద్దు చేసింది. కాని ఈ రద్దు అనేది కాగితాలకే పరిమితమై, ఆచరణలో ఇంకా కొనసాగుతూనే వుంది.

**పత్రికకు మీ ప్రాంతంలోని పోరాట, ప్రతిఘటన, నిర్బంధ, సభలూ - సమావేశాల నివేదికలు, అమరుల చరిత్రలను ఎప్పటికప్పుడు పంపుతూ వుండండి.**

వీటన్నింటికి తోడు అధికారులు చీటికి మాటికి దుర్భాషలాడడం, అవమానించడం సర్వసాధారణం. ఇక కానిస్టేబుళ్లను ఏ అధికారి కూడా పేరు పెట్టి పిలవదు, నెంబర్లతోనే పిలుస్తాడు. ఇలా కానిస్టేబుళ్ల ఆత్మాభిమానం అడుగడుగునా గాయపడుతూనే వుంటుంది. ఎవరైనా తమ ఆత్మాభిమానాన్ని కాస్తయినా ప్రదర్శించాలని చూస్తే వాళ్లను శాఖాపరంగా వేధిస్తారు. వాళ్లను నిరంతరం శవాలకు కాపాలా డ్యూటీలోనో, బందోబస్తు డ్యూటీలోనో వేస్తారు. ఈ వేధింపులను భరించలేక ఇటీవల వరంగల్ ఏపీఎస్పీ నాలుగో బెటాలియన్ సిబ్బంది కమాండెంట్‌ను చితకబాదారనీ, అయితే ఈ సంఘటన ప్రచారం కాకుండా అధికారులు తొక్కిపెట్టారని పత్రికలు రాశాయి.

మరుగుదొడ్లు వంటి కనీస అవసరాలను కూడా తమకు కల్పించడం లేదని కానిస్టేబుళ్లు ఆరోపిస్తున్నారు. వేళా పాళా లేని విధులు, వేళా పాళా లేని తిండీ తిప్పలు, పని వత్తిడి, నిస్సహాయత, అసంతృప్తులు పోలీసుల ఆరోగ్యాలపై తీవ్రమైన ప్రభావం వేస్తున్నాయి. పోలీసు శాఖలో ప్రతి ఏటా సగటున 350 మంది పదవీకాలంలో వుండగానే అనారోగ్యాలతో చనిపోతున్నారని గణాంకాలు తెలియజేస్తున్నాయి. మరే ఇతర వుద్యోగాల్లోనూ ఈ పరిస్థితి లేదు. నల్లగొండ జిల్లాలో గత కొంతకాలం క్రితం చేసిన ఒక సర్వే ప్రకారం నలభై ఏళ్ల వయసున్న పోలీసు సిబ్బందిలో ఇరవై శాతం మంది రక్తపోటు (బ్లడ్‌ప్రెజర్), మధుమేహం (షుగర్) వ్యాధుల బారిన పడుతున్నారు. ఇక వేధింపులను భరించలేక ఆత్మహత్యలకు పాల్పడడం, ఒకరినొకరు కాల్చిచంపుకోడం వంటి ఘటనల గురించి మనం వింటూనే వున్నాం.

మొత్తంగా ఈ పరిస్థితి మహిళా కానిస్టేబుళ్లకు ఎంత దుర్భరంగా వుంటుందో ఊహించడం కష్టం కాదు. మహిళా కానిస్టేబుళ్లపై అధికారులు లైంగిక వేధింపులకు పాల్పడుతున్న విషయం కూడా పలుసార్లు వెలుగులోకి వస్తున్నది.

ఈ పరిస్థితి పోలీసుల కుటుంబాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది. ముఖ్యంగా కానిస్టేబుళ్ల భార్యలపై వత్తిడి బాగా పెరుగుతున్నది. పితృస్వామ్య సమాజంలో పిల్లల భవిష్యత్‌ను మలచడంలో తండ్రుల పాత్ర కీలకంగా వుంటుంది. ఎన్నడూ తండ్రులు ఇంటిపట్టున వుండకపోవడం అనేది పిల్లల పెంపకాన్ని, చదువులను, వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తుంది.

దేశానికే ఆదర్శంగా పాలకులు చాటింపు వేస్తున్న ఆంధ్రప్రదేశ్ పోలీసుల దుస్థితి ఇది. ఇలా పోలీసుల్లో పేరుకు పోతున్న అసంతృప్తి సామాన్య ప్రజల మీదికి మరలుతున్నది. అధికారులను ఏమీ అనలేని తమ నిస్సహాయతను సామాన్య ప్రజలపై ప్రతాపంగా మలుచుకుంటున్నారు. కానిస్టేబుళ్లను నెలల తరబడి భార్యలకు దూరంగా వుంచుతున్న అధికారులు, దానికి పరిహారంగా వుద్యమ ప్రాంతాల్లోని మహిళపై అత్యాచారాలు చేసే అనధికార హక్కు కల్పిస్తున్నారు.

ఈ మొత్తం పరిస్థితి నేపథ్యంలో పోలీసుల్లో, పోలీసు కుటుంబాల్లో రగులుకుంటున్న అసంతృప్తి తాజాగా జరిగిన ఒక ఘటనతో భగ్గుమంది.

విప్లవోద్యమ అణచివేతలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా అడ్డతీగల ఏజెన్సీలో డ్యూటీలో వున్న పయణిరెడ్డి అనే కానిస్టేబుల్ మలేరియా బారినపడ్డాడు. హైదరాబాద్‌కు వెళ్లి చికిత్స చేయించుకుంటానని సెలవు అడిగినా అధికారులు సెలవు శాంక్షన్ చేయకపోవడంతో అతను ఆగస్ట్ 2న చనిపోయాడు.

ఇది పోలీసు కుటుంబాల్లో పెద్ద కదలికను తెచ్చింది. ఆగస్ట్ 4న మొదట రాష్ట్ర రాజధానిలోని కొండాపూర్ 8వ బెటాలియన్ వద్ద పోలీసుల భార్యలు, పిల్లలు ఆందోళన ప్రారంభించారు. ఆ వెంటనే కొన్ని గంటల్లోనే రాష్ట్ర నలుమూలలకు వ్యాపించింది. రాజధానిలో వున్న యూసుఫ్‌గూడ బెటాలియన్‌తో పాటు ఖమ్మం, విజయనగరం, తూర్పుగోదావరి, కడప, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్, నెల్లూరు, గుంటూరు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో వున్న 12 బెటాలియన్లకు ఈ ఆందోళన పాకింది. ఆగస్ట్ 4న మధ్యాహ్నం ప్రారంభమైన ఈ ఆందోళన, 5వ తేదీ రాత్రి వరకూ కొనసాగింది. ఆందోళనకారులు పలు చోట్ల అధికారులపై విరుచుకు పడ్డారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గేట్ల ముందు బైఠాయించారు. జాతీయ రహదారులపైనా, ముఖ్యమైన రహదారులపైనా బైఠాయించి గంటల కొద్దీ ట్రాఫిక్‌ను స్తంభింపజేశారు. కొండాపూర్‌లో ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఇక్కడ ఆందోళనాకారుల పట్ల పోలీసు సహజమైన దురుసుతనంతో వ్యవహరించి, అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసి, కాల్చిపారేస్తానని బెదిరించిన ఐజీ ఎ.బి. వెంకటేశ్వరరావుపైన, వేధింపులకు పాల్పడుతున్న కమాండెంట్ పైన మహిళలు చెప్పుల వర్షం కురిపించడంతో పాటు దాడి చేయడానికి ప్రయత్నించారు. ఆందోళనా కార్యక్రమాన్ని చిత్రీకరిస్తున్న ఒక కానిస్టేబుల్‌ను ఎపీఎస్పీ కానిస్టేబుళ్లు, వారి భార్యలు చితకబాదారు.

ఏ ఆందోళననైనా చెదరగొట్టడానికి, అణచివేయడానికి అధికారుల ఆదేశాలనందుకొని లాఠీలు, తుపాకులు పట్టుకుని పరుగెత్తే ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు తమ భార్యలు చేస్తున్న ఆందోళనకు ప్రేక్షకులయ్యారు. వారి వెనుకే నిలబడి తమ మద్దతును ప్రకటించారు. రాష్ట్ర చరిత్రలో ఇలా పోలీసు కుటుంబాలు తిరగబడడం అపూర్వమైనది.

ఆందోళనలు జరుగుతున్న అన్ని చోట్లకు అధికారులు రంగప్రవేశం చేసి ఆందోళన విరమింపజేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. కొండాపూర్ బెటాలియన్‌కు అదనపు డీజీ గౌతం సావంగ్ వచ్చి ఆందోళనాకారులతో చర్చలు జరిపాడు. గౌతం సావంగ్ ఎదుటనే మహిళలు ఐజీ, కమాండెంట్‌లపై చెప్పులు విసిరి దాడి చేయబోయారు. వాళ్లిద్దరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాళ్లిద్దరిపై చర్యలు తీసుకునే విషయంలో డీజీపీతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని గౌతం సావంగ్ హామీనిచ్చాడు. అలాగే ఏబీసీ డ్యూటీ విధానాన్ని రద్దు చేస్తామని, గతంలో వలె నెలకు మూడు రోజులు సెలవు మంజూరు చేస్తామని, దూర ప్రాంతాలకు కాకుండా బెటాలియన్‌కు దగ్గర్లోనే డ్యూటీలు వేస్తామనీ హామీ ఇచ్చాడు. అయితే రెండు నెలలలోగా వీటి అమలుకు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో మహిళలు రెండు రోజుల్లోనే చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. అప్పటి వరకూ తమ ఆందోళన ఆపేది లేదన్నారు. అధికారులు పదే పదే విజ్ఞప్తి చేసిన మీదట రాత్రికి ఆందోళన విరమించారు. పలుచోట్ల ఆందోళన చేస్తున్న తమను కించపరిచేలా మాట్లాడిన అధికారుల చేత మహిళలు క్షమాపణ చెప్పించుకున్నారు. చిన్నారులు సైతం ఈ ఆందోళనల్లో పాల్గొని అధికారులను ధైర్యంగా నిలదీయడం విశేషం.

అయితే ఎలాగోలా నచ్చజెప్పో, బుజ్జగించో ఆందోళన విరమింపజేసిన పోలీసు అధికారులు ఆ తర్వాత తమ సహజ శైలిలోనే స్పందించారు. నిరసనలపై విచారణకు డీజీపీ దినేష్ రెడ్డి ఆదేశించాడు. క్రమశిక్షణ కలిగి వుండాల్సిన పోలీసు శాఖలో ధర్నా, రాస్తారోకోలాంటి నిరసన కార్యక్రమాలు చేయడం, చట్టాలను తమ చేతుల్లోకి తీసుకోవడం వంటి చర్యలను సహించబోమని అన్నాడు. (ధర్నాలు, రాస్తారోకోలు చేయడం ద్వారా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదు. కాని ప్రజలను చిత్రహింసలు పెట్టడం, మాయం చేయడం, లాకప్పులో హింసించి చంపడం, ఎన్‌కౌంటర్ల పేరిట చంపడం, మహిళలను అత్యాచారాలను చేయడం వంటి చర్యల్లో మాత్రం చట్టాన్ని నిక్షేపంగా చేతుల్లోకి తీసుకోవచ్చు!) ఇక గౌతం సావాంగ్ ఈ ఆందోళనల వెనుక అరాచక శక్తులు వున్నట్టుగా గుర్తించామని చెప్పాడు. ఈ ఆందోళనల నేపథ్యంలో కొందరు కానిస్టేబుళ్లపై క్రిమినల్ కేసులు కూడా పెట్టారు. అధికారుల ఈ ప్రతిస్పందన కానిస్టేబుళ్ల కుటుంబాల అసంతృప్తిని మరింత పెంచే విధంగా వుంది. కనుక ఈ ఆందోళన విరమణ తాత్కాలికమే కావొచ్చు. మరెప్పుడో ఈ అసంతృప్తి మళ్లీ భగ్గుమనే అవకాశం వుంది.

పోలీసుల భార్యలు, పిల్లలు చేసిన ఈ ఆందోళన స్వాగతించవలసినది. పోలీసు వ్యవస్థలోని కొన్ని చీకటి కోణాల మీదనైనా ఇది వెలుగును ప్రసరింపజేసింది. అయితే తమ భర్తల్ని వేధిస్తున్న, తమ కుటుంబాలను వేదనకు గురి చేస్తున్న నిబంధనలపైనా, అధికారులపైనా తిరుగుబాటు చేసిన ఈ మహిళలు; తమ భర్తల్ని మృగాలుగా, హంతకులుగా, రేపిస్టులుగా తయారు చేయవద్దనీ చట్ట ప్రకారం మాత్రమే వారిని విధులు నిర్వర్తించనివ్వాలని కూడా అధికారులపై తిరుగుబాటు చేస్తే... అది ఎంతో కొంత ప్రగతిశీలమైనది అవుతుంది. పోలీసులు ఎదుర్కొంటున్న అణచివేతకు శాశ్వత పరిష్కారం మాత్రం వాళ్లు విప్లవోద్యమంతో సమైక్యమయినప్పుడే లభిస్తుంది.

★

# పోరాటాలు - ప్రతిఘటన - సభలు

## ఏవోబీ

### కోరాపుట్ జిల్లాలో

#### కామ్రేడ్ నందు శీరిక హత్య పోలీసుల కుట్రే!

కామ్రేడ్ నందు శీరిక నారాయణపట్నా బ్లాక్, బీజాగాటి పంచాయితీ జొడిపొదర్ గ్రామస్థుడు. ఇతని అన్న ఛసి మూలియా ఆదివాసీ సంఘం బీజాగాటి కమిటీ అధ్యక్షుడు. జొడిపొదర్ గ్రామంలోని ఛసి మూలియా సంఘ వ్యతిరేకులకు, శాంతి సంఘంలో పని చేస్తున్న వారికి నందు శీరిక అన్నను చంపడం లక్ష్యం. అతను దొరకక పోవడంతో పశువులను కాస్తున్న నందు శీరికను అత్యంత కిరాతకంగా కత్తులు, గొడ్డళ్లు, బరిశెలతో నరికి చంపారు. అతనితో పాటు వున్న మహిళను తీవ్రంగా గాయపరచి పారిపోయారు. ఈ హత్యను ఛసి మూలియా సంఘం (సిఎమ్ఎస్) తీవ్రంగా ఖండిస్తూ హంతకులను శిక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చింది.

జొడిపొదర్ గ్రామంలోని శాంతి సంఘంలో పని చేస్తున్న లచ్చయ శీరిక కుటుంబం ఈ హత్యకు కారణం. ఈ కుటుంబం శాంతి సంఘంలో వుంటూనే దోపిడీ చేస్తూ ప్రజల వ్యతిరేకతకు గురయింది. గ్రామం విడిచి పారిపోయిన ఈ కుటుంబ సభ్యుడు పురి శీరిక పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా మారినందున పిఎల్‌జిఎ ఇతన్ని ఖతం చేసింది. దీనితో కక్ష పెంచుకున్న పురి అన్న నప్పర శీరిక కూడా ఇన్‌ఫార్మర్‌గా మారి ఒక ఎన్‌కౌంటర్‌కు కారకుడయి నందుకు శిక్షకు గురయ్యాడు. దీంతో మిగిలిన కుటుంబం నందు శీరిక కుటుంబంపై కక్షకట్టి, పోలీసుల ప్రోద్బలంతో ఈ హత్యకు పథకం వేసింది. ఈ పథకంలో రత్తమట్టి, దేవుబిల్లి గ్రామాల్లోని పెత్తందారులు, శాంతి సంఘం వాళ్లు భాగమయ్యారు.

నందు శీరిక హత్యా సమాచారం తెలుసుకున్న వందలాది మంది ప్రజలు కదిలి శవాన్ని తీసుకెళ్లి హత్య చేసిన వారి ఇళ్ల ముందే దహన సంస్కారాలు జరిపారు. సంఘం ఈ హత్యను తీవ్రంగా ఖండిస్తూ దీని వెనుక గల కుట్రను బహిర్గతం చేసి, సంబంధిత వ్యక్తులకు హెచ్చరికలు జారీచేసింది. ఈ హత్యతో భయపడి గ్రామం విడిచి పారిపోయిన సామాన్య కుటుంబాలను తిరిగి గ్రామానికి తీసుకువచ్చింది. హంతకులకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలందరికీ పిలుపునిచ్చింది.

తీవ్రంగా నష్టపోయిన నందు శీరిక కుటుంబానికి అన్ని రకాల సహాయ సహకారాలు, మద్దతు ఇవ్వాలని సంఘం తీర్మానించింది. ప్రతి పంచాయితీలోని ప్రజల నుండి చందాలు జమ చేసి ఆర్థికంగా సహాయం చేసింది. పంచాయితీ తరపు నుండి కొత్త బట్టలు, దినకర్మకు అయిన ఖర్చును భరించింది. ఆ సందర్భంగా బహిరంగ సభ జరిపి కామ్రేడ్ నందు శీరిక కుటుంబానికి మద్దతుగా నిలవాలనీ, శాంతి సంఘం, పోలీసులు ఇతర చోట్ల కూడా ఇలాంటి హత్యలు జరిపే అవకాశం వుందనీ, సంఘ సభ్యులు, ప్రజలు అప్రమత్తంగా వుండాలనీ పిలుపునిచ్చింది.

#### బిప్లబి ఆదివాసీ మహిళా సంఘం అధ్యక్షురాలు కామ్రేడ్ సున్నో అరెస్టుకు నిరసనగా ర్యాలీ

భువనేశ్వర్‌లో ప్రజాస్వామికవాదులు తలపెట్టిన బహిరంగ సభకు నారాయణపట్నా బందుగాం బ్లాక్‌ల నుండి 150 మంది (స్త్రీలు-పురుషులు) సిఎమ్ఎస్, బిఎమ్ఎస్ సంఘాల సభ్యులు బయలుదేరి వెళ్లారు. పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో రైలు కోసం ఎదురు చూస్తూ భోజనం కోసమని హొటల్‌కు వెళ్లిన మహిళా సంఘం అధ్యక్షురాలు కామ్రేడ్ సున్నోను, డిబా, సుబ్బా అనే ఛసి మూలియా సంఘం (సిఎమ్ఎస్) సభ్యులను అక్రమంగా నిర్బంధించి తీవ్రమైన చిత్రహింసలకు గురిచేసి జైల్లో వేసారు. పోలీసుల చర్యను ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులు తీవ్రంగా ఖండించారు.

నారాయణపట్నా వుద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా సంఘం నాయకురాలు కామ్రేడ్ సున్నోను అరెస్టు చేయడం పెద్ద విజయంగా పోలీసులు ప్రకటించుకున్నారు. సుదీర్ఘ కాలంగా నాయకత్వం వహిస్తున్న తమ నాయకురాలు కామ్రేడ్ సున్నోను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మూడు వేల మంది ప్రజలు ఊరేగింపుగా వెళ్లి బీడీఓకు మెమోరాండం ఇచ్చారు. ప్రభుత్వ నిర్బంధం గురించి పత్రికా విలేకరులకు వివరించారు.

#### కలెక్టర్ వినీల్‌కృష్ణ కిడ్నాప్ ఒప్పందాల అమలు కోసం

జైళ్లలో మగ్గుతున్న ఆదివాసీల విడుదలకై 2010 ఫిబ్రవరిలో కలెక్టర్ వినీల్‌కృష్ణ కిడ్నాప్ సందర్భంగా కుదిరిన ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయాలనే డిమాండ్‌తో 50 మంది ఖైదీల కుటుంబీకులు ఫిబ్రవరి 24న కోరాపుట్ కలెక్టర్ ఆఫీస్ ముందు ఒక రోజు ధర్నా చేసారు. అన్యాయంగా కేసుల్లో ఇరికించి తమ కుటుంబ సభ్యులను హింసిస్తున్నారని, రెండు సంవత్సరాలు గడిచినా కేసుల విషయంలో అతీగతీ వుండడం లేదని ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ కేసుల విషయంలో తాను ఏమీ చేయలేనని, ముఖ్యమంత్రికి విషయాన్ని తెలియజేస్తానని తన చేతగానితనాన్ని ప్రజల ముందు ఒప్పుకొని ఏ రకంగానూ ఉపయోగపడని ఒక హామీ ఇచ్చాడు. ఈ పోరాటం జైలులో వున్న వారందరికీ ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది.

## ప్రభుత్వ పాలనను దిగ్బంధించిన ప్రజలు

నారాయణపట్నా ఆదివాసీ ఛసి మూలియా సంఘ పోరాటాలను చూసి బెదిరిపోయిన ప్రభుత్వం దాని అణచివేతకు పాల్పడుతూనే అనేక కుట్రలను, పథకాలను రచించింది. శాంతి సంఘం ద్వారా గ్రామాలపై దాడులు చేయిస్తూ, 2009 నవంబర్ 20న నిర్బంధం గురించి నిలదీయడానికి పోలీసు స్టేషన్‌కు వచ్చిన ప్రజలపై కాల్పులు జరిపి తన పాశవిక నిర్బంధానికి తెరతీసింది. అప్పటినుండి సల్వాజుడుం తరహా అరెస్టులు, దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయి. పోలీసు నిర్బంధాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ప్రజలు తమ న్యాయమైన ప్రజాస్వామిక హక్కులకై పోరాటాన్ని తీవ్రతరం చేస్తున్నారు. డైగూడ బిఎస్ఎఫ్ క్యాంపుతో పాటు పొడపొదర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బిఎస్ఎఫ్ క్యాంపును ఎత్తివేయాలని ర్యాలీ చేసి కలెక్టర్, బీడీఓలకు ప్రజలు మెమొరాండం ఇచ్చారు. ప్రభుత్వ దమననీతికి వ్యతిరేకంగా ప్రభుత్వ కార్యకలాపాలను రెండు నెలల పాటు స్థంభింప చేయాలని సంఘం ఆందోళనకు పిలుపునిచ్చింది.

సంఘం పిలుపుకు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపి ఆందోళనలో భాగమయ్యారు. ఈ కింది కార్యకలాపాలను తీసుకున్నారు.

1. ప్రభుత్వం చేపట్టే చెక్‌డ్యాంలు, చెరువులు, రోడ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలను బహిష్కరించడం.

2. ప్రభుత్వ ఆఫీసులకు వెళ్లి నిలదీయడం.

3. పంచాయితీ కార్యాలయాలకు తాళాలు వేయడం.

4. ప్రభుత్వం చేపట్టబోయే కార్యక్రమాల ప్రచార సభల బహిష్కరణ.

5. రేషన్ బియ్యం, పెన్షన్ డబ్బుల వంటి ప్రభుత్వ సంస్కరణ పథకాలను తిరస్కరించడం.

ఈ దిగ్బంధ ఆందోళనను సిఎమ్ఎస్ పోస్టర్ల ద్వారా ప్రచారం చేసింది. ఈ కార్యక్రమాల అమలుకోసం సంఘ నాయకత్వం చాలా చైతన్యవంతంగా కృషిచేస్తూ, ప్రజలకు ఓపికగా వివరించింది. ఈ ఆందోళన గురించి తెలుసుకున్న బీడీఓ వెంటనే అనేక గ్రామాలు తిరిగి రేషన్ బియ్యం, పెన్షన్ డబ్బులు తీసుకొమ్మని ప్రజలను బతిమాలాడు. అయినప్పటికీ ప్రజలు అతని ప్రతిపాదనను తిరస్కరిస్తూ నిరసన కార్యక్రమంను దృఢంగా అమలు చేసారు. దీంతో ప్రభుత్వ ఆఫీసులు వెలవెలపోయాయి. నారాయణపట్నాకు రాకపోకలు తగ్గిపోయాయి.

ఏ పోరాట రూపాలలోనైనా ప్రజలు కొన్ని యిబ్బందులు ఎదుర్కోవలసి వుంటుంది. అలాగే ఈ రెండు నెలల నిరసన కార్యక్రమాలతో యిబ్బంది పడిన పేద ప్రజలు దీన్ని త్వరగా ముగించాలని కోరారు. కొన్ని గ్రామాలలో కొద్ది మంది బియ్యం, పెన్షన్ డబ్బులు తీసుకున్నారు. మిగతా మెజారిటీ ప్రజలు దృఢంగా ఆందోళనలో పాల్గొన్నారు. బొరిగి లాంటి చోట్ల కొత్తగా పోలీసు క్యాంపులు ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ఆలోచనను వ్యతిరేకిస్తూ రోడ్డు తవ్వేసి రాకపోకలకు వీలు లేకుండా చేశారు. నెల రోజుల పాటు ఆ రోడ్డు బంద్ అయింది. చివరికి బిఎస్ఎఫ్ పోలీసులు దౌర్జన్యంగా ప్రజలను కొట్టి రోడ్డును తిరిగి బాగు చేయించారు.

ఇంత పెద్ద ఎత్తున, రెండు నెలల నుండి ప్రజలు పాల్గొంటు తమ నిరసన తెలియజేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వుంది. జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు ఎవరూ ప్రజలకు ముఖం చూపించలేదు. వారి దివాళాకోరు ఓట్ల రాజకీయాలను అర్థం చేసుకున్న ప్రజలు ఓట్ల పార్టీలను వ్యతిరేకిస్తున్నారు. ఈ ఆందోళన చివర దశలో 20 వేల మందితో కుంబారిపుట్‌లో బహిరంగ సభ జరిపి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. తిరిగి బియ్యం, పెన్షన్ మాత్రం తీసుకోవాలని నిర్ణయించారు. దీనితో పాటు అర్హులైన ప్రతివారికి రేషన్, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేసారు. నూతన పోరాట రూపాలలో ప్రజలు చైతన్యవంతంగా పాల్గొని, ప్రభుత్వ కుటిల ఎత్తుగడలను, మోసపూరిత, బూటకపు సంస్కరణలను తిప్పికొట్టి నూతన రాజ్యాధికార దిశగా అడుగులు వేస్తున్నారు.

## పొట్టేసు గ్రామంపై శాంతి సంఘం దాడి

జిల్లాలోని బందుగాం బ్లాక్ కొమ్ముగొండ పంచాయితీలోని 30 ఇండ్లున్న చిన్న గ్రామం పొట్టేసు. ఈ గ్రామంలోని సంఘ నాయకత్వాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో శాంతి సంఘం గూండాలు పోలీసుల మద్దతుతో అర్ధరాత్రి సమయంలో 2012 మార్చిలో దాడి చేసి పన్నెండు ఇండ్లను ధ్వంసం చేసి, బీభత్సం సృష్టించారు. కామ్రేడ్స్ సిత్రు, జానకిలను ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేయించి వారి అడ్డుతొలగించుకున్న ప్రజాద్రోహులు, సంఘ నాయకత్వాన్ని కూడా నిర్మూలించి వారి అక్రమ భూములను, సారా వ్యాపారాలను కాపాడుకొని తమ అధికారాన్ని నిలుపుకోవాలనే లక్ష్యంతో ఈ దాడులు చేస్తున్నారు.

కామ్రేడ్ తెల్లి ఆ ప్రాంతంలో పేరున్న నాయకుడు. కామ్రేడ్ సిత్రుతో కలిసి సంఘ నిర్మాణాలు చేస్తూ, భూస్వాములకు వ్యతిరేకంగా నిలబడ్డాడు. గత మూడు సంవత్సరాలుగా ప్రజలకు నాయకత్వం వహిస్తూ, భూస్వాముల దోపిడీని, దొంగ సారా వ్యాపారాలను అడ్డుకుంటున్నందుకే కామ్రేడ్ తెల్లి భూస్వాములకు కంటగింపయ్యాడు. ప్రజలు మిలిటెంట్ పోరాటాలలో పాల్గొనడం నచ్చని మితవాద అవకాశవాద సంఘం (కాను సన్యాల్ ఎమ్ఎల్ గ్రూప్) భూస్వాములతో చేతులు కలిపి కామ్రేడ్ తెల్లిని చంపి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి తమ వైపు తిప్పుకోవాలనే కుట్రతో పొట్టేసు గ్రామంపై దాడికి సంయుక్తంగా పథకం వేసి అమలు చేసారు. పోలీసులు ఈ దాడికి అన్ని విధాల అండగా వున్నారు.

ఈ దాడిలో 50 మంది శాంతి సంఘం గూండాలు మారణాయుధాలతో పాల్గొన్నారు. దాడి స్వభావాన్ని అర్థం చేసుకున్న సంఘ నాయకులు, ముఖ్యమైన యువకులు తప్పుకున్నారు. దాడిలో ప్రతి ఇంటిని సోదా చేస్తూ, దొరికిన వారిని చితకబాదుతూ ఇండ్లలోని బంగారం, డబ్బులు దొంగిలించారు. ఆహార ధాన్యాలను నేలపాలు

చేసారు. చింతపండు లాంటి నిత్యావసర వస్తువులను ఎత్తుకుపోయారు. అర్ధరాత్రి మొదలయిన దాడి తెల్లవారి 12 గంటల వరకు యధేచ్ఛగా కొనసాగింది. గూండాలు తమ వెంట తెచ్చుకున్న సారాలో మునిగితేలుతూ కోళ్లు, మేకలను చంపి విందు చేసుకున్నారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారు. తప్పుకున్న సంఘ నాయకత్వాన్ని, యువకులను శాంతి సంఘానికి అప్పజెప్పాలని, లేకుంటే గ్రామం మొత్తం ధ్వంసం చేస్తామని బెదిరిస్తూ, వారం రోజుల పాటు ఆ చుట్టు పక్కల గ్రామాల్లో వుంటూ అడవిలో గాలింపులు చేపట్టారు.

ఈ ప్రాంతంలో 2009లో కూడా కొమ్ముగూడ, జడబ అనే గ్రామంలో 50 ఇండ్లను కాల్చి బూడిద చేశారు. కిర్మమ్మ అనే యువతిని 18 మంది భూస్వాముల గుంపు సామూహికంగా అత్యాచారం చేసి చంపారు. అనంతరం ఆమెను నగ్నంగా వీధుల్లో తిప్పుతూ, ఎవరైనా తమను ఎదిరిస్తే వారికి కూడా ఇదే గతి పడుతుందని హెచ్చరించారు.

ఇదే తరహాలో పొట్టేసు గ్రామాన్ని కూడా విధ్వంసం చేసి తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవాలని భూస్వాములు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనతో ఎర్రజెండా ముసుగులో విప్లవం పేరుతో కొనసాగుతూ అవకాశవాద వర్గ సంకర రాజకీయాలు అవలంబిస్తున్న ఎమ్ఎల్ గ్రూప్ రాజకీయాలను ప్రజలు గతం కంటే నేడు స్పష్టంగా అర్థం చేసుకున్నారు. భూస్వాముల, శాంతి సంఘాల, అవకాశవాదుల దాడుల మధ్యనే ప్రజలు మరింతగా సంఘటితమవుతూ ప్రతిదాడులకు సిద్ధపడుతున్నారు.

### గ్రామ పునర్నిర్మాణం:

ఈ గ్రామంపై శాంతి సంఘం గూండాలు చేసిన దాడి కారణంగా గ్రామంలోని అన్ని కుటుంబాలకు చెందిన ప్రజలు గ్రామాన్ని విడిచి బంధువుల గ్రామాలలో తలదాచుకున్నారు. ఈ నేపథ్యంలో 2012 మే 7న సంఘం పిలుపుతో 5 వేల మంది ప్రజలు పునర్నిర్మాణ సభ జరిపారు. సభలో చెల్లాచెదురైన పొట్టేసు గ్రామ కుటుంబాలకు నైతిక, ఆర్థిక మద్దతునివ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలూ, సిఎమ్ఎస్ అందించిన నైతిక మద్దతుతో, అన్ని కుటుంబాలు తిరిగి తమ గ్రామానికి చేరుకున్నాయి. ఇండ్లు కోల్పోయిన ప్రజలకు, సంఘం తరపున ఇంటికి 2 వేల రూపాయల చొప్పున మొత్తం 24 వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. చందాలుగా వసూలు అయిన 8 క్వింటాళ్ల బియ్యం, చోళ్లు, జొన్నలు వంటి ఆహార ధాన్యాలను పంపిణీ చేశారు. వారందరికీ పక్కా ఇళ్లు నిర్మించే బాధ్యతను సంఘం చేపట్టాలని సభకు హాజరైన ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలోని ఇంటికి వంద రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని, ఆ డబ్బుతో 12 ఇండ్లను రేకులతో నిర్మించాలని నిర్ణయించారు. ఇలా పొట్టేసు గ్రామ ప్రజలు, సంఘం, ఇతర గ్రామాల ప్రజల సహకారంతో ధ్వంసమైన తమ గ్రామాన్ని తిరిగి నిర్మించుకున్నారు.

### శాంతి సంఘంపై ఎదురుదాడి:

గ్రామ పునర్నిర్మాణంతోనే సరిపెట్టకుండా ఈ గ్రామాన్ని ధ్వంసం చేసిన శాంతి సంఘం గూండాలకు తగిన బుద్ధి చెప్పాలని కూడా సభ నిర్ణయించింది. ముఖ్యంగా సంఘానికి ప్రతిబంధకంగా వున్న కొమ్ముగొండ గూండాలకు మొదట బుద్ధి చెప్పాలనుకున్నారు. ఈ గ్రామానికి చెందిన బందుగాం బ్లాక్ ఛైర్మన్ కొడుకు, ఎమ్ఎల్ గ్రూప్ సంఘ నాయకుడు సోమయ్య తమ్ముడు ఈ దాడికి నాయకత్వం వహించారు. గతంలో కూడా కొమ్ముగొండ గ్రామంలోని అక్రమ సారాను ధ్వంసం చేయడానికి ఎమ్ఎల్ గ్రూప్ సంఘం ఆధ్వర్యంలో ప్రజలు వెళ్లినపుడు భూస్వాములు తరిమికొట్టారు. అందుకే ఈ గ్రామ గూండాలకు, భూస్వాములకు గట్టిగా బుద్ధిచెప్పాలని అనుకున్నారు.

వేలాది మంది ప్రజలు సాంప్రదాయక ఆయుధాలు చేతబట్టి కొమ్ముగొండ గ్రామాన్ని చుట్టుముట్టి బ్లాక్ ఛైర్మన్‌ను, అతని కొడుకును పట్టుకున్నారు. అయితే కొంత మంది గూండాలు తప్పించుకున్నారు. బ్లాక్ ఛైర్మన్ కొడుకుకు దేహశుద్ధి చేసి, విలేకరుల ముందు హాజరుపరచి పొట్టేసు గ్రామంపై జరిగిన దాడిలో ఎవరెవరు పాల్గొన్నారో చెప్పించారు. కొమ్ముగొండలో వున్న భూస్వాములకు సంఘాన్ని తిప్పికొట్టడమే తెలుసుగానీ, సంఘం చేతిలో దెబ్బలు తినడం ఇదే మొదటిసారి. ఈసారి కూడా ప్రతిఘటనకు సిద్ధపడిన భూస్వాములు ప్రజా సమూహాన్ని చూసి గ్రామం విడిచి పారిపోయారు. సంఘం బలంతో భూస్వాములపై దాడి చేయడం స్థానిక పీడిత ప్రజలకు మనోధైర్యాన్ని కలిగించింది. తమకు ఎదురు లేదనుకున్న భూస్వాముల నడ్డి విరిగినట్లయ్యింది. ప్రజాద్రోహులలో భయాన్ని నెలకొల్పింది సంఘటిత శక్తి ద్వారా ఎంతటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చనే ధైర్యం ప్రజల్లో కలిగింది. తీవ్ర నిర్బంధంలో కూడా నారాయణపట్నా-బందుగాం ప్రజలు పోరాటాలలో ఇలా పురోగమిస్తున్నారు.

గతంలో పోలీసులు మసాన్‌మండ గ్రామాన్ని కాల్చి బూడిద చేస్తే సంఘ సహకారంతో ప్రజలు తిరిగి నిర్మించుకున్నారు. ప్రభుత్వ సహకారాన్ని తిరస్కరించారు. ఈ విధంగా భూమి సమస్యలోనూ, శాంతి సంఘం గూండాలను ఎదుర్కోవడంలోనూ ప్రజలను కదిలించి ఛసి మూలియా సంఘం విజయాలు సాధిస్తున్నది. ప్రజల ఆత్మ విశ్వాసాన్ని నిలబెడుతున్నది.

## ఎమ్మెల్యే జిన్నా హికాక కిడ్నాప్

ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లా లకింపూర్ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే జిన్నా హికాకను పిఎల్‌జిఎ బలగాలు 2012 మార్చి 23న తమ అదుపులోకి తీసుకొన్నాయి. వినీల్‌కృష్ణ కిడ్నాప్ సందర్భంగా ప్రభుత్వం ఆమోదించిన డిమాండ్స్ పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మార్చి 25న ఏవోబీ ఎస్‌జెడ్‌సి అధికార ప్రతినిధి జగబంధు, శ్రీకాకుళం-కోరాపుట్ డివిజన్ కమిటీ కార్యదర్శి దయ సంయుక్తంగా పత్రికలకు ప్రకటన విడుదల చేసారు.

ఎమ్మెల్యే హికొకను వెంటనే విడిచిపెట్టాలనే డిమాండ్‌తో మార్చి 26న ఒడిశాలో వివిధ జిల్లాల ఎంఎల్‌ఏలు, ఎంపీ జయరాం పాంగి, ఎమ్మెల్యే భార్య కౌసల్య ప్రకటనలు ఇవ్వడంతో పాటు కోరాపుట్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో బంద్‌లు, రాస్తారోకో, రైల్‌రోకో, ఊరేగింపులు, నిరసన ప్రదర్శనలు చేయించారు. సీపీఐ (మావోయిస్టు) జోనల్, జిల్లా కమిటీలు వీటన్నింటిని ఖండిస్తూ ఏళ్ల తరబడి అమాయక ఆదివాసీలు అన్యాయంగా తప్పుడు కేసులతో కోరాపుట్, మల్కన్‌గిరి జైళ్లలో నిర్బంధించబడి వున్నారనీ, వారందరి విడుదలే ఎమ్మెల్యే విడుదలకు షరతు అని ప్రభుత్వంతో చర్చలు, మధ్యవర్తులు అవసరం లేదని ప్రకటిస్తూ మార్చి 27న రెండవ ప్రకటన విడుదల చేసాయి.

మార్చి 27వ తేదీ నుండి జైళ్లో బందీలుగా వున్న వారి కుటుంబ సభ్యులు – దాదాపు 60 మంది – తమ వారిని విడుదల చేయాలని కోరాపుట్ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ విధంగా ఒకవైపు ప్రజల ఆందోళనలు, మరోవైపు ప్రభుత్వ డబ్బుతో చేయించిన నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు కొద్ది రోజులు కొనసాగి క్రమంగా చల్లబడిపోవడంతో పాటు ప్రభుత్వం నుండి కూడా ఎటువంటి సానుకూల స్పందన లేకుండా పోయింది. ఈ విషయం బందీగా వున్న ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో అతడు ప్రభుత్వం చేతుల్లో ఎమ్మెల్యేలు కీలుబొమ్మలని, తమకు ఎటువంటి అధికారాలు లేవని, ఆదివాసీ ఎమ్మెల్యే అయినందున ప్రభుత్వం తన విడుదల కోసం పట్టించుకోవడం లేదని, అదే ఎంపీ జయరాం పాంగిని కిడ్నాప్ చేస్తే పరిస్థితి వేరే విధంగా వుండేదని అన్నాడు. తాను బూర్జువా రాజకీయాల నుండి బయటకు వస్తానని కూడా మాట్లాడాడు. ఈ పరిస్థితిలో తను మాట్లాడిన విషయాలనే ముఖ్యమంత్రికి రాతపూర్వకంగా రాయాలని పార్టీ కామ్రేడ్స్ కోరడంతో అతను లేఖ రాశాడు. ప్రభుత్వం స్పందించకపోతే రాజీనామా చేస్తానని కూడా రాశాడు. తన భార్యకు కూడా ఒక లేఖ రాసాడు.

ఈ రాజీనామా లేఖతో పాటు, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును, నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ ఏప్రిల్ 3న జగబంధు పేరుతో మూడవ ప్రకటన విడుదలైంది. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ ఏప్రిల్ 4న ఎమ్మెల్యే భార్య, మరో 300 మంది గ్రామస్థులతో కల్సి కోరాపుట్ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేసింది. ఏప్రిల్ 5న డెడ్‌లైన్ ప్రకటిస్తూ చంద్రమౌళి పేరుతో మీడియాలో ప్రకటన వచ్చింది. ఈ విధంగా అన్ని వైపుల నుండి ప్రభుత్వంపై ఒత్తిడి పెరగడంతో గత్యంతరం లేక ఏప్రిల్ 5న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అసెంబ్లీలో కోరాపుట్, మల్కన్‌గిరి జైళ్లలో వున్న 25 మందిని విడిచిపెట్టేందుకు ఒప్పుకుంటున్నట్లు పేర్లతో సహా ప్రకటించాడు. అయితే ప్రభుత్వం ప్రకటించిన పేర్లలో కేవలం ఇద్దరు మాత్రమే (అర్జున్, సునీత) గతంలో పార్టీలో పని చేసి అరెస్టయిన వాళ్లు. మిగతా వాళ్లలో ముఖ్యమైన సంఘ నాయకత్వం ఎవరూ లేకపోవడంతో, ప్రభుత్వ కుట్రను ఖండిస్తూ పార్టీ వైపు నుండి అయిదుగురి పేర్లను (ఘాసీ, గణనాథో పాత్రో, సున్నో, సింగ, వల్సి) ప్రకటిస్తూ ప్రభుత్వం ఒప్పుకున్న 25 మందితో పాటు ఈ అయిదుగురిని కలిపి 30 మందిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 10 వ తేదీ వరకు డెడ్‌లైన్‌ను పొడిగిస్తూ ఏప్రిల్ 7న పార్టీ నుండి మరొక ప్రకటన విడుదలైంది. కాని పార్టీ డిమాండ్ చేసిన అయిదుగురిని మినహాయించి, మిగతా వాళ్లకు బెయిళ్లు, జామీన్ల ప్రక్రియ కొనసాగుతుందని, ఎమ్మెల్యేను మానవతా దృక్పథంతో విడిచి పెట్టాలని, పదే పదే ప్రభుత్వం ప్రసార మాధ్యమాల ద్వారా వివిధ రూపాల్లో ప్రచారం చేసింది. ఘాసీ కరడుగట్టిన తీవ్రవాదనీ, నేరస్థుడనీ విస్తృతంగా ప్రచారం చేసింది.

అలాగే పోలీసు సంఘం అధ్యక్షుడి ద్వారా జైళ్లో ఖైదీలను విడిచిపెడితే తాము పోలీసు ఉద్యోగాల నుండి వైదొలుగుతామని, తామెంతో శ్రమించి, ప్రాణాలొడ్డి ఘాసీ లాంటి వారిని పట్టుకుంటున్నామని అటువంటి వాళ్లను ప్రభుత్వం విడిచిపెడితే సహించమంటూ ప్రకటనలు ఇప్పించింది. మరోవైపు ఒక మాజీ సైనికాధికారి, మావోయిస్టులు కిడ్నాప్‌లు చేసి జైళ్లో వున్న ఖైదీలను విడిచిపెట్టాలని ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటూ, ప్రభుత్వం ఖైదీలను విడిచిపెట్టడానికి ఒప్పుకోవడాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో కేసు వేశారు. ఈ విధంగా ప్రభుత్వం మావోయిస్టులపై ఒత్తిడి చేయడం ప్రారంభించింది. ఏప్రిల్15న ప్రభుత్వ దుష్ప్రచారాన్ని ఖండిస్తూ, ఘాసిని బూచిగా చూపి ప్రభుత్వం సమస్యను నీరు కారుస్తుంది కనుక, ఘాసీ పేరును మినహాయించి మిగతా వాళ్లనందరినీ ఏప్రిల్ 18న సాయంత్రం బేషరతుగా విడుదల చేసి బలిపట్టాకు తీసుకువచ్చి అప్పగించాలని, ఇది చివరి అవకాశం అని పార్టీ నుండి మరో ప్రకటన వెలువడింది. ఏప్రిల్ 18 నాటికి కూడా ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఏప్రిల్ 19న 'ఎమ్మెల్యే భవిష్యత్‌ను ప్రజాకోర్టులో ప్రజలే తేలుస్తారనే' ప్రకటనను మీడియాకు విడుదల చేశారు.

చివరికి ప్రజా కోర్టు విచారణలో జిన్నా హికొక ప్రభుత్వం ప్రజా వుద్యమాలపైన పెంచుతున్న దమనకాండలో తన వంతు తప్పిదాన్ని ఒప్పుకొని ఇకమీదట ప్రజల పక్షం వహిస్తానని చెప్పాడు. ప్రభుత్వ కుటిల నీతి బహిర్గతం కావడంతో తాను భవిష్యత్‌లో పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తానని హామీ ఇచ్చాడు. దానితో ప్రజాకోర్టు అతన్ని క్షమించడంతో ఎమ్మెల్యే విడుదలయ్యాడు.

ఈ ఘటన దేశమంతటా ఒక రాజకీయ వాతావరణాన్ని సృష్టించింది. ముఖ్యంగా ప్రభుత్వాలు వుద్యమాల పట్ల ఎంత కఠినంగా వుంటాయో, వారి స్వప్రయోజనాల కోసం ఒక ఆదివాసీ ఎమ్మెల్యేను కూడా బలి పశువుగా చేయడానికి ఎలా సిద్ధపడతారో, సీపీఐ (మావోయిస్టు) ఎంత స్పష్టమైన వర్గ పంథా, ప్రజా పంథాలను కలిగి వుంటుందో ప్రజలందరికీ మరోసారి అర్థం కావడానికి ఈ సంఘటన తోడ్పడింది. అదే విధంగా పోరాటాలతో తప్ప కిడ్నాప్‌లతో ప్రజల సమస్యలు పరిష్కారం కావని కూడా స్పష్టంగా అర్థమయ్యింది.

# బందుగాంలో పురోగమిస్తున్న రైతాంగ పోరాటం

కోరాపుట్ జిల్లా బందుగాం బ్లాక్‌లోని దాసిని, గుసిరిగూడ, టిక్కరపాడు గ్రామాల్లో భూపోరాటం జోరుగా సాగుతున్నది. ఈ మూడు గ్రామాల్లో ఆదివాసీలకు చెందిన 110 ఎకరాల భూములను గతంలో ఆదివాసేతరులు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు. ఈ భూములను ఈ ఏడాది మే, జూన్ నెలల్లో ఆదివాసీలు తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

బందుగాంకు ఒకటిన్నర కిలో మీటర్ల దూరంలో దాసిని గ్రామం వుంది. దీని పక్కనే గొత్తిపుట్, మొండిగూడ గ్రామాలు కలిసి వున్నాయి. మూడు గ్రామాల పరిధిలోని 75 ఎకరాల భూములను గత 30 సంవత్సరాల క్రితం ఆదివాసేతరులు ఆక్రమించుకొని నిమ్మగడ్డి (సెంట్‌గడ్డి) ని పండించుకుంటున్నారు. ఈ గ్రామాలలో ప్రజలు భూమి సమస్యను పరిష్కరించుకోవాలనే కోరికతో కాను సన్యాల్ గ్రూపు రైతు సంఘాన్ని ఆశ్రయించారు. సంఘం నాయకత్వం షావుకార్ల వద్ద లంచాలు తీసుకుని ఆ భూములను రైతాంగానికి దక్కకుండా చేసింది. దీనితో విసిగిన ప్రజలు నారాయణపట్నా ఛసి మూలియా సంఘంలో చేరి, భూస్వాధీనానికి నడుంకట్టారు.

2010లో దాసిని గ్రామంలో భూ పోరాటాన్ని చేపట్టిన ప్రజలు భూములు ఆక్రమించారు. అయితే దాసిని గ్రామంలో వున్న లంచగొండి పాత సంఘ నాయకుడు ప్రజలను భయపెట్టి ఈ పోరాటానికి అడ్డుతగిలాడు. ప్రజలు, మిలీషియా కలిసి అతన్ని దేహశుద్ధి చేసి, తగిన బుద్ధి చెప్పి భూముల పంపకాలకు సన్నద్ధం అయ్యారు.

2012 మే 4న సంఘం పిలుపునందుకొని దాదాపు మూడు వేల మంది ప్రజలు భూపంపకాలను విజయవంతం చేయాలని తమ సాంప్రదాయక ఆయుధాలు, ఎర్రజెండాలు, బ్యానర్లు చేతపట్టి దాసిని గ్రామంకు చేరుకున్నారు. అయితే ఈ సమాచారం పోలీసులకు చేరింది. ఎలాగైనా ఈ పోరాటాన్ని అడ్డుకోవడానికి సుమారు 150 మంది పోలీసులు దారికి అడ్డంగా మాటు వేశారు. దానితో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భూమి పంపకాలు చేపట్టాలనే పట్టుదలతో, భూములు చెందాల్సిన గ్రామస్థులే కాకుండా, వారికి మద్దతుగా వేలాదిమంది ఇతర గ్రామాల రైతులు వచ్చారు. డప్పులు, కొమ్ముబూరలతో, నినాదాలతో రైతాంగం ఒక దండులా తమ వైపు కదిలి రావడం చూసిన పోలీసులు వెనక్కి తగ్గి క్యాంపుకు వెళ్లిపోయారు. అలా ముందుకు సాగిన రైతాంగం ఆ భూముల్లో ఎర్రజెండాలు పాతి 75 ఎకరాల భూమిని ఏడు గ్రామాలకు వాటాలుగా విభజించి పంచుకున్నారు. ఈ ప్రాంతంలో ఇంకా వందల ఎకరాల భూములు షావుకార్ల చేతిలో వున్నాయి. రేపు తమది కూడా ఆక్రమిస్తారనే భయం ఆ షావుకార్లలో నెలకొంది.

కుంబారిపుట్ పంచాయితీలోని గుసిరిగూడ, టిక్కరపాడు గ్రామాలలో మటియా, కుయి తెగకు చెందిన ఆదివాసీ ప్రజలు వుంటారు. మటియా తెగకు చెందిన గుసిరిగూడ గ్రామస్థులు 30 సంవత్సరాల క్రితం చిన్న చిన్న అప్పుల కింద, సారా కింద తమ భూములను పోగొట్టుకున్నారు. ప్రస్తుతం ఈ తెగ ప్రజలు చేతివృత్తులు (బట్టలు, తట్టలు, చేటలు) చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఆ గ్రామ సంఘ నాయకుడు తవుడు విలేకర్లతో మాట్లాడుతూ గతంలో తన తండ్రి 500 రూపాయలు అప్పు చేసినందుకు తమ భూములను పోగొట్టుకున్నామని ఆవేదనతో తెలిపాడు. టిక్కరపాడుకు చెందిన సాంబన్న అనే రైతు పరిస్థితి కూడా అదే. కుంబారిపుట్ పంచాయితీలో రాజుల కాలంలో పన్నులు కట్టలేక భూములు పోగొట్టుకున్న రైతాంగం తమ భూముల గురించి కథలు కథలుగా చెప్పుకుంటారు. ఈ సమస్య పరిష్కారం కోసం గుసిరిగూడ, టిక్కరపాడు గ్రామస్థులు తమ భూములు తిరిగి స్వాధీనం చేసుకోవాలని సంవత్సర కాలంగా సన్నద్ధమవుతున్నారు.



భూ పోరాటాలకు ముందు భాగాన నిలుస్తున్న మహిళలు

జూన్ 1న భూములు ఆక్రమించాలనే సంఘం నిర్ణయం ప్రకారం ఈ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయబడింది. అనుకున్న విధంగానే ప్రజలు సాంప్రదాయక ఆయుధాలతో, ఎర్రజెండాలు, బ్యానర్లు, ఆట పాటలు, నినాదాలతో భూముల్లో ఎర్రజెండాలు పాతి దుక్కులు దున్నారు. గుసిరిగూడకు 20 ఎకరాలు, టిక్కరపాడుకు 12 ఎకరాల చొప్పున పంచుకున్నారు.

మొత్తంగా ఈ పోరాటాలు ప్రజలలో మంచి ప్రభావం వేసాయి. కాను సన్యాల్ గ్రూపు మితవాద రాజకీయాల నుండి ప్రజలు మిలిటెంట్ పోరాటాలకు సిద్ధమవుతున్నారు. పోరాటాల ద్వారానే మౌలిక సమస్యలు పరిష్కరించుకోవచ్చనే నిజాన్ని ఈ భూపోరాటాలు రుజువు చేస్తున్నాయి. ప్రజలు పైడమ్మ సంఘం రాజకీయాలను కాలదన్ని భూపోరాటాల్లో, వర్గపోరాటంలో కదులుతున్న తీరు సరైన పంథావైపు ప్రజలు తప్పక సమీకరించబడతారనడానికి నిదర్శనం. సమస్యలున్న ప్రజలకు సరియైన నాయకత్వం అందించగలిగితే శత్రు నిర్బంధాన్ని కూడా ధైర్యంగా ఎదుర్కొనగలరనేది ఈ భూపోరాటాలు నిరూపిస్తున్నాయి. ఈ పరిణామాలు భూస్వాములకు, పోలీసులకు, మితవాద అవకాశవాద రాజకీయ నాయకులకు మింగుడుపడడం లేదు.

# నారాయణపట్నా వుద్యమంపై తీవ్రమవుతున్న నిర్బంధం

ఒడిశా రాష్ట్రంలోని ఖనిజ సంపదపై దళారీ, బహుళజాతి కంపెనీల డేగకన్ను పడింది. ఇప్పటికే రాష్ట్రంలో పనిచేస్తున్న వేదాంత, హిండాల్కో, నాల్కో వంటి కంపెనీలు సృష్టించిన నిర్వాసిత, పర్యావరణ సమస్యలు ప్రజలను అనివార్యంగానే పోరాటాలలోకి నెడుతున్నాయి. కళింగనగర్‌లో జరిగిన నిర్వాసిత వ్యతిరేక పోరాటం దేశ ప్రజలకు ప్రేరణగా నిలిచింది. బహుళజాతి కంపెనీలకు నమ్మినబంటుగా వ్యవహరిస్తున్న నవీన్ పట్నాయక్ ప్రభుత్వం ఈ పోరాటాలను అణచివేయడానికి గ్రీన్‌హంట్‌లో భాగంగా వుద్యమ ప్రాంతాలపై వుక్కుపాదం మోపుతున్నది. వేలకొలది పోలీసు బలగాలను మోహరించి నిర్వాసిత వ్యతిరేక పోరాటాలను, రైతాంగ పోరాటాలను అణచివేయడానికి కుట్రలు పన్నుతున్నది.

రాష్ట్రంలో ఇప్పటికే 14 బెటాలియన్ల (పారా మిలిటరీ, కోబ్రా, బిఎస్ఎఫ్, ఐటిబిటి, ఎస్‌ఓజి, ఓఎస్, ఏపీ) పోలీసు బలగాలు తిష్టవేసి వున్నాయి. కేంద్ర మంత్రి చిదంబరం జరుపుతున్న సమావేశాలకు హాజరవుతున్న నవీన్ పట్నాయక్, ఒడిశా డీజీపీ మన్‌మోహన్ ప్రహరాజ్, గవర్నర్ బంగారి వంటి భూస్వామ్య పాలకులు ఇప్పటికే వున్న బలగాల సంఖ్య సరిపోదని ఆందోళన చెందుతూ బలగాలను పెంచే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే వున్న హెలికాప్టర్లకు తోడు ఎమ్.వి-9 నావికా దళ హెలికాప్టర్లు రెండు తెచ్చుకున్నారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాలను నక్సలైట్ ప్రభావిత జిల్లాలుగా చేర్చి ఆర్థిక సంస్కరణలతో పాటు పోలీసు బలగాల సంఖ్యను పెంచుకున్నారు. స్థానికుల నుండి, ప్రత్యేకంగా ఆదివాసీ యువకుల నుండి రిక్రూట్ చేసుకొని ఇండియన్ రిజర్వు బెటాలియన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. పై చర్యలతో రాష్ట్రాన్ని పోలీసు రాష్ట్రంగా మార్చివేస్తున్నారు.

నారాయణపట్నా వుద్యమంపై అమలవుతున్న నిర్బంధాన్ని ఇందులో భాగంగానే చూడాలి. నారాయణపట్నా బ్లాక్ పరిధిలో 10 కిలో మీటర్ల దూరంలో పాలూరు-డైగూడ, పొడపొదర్ తదితర మూడు చోట్ల కేంద్ర బలగాల క్యాంపులు పెట్టి ప్రజలపై దాడులు చేస్తున్నారు.

పార్వతీపురం, మక్కువ, కొమరాడ, లక్ష్మీపురం, దామన్‌జోడి, సునాబెడ, సిమిలిగూడ, రాయగఢ కేంద్రాలుగా వున్న బలగాల ద్వారా ఆంధ్ర-ఒడిశా సమన్వయంతో సంయుక్త దాడులు, ఏరియా డామినేషన్ కూంబింగ్‌లు చేపడుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని యుద్ధ వాతావరణం నెలకొనివుంది. నారాయణపట్నా-బంద్‌గాంలలోని అటవీ గ్రామాలు పోలీసులతో నింపి వేయబడిన కాన్‌సెంట్రేషన్ క్యాంపుల వలయంలో బిక్కుబిక్కుమంటున్నాయి. తెంతులిపొదర్, బొరిగి మొదలగు పంచాయితీలలో బిఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్ క్యాంపులు పెట్టే ఆలోచనలో ప్రభుత్వం వుంది. భవిష్యత్‌లో పోలీసు నిర్బంధం మరింత పెరిగే అవకాశం వుంది.

ఇక్కడ జరిగే విప్లవ కార్యక్రమాలను దెబ్బతీయాలని పోలీసులు, ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. 2011లో జూలై 28 సందర్భంగా బొరిగి, కంబిపాయ, పొడపొదర్‌లలో నిర్మించిన అమరవీరుల స్థూపాలను బాంబులతో పేల్చివేసారు. 2011లో ఆగస్టు 15 బూటకపు స్వాతంత్ర్య దినం సందర్భంగా, నిరసన దినంగా పాటించాలని ప్రజలు నిర్ణయించుకున్న విషయం తెలుసుకున్న పోలీసులు ప్రతిపల్లెను గాలించి భయభ్రాంతులకు గురిచేసారు. ఎగువలొచ్చ, మంగళాపురం, నేలభద్ర, చింతగూడ, కంబిపాయ, గొర్పగూడ, డుంబగూడ గ్రామాలను చుట్టుముట్టి సంఘ నాయకత్వాన్ని అరెస్టు చేయడానికి ప్రయత్నించారు. ప్రజలు వేసుకున్న పంట పొలాలను, జొన్న చేలను నాశనం చేశారు. 2011 ఆగస్టు 24, సెప్టెంబర్ 19 తేదీలలో పిఎల్‌జిఎ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఎన్‌కౌంటర్లకు పాల్పడ్డారు. ఆ సందర్భంగా పిఎల్‌జిఎకు ఎటువంటి నష్టం జరగలేదు. కాని రంగంగూడ గ్రామంలో పంటచేను వద్ద వుంటున్న ప్రజల పాకలను, ఆహార పదార్థాలను, బట్టలను కాల్చి బూడిద చేశారు. మాసాన్‌మండ దగ్గర కాల్పులు జరిపి అనంతరం సుమారు ఐదు గ్రామాల (మాసాన్‌మండ, ఒడిగూడ, పాణిబడి, రజ్జింగి, పిలుకూరు) ప్రజలు గ్రామాలు విడిచి పారిపోయే విధంగా బెదిరించారు. కంబిపాయలో జొన్నపంటను నష్టపరిచి ప్రజలను తీవ్రంగా కొట్టారు. ఈ ఆపరేషన్‌లో 500 మంది బలగాలు పాల్గొన్నాయి. 2011 అక్టోబర్ 20 నుండి 24 వరకు నారాయణపట్నా నుండి బీజాగాటి, మక్కువ వైపు వున్న అటవీ ప్రాంతంలోని గ్రామాలలో ఏరియా డామినేషన్ ఆపరేషన్ జరిగింది. ఈ సందర్భంగా తెంతులిపొదర్, బలిపట్టా పంచాయితీ గ్రామాలైన బొరిగి, మంగళాపురం, నేలభద్ర, లొచ్చ గ్రామాలపై కేంద్రీకరించారు. మూడు రోజులపాటు సాగిన ఈ ఆపరేషన్‌లో భాగంగా సూడేశు గ్రామంలో బారికను తీవ్రంగా కొట్టి చావు బతుకుల మధ్య వదిలిపెట్టారు. గ్రామస్థులు పూజ చేసుకునే స్థలాన్ని చూసి నక్సలైట్లకు భోజనాలు వండిపెడుతున్నారని ఆరోపిస్తూ ప్రజలను తీవ్రంగా హింసించారు. గ్రామంలోని ఇద్దరు యువకుల కోసం గాలించగా వారు దొరకలేదు. పోలీసుల భయంతో ప్రజలు పారిపోవడంతో పశువులు, మేకలు ఆకలితో అలమటించి తాళ్లు తెంపుకొని పంట చేన్లు తిన్నాయి. పోలీసులు తిరిగి వెళ్తున్న క్రమంలో నేలభద్ర గ్రామంపై దాడి చేసి ఒక మధ్య వయసు మహిళ చేయి విరగ్గొట్టారు. ఒక యువతిని అత్యాచారం చేయడానికి తీసుకెళుతుండగా మహిళలంతా తిరగబడి ఆమెను విడిపించుకున్నారు. ఇలా ప్రతి గ్రామంలోనూ, పార్టీ ఆచూకీ చెప్పమని, దారి చూపమని కొడుతూ అత్యాచారాలకు పాల్పడ్డారు.

నారాయణపట్నాకు ఆనుకొని వున్న ఆంధ్ర ప్రాంతంలోని హైవే వైపు నిరంతరం పెట్రోలింగ్ జరుగుతున్నది. మన ఆర్గనైజేషన్ కంటిన్యూషన్ లేని ప్రాంతాలలో కూడా కూంబింగ్‌లు జరుగుతున్నాయి. రాయగఢ-కోరాపుట్‌ల మధ్య శత్రువు నెట్‌వర్క్ పెరిగింది. కోరాపుట్ దేవ్‌మాలి, మాలీలలో వున్న ఖనిజ సంపద కొల్లగొట్టడానికి ఇక్కడ కూడా పోలీసు బలగాలను మోహరిస్తున్నారు.

అయితే ప్రభుత్వ దమననీతిని అర్థం చేసుకున్న ప్రజలు పార్టీని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. సూడేశు గ్రామంపై దాడి చేసి వెళ్తున్న పోలీసులపై మిలీషియా బండరాళ్లు దొర్లించడంతో పోలీసులు పరుగులు తీశారు. ప్రజలు చైతన్యంతో శత్రు దాడిని ఎదిరించడానికి సిద్ధపడుతున్నారు.

# ఉత్తర తెలంగాణ

## కె.కె.డబ్ల్యూ. డివిజన్‌లో

### మాజీ సర్పంచ్‌పై కాల్పులు

కె.కె.డబ్ల్యూ. డివిజన్‌లోని ఏటూర్‌నాగారం – మహాదేవ్‌పూర్ ఏసి పరిధిలోని కరీంనగర్ జిల్లా మహాదేవ్‌పూర్ మండలం ముకునూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకుడు, మాజీ సర్పంచ్ వెంకటస్వామిపై కాల్పులు చేయడం జరిగింది. ఆయన తమ్ముడు మాజీ ఎమ్‌పీపీని ప్రజల సమక్షంలో దేహశుద్ధి చేయడం జరిగింది. వీళ్లు అధికార కాంగ్రెస్ పార్టీ పౌర సరఫరాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబుకు అనుచరులుగా వుంటూ విప్లవోద్యమానికి, ప్రజలకు వ్యతిరేకంగా మారి మావోయిస్టు పార్టీ సమాచారం పోలీసులకు చేరవేయడం, ప్రజలకు వచ్చే నిధులు కాజేస్తూ ప్రశ్నించిన వాళ్లపై తన అనుచరగణంతో దాడి చేయడం, సమీకృత యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ముందుండి రోడ్ల విస్తరణ కార్యకలాపాలు కొనసాగించడం, యువతను లంపెనైజేషన్ వైపు ప్రోత్సహిస్తూ, స్థానిక యువతను పోలీస్ రిక్రూట్‌మెంట్‌లోకి ప్రోత్సహించడం పదవిలో వున్న రోజుల్లో మహాదేవ్‌పూర్ (మండల సెంటర్) లోనే వుంటూ ప్రజలకు పీడకులుగా తయారవడంతో 2012 మే 11న దళం ప్రజల సమక్షంలో దేహశుద్ధి చేసింది. దీనితో అధికార కాంగ్రెస్ నాయకులు, ప్రజా వ్యతిరేకులు ప్రజల నుండి తప్పించుకోలేరని నిరూపితమైంది. ఈ చర్య ప్రజలల్లో పాజిటివ్ ప్రభావాన్ని వేసింది.

## ఖమ్మం జిల్లాలో

### పోలీస్ ఇన్‌ఫార్మర్ల ఖతం

ఖమ్మం జిల్లా చర్ల ఏసీ పరిధిలోని పూసుగుప్ప గ్రామానికి చెందిన ఊకే గురువయ్య మాజీ సానుభూతిపరుడు. పోలీసు ఇన్‌ఫార్మర్‌గా మారి ఎస్‌ఐబీ వాళ్లతో సంబంధాలు కొనసాగిస్తూ దళాల సమాచారం పోలీసులకు చేరవేసేవాడు. ఇతన్ని గతంలో ఒకసారి ప్రజల ముందు విచారించినప్పుడు తప్పులు ఒప్పుకొని, పోలీసులతో సంబంధాలు మానుకుంటానని కుటుంబ సభ్యుల ముందు చెప్పగా, వారికే ఇతని బాధ్యతను అప్పజెప్పడం జరిగింది. కానీ ఆ తరువాత అదే విధంగా పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తూ, మరికొంత మందిని కూడా ఇన్‌ఫార్మర్లుగా మార్చుతున్నాడు. గ్రామంలో అనేక మంది మహిళలతో అక్రమ సంబంధాలు కొనసాగిస్తూ, అమాయక ఆదివాసీ విద్యార్థుల వద్ద వస్తువులు తెప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకోవడం, సెల్‌ఫోన్‌లు తీసుకుని మాయం చేయడం లాంటివి చేస్తుండడంతో ప్రజల అభిప్రాయం మేరకు 2012 ఏప్రిల్ 18న ఇతన్ని ఖతం చేయడం జరిగింది. ఇతన్ని హత్య చేయడంతో పోలీసులకు సమాచారం చేరవేసే వారికి ఎవరికైనా ఇదే గతి పడుతుందని ప్రజలందరికీ అర్థమయ్యింది. విద్యార్థులు, మహిళలు చివరికి పోలీస్ కానిస్టేబుళ్లు కూడా ఇతని పీడ వదిలిందని సంతోషపడ్డారు.

భద్రాచలం మండలం ఏటపాక గ్రామానికి చెందిన సురేశ్ 2005 సంవత్సరంలో పోలీసుల ప్లానింగ్‌లో భాగంగా పార్టీలోకి రిక్రూట్ అయినాడు. ఆ తరువాత జిల్లా కమిటీకి అతనిపై అనుమానం వచ్చి ఇంటికి పంపగా, ఆటో డ్రైవరుగా పనిచేస్తూ శబరి ఏరియాలో లోతట్టు గ్రామాలకు వెళ్తూ పార్టీ సమాచారం సేకరిస్తూ, ఆ గ్రామాల యువతను పోలీసు ఇన్‌ఫార్మర్స్‌గా మార్చే ప్రయత్నం చేస్తుండడంతో 2012 మే 20న ఖతం చేయడం జరిగింది.

### నకిలీ నక్సలైట్ హతం

శబరి ఏరియా చింతూర్ మండలం జగ్గారం గ్రామానికి చెందిన బాలాజీ పార్టీ పేరు చెప్పి చందాలు వసూలు చేయడం, పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా పని చేయడంతో అతని ట్రాక్టర్‌ను, మోటారు సైకిల్‌ను జప్తు చేసి, అతన్ని ఖతం చేయడం జరిగింది.

### పిఎల్‌జీఏ ప్రతిఘటన

ప్రతిఘటనలో భాగంగా చర్ల ఏసీ పరిధిలో ఆటోలో పెట్రోలింగ్‌కు వచ్చే పోలీసులపై రాత్రి దాడి చేయగా ఆటో డ్రైవర్‌కు, ఒక కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి.

శబరి ఏరియా పరిధిలో మే నెలలో బంద్ సందర్భంగా రోడ్డును తవ్వుతుండగా, అనుకోకుండా పోలీసులు వచ్చి గాలిలోకి ఫైర్ చేశారు. తిరిగి దళం, మిలీషియా కాల్పులు జరపడంతో ఒక కానిస్టేబుల్‌కు తీవ్రంగా గాయాలయ్యి తప్పుకొని పరిగెత్తారు. ఈ రెండు ఘటనలు కూడా ప్రతిఘటనలో భాగంగా జరపడంతో ప్రజలలో, పార్టీలో మంచి ప్రభావం వేసింది. రాజకీయ నాయకులకు, పోలీసు బలగాలకు ఆందోళన మొదలయ్యింది.

చర్ల మండలం చెన్నపురం గ్రామంలో జరిగిన ఎన్‌కౌంటర్‌కు నిరసనగా 2011 అక్టోబర్ 10న వెంకటాపురం మండలం ఒంటిమామిడి గ్రామం దగ్గర మిలీషియా బలగాలు ప్రొక్లెయినర్‌ను ధ్వంసం చేశాయి.

★

**ప్రజా పోరాటాలను పెంపొందించడం ద్వారా శత్రువు తలపెట్టిన ప్రజలపై యుద్ధాన్ని విఫలం చేద్దాం!**

*(వెనక పేజీ తరువాయి...)*

కామ్రేడ్ మాధవరావును 1971లో అరెస్టు చేసి దొంగ సాక్ష్యాలతో ఆయనకు యావజ్జీవ శిక్ష వేసి విశాఖపట్నం జైలులో బంధించారు. 1979లో జైలు నుంచి విడుదలైనప్పటి నుంచి తిరిగి ఉద్యమంలో పూర్తికాలం కార్యకర్తగా భాగమయ్యారు. కామ్రేడ్ ముత్యాలు కూడా పూర్తికాలం కార్యకర్తగా పని చేస్తూ 1990 వరకూ ఇద్దరూ పార్టీ టెక్నికల్ అవసరాలను ఎన్నింటినో తీర్చారు.

1980 సెప్టెంబర్‌లో జరిగిన మునుపటి సి.పి.ఐ. (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 12వ మహాసభలలోనూ, 1987లో జరిగిన 13వ రాష్ట్ర మహాసభలలోనూ ఆయన ప్రతినిధిగా పాల్గొన్నారు. ఆయన 12వ రాష్ట్ర మహాసభలలో అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించగా, 13వ రాష్ట్ర మహాసభలలో పార్టీ జెండాను ఆవిష్కరించారు.

విప్లవోద్యమంపై శత్రు ఫాసిస్టు నిర్బంధం తీవ్రతరమై 'క్రాంతి' ప్రచురణలు, పీస్ బుక్ సెంటర్ తదితర విప్లవ ప్రచురణ, అమ్మకాల కేంద్రాలు శత్రువుకు లక్ష్యంగా మారిన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో విప్లవ సాహిత్యాన్ని ప్రచురించడంలో కామ్రేడ్ గోరు మాధవరావు ఒక కేంద్రంగా నిలిచారు. ప్రత్యేకించి ఏ సాహిత్యం ప్రజలకు అందకుండా చేయాలని పాలకవర్గాలు కుట్రలు చేస్తూ వచ్చాయో అలాంటి నిషేధిత విప్లవ సాహిత్యాన్ని ఆయన ప్రచురించి వారి కంట్లో నలుసుగా మారారు. మునుపటి సి.పి.ఐ. (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్), ఆ తర్వాత సి.పి.ఐ. (మావోయిస్టు)కు చెందిన అనేక ప్రచురణలను తన చిరునామాతో ప్రచురించి విప్లవ సాహిత్య ప్రచారంలో గొప్ప పాత్రను నిర్వహించారు. నక్సలైట్ సాహిత్యం ప్రచురిస్తే జైల్లో పెడతామని ప్రభుత్వం పదే పదే హెచ్చరికలు చేసినా ఏమాత్రం లెక్కచేయక దృఢదీక్షతో ప్రజలకు విప్లవ సాహిత్యాన్ని నిర్విరామంగా అందించిన ఆయన విప్లవ నిబద్ధత అనుసరణీయం. వివిధ ప్రజాపోరాటాలలో, విద్యార్థి, యువజన, మహిళా ఉద్యమాలలో, ప్రచారంలో, ప్రజల ఐక్యకార్యాచరణ కార్యకలాపాలలో భాగస్వామి అవుతూ వాటిని పురోగమింపజేసేందుకు శక్తిమేరకు కృషి చేశారు.

కామ్రేడ్ మాధవరావుకు పార్టీ పంథా పట్ల అపారమైన విశ్వాసం ఉండేది. శ్రీకాకుళ సాయుధ పోరాటం వెనుకపట్టు పట్టినా, పుల్లారెడ్డి, నాగిరెడ్డి గ్రూపులు మితవాద అవకాశవాదంతో విప్లవ పంథాను నీరుగార్చాలని ప్రయత్నించినా, కామ్రేడ్ ఆదిభట్ల కైలాసం అమరత్వం తర్వాత పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన పైలా వాసుదేవరావు సత్యనారాయణ్ సింగ్‌తో కలిసిపోయి విచ్ఛిన్నకుడిగా మారినా, చౌదరి తేజేశ్వరరావు వంటి విచ్ఛిన్నకులు పార్టీని చీల్చేందుకు ప్రయత్నించినా కామ్రేడ్ గోరు మాధవరావు పార్టీని, విప్లవ పంథాను అంటిపెట్టుకొని ఉన్నారు. శ్రీకాకుళ ఉద్యమం దెబ్బతిని అనేక నష్టాలు పాలవుతూ, చాలా మంది విప్లవకారులు వెన్నుజూపి విప్లవానికి చెల్లుచీటి ఇస్తున్న పరిస్థితుల్లో విప్లవ పంథాను ఎత్తిపట్టిన అతితక్కువ మంది విప్లవకారులలో ఆయన ఒకరు. అలాగే జైలు నిర్బంధంలోనూ ఆయన విప్లవ పక్షాన దృఢంగా నిలిచారు. విప్లవ పంథాను దెబ్బతీసేందుకు ప్రయత్నించిన మితవాద అవకాశవాదుల పద్ధతులను నిరంతరం తూర్పారబట్టేవారు. 1970ల చివరలో తిరిగి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన విప్లవ రైతాంగ వెల్లువను చూసి ఎంతో వుత్తేజితుడైనారు. ఆయన పార్టీ 12వ రాష్ట్ర మహాసభకు హాజరైన నూతన తరం ప్రతినిధులకు శ్రీకాకుళ సాయుధ పోరాట అనుభవాలను అందించి వారిని ఎంతగానో ఉత్తేజితుల్ని చేశారు.

1985లో, 1991లో సత్యమూర్తి, కె.ఎస్.లు పార్టీలో అంతర్గత సంక్షోభాన్ని సృష్టించినపుడు కామ్రేడ్ మాధవరావు దృఢంగా విప్లవోద్యమం పక్షాన నిలబడ్డారు. 2006-2007లలో ఆంధ్రప్రదేశ్ ఉద్యమం వెనుకపట్టు పట్టినా ఆయన ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ జెండాను సమున్నతంగా ఎత్తిపడుతూ తన విప్లవ ఆచరణను కొనసాగించారు. రాష్ట్రంలోనూ, దేశంలో అనేక చోట్లకు వెళ్లి పార్టీ సందేశాన్ని అందిస్తూ విప్లవ శ్రేణులలో, ప్రజలలో విప్లవోద్యమం పట్ల విశ్వాసాన్ని పెంపొందించేందుకు తీవ్రంగా కృషి చేశారు.

కామ్రేడ్ గోరు మాధవరావు, ఆయన సహచరి ముత్యాలు ఇరువురూ ఉద్యమంలోనే ఉండడం వలన వారికి ఎటువంటి ఆస్తిపాస్తులూ లేవు. శ్రీకాకుళ పోరాటంలో కామ్రేడ్ మాధవరావు రహస్య జీవితానికి వెళ్లినపుడు కామ్రేడ్ ముత్యాలు చిన్న పిల్లలిద్దరితో ఎన్నో కష్టాలను నిబ్బరంగా ఎదుర్కొని నిలిచింది. అంతటి కష్టకాలంలోనూ ఇంటికొచ్చే విప్లవ కార్యకర్తలను కామ్రేడ్ ముత్యాలు అమ్మలాగా ఎంతో ఆప్యాయంగా ఆదరించేది. ఆమె కూడా పార్టీ సభ్యురాలు. తమ ఇద్దరు కూతుర్ల పెంపకం విషయంలో వారు ఫ్యూడల్ విలువలను తిరస్కరించారు. కామ్రేడ్ ముత్యాలు 1993 జూన్ 30న తుదిశ్వాస విడిచింది. కామ్రేడ్ మాధవరావు నిరాడంబరమైన సాదాసీదా జీవితం గడిపారు. అట్టడుగు పేద వర్గంలో పుట్టి పెరిగిన ఆయన ఆదర్శ కమ్యూనిస్టు విలువల్ని జీర్ణం చేసుకున్నారు. అందుకనే ఉద్యమ అవసరాల కోసం ఆయన నిర్వహించిన అనేక డెన్‌లు కూడా అత్యంత సాదాసీదాగా ఉండేవి. ఆయన మాటల్లో, వ్యవహార శైలిలో వాగాడంబరం, దంబాచారం ఉండేవి కావు. ఆయన విప్లవోద్యమంలో అత్యంత సీనియర్ అయినప్పటికీ, ఉద్యమావసరాల కోసం పార్టీ అప్పగించిన అనేక బాధ్యతలు నిర్వహించినప్పటికీ పార్టీలో నా స్థాయి ఏమిటి అనేదాన్ని ఎన్నడూ ఆలోచించని నిస్వార్థపరుడు. శ్రీకాకుళ పోరాటయోధుడు కావడం, పార్టీ పంథా పట్ల ఎనలేని విశ్వాసం ఉండడం వల్ల కోల్‌కత నగరంలో ఆయన నిర్వహించిన డెన్ భారతదేశంలో విప్లవకారుల ఐక్యతా చర్చలలో మునుపటి ఎంసిసి పార్టీకి ఒక విశ్వసనీయమైన కేంద్రంగా ఉండేది. మునుపటి ఎంసిసి ప్రవంతి కామ్రేడ్స్‌కు ఆయన పట్ల అపార విశ్వాసం, గౌరవం ఉండేవి.

# సీమా ఆజాద్, విశ్వ విజయ్‌లకు యావజ్జీవ శిక్ష విధించడాన్ని ఖండిద్దాం!

మావోయిస్టు కార్యకర్తలనే ఆరోపణతో సీమా ఆజాద్, ఆమె జీవిత సహచరుడు విశ్వ విజయ్‌లకు అలహాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు 2012 జూన్ 8న జీవిత ఖైదు విధించింది.

సీమా ఆజాద్, విశ్వ విజయ్‌లను 2010 ఫిబ్రవరి 6న అలహాబాద్ రైల్వేస్టేషన్‌లో అరెస్టు చేశారు. అప్పటి నుండి 27 నెలల పాటు నైని జైలులో గడిపిన తర్వాత కోర్టు ఈ శిక్షను వెలువరించింది.

అరెస్టయ్యే నాటికి సీమా ఆజాద్ (37) ఉత్తర ప్రదేశ్ పౌర హక్కుల ప్రజా సంఘం (పీయూసీఎల్)లో నిర్వాహక కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నది. ఆమె రచయిత్రి, దస్తక్ అనే మాస పత్రిక సంపాదకురాలు కూడా. అలహాబాద్‌లో మాస్టర్స్ డిగ్రీ చదివిన సీమా ఆజాద్‌ను నేటి సామాజిక పరిస్థితులు ఉద్యమాల వైపు ఆకర్షించాయి. 1995-96 నాటికి విద్యార్థి, మహిళా రాజకీయాల్లో క్రియాశీల భాగస్వామి అయింది. వివిధ పత్రికలలో విరివిగా వ్యాసాలు రాసేది. 2006 తరువాత దస్తక్ అనే ప్రగతిశీల పత్రికను ప్రారంభించి దానికి సంపాదకురాలయింది. వేలాది ప్రజలను నిర్వాసితులను చేసే గంగా ఎక్స్‌ప్రెస్ పథకం గురించి ఒక సర్వేను నిర్వహించి, దానిని పుస్తకంగా ప్రచురించి ప్రజల్లోకి తీసుకువెళ్లింది. అజామ్‌గఢ్ ముస్లిం యువతపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ చేసిన అక్రమ అరెస్టులను, దారుణాలను ఒక సుదీర్ఘ వ్యాసంగా రాసి దస్తక్‌లో ప్రచురించింది. మానవ హక్కుల ఉద్యమంలో క్రమంగా మరింత క్రియాశీలక పాత్ర పోషించింది. 2009లో ఉత్తరప్రదేశ్ పీయుసీఎల్ శాఖలో చేరి, దానికి నిర్వాహక కార్యదర్శి అయింది. ఎవరైనా తమ మానానా తాము బతక్కుండా నలుగురి గురించి ఆలోచించడం రాజ్యానికి గిట్టదు కనుక, సీమా ఆజాద్ కార్యకలాపాలన్నీ దాని దృష్టిలో నేరాలయ్యాయి. ఎవర్నైనా అరెస్టు చేయాలన్నా, శిక్షించాలన్నా, ఇవేవీ లేకుండా చంపేయాలన్నా మావోయిస్టు అనే ముద్ర వేయడం ద్వారా తన పనిని సానుకూలం చేసుకోవడం అలవాటైన రాజ్యం, ఈ దంపతులిద్దరిపై అదే ముద్ర వేసి అరెస్టు చేసింది. వారిపై యుఎపిఎలోని పలు సెక్షన్ల కింద కేసులు పెట్టింది. సాక్ష్యాలు సరిగా లేకపోయినా కోర్టు వీళ్లిద్దరికీ జీవిత ఖైదు విధించి, న్యాయ వ్యవస్థకు ఎటువంటి స్వయం ప్రతిపత్తి లేదని చాటింది. ప్రస్తుతం సీమా ఆజాద్ బెయిల్‌పై విడుదలైంది. కాని ఆమెకు విధించిన జీవిత ఖైదును మాత్రం రద్దు చేయలేదు. ఆమె మీద ఆరోపించిన అన్ని కేసులూ కొనసాగుతూనే వున్నాయి.

వీళ్లిద్దరికీ, గతంలో వినాయక్ సేన్ తదితరులకు కఠిన శిక్షలు విధించడం ద్వారా రాజ్యం ప్రజా పక్షం వహించే మేధావులందరికీ ఒక హెచ్చరికను జారీ చేస్తున్నది. సామ్రాజ్యవాదానికి నమ్మినబంట్లుగా సేవ చేస్తున్న భారత పాలకవర్గాలు, సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం, దాని అండదండలతోనే గ్రీన్‌హంట్ పేరిట ప్రజలపై పెద్ద యుద్ధాన్ని నడుపుతున్నాయి. దీనిపై వెల్లువెత్తే వ్యతిరేకతను అణచడం కోసం దేశంలో కనీస ప్రజాస్వామ్య వాతావరణం లేకుండా చేయపూనుకుంటున్నాయి. అందులో భాగమే ఈ అరెస్టులు, శిక్షలు.

పాలకుల ఈ ఫాసిస్టు వైఖరిని తీవ్రంగా ఖండించాలనీ, సీమా ఆజాద్, విశ్వవిజయ్‌ల జీవిత ఖైదులు రద్దు చేయాలనీ, వాళ్ల మీద ఆరోపించిన అన్ని కేసులు ఎత్తివేయాలనే బలమైన ప్రజాస్వామిక వుద్యమాన్ని నిర్మించాలని ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థులు, మేధావులకు 'క్రాంతి' విజ్ఞప్తి చేస్తున్నది.

నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాలు అందించిన పాఠాలు ఎలాగైతే వర్తమాన చరిత్రకు అత్యంత విలువైనవో, కామ్రేడ్ మాధవరావు వంటి నక్సల్బరీ తరం విప్లవకారుల కార్యాచరణ, ఆధునిక రివిజనిజం, అతివాద, మితవాదాలతో వారి రాజీలేని పోరాటం, పీడిత ప్రజల విముక్తి పట్ల మొక్కవోని నిబద్ధత, విప్లవ పార్టీ పంథా పట్ల అచంచల విశ్వాసం వంటి విలువలు తర్వాతి తరాలకు అలాగే అత్యంత విలువైనవి. ఆచరణయోగ్యమైనవి. భారతదేశ విప్లవోద్యమంలో అత్యంత సీనియర్ అయిన కామ్రేడ్ మాధవరావు జీవితం, కార్యాచరణల నుండి యువతరం విప్లవకారులే కాక మన దేశం భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా, సామ్రాజ్యవాద దోపిడీ, పీడనల నుండి విముక్తి చెందాలని ఆకాంక్షించే ప్రతి ప్రజాస్వామికవాది, మేధావి కూడా నేర్చుకోవలసింది ఎంతో వుంది. రకరకాల కారణాలతో, సాకులతో విప్లవోద్యమ క్రమంలో వచ్చే ఒడిదుడుకుల్నీ, కష్టనష్టాల్నీ, శత్రు నిర్బంధాన్నీ తట్టుకోలేక విప్లవబాటను వదిలేస్తున్నవారు వుంటున్న నేపథ్యంలో కామ్రేడ్ మాధవరావు వంటి కమ్యూనిస్టులు దశాబ్దాలపాటు చివరికంటా విప్లవ పంథాలో కొనసాగడం అనే ఆదర్శాన్ని ప్రత్యేకించి ఉన్నతంగా ఎత్తిపడుతూ అనుసరణీయంగా తీసుకోవల్సిన, విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం వున్నది.

కామ్రేడ్ గోరు మాధవరావు అమరత్వంతో ఐదు దశాబ్దాలకు పైగా పార్టీ పంథాను ఎత్తిపట్టిన గొప్ప విప్లవ యోధుడిని పార్టీ, విప్లవ ప్రజానీకం కోల్పోయారు. యావత్ విప్లవ శ్రేణుల తరఫున సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ ఆయనకు తలవంచి విప్లవాంజలి ఘటిస్తోంది. ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోతానని శపథం చేస్తోంది.


**అభయ్,**
**అధికార ప్రతినిధి, కేంద్ర కమిటీ**
**సీపీఐ (మావోయిస్టు)**

జూలై 29, 2012

# పోరాట యోధుడు, మొక్కవోని కమ్యూనిస్టు నిబద్ధతకు ప్రతీక

# కామ్రేడ్ గోరు మాధవరావుకు జోహార్లు!

మన దేశ విప్లవోద్యమం మరో గొప్ప పోరాటయోధుడ్ని కోల్పోయింది. శ్రీకాకుళ సాయుధ పోరాట జ్వాలల నుంచి ఎగసిన కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ గోరు మాధవరావు తన స్వగ్రామం జింకిభద్రలో జూలై 18న వృద్ధాప్యంతో తుదిశ్వాస విడిచారు. నవ యువకుడిగా ఆనాటి 'తెగింపు సంఘం'లో భాగమైనప్పటి నుంచి చివరి ఊపిరి వరకూ ఆయన పీడిత ప్రజల పక్షాన నిలబడి కమ్యూనిస్టు యోధుడిగా దాదాపు ఐదు దశాబ్దాల పాటు విప్లవోద్యమానికి ఎనలేని సేవలు అందించారు. ఉద్యమానికి కొండంత అండగా నిలిచిన ఆయన అమరత్వం విప్లవోద్యమానికి తీరని లోటు.



కామ్రేడ్ మాధవరావు శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం జింకిభద్ర గ్రామంలో ఒక పేద కుటుంబంలో పుట్టారు. ఆ ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమం బలంగా ఉండడం వల్ల చిన్ననాటే ఆయనలో విప్లవ భావాలు నాటుకున్నాయి. ఈ ప్రాంతంలో విప్లవ ప్రజా నాయకుడిగా ప్రసిద్ధి చెందిన కామ్రేడ్ తామాడ గణపతి తదితర కామ్రేడ్స్ నాయకత్వంలో సాగుతున్న ఉద్యమ ప్రభావం ఆయనపై బలంగా పడింది. ఆనాడు 'తెగింపు సంఘాలు' గ్రామ గ్రామాన ఏర్పడ్డాయి. యువకుడైన కామ్రేడ్ మాధవరావు 'తెగింపు సంఘం'లో చేరారు. అందులో క్రియాశీల కార్యకర్త అయ్యారు. అనతికాలంలోనే కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఎదిగారు.

ఉద్యమంలో పనిచేస్తూనే ఆయన వివాహం చేసుకున్నారు. తన సహచరి ముత్యాలును కూడా ఉద్యమానికి పరిచయం చేశారు. కమ్యూనిస్టు రాజకీయాలను తన జీవితంగా నమ్మిన ఆయన వాటిని తన సహచరికి కూడా నేర్పడంలో శ్రద్ధ వహించారు. వారికి ఇద్దరు ఆడపిల్లలు.

కామ్రేడ్ చారుమజుందార్ నేతృత్వంలో సాగిన నక్సల్బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటు దేశంలోని విప్లవకారులకు దిశానిర్దేశం చేయడంతో శ్రీకాకుళంలో కూడా సిపిఎం ఆధునిక రివిజనిజంతో తెగతెంపులు చేసుకుని నిజమైన విప్లవకారులు సాయుధ పోరాట బాటనెంచుకున్నారు. శ్రీకాకుళంలో సాయుధ పోరాటాన్ని ప్రారంభించాలా లేదా అనే చర్చ ఎజెండా మీదికి వచ్చినపుడు మితవాద అవకాశవాదులు అనేక సాకులను చూపి సాయుధ పోరాటాన్ని వాయిదా వేయాలని చూశాయి. కమ్యునిస్టు విప్లవకారులు తక్షణం సాయుధ పోరాటాన్ని ప్రారంభించాలని వాదించారు. కామ్రేడ్ మాధవరావు సాయుధ పోరాటం ప్రారంభించాలనే పక్షాన నిలిచి విప్లవ పంథా పట్ల స్పష్టమైన అవగాహనను తొలినాళ్లలోనే ప్రదర్శించారు. ఆ విధంగా తొలుత ఆధునిక రివిజనిజాన్ని తిరస్కరించి దాని నడ్డి విరచడంలోనూ, తర్వాత మితవాద అవవాశవాద రాజకీయాలను ఓడించి సాయుధ పోరాట పంథాను ఎత్తిపట్టడంలోనూ కామ్రేడ్ మాధవరావు, ఆనాటి శ్రీకాకుళ విప్లవకారులందరూ కలిసి చేసిన కృషి దేశంలో సరైన విప్లవ పంథాను స్థాపించడంలో ఎంతో కీలకమైనది. తరతరాల విప్లవకారులు ఆచరణకు మార్గదర్శకంగా తీసుకోదగినది.

జిల్లాలో సాయుధ పోరాటం మొదలు కాగానే పార్టీ పిలుపును అందుకొని కామ్రేడ్ మాధవరావు పూర్తికాలం కార్యకర్తగా మారారు. కామ్రేడ్ ముత్యాలు ఆయన నిర్ణయాన్ని స్వాగతించింది. వీరనారి కామ్రేడ్ పంచాది నిర్మల నేతృత్వంలోని గెరిల్లా దళంలో ఆయన సభ్యుడిగా చేరారు. ఆ దళం నిర్వహించిన అనేక విప్లవ కార్యకలాపాలలో ఆయన ముందు నిలిచారు. 1969 డిసెంబర్ 22 తెల్లవారు జామున ఆ దళాన్ని కిరాయి పోలీసు, పారా మిలటరీ బలగాలు ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో చుట్టుముట్టి కామ్రేడ్స్ పంచాది నిర్మల, అంకమ్మ, సరస్వతి, తామాడ చినబాబు, సుబ్బారావు పాణిగ్రాహి, రమేష్ చంద్ర సాహులను పట్టుకొని ఘోరమైన చిత్రహింసలకు గురిచేసి రంగమేటియా కొండల్లో దారుణంగా కాల్చిచంపారు. ఆ ఘటన జరిగిన నాటికి ఆ దళంలోనే ఉన్న కామ్రేడ్ మాధవరావు శత్రువు కళ్లుగప్పి తప్పుకోగలిగారు. ఆ తర్వాత ఆయన ఉద్దానం ప్రాంతంలో డాక్టర్ చాగంటి భాస్కరరావు, దేవినేని మల్లికార్జునరావులతో కలిసి పని చేశారు.

*(మిగతాది 54వ పేజీలో...)*